ఈనాడు

విజయవాడ 25-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 75

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

Celebrations feel even more special when there's something for everyone

#MakeItSpecial



Product Name	Net Effective Price#
OnePlus 12	₹54,999
OnePlus Nord 4	₹25,999
OnePlus Pad 2	₹34,999
OnePlus Watch 2	₹16,999
OnePlus Buds Pro 3	₹9,999

ICICI Bank | kotak Mahindra Bank | RBL BANK

Up to ₹20,000 Instant bank discount
on ICICI Bank, Kotak Mahindra Bank and RBL Bank Credit Cards & EMI*
*T&C Apply

Up to 12 month No cost EMI on leading bank cards

Red Cable Club
Join Red Cable Club to get exclusive benefits

Easy Upgrades
Get OnePlus 12R starting at ₹1,246/mo
Just pay 65%* with 24-month No Cost EMIs

Jio BENEFITS WORTH ₹2,250
Activate Jio number yourself from home
Call 70000-70000 | T&C Apply

Available at oneplus.in | OnePlus Store App
OnePlus Experience Stores and Select Partner Stores

amazon.in Flipkart

https://www.oneplus.in/terms-and-conditions/all-bank-instant-discount | #Incl. of bank & other offers

ఈనాడు

విజయవాడ 25-10-2024 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 75

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్


రాజధానికి రైలు వరం

₹2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వే లైన్ నిర్మాణం ● కృష్ణా నదిపై 3.2 కి.మీ. పొడవున వంతెన

కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర

ఈనాడు, దిల్లీ: రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం మరో వరాన్ని ప్రకటించింది. రాజధాని నగర నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు ద్వారా రూ. 15 వేల కోట్లు అందజేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని దేశం నలుమూలలతో అనుసంధానించడానికి రూ.2,245 కోట్లతో 57 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను ప్రకటించింది. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఇందుకు ఆమోద ముద్ర వేసింది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిల సమక్షంలో ప్రకటించారు. ఈ కొత్త మార్గాన్ని 160 కి.మీ. వేగంతో రైళ్ల రాకపోకలు సాగించేలా సెమీ హైస్పీడ్ కారిడార్‌గా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నాలుగేళ్లలో దీన్ని పూర్తి చేయాలన్నది లక్ష్యమని.. అయితే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు మూడేళ్లలో పూర్తి చేయాలని కోరుతున్నందున వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. 'అమరావతి చంద్రబాబునాయుడి కలల ప్రాజెక్టు. ఆ నగర ప్రణాళికలో ఆయన దార్శనికత ప్రతిబింబిస్తుంది.

(మిగతా 2లో)



ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయండి: చంద్రబాబు | **రాజధాని అభివృద్ధిలో కీలకపాత్ర: పవన్ కల్యాణ్** | **డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ప్రయోజనమిది: పురందేశ్వరి** 2లో

కీలక నగరాలతో అమరావతికి అనుసంధానం! | **కేంద్ర ఆమోదంతో భూసేకరణ, పనుల ప్రారంభానికి అవకాశం** 5లో

ఎవరి సొమ్మని దోచుకు తింటారు?



- ప్రకృతి సంపద కుటుంబ ఆస్తా?
- అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఖనిజసంపదపై కన్నేసి... ఆ ఆస్తుల కోసం రోడ్డెక్కి..
- 'సరస్వతి పవర్' ఆస్తులపై వైఎస్ కుటుంబంలో రచ్చ
- నాడు ఎకరా రూ.3 లక్షలకే రైతుల నుంచి కొనుగోలు
- 1,515 ఎకరాల భూమి విలువ నేడు రూ.220 కోట్ల పైమాటే
- వాటిలో రూ.10 వేల కోట్ల విలువైన సున్నపురాయి నిక్షేపాలు

ఈనాడు - అమరావతి

'సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్'కి చెందిన ఆస్తులన్నీ తనకే చెందుతాయంటూ వైకాపా అధ్యక్షుడు జగన్ కోర్టుకెళ్లడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.. ఎవరి సొమ్మని జగన్ వాటిని సొంతం చేసుకోవాలనుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. ప్రకృతి వనరులు, ఖనిజాలు ప్రజల సంపద.. ప్రభుత్వం వాటికి కాపలాదారు మాత్రమే.. ప్రతిఫలం ప్రజలకే చెందాలి!

కానీ తండ్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన అధికారాన్ని అడ్డుపెట్టుకుని, తర్వాత తాను ముఖ్యమంత్రయ్యాక తన అధికారాన్ని ఉపయోగించి జగన్ ప్రకృతి సంపదను చెరబట్టారు. ఆయన అడ్డగోలుగా సాగించిన దోపిడీల్లో సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రాజెక్టు ఒకటి.

ఆస్తుల పంపకంలో భాగంగా చెల్లెలు షర్మిలకు సరస్వతి పవర్ కంపెనీ షేర్లు ఇచ్చినట్టే ఇచ్చిన జగన్.. అక్కడి భూములు, ఖనిజ సంపద విలువ భారీగా పెరగడంతో అడ్డం తిరిగి, అవన్నీ తనకే చెందాలంటూ కోర్టుకు ఎక్కారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. అప్పట్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సరస్వతి పవర్ పేరుతో రైతుల నుంచి జగన్ ఎకరా రూ. 3 లక్షల చొప్పున కారుచౌకగా భూములు కొన్నారు. మొత్తం 1,515.93 ఎకరాల వరకు ఉన్న మొత్తం భూమిలో వాగులు, వంకలు, కొండ పోరంబోకు వంటి ప్రభుత్వ భూములు కూడా కొద్దిమొత్తంలో ఉన్నాయి. ఆ భూముల విలువ ఇప్పుడు సుమారు రూ. 220 కోట్లు పైమాటే. వాటిలో ఉన్న సున్నపురాయి నిక్షేపాల్ని అప్పట్లో వైఎస్ ప్రభుత్వం సరస్వతి పవర్‌కి అడ్డగోలుగా కట్టబెట్టింది. దాని విలువే ఇప్పుడు సుమారు రూ. 10,308.80 కోట్లు ఉంటుందని గనుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో ఎకరాకు సుమారు 1.70 లక్షల టన్నుల సున్నపురాయి లభిస్తుందని అంచనా. ప్రస్తుతం సిమెంట్ గ్రేడ్ సున్నపురాయి విలువ మార్కెట్‌లో టన్ను రూ. 400 వరకు ఉంది.

రాష్ట్రంలోని గనుల్ని, ఖనిజాల్ని తమ కుటుంబ ఆస్తులుగా, గనుల శాఖను తమ జేబు సంస్థగా భావించిన వైఎస్ కుటుంబం.. రాజశేఖర్‌రెడ్డి హయాంలో, ఆ తర్వాత జగన్ జమానాలో

(మిగతా 5లో)

బీద ఏడుపులెందుకు జగనన్నా!

- బెయిల్ రద్దవుతుందనుకుంటే ఒప్పందంపై ఎలా సంతకం చేశావు?
- సరస్వతి పవర్ షేర్లు ఈడీ ఎటాచ్ చేయలేదు
- రూ. 32 కోట్ల విలువైన భూమే స్వాధీనం చేసుకుంది
- షేర్లు బదిలీ చేయడానికి ఏ ఇబ్బందీ లేదు
- ఆస్తులపై ప్రేమతో రక్త సంబంధాలను మరిచావు

2లో

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



శారదాపీఠానికి మరో ఎదురుదెబ్బ


వైకాపా హయాంలో తిరుమలలో అక్రమ నిర్మాణాలు

వాటికి తితిదే బోర్డు ఆమోదం

నాటి తీర్మానాన్ని తిరస్కరిస్తూ కూటమి ప్రభుత్వ తాజా నిర్ణయం

ఈనాడు, తిరుపతి: వైకాపా అధినేత జగన్‌కు గురువు, వివాదాస్పద స్వామి స్వరూపానందేంద్రకు మరో ఎదురు దెబ్బ తగిలింది. విశాఖలో శారదా పీఠానికి వైకాపా ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన భూమిని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం.. ఆ పీఠం తిరుమలలో చేపట్టిన అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట వేసింది. ఇప్పటికే శారదాపీఠం

(మిగతా 2లో)



జాతీయ రహదారుల పనుల పూర్తికి టాస్క్‌ఫోర్స్


సమస్యల పరిష్కారానికి పోర్టల్

లక్ష్యం మేరకు పనులు చేయని గుత్తేదారులపై చర్యలు

ఎన్‌హెచ్‌లపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనులు శరవేగంగా పూర్తి చేయడానికి వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జాతీయ రహదారులు, అటవీ, రైల్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, గనులు తదితర శాఖలకు చెందిన 9 మంది అధికారులతో ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీ అన్ని అంశాలను పరిశీలిస్తుందని తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారానికి అన్ని విభాగాలతో ఓ పోర్టల్ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రెండున్నరేళ్లలో 3,300 కి.మీ. హైవేల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సచివాలయంలో గురువారం జాతీయ రహదారుల పనులపై సీఎం సమీక్షించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 129 ఎన్‌హెచ్ ప్రాజెక్టుల్లో రూ.76 వేల కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. హైవేల పనులపై మూడు నెలలకోసారి సమీక్షిస్తామని తెలిపారు.

(మిగతా 2లో)



అర్జున్.. అద్భుతః

ఆనంద్ తర్వాత చెస్‌లో 2800 ఎలో రేటింగ్ సాధించిన భారతీయుడిగా ఘనత

ఛాంపియన్ లో..

రాజధానికి రైలు వరం



కృష్ణా నదిపై నిర్మించనున్న రైల్వే వంతెన

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నగరాన్ని శాస్త్ర సాంకేతికంగా కొత్త విధానంలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ నగరానికి రైలు అనుసంధానం కల్పించడానికి రూ.2,245 కోట్లతో 57 కి.మీ. కొత్త లైన్ నిర్మించాలని నిర్ణయించాం. అన్ని కోణాలను దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాల ప్రయోజనాలతో ఈ ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశాం. ఇందుకోసం కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల సుదీర్ఘ వంతెన చేపట్టబోతున్నాం. భారతీయ రైల్వేలో ఇదో ప్రధాన వంతెనగా నిలుస్తుంది. ఈ లైన్‌తో అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, నాగ్‌పూర్, బెంగళూరులకు నేరుగా, ముంబయి, దిల్లీలకు హైదరాబాద్, నాగ్‌పూర్‌ల మీదుగా అనుసంధానం ఏర్పడుతుంది. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌కు 40 ఏళ్ల వరకు రైలు సౌకర్యం లేదు. 2004కి ముందు మన దేశ పరిస్థితికి అదో ఉదాహరణ. ఇప్పుడు పరిస్థితులు మారాయి. నగర నిర్మాణంతోపాటు ఏకకాలంలో రైల్వే లైన్ నిర్మాణ పనులూ మొదలుపెడుతున్నాం. ఈ లైన్‌తో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాంస్కృతిక, చారిత్రక ప్రాంతాలైన అమరలింగేశ్వరస్వామి ఆలయం, అమరావతి స్తూపం, ధ్యానబుద్ధ విగ్రహం, ఉండవల్లి గుహలను, మచిలీపట్నం, కాకినాడ, కృష్ణపట్నం, వైజాగ్ పోర్టులను అనుసంధానం చేస్తున్నాం. 19 లక్షల పనిదినాలు కల్పించే పెద్ద ప్రాజెక్టు ఇది. దీని వల్ల 6 కోట్ల కిలోగ్రాముల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. ఇది 25 లక్షల చెట్లు నాటిన దాంతో సమానం. ఈ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ కల నెరవేర్చినట్లయింది. ఎర్రుపాలెం నుంచి మొదలయ్యే ప్రాజెక్టు పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పవరం మీదుగా నంబూరు వరకు సాగుతుంది. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ ఈ ఎలైన్‌మెంట్‌లోకి రాకుండా చూసుకున్నాం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును సాకారం చేయడంలో సహకరించిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ధన్యవాదాలు. పరిటాలలో రైలు, రోడ్డు, జల రవాణాకు సంబంధించిన కార్గో టెర్మినల్ వస్తుంది. అది ముఖ్యమైన మల్టీమోడల్ లాజిస్టిక్ హబ్‌గా మారి, అమరావతికి ఆర్థికశక్తిగా రూపొందుతుంది.

> మౌలికవసతుల కల్పనకు ఊతమిచ్చేలా రెండు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా బిహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వాణిజ్యం వృద్ధి చెందుతుంది.
> -‘ఎక్స్’లో ప్రధాని మోదీ

ప్రధానికి ధన్యవాదాలు: చంద్రబాబు

ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలని వినతి

ముఖ్యమైన రైల్వేలైన్‌ను అమరావతికి మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. దీని ద్వారా దేశంలోని అన్ని రాజధాని నగరాలతో అమరావతికి అనుసంధానం ఏర్పడుతుందన్నారు. కృష్ణా నదిపై నిర్మించే వంతెనను ఐకానిక్ బ్రిడ్జిగా నిర్మించాలని కోరారు. ‘అమరావతిని దేశంలో అత్యుత్తమ రాజధాని నగరంగా నిర్మించాలనుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం దీనికి ఆర్థిక సహకారం అందించడంతోపాటు వివిధ మార్గాల్లో సహకరిస్తోంది. చాలా స్వల్ప కాలంలో ఈ ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ముందుపెట్టి ఆమోదించినందుకు ప్రధానికి ధన్యవాదాలు. ఏపీలో ప్రస్తుతం రూ.70 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విశాఖపట్నం రైల్వేజోన్ సమస్యను పరిష్కరించగలిగాం. దీనికి నవంబర్‌లోనో, డిసెంబర్‌లోనో ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయాలని కోరుతున్నాం. భూసేకరణకు అన్ని విధాలా సహకరిస్తాం. మేం అమరావతిలో అన్ని పనులను మూడేళ్లలో పూర్తి చేయాలనుకుంటున్నాం. అమరావతి రైల్వే లైన్‌ను కూడా అదే గడువులోగా పూర్తి చేస్తే రాష్ట్రానికి గొప్ప సాయం చేసినవారవుతారు’ అని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద వరం



అమరావతి రైల్వే లైను ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద వరమని, రాజధాని అభివృద్ధిలో ఇది అత్యంత కీలకపాత్ర పోషించబోతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ‘అమరావతికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. కానీ గత పాలకుల కారణంగా ఐదేళ్లు వృథా అయింది. ఇప్పుడు రాష్ట్రానికి అతి ముఖ్యమైన ప్రాజెక్టును మంజూరు చేయడం ద్వారా ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పక్షాన నిలబడ్డారు. ఇది ప్రజల్లో విశ్వాసం నింపడంతోపాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుంది. ప్రాజెక్టు ద్వారా 19 లక్షల పనిదినాలు కల్పించడం అన్నది చాలా ముఖ్యమైన అంశం’ అని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించిన సీఎం

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుపై మేం పార్లమెంటులోనే హామీ ఇచ్చాం. దీనికి భూమి సమస్యను పరిష్కరించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. ప్రస్తుతం డీపీఆర్ తయారవుతోంది. దీని ఖరారుకు కొన్ని నెలల సమయం పడుతుంది. సాంకేతికంగా మిగతా విషయాలన్నీ ట్రాక్‌లో ఉన్నాయి. రాజమహేంద్రవరం స్టేషన్‌తోపాటు 73 రైల్వేస్టేషన్లు పునర్నిర్మిస్తున్నాం. ఇది చరిత్రాత్మకం’ అని ప్రకటించారు. ఇదివరకటి రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాష్ట్ర రాజధానిగా గుర్తించలేదని, భవిష్యత్తులో ప్రభుత్వాలు మారితే అమరావతి రాజధానిగా ఉంటుందా లేదా? అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ ‘అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉంటుంది. ఈ రైల్వే ప్రాజెక్టు, రాజధాని నగర నిర్మాణం ఏకకాలంలో జరుగుతాయి’ అని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం సింగిల్‌లైన్‌గా నిర్మిస్తున్నప్పటికీ డబుల్ లైన్ కోసం భూసేకరణ చేపడతామని, వంతెన పునాదులు కూడా డబుల్‌లైన్‌ను దృష్టిలో ఉంచుకొని వేస్తామన్నారు. ఏ రైల్వే ప్రాజెక్టు అయినా తొలుత సింగిల్‌లైన్‌గా నిర్మించి, తర్వాత ట్రాఫిక్ చూసుకొని విస్తరిస్తారని చెప్పారు. అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వెళ్లే మార్గాలను కూడా సెమీ హైస్పీడ్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. రైల్వే లైన్, వంతెన నిర్మాణం ఏకకాలంలో చేపడతామని చెప్పారు. విలేకర్ల సమావేశంలో తెదేపా నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఇది చరిత్రాత్మక క్షణం



ఈ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడం చరిత్రాత్మకమని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ‘ఆంధ్రప్రదేశ్ ప్రజలు గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి రికార్డు స్థాయి విజయాన్ని కట్టబెట్టారు. కృతజ్ఞతగా ప్రధానమంత్రి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తున్నారు. అమరావతి కోసం బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు ప్రకటించారు. ఇప్పుడు రూ.2,245 కోట్లతో రైల్వే ప్రాజెక్టు ప్రకటించారు. తద్వారా అమరావతిలో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని మరోసారి చాటిచెప్పారు’ అని తెలిపారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రయోజనమిది



రాష్ట్రానికి ఇచ్చిన హామీలకు మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో కట్టుబడి ఉందనడానికి ఈ రైల్వే ప్రాజెక్టు మంజూరే ఉదాహరణ అని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ‘అమరావతే ఏపీ ఏకైక రాజధాని అన్న నినాదానికి భాజపా తొలి నుంచీ కట్టుబడింది. ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఈ రైల్వేలైన్ ప్రకటన ద్వారా అమరావతి ఒక్కటే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని పునరుద్ఘాటించినట్లయింది. ఈ లైన్ ద్వారా ఆర్థికంగానూ రాష్ట్రానికి ఎంతో మేలు జరగనుంది. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి డబుల్ ఇంజిన్‌లా పరుగెత్తుతుందని ఎన్నికలప్పుడు మేం చెప్పిన మాటలు ఇప్పుడు సాకారమవుతున్నాయి’ అని అన్నారు.

శారదాపీఠానికి మరో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని తితిదేను ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి అతిక్రమణలు జరగకుండా.. ముందుగానే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేస్తూ.. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి (దేవాదాయ శాఖ) ఎస్.సత్యనారాయణ గురువారం మెమో జారీ చేశారు. 2005 సంవత్సరంలో రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు తిరుమలలో శారదా పీఠానికి 5,000 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు ఇవ్వగా, దానిని అడ్డం పెట్టుకుని పెద్దఎత్తున యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగించింది. తితిదే భూమిని ఆక్రమించేసి మరీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టింది.



నిబంధనలు ఉల్లంఘించి తిరుమలలో శారదా పీఠం చేపట్టిన నిర్మాణం

రాజశేఖరరెడ్డి నుంచే మొదలు

రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2005 ఫిబ్రవరిలో.. తిరుమలలో భక్తులకు వసతి, అన్నప్రసాదాలు కల్పించేందుకంటూ శారదా పీఠానికి గోగర్భం జలాశయ ప్రాంతంలో 5,000 చదరపు అడుగుల స్థలాన్ని 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చారు. సెల్లార్, గ్రౌండ్, మొదటి, రెండు, మూడు అంతస్తుల నిర్మాణానికి 2007లో పీఠం నిర్వాహకులు అనుమతులు తీసుకున్నారు. కానీ పీఠం నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించి అడ్డగోలుగా 1906.50 చ.మీ. విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టారు. అంటే తితిదే ఇచ్చిన అనుమతులను పక్కనబెట్టి.. ఇష్టానుసారం నిర్మించారు. అయినా నాటి ప్రభుత్వం కానీ, తితిదే ధర్మకర్తల మండలి కానీ అడ్డుకోలేదు.

జగన్ వచ్చాక మరింత అడ్డగోలుగా

2019లో జగన్ అధికారంలోకి వచ్చాక శారదాపీఠం మరోసారి అక్రమాలకు తెరలేపింది. అప్పటికే నిర్మించిన భవనానికి ముందు భాగంతోపాటు వెనక ఉన్న కాలువ ప్రాంతాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టింది. తర్వాత అదనపు నిర్మాణాలకు అనుమతులంటూ తితిదేకు దరఖాస్తు చేసుకుని ఆమోదం పొందింది. కానీ దానిని కూడా అతిక్రమించి అదనంగా మరో 685.45 చ.మీ. విస్తీర్ణంలో అడ్డగోలుగా పనులు చేపట్టింది. మొత్తంగా 1851.06 చ.మీ. మేరకు నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు తితిదే ఇంజినీరింగ్ అధికారులు నిర్ధారించారు. అంతేకాదు సెల్లార్ భాగంలోనూ అడ్డగోలుగా పనులు చేపట్టింది. మఠానికి ఇచ్చిన భూమిలోనే కాకుండా పక్కనే.. తితిదే ఆధీనంలో ఉన్న భూమిని కూడా ఆక్రమించడమే కాకుండా.. క్రమబద్ధీకరించాలని శారదాపీఠం కోరింది. స్వామి నుంచి ప్రతిపాదన వచ్చిందే తడవుగా 2019లో అప్పటి తితిదే ధర్మకర్తల మండలి దానికి అనుమతి ఇచ్చింది. అప్పటి జగన్ ప్రభుత్వం కూడా ఆమోదముద్ర వేసింది.

స్వామి సేవలో ధర్మకర్తల మండలి

నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్న సమయంలోనే వాటిని అడ్డుకుని కూల్చివేయాల్సి ఉన్నా.. తితిదే అధికారులు మాత్రం శారదాపీఠం నుంచి కేవలం వివరణ కోరారు. వాస్తు దోషం నివారణకే అదనపు నిర్మాణాలు చేపట్టినట్లు పీఠం నుంచి సమాధానం వచ్చింది. హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకే పీఠం పని చేస్తోందని, అందుకే అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు 2023లో తితిదే తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించింది. కొత్త ప్రభుత్వం వచ్చే వరకు అక్కడ అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శారదా పీఠం అక్రమాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తూ అప్పట్లో ధర్మకర్తల మండలి చేసిన తీర్మానాన్ని తిరస్కరించింది.

‘అంతరిక్ష అంకురా’లకు రూ.వెయ్యి కోట్ల నిధి

- కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

దిల్లీ: అంతరిక్ష రంగంలో వచ్చే అంకుర పరిశ్రమల కోసం రూ.వెయ్యి కోట్ల ‘వెంచర్ క్యాపిటల్ ఫండ్’ ఏర్పాటు చేయడానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. దీని ద్వారా సుమారు 40 స్టార్టప్‌లకు మద్దతు, అంతరిక్ష సంబంధిత పరిశ్రమల్లో ప్రైవేటు రంగానికి చేయూత లభిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. తదుపరి దశల్లో అభివృద్ధికి అదనపు నిధులు రాబట్టేలా ఈ నిర్ణయం ప్రభావాన్ని చూపిస్తుందని ఆశాభావం వ్యక్తంచేసింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), భారత జాతీయ అంతరిక్ష ప్రోత్సాహక.. అధీకృత కేంద్రం (ఇన్-స్పేస్)ల ఆధ్వర్యంలో ఈ నిధి ఉంటుంది. మొదటగా రూ.5-10 కోట్ల చొప్పున, తర్వాత రూ.10-60 కోట్ల చొప్పున రెండు విడతల్లో ఈ నిధి నుంచి పెట్టుబడులు సమకూరుస్తారు. ఈ నిర్ణయాన్ని పరిశ్రమ వర్గాలు ఆహ్వానించాయి. రూ.4,553 కోట్లతో బిహార్‌లోని నర్కటియాగంజ్- రక్సాల్- సీతామఢి- దర్భంగా, సీతామఢి-ముజఫర్‌పుర్ మార్గాల డబ్లింగ్‌కు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.590 కోట్ల ఆర్థిక సంఘం నిధులు

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీలకు, జిల్లా, మండల పరిషత్తులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.590 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పంచాయతీరాజ్‌శాఖ త్వరలో వీటిని గ్రామీణ స్థానిక సంస్థల బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంది. 2024-25 సంవత్సరానికి తొలి విడతగా కేంద్రం ఇటీవల రూ.980 కోట్ల నిధులు విడుదల చేసింది. వీటిలో నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం రూ.390 కోట్ల వరకు స్థానిక సంస్థలకు ఇచ్చింది. మిగిలిన రూ.590 కోట్లు గురువారం విడుదల చేస్తూ ప్రభుత్వం వేర్వేరుగా రెండు జీవోలు జారీ చేసింది.

అండమాన్ నికోబార్ తెదేపా అధ్యక్షుడిగా మాణిక్యరావుయాదవ్

ఈనాడు, అమరావతి: అండమాన్ నికోబార్ దీవుల తెదేపా అధ్యక్షుడిగా నక్కల మాణిక్యరావుయాదవ్‌ను ఆ పార్టీ గురువారం నియమించింది. తెదేపా జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

బీద ఏడుపులెందుకు జగనన్నా!

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఎద్దేవా



ఈనాడు-అమరావతి: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2016లో ఎటాచ్ చేసిన సరస్వతి పవర్ కంపెనీ షేర్లు బదిలీ చేస్తే బెయిల్ రద్దవుతుందని బీద ఏడ్పులు ఏడుస్తున్న జగన్.. 2019లో 100% వాటాలు బదలాయిస్తామని స్పష్టంగా పేర్కొంటూ ఒప్పందంపై సంతకం ఎలా చేశారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు, జగన్ సోదరి షర్మిల ప్రశ్నించారు. ఎంవోయూపై సంతకం చేసినపుడు బెయిల్ గుర్తుకు రాలేదా? అని ఆమె మండిపడ్డారు. ఈడీ షేర్లు ఎటాచ్ చేయలేదని, రూ.32 కోట్ల విలువైన భూమి మాత్రమే ఎటాచ్ చేసిందని గురువారం ఒక ప్రకటనలో షర్మిల పేర్కొన్నారు. ‘షేర్లు బదిలీ చేయకూడదని వాదిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి.. క్లాసిక్, సండూరులో ఉన్న కంపెనీ షేర్లను రూ. 42 కోట్లకు కొనుగోలు చేసేందుకు 2021లో తల్లి వైఎస్ విజయమ్మకు ఎలా అనుమతి ఇచ్చారు? అప్పుడు బెయిల్ సంగతి గుర్తు రాలేదా? 2021లో జగన్, ఆయన భార్య షేర్లపై సంతకం చేసి విజయమ్మకు గిఫ్ట్ డీడ్ ఎలా ఇచ్చారు? అప్పుడు కూడా బెయిల్ గుర్తురాలేదా? ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయాక జగన్‌మోహన్‌రెడ్డికి ప్రాజెక్టును వదులుకోవడం ఇష్టం లేక.. భారతి సిమెంట్ బ్యానర్ కింద సరస్వతి సిమెంట్‌ను నిర్వహించాలనుకుంటున్నారు. అందుకే ఇప్పుడు ఈడీ ఎటాచ్‌మెంట్ అంశాన్ని లేవనెత్తారు. షేర్లు బదిలీ చేయలేమని అంటున్నారు’ అని షర్మిల విమర్శించారు.

బెయిల్ రద్దుకు కుట్ర అనడం శతాబ్దపు జోక్

‘చట్ట విరుద్ధమని తెలిసినా చెల్లెలిపై ప్రేమతో జగన్ షేర్లు బదిలీ చేశారనేది పచ్చి అబద్ధం. ఆయన బెయిల్ రద్దు చేసేందుకే కుట్ర అనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్. ఆస్తుల మీద ప్రేమతో రక్త సంబంధాన్ని, అనుబంధాలను మర్చిపోయారు. నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకోవాల్సిన కుటుంబ విషయాలను రోడ్డు మీదకు తీసుకొచ్చారు. అదీ చాలదన్నట్లు ఇప్పుడు కోర్టుల వరకు తీసుకెళ్లారు’ అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

షేర్లు ఎప్పుడైనా బదిలీ చేయొచ్చు

‘ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సరస్వతి పవర్ కంపెనీ షేర్లు ఎప్పుడూ ఎటాచ్ చేయలేదు. ఏ సమయంలోనైనా వాటిని బదిలీ చేసుకోవచ్చు. ఏ కంపెనీ ఆస్తులైనా ఈడీ ఎటాచ్ చేసినా.. ఆ కంపెనీ షేర్ల బదిలీని ఎప్పుడూ ఆపలేదు. స్టాక్ మార్కెట్లలో చాలా కంపెనీల ఆస్తులను ఈడీ ఎటాచ్ చేసి ఉంటుంది. అయినా వాటి ట్రేడింగ్ జరుగుతుంది. పేర్లు కూడా బదిలీ అవుతుంటాయి’ అని షర్మిల వివరించారు. ‘ఈడీ ఎటాచ్‌మెంట్‌పై 2019 జులై 26న చేసిన అప్పీల్‌ను ట్రైబ్యునల్ అనుమతించి, తాత్కాలిక జప్తు ఉత్తర్వులను పక్కన పెట్టింది. కంపెనీ షేర్లు ఈడీ ముందుకు రావని పేర్కొంది’ అని షర్మిల తెలిపారు.

కాదంబరీ కేసు సీఐడీ కోర్టుకు

- నేడు మూడో ఏసీజేఎం కోర్టుకు దస్త్రాల అందజేత

ఈనాడు, అమరావతి: బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీ కేసు సీఐడీ కోర్టుకు బదిలీ కానుంది. ఈ కేసు విచారణ బాధ్యతను సీఐడీకి ప్రభుత్వం అప్పగించింది. ఇటీవల విజయవాడ పోలీసుల నుంచి కేసు రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు ప్రస్తుతం ఈ కేసు విచారణ సాగుతున్న విజయవాడలోని నాలుగో ఏసీజేఎం (అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్) కోర్టులో మెమో దాఖలు చేశారు. కాదంబరీ జెత్వానీ కేసు తమకు బదిలీ అయిందని అందులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని నాలుగో ఏసీజేఎం కోర్టు న్యాయాధికారి రామ్మోహన్.. జిల్లా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేసు దస్త్రాలను నాలుగో ఏసీజేఎం కోర్టు నుంచి సీఐడీ కేసులు విచారించే మూడో ఏసీజేఎం న్యాయస్థానానికి శుక్రవారం చేరే అవకాశం ఉంది.

కస్టడీలో చెప్పిన వివరాలు కోర్టు ముందుంచుతాం

సమయం ఇవ్వాలని పోలీసుల తరఫు న్యాయవాది అభ్యర్థన

నందిగం సురేష్ బెయిలు పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

ఈనాడు, అమరావతి: మరియమ్మ హత్య కేసులో నిందితుడు, వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్.. పోలీసు కస్టడీలో వెల్లడించిన వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం కావాలని పోలీసుల తరఫు న్యాయవాది గురువారం హైకోర్టును అభ్యర్థించారు. అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే. కృపాసాగర్ బెయిలు పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. అంతకుముందు జరిగిన విచారణలో సురేష్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 2020 డిసెంబరులో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు జరిగి, రాళ్లు రువ్వుకున్న ఘటనలో వెలగపూడికి చెందిన మరియమ్మ మృతి చెందారు. దీనిపై అప్పట్లో తుళ్లూరు ఠాణాలో కేసు నమోదు చేశారు. నందిగం సురేష్‌ను నిందితుడిగా చేర్చారు. ప్రస్తుతం సురేష్ జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. బెయిలు మంజూరు చేయాలని చేసిన అభ్యర్థనను గుంటూరు కోర్టు తోసిపుచ్చడంతో హైకోర్టును ఆశ్రయించారు.

జాతీయ రహదారుల పనుల పూర్తికి టాస్క్‌ఫోర్స్

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ సంస్థలకు అనుమతులన్నీ వేగంగా దక్కేలా చేస్తామని, లక్ష్యం మేరకు పనులు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ‘హైవేల్లో వాగులు, వంకలపై నిర్మించే వంతెనల వద్ద నీరు నిలిచేలా చెక్‌డ్యామ్ తరహా నిర్మాణాలకు ఉన్న అవకాశాలు పరిశీలించాలి. వీటిలో నీటిని నిల్వ చేస్తే ఆ ప్రాంతంలో భూగర్భజలం పెరిగి, నీటి అవసరాలు తీరుతాయి. రాష్ట్రంలో మరిన్ని 6, 8 వరుసల రహదారులు రావాల్సి ఉంది. భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతుల్లో జాప్యం కారణంగా కొన్ని ప్రాజెక్టులు నిలిచిపోయాయి. భూసమస్యతో 70, అటవీశాఖ అనుమతి లేక 20, టోల్‌ప్లాజా సమస్యతో 2 ప్రాజెక్టుల్లో ఆలస్యమవుతోంది. అసలు ప్రారంభించని ప్రాజెక్టులు 3 ఉన్నాయి. 3 నెలల్లో ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులకు లక్ష్యాన్ని నిర్ణయించాం’ అని చంద్రబాబు పేర్కొన్నారు.

రణస్థలం- శ్రీకాకుళం ఆరు వరుసలకు ఆమోదం: ‘రణస్థలం నుంచి శ్రీకాకుళం వరకు ఆరు వరుసల రహదారికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం చాలా సంతోషం. ఎన్‌హెచ్‌లపై ఈ సమీక్షకు కాంట్రాక్టర్లను కూడా పిలిచాం. గడువులోగా పనులు పూర్తి చేయాలని వారికి చెప్పాం. ఈ ఏడాది సుమారు రూ.18 వేల కోట్ల ఖర్చుతో.. రోడ్లు పూర్తి చేస్తాం. గత ఐదేళ్లలో నిలిచిన కీలక ప్రాజెక్టులను గాడినపెడుతున్నాం. ఎన్టీఆర్ జిల్లా పరిటాల వద్ద మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ వస్తుంది. సామాన్యులు, నిర్మాణదారులకు ఇసుక అందుబాటులో ఉంచాలని నిర్ణయించాం. 108 కొత్త ఇసుక రీచ్‌లకు అనుమతి ఇస్తున్నాం. మేం మంచి చేస్తుంటే చూసి భరించలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అమరావతి- కడప, గిద్దలూరు- అమరావతి పనులు పూర్తి చేస్తాం’ అని సీఎం పేర్కొన్నారు.

త్వరలో వాటర్ పాలసీ: ‘రాష్ట్రంలో 95 శాతం ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయి. కొన్ని ప్రాజెక్టుల్లో లీకులున్నాయి. వాటిని సరిచేస్తాం. త్వరలో వాటర్ పాలసీ తీసుకొస్తాం. రాయలసీమను ఆర్థిక జోన్‌గా మార్చాం. డ్రోన్ సమ్మిట్ గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. వాట్సప్ గవర్నెన్స్ తీసుకురానున్నాం. దీనికి సంబంధించి మంత్రి లోకేశ్ అన్ని చర్యలు తీసుకుంటున్నారు. 4నెలల్లోనే ఏపీ గురించి అందరూ మాట్లాడుతున్నారు. మొన్నటి వరకు విధ్వంసానికి చిరునామా కాగా. . ఇప్పుడు అభివృద్ధికి చిరునామాగా మారింది’ అని చంద్రబాబు తెలిపారు.

రూ.26 వేల కోట్లతో అమరావతి ఓఆర్‌ఆర్: భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా ఆరు వరుసల రహదారులు 3, నాలుగు లైన్ల రహదారులు నాలుగింటి పనులు జరుగుతున్నట్లు ఎన్‌హెచ్ అధికారులు సీఎంకు చెప్పారు. రూ.26 వేల కోట్లతో 189 కి.మీ. అమరావతి అవుట్ రింగ్ రోడ్, 56 కి.మీ. మేర రూ.300 కోట్లతో కుప్పం- హోసూరు- బెంగళూరు రోడ్, రూ.8,300 కోట్లతో 165 కి.మీ. మూలపేట- విశాఖ గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం, హైదరాబాద్- విజయవాడ మధ్య 226 కి.మీ. మేర రూ.8 వేల కోట్లతో 6/8 వరుసల ఎన్‌హెచ్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు.

గ్రహం అనుగ్రహం

25-10-2024 శుక్రవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం
నవమి: పూర్తి
పుష్యమి: మ. 12-08 తదుపరి ఆశ్లేష
వర్జ్యం: రా. 1-33 నుంచి 3-14 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-11 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-03 వరకు
తిరిగి మ. 12-08 నుంచి 12-54 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.59; సూర్యాస్తమయం: సా. 5.31

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	36.5	22.5
నెల్లూరు	35.6	26.4
ఒంగోలు	34.7	26.0
అనంతపురం	34.5	24.3
గుంటూరు	34.0	24.0
కర్నూలు	33.8	23.7
విజయవాడ	33.5	23.4
తాడేపల్లిగూడెం	33.2	24.0
కడప	33.0	23.0
తిరుపతి	32.8	24.6
నరసాపురం	32.4	25.2
విశాఖపట్నం	32.4	23.0
శ్రీకాకుళం	32.0	26.0
విజయనగరం	30.0	24.0

ఈనాడు

విశ్వశాంతికి 'బ్రిక్స్' పిలుపు

బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణంకోసం ఆవిర్భవించిన 'బ్రిక్స్' కూటమి- విశ్వ ప్రగతి, భద్రతకోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని తాజాగా పిలుపిచ్చింది. నూతనంగా నాలుగు దేశాల చేరికతో కొత్త జవం సంతరించుకొన్న 'బ్రిక్స్' 16వ శిఖరాగ్ర సదస్సు రష్యాలోని కజన్ నగరంలో ముగిసింది. పుడమి గుండెలపై పెనుకుంపటిలా పరిణమించిన యుద్ధాలు, ఉగ్రవాదంపై పోరాటం, ఆర్థిక వృద్ధికి పరస్పర ప్రోత్సాహం తదితరాలపై ఇందులో చర్చలు సాగాయి. అంతర్జాతీయ వివాదాలను దౌత్య మార్గాల్లో శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్న కజన్ తీర్మానం సహర్షంగా స్వాగతించదగింది. పశ్చిమాసియా పరిస్థితులు నానాటికీ దిగజారుతుండటంపై 'బ్రిక్స్' తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సత్వరం ముగిసిపోవాలని కోరుకొంటున్న ఇండియా- శాంతి స్థాపనకు సహకరించడానికి సదా సిద్ధమని పునరుద్ఘాటించింది. రష్యాను ఏకాకిని చేయాలన్న పాశ్చాత్య దేశాల ప్రయత్నాలు ఫలించేవి కావని బ్రిక్స్ సదస్సు చాటిచెప్పింది. ఇండియా, చైనా, ఇరాన్ సహా 36 దేశాలకు, అందులోనూ ఇరవైకి పైగా దేశాధినేతలకు ఆతిథ్యమివ్వడం ద్వారా అంతర్జాతీయ యవనికపైకి పుతిన్ మళ్ళీ బలంగా తిరిగొచ్చారు!

నాలుగేళ్ల క్రితం తూర్పు లద్దాఖ్‌లో ఘర్షణల తరవాత భారత్-చైనా సంబంధాలు బాగా క్షీణించాయి. వాటిని గాడినపెట్టే క్రమంలో వాస్తవాధీన రేఖ వెంబడి పూర్వ స్థితి కొనసాగింపునకు ఇటీవల గస్తీ ఒప్పందమొకటి కుదిరింది. దాదాపు అయిదేళ్ల తరవాత కజన్ వేదికగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరిగిన మోదీ ద్వైపాక్షిక భేటీ మరింత సానుకూల వాతావరణానికి ప్రోదిచేసింది. ప్రత్యేక ప్రతినిధుల స్థాయిలో చర్చల ప్రారంభానికి ఇరుపక్షాలు నిర్ణయించడం హర్షణీయం. ద్వైపాక్షిక సంబంధాల్లో పరస్పర నమ్మకం, గౌరవం కీలకమైనవన్న మోదీ వ్యాఖ్య అక్షరసత్యం. అయితే, 'పంచశీల' స్ఫూర్తిని కాలరాసి ఆరు దశాబ్దాల క్రితం ఇండియాపై కత్తిదూసిన చైనా- వాగ్దానాలకూ ఒప్పందాలకు కట్టుబడే అలవాటు తనకు లేదని నిరూపించుకుంది. పాకిస్థాన్‌తో చేతులు కలిపి భారతదేశాన్ని అస్థిరపరిచేందుకు కాచుకొని కూర్చుంది. కరడుగట్టిన ముష్కరులపై ఆంక్షల విధింపునకు అది ఐరాసలో మోకాలడ్డింది. ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలు తగవంటూ బీజింగ్‌కు మోదీ తాజాగా చురకలంటించడానికి కారణమిదే. అటువంటి చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ఎంతవరకు కట్టుబాటు చాటుతుందో చూడాలి!

ఉక్రెయిన్‌పై దండెత్తిన రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షల కొరడాను ఝుళిపించాయి. డాలర్‌ను రాజకీయ ఆయుధంగా అమెరికా ప్రయోగిస్తున్న నేపథ్యంలో దాని ఆధిపత్యాన్ని తగ్గించేందుకు అంతర్జాతీయ ప్రత్యామ్నాయ చెల్లింపుల వ్యవస్థకోసం మాస్కో గళమెత్తుతోంది. ఆ క్రమంలోనే 'బ్రిక్స్'ను విస్తరించాలని అది భావిస్తోంది. తనతో కలిసి వచ్చే దేశాలకు సభ్యత్వం ఇప్పించి 'బ్రిక్స్'ను గుప్పిట్లో పెట్టుకోవాలని చైనా కలలుకంటోంది. దాని జిత్తులను ఇండియా ఎప్పటికప్పుడు చిత్తు చేస్తోంది. అంతర్జాతీయ వేదికల్లో సంస్కరణలకు, అభివృద్ధి చెందుతున్న దేశాలతో బంధం బలోపేతానికి 'బ్రిక్స్'ను ఒక సాధనంగా భారత్ వినియోగించుకుంటోంది. పాశ్చాత్య వ్యతిరేక విధానాలకు అది వేదిక కాకుండా జాగ్రత్తవహిస్తోంది. 'బ్రిక్స్' ఉద్దేశం విభజన కాదని, మానవాళి సంక్షేమమే దాని ధ్యేయమన్న మోదీ తాజా ప్రకటనే ఇందుకు నిదర్శనం. అగ్రరాజ్యాల పెత్తందారీ పోకడలను అడ్డుకుంటూ, వర్ధమాన దేశాల ఆకాంక్షలను నెరవేర్చగలిగితేనే 'బ్రిక్స్'కు సార్థకత. ఆ మేరకు కూటమి సభ్యదేశాలు, భాగస్వామ్య పక్షాల నడుమ సౌహార్ద సంబంధాల వారధిగా ఇండియా కృషి కొనసాగాలి!



మహిళల పట్ల సమాజధోరణి ఇంకా మారలేదు. ఆమె తన హక్కుల గురించీ, స్వేచ్ఛ గురించీ నోరు తెరిచి ప్రస్తావిస్తే చాలు పురుషుల గుండెల్లో వెళ్ల పరుగెడుతున్నాయి.

– మృదులా గర్గ్, హిందీ రచయిత్రి

మూడు దుఃఖాలు

మనిషికి దుఃఖం ఎందుకు కలుగుతుంది? దాన్ని నివారించే మార్గం ఏదైనా ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందుగా అసలు దుఃఖమంటే ఏంటో తెలియాలి. దాని స్వరూప స్వభావాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవాలి. తైత్తిరీయ ఉపనిషత్తులోని సాంఖ్య దర్శనంలో దీనికి సంబంధించి ప్రామాణిక వివరణ కనిపిస్తుంది. మనుషులకు కలిగే దుఃఖాలు మూడు... ఆధ్యాత్మికం, ఆది భౌతికం, ఆది దైవికం. మనిషిలో రజోగుణ ప్రకోపం ఎక్కువైనప్పుడు కలిగే ఈ మూడింటికీ కాస్త పరిణామ భేదం ఉంటుంది తప్ప అన్నీ ఒక కోవకు చెందినవే.



అంతర్యామి

ఎవరికి వారుగా చిన్నపాటి ప్రయత్నంతో, సులభంగా దుఃఖాన్ని పోగొట్టుకోవచ్చని సాంఖ్యశాస్త్రం చెబుతోంది. తమను తాము తరచి చూసుకోవడం ద్వారా, ఆలోచనలను సంస్కరించుకోవడం ద్వారా అది సాధ్యమేనంటోంది.

ఆధ్యాత్మిక దుఃఖం... శారీరకం, మానసికం అని రెండు రకాలు. శారీరక అనారోగ్యం కారణంగా కలిగే దుఃఖం- వైద్యుణ్ని సరైన మందు తీసుకుంటే ఉపశమిస్తుంది. అరిషడ్వర్గాలవల్ల కలిగే దుఃఖం మానసికం. ఏ మనిషైనా ఫలానాది నాకు కావాలనుకోవడంలో తప్పులేదు. కానీ స్థాయిని మర్చిపోయి అందని ద్రాక్షకోసం అర్రులు చాచకూడదు. తెల్లారేసరికల్లా అపర కుబేరుడిగా మారిపోవాలనుకోవడం అజ్ఞానం. కోటీశ్వరుడు కావాలనుకోవడం తప్పుకాదు. కానీ, దానికోసం శ్రమించకుండా అప్పనంగా సంపద ఒళ్లో పడాలనుకోవడం అవివేకం. ఇలాంటి అనుచితమైన కోరికలవల్ల మనసుకు దుఃఖం కలుగుతుంది. వీలైనంత ప్రశాంతంగా ఉండాలి. మంచిగా ఆలోచించాలి. ఇతరుల అభివృద్ధిని చూసి సంతోషించాలి. అరిషడ్వర్గాలవల్ల కలిగే దుఃఖానికి ఇవే తగిన ఔషధాలు.

రెండో రకమైన దుఃఖం ఆది భౌతికం. ఇది మనుషులు, పాములు, తేళ్లు, సింహాలవంటి ప్రాణులవల్ల కలుగుతుంది. క్రూరమృగాలకు దూరంగా ఉండొచ్చు కానీ మనుషులకు దూరంగా ఎలా ఉండగలం! 'నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ' అని శతకకారుడు చెప్పినట్టుగా చెడ్డవారికి దూరంగా ఉండాలి. మన గురించి చెడుగా ఆలోచించేవారు చాలామంది ఉండొచ్చు. అది వాళ్ల లోపం. వాళ్ల గురించి, వాళ్ల చర్యల గురించి పదే పదే ఆలోచించి, బాధపడటం ఎందుకు... అనే సత్యాన్ని తెలుసుకుంటే ఈ విధమైన దుఃఖం నుంచి విముక్తి కలుగుతుంది. వివేచన అంటే అదే. ఈ నిజాన్ని తెలుసుకోలేకపోతే అవతలివాళ్లు చేసే చేటుకంటే ఎవరికివారు చేసుకునే చేటే ఎక్కువ.

మూడో రకమైన దుఃఖం ఆది దైవికం. ఇది యక్ష, రాక్షస, గ్రహావేశాలవల్ల కలిగే దుఃఖం. మన జీవితం మన చేతిలో ఉండాలి. మన ఉపాసన బలం మనకుండాలి. మంచి నడవడిక, నిర్మలమైన మనసు ఉంటే భగవంతుడి అండ ఎప్పటికీ ఉంటుంది. అవే నిర్మలమైన ఆనందానికి హేతువులు. ఈ నిజాన్ని తెలుసుకోవటమే దుఃఖనివారణకు సిసలైన మార్గం.

– మల్లాది వేంకట గోపాలకృష్ణ

పునాది చదువులకు తీరైన ప్రణాళికలు

మన పాఠశాల విద్యను సమూలంగా సంస్కరించాలని జాతీయ విద్యావిధానం-2020 ప్రతిపాదించింది. అందులో భాగంగా మూడేళ్లలోపు చిన్నారుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పేర్కొంది. దీని వెనుక ఉన్న శాస్త్రీయ అధ్యయనాలను ఉటంకిస్తూ, పిల్లల మానసిక వికాసం పెంపొందించడానికి అవసరమైన చర్యలను సూచించింది. నేర్చుకొనేతత్వం శిశువుకు జన్మించిన నాటి నుంచే అలవడుతుంది. ముఖ్యంగా మనిషి వ్యక్తిత్వ వికాసంలో 85శాతం వరకు మొదటి ఆరేళ్ల వయసులోనే జరుగుతుందని శాస్త్రవేత్తల అంచనా. అందులోనూ మొదటి మూడేళ్లు అతి ముఖ్యమైనవి. ప్రాథమిక విద్య- నేర్చుకొనే సామర్థ్యాన్ని, వ్యక్తి జీవితం తరవాతి దశల్లో శక్తియుక్తులను ప్రభావితం చేస్తుందని 'నేచర్' పత్రికలో ఇటీవల ప్రచురితమైన వ్యాసం తేల్చిచెప్పింది. బీనా కోషి, మణికందన్ శ్రీనివాసన్ తదితరులు తమిళనాడులోని వెల్లూరులో 251 మంది పిల్లలపై చేసిన పరిశోధన ద్వారా ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. అతి చిన్నవయసులో (0-3 ఏళ్లు) అందించే విద్య చిన్నారుల మేధాశక్తిని ప్రభావితం చేస్తున్నట్లు వీరు గుర్తించారు.

గమనిస్తూ... నేర్పాలి!

చిన్నతనంలో విద్య అనేది అభిజ్ఞా నైపుణ్యాలను ఇనుమడింపజేయాలి. అభిజ్ఞా నైపుణ్యాలంటే మెదడు (బ్రైన్)కు, మేధస్సు (ఇంటెలిజెన్స్)కు సంబంధించినవి. శైశవ దశలోనే మెదడు పరిణతి చెందేందుకు వీలైన కార్యకలాపాలను ప్రోత్సహించాలి. మేధస్సు పెరిగి, అవగాహన పెంపొందేందుకు వీలుగా చర్యలు చేపట్టాలి. విషయ అవగాహన, విశ్లేషణ, గుర్తింపు సామర్థ్యం, కార్యాచరణ సంబంధాలను (రీజనింగ్) అర్థం చేసుకోవడం, సందర్భోచితంగా నిర్ణయాలు తీసుకోవడం వంటివీ అభిజ్ఞా నైపుణ్యాల కోవలోకి వస్తాయి. చిన్నారులు తమ చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూ, ఎలా ప్రతిస్పందిస్తున్నారనే అంశాన్నీ అధ్యయనం చేయాలి. ఈ సామర్థ్యం పెంపొందేలా పాఠ్య ప్రణాళికలు రూపొందించాలి. ముఖ్యంగా దృశ్య శ్రవణ మాధ్యమాలకు స్పందన ఎలా ఉందనే విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. పిల్లలు రంగులను గుర్తించడం, వివిధ ఆకృతులను పసిగట్టడంలో ప్రతిస్పందించే తీరును గమనించాలి. ఇందుకు అనువైన వాతావరణాన్ని, పాఠ్యాంశాలను రూపొందించాలి.

బహుముఖ ప్రజ్ఞ కోసం...

జాతీయ విద్యా, శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 1992లోనే 30వేల మంది పిల్లలపై అధ్యయనం చేసి శైశవ దశలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఉందని పేర్కొంది. ఈ ప్రయత్నం రెండు దశలుగా సాగాలని వెల్లడించింది. ఒకటి, 0-3ఏళ్ల వయసు పిల్లలకు ఉద్దేశించింది. ఇందుకోసం అటు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ దశలో పిల్లలకు తక్కువ ఖర్చులో దొరికే



పిల్లలకు ఎలాంటి విద్యను అందించాలనే విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. చదువు అనేది విద్యార్థుల నైపుణ్యాలకు సానపట్టాలి. పోటీ ప్రపంచంలో నెగ్గుకొచ్చే సామర్థ్యాలను అందించాలి. ఆ మేరకు మన పాఠ్య ప్రణాళికలను రూపొందించుకోవాలి.

'లెర్నింగ్ ఎయిడ్స్'ను రూపొందించాలి. వాటిలో ఎక్కువగా పిల్లలు ఆడుకునే రంగుల వస్తువులు, వివిధ ఆకృతుల బిళ్లలు, బొమ్మలు, టోపీలు, పడవలు వంటి వాటిని కాగితాలతో తయారు చేసి చూపాలి. తద్వారా పిల్లల గుర్తింపు సామర్థ్యాన్ని పెంచేందుకు యత్నించాలి. ఈ దశలో ఆటల ద్వారా నేర్చుకొనే సామర్థ్యాన్ని పెంపొందించాలి. రెండో దశలో (3-8 ఏళ్లు) పాఠ్యాంశాలు పిల్లల బహుముఖ ప్రజ్ఞను వెలుగులోకి తెచ్చేలా ఉండాలని ఎన్‌సీఈఆర్‌టీ పేర్కొంది. ఇందులో ముఖ్యంగా మూడు అంశాలకు సంబంధించి సామర్థ్యాల పెంపు ఉండాలి. అవి... ఆటలతో ముడిపడిన (ప్లే బేస్డ్) పాఠ్యాంశాలు, చర్యల ఆధారిత (యాక్టివిటీ బేస్డ్) విద్య, కొత్త విషయాలను గుర్తించే (డిస్కవరీ బేస్డ్) లెర్నింగ్. వీటికి సంబంధించి ఏయే అంశాలపై దృష్టి పెడితే బాగుంటుందనే అంశాన్ని అటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠ్యప్రణాళికను రూపొందించే నిపుణులు గమనించాలి.

నిపుణుల సూచనలతో...


పాఠ్య ప్రణాళిక అనేది పిల్లల మానసిక వికాసాన్ని, సృజనాత్మకతను పెంపొందించేదిగా ఉండాలని జాతీయ విద్యా విధానం సూచించింది. ఆరేళ్లలోపు పిల్లల భవితకు పునాదులు పడేందుకు వీలుగా కొన్ని ముఖ్యమైన చర్యలు చేపట్టాలి. ఒకటి- అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను మార్చాలి. పాతబడిన భవనాల్లో కాకుండా ఆకర్షణీయమైన, నూతన భవనాలను నిర్మించాలి. అందులో చిన్నారి ప్రవేశించగానే కొత్తలోకం కనిపించాలి. నిపుణుల సాయంతో నమూనాలు రూపొందించి, భవనాలను నిర్మింపజేయాలి. రెండు- మానసిక శాస్త్రవేత్తల సూచనలు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఆరేళ్లలోపు బాలబాలికలకు పాఠ్యప్రణాళికను నిర్ణయించాలి. నిజానికి అటు కేంద్రంలో సీబీఎస్ఈగాని, రాష్ట్రాల్లోని ఎస్‌సీఈఆర్‌టీలుగాని ఈ స్థాయి విద్యకు సంబంధించి గట్టి ప్రయత్నం ఏమీ చేయలేదు. తెలుగు రాష్ట్రాలు సైతం నిపుణులతో ఉన్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసి పాఠ్యాంశాలను నిర్ధారించవచ్చు.

పద్ధతిగా ప్రాథమిక విద్య

ప్రాథమిక విద్య రెండో దశలో పిల్లలకు వర్ణమాలను నేర్పడం, అంకెలూ రంగులను గుర్తించేలా చూడటం, మాతృభాషలో మాట్లాడించడం ముఖ్యం. ఆకృతులను సరిపోల్చడం, ధ్వనులను అనుకరించడం, వేరుపరచడం, డ్రాయింగ్, సంగీతం, నాట్యం వంటివి పరిచయం చేయడంపై దృష్టి సారించాలి. ఇంకా పైస్థాయిలో పజిల్స్ పూర్తిచేయడం, చుక్కలు కలపడం, కథలు చెప్పడం, గీతాలు వల్లె వేయడం, పద్యాలు చెప్పడం వంటి అంశాలను చేర్చవచ్చు. ప్రధానంగా పిల్లలు భాషపై పట్టు సాధించేలా చూడాలి. లెక్కల మదింపు సామర్థ్యం (కంప్యూటేషనల్ ఎబిలిటీ), తోటిపిల్లలతో కలిసిమెలిసి మెలగడం నేర్పాలి.

ఆటపాటలతో అక్షర జ్ఞానం

ప్రాథమిక దశలో చదువు అనేది కేవలం పుస్తకాలకు పరిమితం కాకూడదు. ఆటపాటల ద్వారా అక్షర జ్ఞానాన్ని, పరిసరాలపై అవగాహనను ఏర్పరచే ప్రయత్నం జరగాలి. ఇందుకోసం విజ్ఞానాన్ని పెంపొందించే బొమ్మలూ పరికరాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి. ఈ కేంద్రాలను సమర్థంగా నిర్వహించడానికి సుశిక్షితులైన శిక్షకులను నియమించాలి. వీరిని తీర్చిదిద్దేందుకు రాష్ట్రస్థాయి శిక్షణా కేంద్రాన్ని స్థాపించాలి. చివరిగా, ఈ భావనను, వ్యవస్థను సార్వజనీనం చేయడానికి తల్లిదండ్రులు, ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. ఇందుకోసం ప్రభుత్వాలు అన్నిరకాల ప్రసార మాధ్యమాలను వినియోగించుకోవాలి. ఈ మొత్తం కార్యక్రమంలో తల్లిదండ్రుల బాధ్యతే ఎక్కువ. ఇందుకోసం వారే మొదటి అడుగు వేయాలి. ఆపైన ప్రభుత్వ తోడ్పాటు, ప్రజామోదం జతచేరి భావితరానికి సరికొత్త ప్రపంచం అందించవచ్చు. మానవ వనరుల అభివృద్ధిలో ఇదొక సరికొత్త పంథాగా నిలుస్తుంది. ఫలితంగా, మెరుగైన సమాజం ఆవిష్కృతమవుతుంది.



ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం


ఉపాధి కల్పనకు ఊతంగా...

మన దేశంలో చారిత్రక కట్టడాలు, సహజ సుందర ప్రదేశాలెన్నో ఉన్నాయి. వాటిని చూడటానికి వస్తున్న విదేశీ పర్యటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో తగిన వసతులు, భద్రతకు భరోసా కల్పిస్తే మరెందరో ఇండియాను సందర్శిస్తారు. తద్వారా దేశాదాయం ఇనుమడిస్తుంది.

ఈ ఏడాది మొదటి ఆర్నెల్లలో 47.8 లక్షల మంది విదేశీ పర్యటకులు భారత్‌లో ఆయా ప్రదేశాలను తిలకించారు. అంతకుముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే విదేశీ సందర్శకుల్లో 9.1శాతం వృద్ధి నెలకొంది. ఈ మేరకు కేంద్రం ఇటీవల వివరాలు వెల్లడించింది. బంగ్లాదేశ్, అమెరికాల నుంచి అత్యధికంగా పర్యటకులు ఇండియాకు వచ్చారు. యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఆస్ట్రేలియా వాసులు తరవాతి స్థానాల్లో నిలిచారు. ఈ ఏడాది జనవరి- జూన్ మధ్యకాలంలో విదేశీ సందర్శకుల వల్ల ఇండియాకు రూ.1.28 లక్షల కోట్ల ఆదాయం సమకూరింది. అంతకుముందు సంవత్సరం మొదటి ఆరు మాసాల్లో ఆదాయం రూ.1.09 లక్షల కోట్లే. విదేశీ యాత్రికుల రాక వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. పర్యటక రంగ వృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు అధికమవుతాయి. కొవిడ్ తరవాతి పరిస్థితులను పరిశీలిస్తే దేశీయ పర్యటక రంగానికి కొత్త జవసత్వాలు వచ్చాయని చెప్పవచ్చు. 2021లో 10.5 లక్షల మంది విదేశీ పర్యటకులు భారత్‌కు అతిథులుగా వస్తే, అనంతరం ఏటికేడు మంచి వృద్ధి కనిపిస్తోంది.

భద్రతకు భరోసా ఇవ్వాలి...

భారత జీడీపీలో పర్యటక రంగం వాటా 6.5శాతం. 4.3 కోట్ల ఉద్యోగాల కల్పనకు ఈ రంగం ఊతమిచ్చింది. 2030 నాటికి జీడీపీలో పర్యటక రంగం వాటాను 7.6శాతానికి చేర్చాలన్నది కేంద్రం లక్ష్యం. మరో ఆరేళ్లలో జపాన్, మెక్సికోలను దాటి ప్రపంచ పర్యటకంలో ముందున్న దేశాల్లో ఇండియాను నాలుగో స్థానానికి తీసుకెళ్లాలనే ఆశయంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇదంతా నాణేనికి ఒక వైపే! మరోవైపు విదేశీ యాత్రికుల భద్రత పలు సందర్భాల్లో ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ ఏడాది మార్చిలో స్పెయిన్‌కు చెందిన యాత్రికురాలిపై ఝార్ఖండ్‌లో దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టడం యావద్దేశాన్నీ దిగ్భ్రాంతపరచింది. అతిథులపై తరచూ దాడులు, అరాచకాలు జరుగుతుండటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలి. ఇటీవల యూకే- తమ దేశీయులు సందర్శించేందుకు అతి ప్రమాదకరమైన దేశాల జాబితాలో భారత్‌ను సైతం చేర్చింది.



కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలోని పలు కోటలు, మ్యూజియాల్లో ప్రవేశానికి దేశీయ యాత్రికుల కన్నా ఎక్కువ మొత్తం రుసుమును విదేశీయుల నుంచి వసూలు చేస్తున్నారు. మనకు భారీగా ఆదాయం తెచ్చిపెట్టే విదేశీ యాత్రికుల రక్షణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. వారి భద్రతకు పూర్తి భరోసా కల్పించాలి.

ఉభయ తెలుగు రాష్ట్రాలకు విదేశీ యాత్రికుల రాక అంతంతమాత్రంగానే ఉంటోంది. గతేడాది తెలంగాణలో విదేశీయులు ఎక్కువగా సందర్శించిన ప్రదేశంగా గోల్కొండ నిలిచింది. అయితే, ఇక్కడికి వచ్చిన వారు కేవలం 11వేల మందే. తీర ప్రాంతమైన గోవాకు లక్షల సంఖ్యలో విదేశీయులు వరస కడతారు. సుదీర్ఘమైన తీర ప్రాంతాన్ని కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ పర్యటక రంగం ద్వారా ఆదాయ వనరులు సృష్టించుకోవచ్చు. పర్యటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఏపీ సర్కారు 'టూరిజం పాలసీ' తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఏపీలోని విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని, తెలంగాణకు రావాల్సిన ఎయిర్‌పోర్టులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లోని చారిత్రక కట్టడాలు, అడవులు, జలపాతాల దగ్గర విదేశీయులను ఆకట్టుకునేలా తగిన ఏర్పాట్లపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. తద్వారా ఆదాయానికి, ఉపాధి కల్పనకూ అవకాశం లభిస్తుంది.

– గుండు పాండురంగశర్మ

నీ బలం... నువ్వే!

వేదిక మీద ఒక వ్యక్తి ప్రసంగిస్తున్నాడు. అందరూ కళ్లూ చెవులూ అప్పగించి వింటున్నారు. అతడేమీ సినిమా తారో స్పోర్ట్స్ స్టారో కాదు. అయినా రెప్పవేయటం మర్చిపోయి మరీ వింటున్నారు. నల్లగా ఉన్నాననో, పొట్టిగా ఉన్నాననో, లావయ్యాననో, అనారోగ్యంతో ఏమీ చేయలేకపోతున్నాననో, పేదరికం కలల్ని సమాధి చేసిందనో... లోలోపల గూడు కట్టుకున్న రకరకాల ఆత్మన్యూనతల అసంతృప్తులన్నీ కరిగి కన్నీరవుతున్నాయి. అతడికీ నీకూ తేడా ఏంటో తెలిసిందా, మరి నువ్వేం సాధించావు అని అంతరాత్మలు నిగ్గదీసి అడుగుతున్నాయి. సిగ్గుతో వాలిపోతున్న కనురెప్పల్ని బలవంతాన తెరచిచూస్తూ 'ఈ క్షణం నుంచి నేను నేనుగా జీవిస్తాను. నాకున్న బలాల్ని గౌరవిస్తాను' అని మనసుని కూడదీసుకుంటూ ఆ వక్తనుంచి అందినంత స్ఫూర్తిని ఒడిసి పట్టుకుంటున్నాయి అక్కడున్న వేలాది హృదయాలు.



ఆ వక్త వృత్తి ప్రేరణాత్మక ప్రసంగాలు ఇవ్వడమే అయినా అతడు చేయగలడని ఎవరూ ఊహించని పనులన్నీ చేస్తాడు. అమెరికాలో స్థిరపడిన అతడి పేరు నిక్ ఊయిచిచ్. వయసు 42 ఏళ్లు. అరుదైన జన్యువ్యాధి వల్ల అతడికి పుట్టుకతో కాళ్లూ చేతులూ లేవు. కేవలం మొండెమూ తలతో పుట్టిన బిడ్డని చూసి దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు ఆస్పత్రిలోనే వదిలి వెళ్లిపోయారు. ఆ తరవాత వైద్యుల కౌన్సెలింగ్‌తో ధైర్యం కూడదీసుకుని బిడ్డను సాకడం మొదలెట్టారు. కన్నవాళ్లు కాబట్టి ప్రేమగా చూస్తారు కానీ, బయట అవమానాలు భరించలేక పదేళ్ల వయసులో ఆత్మహత్యాయత్నం చేశాడు. ఫలించలేదు. ఎప్పుడూ కుంగుబాటులో కూరుకుపోయి ఉంటున్న బిడ్డకి తల్లి జీవితం పట్ల ఆశ నూరిపోసేది. 'నువ్వు తలచుకోవాలే కానీ ఏదైనా చేయగలవ'ంటూ ప్రోత్సహించేది. అప్పుడు మొదలైంది పరిస్థితులతో అతడి పోరాటం. వైకల్యం తన విలువను నిర్ధారించకూడదనీ సంకల్పబలంతో దాన్ని అధిగమించాలనీ నిర్ణయించుకున్నాడు. మొండెంతోనే నడకా, నోటితో పనులూ సాధన చేశాడు. డిగ్రీ పూర్తిచేశాడు. కంప్యూటరు నేర్చుకున్నాడు. టెన్నిస్ ఆడతాడు. డ్రమ్స్ వాయిస్తాడు. కారు డ్రైవింగ్, ఈత, సర్ఫింగ్... అన్నీ చేస్తాడు. కృత్రిమ అవయవాలు ఏవీ వాడకుండా, తాను ఎలా ఉన్నాడో అలాగే. పెళ్లి చేసుకుని నలుగురు బిడ్డలకు తండ్రయ్యాడు. తనలాంటివారికి తోడ్పడేందుకు పలు లాభాపేక్ష లేని సంస్థల్ని నిర్వహిస్తున్నాడు. 'లైఫ్ విత్‌ఔట్ లిమిట్స్' అని ఆత్మకథతో పాటు మరెన్నో పుస్తకాలు రాసి బెస్ట్ సెల్లింగ్ ఆథర్స్ సరసన చేరాడు. మన లోపలి శక్తిని మనం తెలుసుకోవాలనడానికి నిలువెత్తు నిదర్శనం... నిక్!

– విస్మయ

దిల్లీ ఉక్కిరి బిక్కిరి

ఏటా శీతకాలంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో పంట వ్యర్థాల దహనం వల్ల దేశ రాజధానిని కాలుష్యం కమ్మేస్తోంది. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. పంట వ్యర్థాల దహనం నివారణకు పాలకులు సరైన చర్యలు చేపట్టకపోవడంపై సుప్రీంకోర్టు తాజాగా ఆగ్రహం వ్యక్తం చేసింది. గత మూడేళ్లలో దిల్లీ చుట్టుపక్కల పంట దహనం ఘటనలు...

	2021	2022	2023
పంజాబ్	71,304	49,922	36,663
హరియాణా	6,987	3,661	2,303
దిల్లీ, రాజస్థాన్‌లోని ఎన్‌సీఆర్ జిల్లాలు	78,550	53,792	39,186

భలే.. భలే.. గులాబీ సరస్సు!

గులాబీ రంగు నీళ్లతో కనిపిస్తున్న దీని పేరు హిల్లియర్ సరస్సు. దీన్ని బబుల్‌గమ్ లేక్ అని కూడా పిలుస్తారు. ఇది పశ్చిమ ఆస్ట్రేలియాలోని దక్షిణ తీరంలో ఉంది. అక్కడి గోల్డ్‌ఫీల్డ్, ఎస్పెరెన్స్ ప్రాంతంలో రెచెర్చే ద్వీపసమూహంలోని మిడిల్ ఐలాండ్‌లో ప్రకృతి సిద్ధంగా ఏర్పడింది. దీని పొడవు 600 మీటర్లు. వెడల్పు 250 మీటర్లు. దీని చుట్టూ యూకలిప్టస్ చెట్లతో దట్టమైన అడవి ఉంది. ఇదో ఉప్పునీటి సరస్సు. ఉనాలియెల్లా సాలీనా అనే ఆల్గే వల్లే దీనికి ఈ రంగు వచ్చింది. గులాబీరంగులో ఉండే ఈ సరస్సులో నీటిని ఏదైనా పాత్రలోకి తీసుకున్నప్పుడు కూడా



అలాగే మారకుండా ఉంటుందట. ఈ నీటిలో ఉప్పుశాతం ఎక్కువగా ఉన్నప్పటికీ కొన్ని రకాల బ్యాక్టీరియాలు మాత్రం జీవిస్తున్నాయట.

చుట్టూ సముద్రపు నీరుతో ఉన్న ద్వీపంలో ఈ సరస్సు ఉంది. అందుకే దీన్ని సముద్ర, ఆకాశమార్గాల్లో మాత్రమే చేరుకోగలం. ఈ ప్రకృతి వింతను చూడ్డానికి ఏటా పెద్ద సంఖ్యలో దేశ, విదేశాల నుంచి పర్యటకులు వస్తుంటారు. కానీ ఇందులోకి దిగి ఈత కొట్టడానికి మాత్రం వీలుండదు. దాని కోసం ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సిందేనట. నేస్తాలూ.. మొత్తానికి ఇవీ హిల్లియర్ సరస్సు విశేషాలు! మరో విషయం ఏంటంటే కేవలం హిల్లియర్ సరస్సే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా మరికొన్ని పింక్‌లేక్‌లు కూడా ఉన్నాయి. కానీ నీలి రంగు జలాలతో ఉన్న సముద్రం పక్కనే, ఇలా లేత గులాబీ రంగు నీళ్లతో కనిపించే ఈ సరస్సు వాటన్నింటికన్నా ఇంకాస్త ప్రత్యేకం!

హాయ్! బుజ్జీ!!

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. వాటిని సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి చూద్దాం.

కృష్ణ	మనిషి	పుంజు	కరవు	భూమి
పీత	గడ్డి	చిలుక	జీవ	సాగు
పచ్చ	జింక	కోకిల	కోడి	భూమి
పలుకులు	గాన	నది	మర	కాటకాలు

జవాబు: [illegible]

హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

- నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర


మహేశ్వరరావు కుంచం


తూట చంద్ర ధనశేఖర్


చల్లా గుణరంజన్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కొత్తగా ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. సుప్రీం కోర్టు కొలీజియం ఈనెల 15న న్యాయవాదుల కోటా నుంచి సిఫార్సు చేసిన మహేశ్వరరావు కుంచం, తూట చంద్ర ధనశేఖర్, చల్లా గుణరంజన్‌లను అదనపు న్యాయమూర్తులుగా నియమించడానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. కేంద్ర న్యాయశాఖ వీరి నియామక ఉత్తర్వులను విడుదల చేసింది. 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన ఏపీ హైకోర్టులో ప్రస్తుతం 26 మంది సేవలందిస్తున్నారు. ముగ్గురి నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడంతో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరనుంది.

రాజధాని పనులకు గత కాంట్రాక్టుల రద్దు

- కొత్తగా మళ్లీ టెండర్లు
- పురపాలకశాఖ మంత్రి నారాయణ

ఈనాడు-అమరావతి: రాజధాని పనులకు సంబంధించిన గత కాంట్రాక్టులన్నీ 15 రోజుల్లో రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలుస్తామని మంత్రి నారాయణ తెలిపారు. రహదారులు, సచివాలయ భవనాల నిర్మాణానికి డిసెంబరు నెలాఖరులోగా, అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణ పనులకు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకు కొత్త టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన అన్నారు. సచివాలయంలో గురువారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'జగన్ కారణంగా అమరావతి రైతులు పడినన్ని కష్టాలు ఇంకెవరూ పడలేదు. వారి సమస్యల పరిష్కారం పైనే ముందుగా దృష్టి సారించాం. న్యాయపరమైన అంశాలన్నీ ఒకొక్కటిగా పూర్తి చేశాం' అని మంత్రి వివరించారు. 'గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడి పక్కన పెట్టిన రైల్వే ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు చొరవతో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజా నిర్ణయంతో ఎర్రబాలెం నుంచి నంబూరు వరకు అమరావతి మీదుగా 57 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణం కానుంది' అని నారాయణ అన్నారు.

దాచేపల్లిలో నీటి పరీక్షకు ఆదేశాలు

'పల్నాడు జిల్లా దాచేపల్లిలోని అంజనాపురం కాలనీలో బోర్లను మూసి వేసి, నీటిని పరీక్షలకు పంపాలని అధికారులను ఆదేశించాం. సాధారణ పరిస్థితి వచ్చే వరకు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించాం' అని మంత్రి నారాయణ తెలిపారు. దాచేపల్లిలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతిపై కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అమరావతి రైల్వే లైన్‌కు ముందడుగు

కేంద్ర ఆమోదంతో భూసేకరణ, పనుల ప్రారంభానికి అవకాశం

కీలక నగరాలతో అమరావతికి ఏర్పడనున్న అనుసంధానం

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతి మీదుగా నిర్మించతలపెట్టిన కొత్త రైల్వేలైన్‌కు కీలక ముందడుగు పడింది. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 57 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో పనులు వేగంగా పట్టాలెక్కనున్నాయి. దీనికి అవసరమైన భూసేకరణ చేసేందుకు ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా గుర్తిస్తూ జూన్‌లో రైల్వే శాఖ గెజిట్ ప్రచురించింది. తాజాగా కేంద్రం ఆమోదంతో. . ఓవైపు భూసేకరణ ఆరంభించడంతో పాటు, మరో వైపు టెండర్లు పిలిచి, పనులు మొదలుపెట్టేందుకు వీలు కలిగినట్లయింది. ఇప్పటికే డీపీఆర్‌కు రైల్వే బోర్డు కూడా ఆమోదం తెలిపింది. ఈ లైన్‌కు ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఖమ్మం జిల్లాల పరిధిలోని దాదాపు 450 హెక్టార్ల భూసేకరణ చేయనున్నారు.

ఐదేళ్లు తొక్కిపెట్టిన జగన్ ప్రభుత్వం

రాజధాని అమరావతిపై కత్తికట్టిన జగన్ ప్రభుత్వం అమరావతి లైన్‌ను ఐదేళ్లు పూర్తిగా తొక్కిపెట్టింది. దీంతో రైల్వే శాఖ కూడా ఏటా బడ్జెట్‌లో మొక్కుబడిగా రూ.వెయ్యి చొప్పున మాత్రమే కేటాయిస్తూ వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో.. ఈ రైల్వేలైన్‌కు మళ్లీ ఊపిరి వచ్చింది. రైల్వే శాఖ ఆఘమేఘాలపై తుది డీపీఆర్ సిద్ధం చేసి, పంపడం.. రైల్వే బోర్డు దాన్ని ఆమోదించడం.. భూసేకరణకు వీలుగా రైల్వే శాఖ గెజిట్ ప్రచురించడం.. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలపడం చకచకా జరిగిపోయాయి.



అమరావతి సహా కొత్తగా 9 స్టేషన్లు

- కాజీపేట- విజయవాడ ప్రధాన మార్గంలోని ఎర్రుపాలెం వద్ద మొదలయ్యే ఈ కొత్త లైన్ విజయవాడ- గుంటూరు లైన్‌లోని నంబూరు వద్ద కలుస్తుంది. కొత్తగా నిర్మించే స్టేషన్లు: పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు. ఇందులో అమరావతి, పెద్దాపురం, కొప్పురావూరు స్టేషన్లు పెద్దగా నిర్మిస్తారు.
- పరిటాల వద్ద ఎక్కువ సంఖ్యలో గూడ్స్ రైళ్లు నిలిపేందుకు వీలుగా నిర్మాణాలు చేయనున్నారు.
- కొత్తపేట- వడ్డమాను మధ్య కృష్ణా నదిపై 3.2 కి.మీ. మేర వంతెన నిర్మించనున్నారు.

ఉత్తర, దక్షిణ రాష్ట్రాలను కలిపే కీలక లైన్

- ఉత్తరాది రాష్ట్రాల్లోని పలు నగరాలను దక్షిణాది నగరాలకు అనుసంధానం చేసేందుకు ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు లైన్ అత్యంత కీలకం కానుంది.
- రాజధాని అమరావతి మీదుగా హైదరాబాద్, సికింద్రాబాద్‌తోపాటు, ముంబయి, నాగ్‌పుర్, దిల్లీ వంటి నగరాలకు, దక్షిణాదిలో చెన్నైతోపాటు తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పలు నగరాలకు రైళ్లు పరుగులు పెడతాయి.
- ప్రస్తుతం దిల్లీ, ముంబయి నుంచి చెన్నై వైపు వచ్చి వెళ్లే రైళ్లు.. కాజీపేట వైపు నుంచి విజయవాడ వచ్చి అక్కడి నుంచి హౌరా- చెన్నై మెయిన్ లైన్‌లో తెనాలి మీదుగా చెన్నై వైపు రాకపోకలు సాగిస్తున్నాయి.
- అమరావతి లైన్ నిర్మాణం పూర్తయితే.. కాజీపేట నుంచి వచ్చే రైళ్లు ఎర్రుపాలెం వద్ద కొత్త లైన్‌లోకి వచ్చి అమరావతి మీదుగా నంబూరు చేరుకుంటాయి. అక్కడి నుంచి న్యూ గుంటూరు స్టేషన్ మీదుగా హౌరా- చెన్నై ప్రధాన లైన్‌లోని తెనాలి వద్ద కలిసి చెన్నై వైపు వెళతాయి.
- ప్రస్తుతం విజయవాడ మీదుగా నిత్యం సగటున 250 రైళ్ల రాపోకలు సాగిస్తుండటంతో ఈ స్టేషన్‌పై తీవ్ర ఒత్తిడి ఉంది. అమరావతి లైన్ అందుబాటులోకి వస్తే అనేక రైళ్లు దానిమీదుగా మళ్లించేందుకు వీలుంటుంది.

సింగిల్ లైన్‌తో నిరాశ

అమరావతి మీదుగా కొత్త లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపినా.. డబుల్ లైన్‌కు బదులు ఒక్క లైన్‌తో సరిపెట్టడం, రాజధానికి అటు గుంతకల్లు, ఇటు బీబీనగర్ (సికింద్రాబాద్)వైపు లింక్ కలిపే లైన్లను విస్మరించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది

- ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు కేవలం సింగిల్‌లైన్ నిర్మాణానికే క్లియరెన్స్ ఇచ్చారు. వాస్తవానికి ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు మధ్య 56.53 కి.మీ. డబుల్ లైన్, అమరావతి- పెదకూరపాడు మధ్య 24.5 కి.మీ. సింగిల్ లైన్, సత్తెనపల్లి- నరసరావుపేట మధ్య 25 కి.మీ. సింగిల్ లైన్ కలిపి మొత్తం 106 కి.మీ.లతో ఈ ప్రాజెక్టు 2017-18లో మంజూరైంది. అప్పట్లో దీనికి రూ.3,272 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. కానీ ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు సింగిల్‌లైన్ నిర్మాణానికే ఆమోదం తెలిపారు.
- ఎర్రుపాలెం- అమరావతి- నంబూరు లైన్‌లో అమరావతి నుంచి పెదకూరపాడు వరకు లింక్ లైన్ నిర్మించేలా తొలుత ప్రతిపాదన ఉంది. ఇది జరిగితే పెదకూరపాడు వద్ద సికింద్రాబాద్- బీబీనగర్- గుంటూరు లైన్‌కు రాజధాని అమరావతితో అనుసంధానం ఏర్పడుతుంది. సికింద్రాబాద్ నుంచి అమరావతికి నేరుగా రైళ్లు నడపొచ్చు. ఇప్పుడు ఈ లింక్ లైన్‌కు ఆమోదం తెలపకపోవడంతో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లి, అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాజధానికి చేరుకోవాల్సి ఉంటుంది.
- రాయలసీమ జిల్లాలు, బెంగళూరు వైపు నుంచి వచ్చే రైళ్లు నేరుగా రాజధాని అమరావతికి చేరుకునేలా నరసరావుపేట- సత్తెనపల్లి లింక్ లైన్ దోహదపడుతుంది. దాన్నీ పక్కనపెట్టారు.
- ఏకకాలంలో డబులైన్‌తో పాటు, రెండు లింక్ లైన్లు నిర్మిస్తే.. అన్ని వైపుల నుంచి రాజధానికి అనుసంధానం ఏర్పడేది. దీనికి అదనంగా పెద్ద వ్యయం కూడా కాదు. అయినా వాటిని విస్మరించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఇక అందుబాటులో బొబ్బిలి వీణల ముడిసరకు

పనస చెట్ల పెంపకానికి ప్రభుత్వం చర్యలు

ఈనాడు, అమరావతి: దేశ, విదేశాల్లో ఎంతో ప్రాచుర్యం కలిగిన బొబ్బిలి వీణల తయారీకి ముడిసరకుగా వినియోగిస్తున్న పనస మొక్కల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పనస కొరత కారణంగా వీణ తయారీ కళాకారులకు ఎదురవుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనుంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనస మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు గురువారం జారీచేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి హస్త కళాకారులు చేసిన విజ్ఞప్తిపై కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మల తయారీకి కలప కొరతను అధిగమించేందుకు తెల్లపొణికి, అంకుడు మొక్కల పెంపకానికి ప్రభుత్వం ఇటీవల చర్యలు చేపట్టింది. బొబ్బిలి వీణల తయారీకి పనస కలప కొరత తీవ్రంగా ఉందన్న హస్త కళాకారుల విజ్ఞప్తిపై ఉప ముఖ్యమంత్రి స్పందించి తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో ప్రభుత్వ భూముల్లో పనస మొక్కల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. పనస చెట్ల పెంపకంతో పండ్ల విక్రయం ద్వారా పంచాయతీలకు ఆదాయంతో పాటు వీణల తయారీకి కలప కొరత తీరుతుందని పేర్కొంది. బొబ్బిలి, వాడాడ ప్రాంతాల్లో కళాకారులు వీణలు తయారు చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.



జీవితానికి మేలు చేసే నాలుగు సూత్రాలు

1. మీకు సౌకర్యవంతంగా అనిపించే వాతావరణం మీ ఎదుగుదలకు బద్ధ శత్రువు. దాన్నుంచి బయటికి వచ్చి సవాళ్లను స్వీకరించండి. **2.** మీ నైపుణ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టండి. మీపై మీరు పెట్టే విలువైన పెట్టుబడి అదే. **3.** మీరు చేసే పని ఎలాంటి ఫలితాన్నిచ్చినా మీరే బాధ్యత వహించండి. ఆ గుణమే మిమ్మల్ని నాయకుడిగా తీర్చిదిద్దుతుంది. **4.** మీ చుట్టూ నిత్యం స్ఫూర్తినింపే వ్యక్తులు ఉండేలా చూసుకోండి. అప్పుడే మీరు తరగని ఉత్సాహంతో పని చేయగలరు.

– డేనియల్ స్కుటెరి, మెడిటేషన్ కోచ్

ఎవరి సొమ్మని దోచుకు తింటారు?

(మొదటి పేజీ తరువాయి)

ఎడాపెడా దోపిడీకి పాల్పడింది. అత్యంత విలువైన సున్నపురాయి నిక్షేపాల్ని ఇష్టానుసారం కేటాయించుకోవడం ద్వారా వ్యాపార సామ్రాజ్యాన్ని ఎలా విస్తరించుకోవచ్చో భారతీ సిమెంట్స్ ద్వారా గ్రహించిన వైఎస్ కుటుంబం అదే తరహా దోపిడీకి తెరతీసేందుకు సరస్వతి పవర్‌ని తెరపైకి తెచ్చింది ఆ కంపెనీ పేరుతో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గ పరిధిలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 2008లోనే రైతుల నుంచి జగన్ కారు చౌకగా వందల ఎకరాల భూములు కొనుగోలు చేయడం ప్రారంభించారు. వైఎస్ రెండోసారి ఎన్నికల్లో గెలిచిన రెండోరోజే 2009 మే 18న సరస్వతి పవర్ సంస్థకు దాచేపల్లి, మాచవరం మండలాల పరిధిలో 1,515.93 ఎకరాల్లో అత్యంత విలువైన సున్నపురాయి నిక్షేపాల్ని ప్రభుత్వం కట్టబెట్టేసింది. అంత విలువైన భూముల్నీ, ఖనిజ సంపదను గుప్పిట్లో పెట్టుకున్న జగన్.. ఇప్పటివరకు అక్కడ పరిశ్రమ స్థాపనకు ఇటుకరాయి కూడా వెయ్యలేదు. గడువులోగా పరిశ్రమ స్థాపించనందున.. గతంలో తెదేపా ప్రభుత్వం సున్నపురాయి లీజులు రద్దు చేస్తే.. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ వాటిని పునరుద్ధరించుకున్నారు. కృష్ణా నది నుంచి 0.0689 టీఎంసీల జలాల్నీ అడ్డగోలుగా కేటాయించుకున్నారు!

పెద్ద ప్లానే..

'సరస్వతి పవర్' వాస్తవానికి విద్యుదుత్పత్తి కోసం ఏర్పాటు చేసిన కంపెనీ. కానీ భారతీ సిమెంట్‌లో అడ్డగోలుగా లబ్ధి పొందిన జగన్.. అదే తరహాలో సరస్వతి పవర్‌ను కూడా సిమెంట్ కంపెనీగా మార్చేయాలనుకున్నారు. 2008 ఆగస్టు 18న జగన్ అధ్యక్షత తన కంపెనీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కంపెనీ లక్ష్యాల్ని సవరిస్తూ ఆయన భార్య భారతీరెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఇక మీదట కంపెనీ సిమెంట్, క్లింకర్ ఉత్పత్తి, అమ్మకాల్లోకి అడుగుపెడుతుందని, సిమెంట్ ఉత్పత్తికి అవసరమైన గనుల నిర్వహణ చేపడుతుందని తీర్మానం చేశారు. జగన్ తల్లి విజయలక్ష్మి దాన్ని బలపరిచారు. అయితే, సరస్వతి పవర్ సంస్థ సిమెంట్ రంగంలోకి ప్రవేశిస్తూ తీర్మానం చేయడానికి కొన్ని నెలల ముందు నుంచే గనుల లీజు కట్టబెట్టేందుకు సన్నాహాలు జరిగాయి. 2008 ఏప్రిల్ 30నే అప్పటి గనులశాఖ డైరెక్టర్ రాజగోపాల్ ప్రభుత్వానికి దస్త్రం పంపారు. సున్నపురాయి గనుల లీజు దక్కింది 2009 మేలో అయితే.. సరస్వతి పవర్ యాజమాన్యం 2008-09 ఆర్థిక సంవత్సరంలోనే భూసేకరణ కింద రూ. 16.36 కోట్లు ఖర్చు చేసింది. వాస్తవానికి అంతకు రెండు సంవత్సరాల ముందు నుంచే రైతులతో సంప్రదింపులు జరిపింది. 2008 సెప్టెంబరు 26 నుంచి 2011 మే 3 మధ్య ఆ భూములు కొనుగోలు చేసింది. ప్రభుత్వం తమ చేతుల్లోనే ఉంది కాబట్టి.. సున్నపురాయి నిక్షేపాలు ఎలాగైనా దక్కించుకుంటామన్న ధీమాతోనే ముందుగానే వందల ఎకరాల భూములు గుప్పిట్లో పెట్టుకుంది. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ద్వారా ఏర్పాటు చేయాలనుకుంటున్న సిమెంట్ కర్మాగారంలో రూ. 3,257 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్టు 2010లో ప్రభుత్వానికి సమర్పించిన పర్యావరణ ప్రభావ నివేదికలో జగన్ పేర్కొన్నారు.

రైతులపై దాడులు చేసిన పిన్నెల్లి

మూడేళ్లలో సిమెంట్ పరిశ్రమ సిద్ధమవుతుందని, స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని, సీసీ రోడ్లు వేస్తామని, మంచినీటి వసతి కల్పిస్తామని, ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని చెప్పి రైతుల నుంచి సరస్వతీ పవర్ సంస్థ భూములు సేకరించింది. తమ భూములు తీసుకుని ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు చేపట్టకపోవడంతో.. కొందరు రైతులు ఆ భూముల్లో పంటలు వేశారు. 2014లో అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అనుచరుల్ని వెంటేసుకుని వెళ్లి ఆ పొలాల్ని ట్రాక్టర్లతో దున్నేశారు. దాంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గనులు లీజుకు తీసుకుని రెండేళ్లయినా ప్లాంట్ పెట్టకపోవడంతో లీజు గడువు ముగిసినట్టుగా ప్రకటించాలని 2011 ఆగస్టు 10న అప్పటి గనులశాఖ ఎండీ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. చివరకు గనుల లీజుని రద్దు చేస్తూ ప్రభుత్వం 2014 అక్టోబరు 9న ఉత్తర్వులు జారీ చేసింది.

అసలు డైరెక్టర్లను వెళ్లగొట్టి..

మొదట్లో సరస్వతి పవర్ చాలా చిన్న కంపెనీ. కరీంనగర్ జిల్లాలో కాకతీయ కాలువపై 3 మెగావాట్ల సామర్థ్యం గల పవర్‌ప్లాంట్ మాత్రమే ఉండేది. 2009 వరకు దీని వార్షిక వ్యాపార పరిమాణం గరిష్ఠంగా రూ.కోటి దాటలేదు. 2008-09 నాటికి దీని నికర నష్టాలు రూ. 13.57 లక్షలు. అలాంటి చిన్న కంపెనీ వైఎస్ సర్కారు నుంచి కొన్ని లక్షల టన్నుల సున్నపురాయి నిక్షేపాలు దక్కించుకుని, రూ. 3,257 కోట్ల పెట్టుబడికి సిద్ధమైందంటే అంతా జగన్మాయ..! వాస్తవానికి సరస్వతి పవర్‌ను గ్రంధి ఈశ్వరరావు, గ్రంధి సతీష్, గ్రంధి శశికళ 1999 మార్చి 31న స్థాపించారు. ఆ తర్వాత అది వైఎస్ కుటుంబం పరమైంది. జగన్ తన సన్నిహితుడు డి.చంద్రశేఖర్‌రెడ్డితో పాటు 1999 అక్టోబరు 31న కంపెనీలో డైరెక్టర్లుగా చేరారు. వారు చేరినరోజే.. సతీష్, శశికళ రాజీనామా చేశారు. ఆ తర్వాత 2000 జులై 1న గ్రంధి ఈశ్వరరావు కూడా బోర్డుకు రాజీనామా చేశారు. అదేరోజు ప్రస్తుత ఎంపీ విజయసాయిరెడ్డి బోర్డు డైరెక్టర్‌గా చేరి 2002 ఆగస్టు 12 వరకు కొనసాగారు. అంటే వై.ఎస్. ముఖ్యమంత్రి కాకముందే ఆ కంపెనీని ఆయన కుటుంబం హస్తగతం చేసుకుంది.

అధికారంలోకి రాగానే లీజుల పునరుద్ధరణ..

సరస్వతి పవర్‌లో తనకు రూ. 26.4 కోట్ల విలువైన వాటాలు, తన భార్య భారతికి రూ. 13.8 కోట్ల విలువైన వాటాలు ఉన్నట్టు జగన్ 2019 ఎన్నికల్లో నామినేషన్‌తోపాటు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే 2019 డిసెంబరులో సరస్వతి పవర్‌కు గనుల లీజు పునరుద్ధరించడంతోపాటు, లీజు కాలపరిమితిని 50 ఏళ్లకు పెంచేసుకున్నారు. సరస్వతి పవర్‌కు కృష్ణా నది నుంచి 0.0689 టీఎంసీల జలాల్ని కేటాయించుకుంటూ ఉత్తర్వులిచ్చేశారు.

పదిహేనేళ్లయినా ఇటుకరాయీ పడలేదు..

సరస్వతి పవర్ సంస్థ రైతుల నుంచి భూములు కొని, సున్నపురాయి లీజులు తీసుకుని 15 ఏళ్లయినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పంటపొలాలన్నీ బీడువారి చిట్టడవిలా మారాయి. కంపెనీ 24వ వార్షిక ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ ప్రకారం.. 2022-23లో సంస్థ టర్నోవర్ సున్నగా పేర్కొంది. ఇప్పటికవరకు కంపెనీ కార్యక్రమాలు ప్రారంభించలేదని తెలిపింది.

సున్నపురాయి లీజులు రద్దు చేయాలి..

సరస్వతి పవర్‌కి సున్నపురాయి గనుల కేటాయింపుపై ప్రస్తుత ప్రభుత్వం సమీక్షించి, వాటిని రద్దు చేయాలి. అత్యంత విలువైన ప్రకృతి సంపదను కొందరు వ్యక్తులు వారి గుప్పిట్లో పెట్టుకుని, అడ్డగోలుగా లబ్ధి పొందాలని చూడటం సరికాదు. అవసరమైతే ప్రభుత్వం కోర్టుకి వెళ్లి పోరాడైనా.. సరస్వతి పవర్‌కి గనుల లీజు రద్దయ్యేలా చూడాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

అమరావతిలో ఏఐ వర్సిటీకి సహకరించండి

'ఎన్ విడియా' సీఈఓ జెన్సన్ హువాంగ్‌తో లోకేశ్ భేటీ


ఎన్‌విడియా సీఈఓ హువాంగ్‌ను సన్మానిస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: అమరావతిలో త్వరలో ఏర్పాటు చేయనున్న ఏఐ విశ్వవిద్యాలయానికి సలహాలు, సూచనలు అందించి సహకరించాల్సిందిగా ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటరింగ్ సంస్థ 'ఎన్ విడియా' సహ వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సన్ హువాంగ్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ కోరారు. రాష్ట్ర పాలనా వ్యవహారాల్లో వేగవంతమైన, మెరుగైన సేవల్ని అందించడానికి ఏఐని వినియోగించడం తమ ప్రభుత్వ అభిమతమని ఆయనకు స్పష్టం చేశారు. ముంబయిలో జెన్సన్ హువాంగ్‌తో గురువారం లోకేశ్ భేటీ అయ్యారు. లోకేశ్ విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ వినియోగంతో అంతర్జాతీయంగా వచ్చే విప్లవాత్మక మార్పుల్ని లోకేశ్‌కు హువాంగ్ వివరించారు. స్పీచ్ రికగ్నైజేషన్, మెడికల్ ఇమేజింగ్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఏఐ వినియోగానికి అవసరమైన కంప్యూటరింగ్ పవర్ టూల్స్, అల్గారిథమ్‌లను ఎన్ విడియా అందిస్తోంది.

రణస్థలం వద్ద 6 వరుసల ఎలివేటెడ్ కారిడార్

రూ.252 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

ఈనాడు, దిల్లీ; ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: కేంద్ర రహదారి, రవాణాశాఖ ఆంధ్రప్రదేశ్‌కు మరో కీలక ప్రాజెక్టు ప్రకటించింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద 6 వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం 'ఎక్స్'లో వెల్లడించారు. ప్రస్తుతం ఈ మార్గంలో నెలకొన్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించి, రహదారి భద్రత, పట్టణ రవాణాను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ కారిడార్ సరికొత్త సామాజిక-ఆర్థిక అవకాశాలను సృష్టిస్తుందని ఆకాంక్షించారు. తద్వారా ఆ ప్రాంతవాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వెల్లడించారు.


గడ్కరీకి గతంలో వినతిపత్రం అందజేసిన ఎంపీ కలిశెట్టి

- ఈ ప్రకటనపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎలివేటెడ్ కారిడార్ విషయంపై గతంలో నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. 6 వరుసల కారిడార్ రణస్థలం వాసుల చిరకాల వాంఛగా పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు వేదాంత గ్రూప్ ఆసక్తి


సెరెంటికా గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రతినిధులతో భేటీ అయిన మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు వేదాంత గ్రూప్ అనుబంధ సంస్థ సెరెంటికా గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ ఆసక్తి చూపింది. ఆ సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ముంబయిలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాష్ట్రంలో 2030 నాటికి 72 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సెరెంటికా గ్లోబల్ వంటి సంస్థలను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులకు రూ.52 కోట్లు

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం రూ.52 కోట్లు విడుదల చేసిందని, వెంటనే వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. అద్దె భవనాల్లో కేంద్రాలు నడిచే చోట స్థలాల కోసం కలెక్టర్‌కు నివేదించాలని సూచించారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, గుంటూరు తదితర పట్టణ ప్రాంతాల్లో కొత్త అంగన్‌వాడీ కేంద్రాల మంజూరుకు కేంద్రాన్ని కోరతామని తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ, ఆర్జేడీలతో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా పీడీ కార్యాలయాలు ఒకే భవనంలో నిర్వహించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఏ జిల్లాకు సంబంధించినది ఆ జిల్లాకు తరలించాలని ఆదేశించారు. చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. బాల కార్మికులు, రోడ్డు మీద భిక్షాటన అరికట్టి వారిని చైల్డ్ హోమ్‌లో పెట్టి విద్య అందించాలన్నారు.


కందిరీగల దాడిలో తల్లీబిడ్డ మృతి


మృతి చెందిన చిన్నారి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కందిరీగల దాడిలో తల్లీ బిడ్డ మృతి చెందిన విషాదకర ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లాలో చోటు చేసుకుంది. కంద్రుం పంచాయతీ జోడిగుడ గ్రామానికి చెందిన కిల్లో పార్మిళ బుధవారం మధ్యాహ్నం తన కుమార్తె గీతాంజలి (18 నెలలు)ని వెంట బెట్టుకుని పొలం పనులకు వెళ్లారు. అక్కడ వారిపై కందిరీగలు దాడి చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వారిని స్థానికులు గుర్తించి అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి గురువారం మృతి చెందింది. పార్మిళను విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయారు.

గడువులోగా పోలవరం పూర్తిచేద్దాం

- అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచన
- పక్కా షెడ్యూలు రూపకల్పనకు ఆదేశం
- ఉల్లంఘనలను ఉపేక్షించబోనని హెచ్చరిక
- వచ్చే నెలలో పోలవరానికి చంద్రబాబు



ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను కేంద్రం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక ఉండాలన్నారు. ఒక వేళ ఈ ప్రణాళిక రూపకల్పనలో ఇబ్బందులు ఎదురైతే తన వద్దకు గుత్తేదారులతోపాటు అంతా రావాలని, సమస్యలను తాను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద బుధవారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత జలవనరులశాఖ ప్రాజెక్టులపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా పోలవరం పనులపై చర్చించారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం, ఆ తర్వాత ప్రధాన రాతి, మట్టి డ్యాం నిర్మాణాలపై సీఎం అడిగి తెలుసుకున్నారు. 2025 మార్చి నాటికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తవుతుందని, ఆ తర్వాత ప్రధాన డ్యాం పనులు ప్రారంభించి 2027 జులై నాటికి పూర్తి చేసేలా పోలవరం అధికారులు ప్రణాళిక రూపొందించారు. డయాఫ్రం వాల్ ఒక సీజన్‌లోనే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. డయాఫ్రం వాల్ నిర్మాణం కొంత పూర్తయిన తర్వాత సమాంతరంగా ప్రధాన డ్యాం పనులు కూడా ప్రారంభించి పూర్తి చేసేలా చూడాలని చెప్పారు. 2027 జులై వరకు ప్రణాళిక ఏర్పాటు చేసుకుంటే ఎలా అని చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. డిజైన్ల విషయంలో కేంద్ర జలసంఘంతో సమన్వయం చేసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు. డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయిన తర్వాతే ప్రధాన డ్యాం నిర్మాణానికి వారు సుముఖంగా ఉన్నారన్న అభిప్రాయాన్ని అధికారులు కొందరు వ్యక్తం చేశారు. కేంద్రం రెండేళ్లలో పోలవరం పూర్తి చేయాలని గడువు విధించిందని డిజైన్ల ఆమోదం నేపథ్యంలో ఆ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చంద్రబాబు అన్నారు. కేంద్రం గడువును మీరకుండా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలన్నారు. మొత్తం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై పక్కా షెడ్యూలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. షెడ్యూలును రూపొందిస్తే తాను పరిశీలించి ప్రజలకు వెల్లడిస్తానన్నారు. 2025 మార్చి వరకు సమయం కావాలని బావర్ కంపెనీ కోరుతోంది. వరదల సమయంలో కొంత పని ఆపవలసి వస్తుందని, అలా లెక్కించిన రోజుల విషయంలో అధికారులు, బావర్ కంపెనీ అంచనాకూ మధ్య వ్యత్యాసం ఉందని తెలిసింది. గ్యాప్ 2 ప్రధాన డ్యాం డిజైన్లు 2025 ఫిబ్రవరి నాటికి సిద్ధమవుతాయని 2025 నవంబరు నుంచి పనులు ప్రారంభించి 2027 జులైకి పూర్తి చేసేలా ప్రణాళికలో అధికారులు పేర్కొన్నారు. ప్రధాన డ్యాం గ్యాప్ 1లో రాతి, మట్టికట్ట డ్యాం పనులు 2025 మార్చిలో ప్రారంభించి 2026 మార్చి నాటికి పూర్తి చేసేలా ఈ ప్రణాళిక ఉంది. డయాఫ్రం వాల్ పనులు 2025 జనవరిలో ప్రారంభించి 2026 మార్చికి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

వచ్చే నెలలో పోలవరం ప్రాజెక్టుకు సీఎం

నవంబరు నెలలో పోలవరం ప్రాజెక్టు సందర్శనకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారు. ఈ విషయాన్ని ఆయన చూచాయగా వెల్లడించారు. నవంబరు 6 నుంచి నాలుగు రోజుల పాటు పోలవరంలో వర్క్‌షాపు ఏర్పాటు చేస్తున్నారు. నిపుణులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని డిజైన్లు, ఇతర అంశాలపై తుది నిర్ణయాలు తీసుకుంటారు. ఆ తర్వాత పోలవరం పనులు జరిగే వేగం పెరుగుతుంది. రెండో వారంలో ముఖ్యమంత్రి స్వయంగా ప్రాజెక్టును సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించే అవకాశం ఉంది.

పరిహారం కోసం వచ్చే ప్రతి దరఖాస్తునూ పరిశీలించాలి..

విజయవాడ వరద బాధితులకు సాయంపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: భారీవర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన అర్హులందరికీ సాయం అందేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరిహారం కోసం వచ్చే ప్రతి దరఖాస్తునూ పరిశీలించాలని సూచించారు. బాధిత ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. విజయవాడ వరద బాధితులకు సాయంపై గురువారం రాత్రి సచివాలయంలో చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా వరద బాధితులకు సాయం అందించామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇళ్లు నీటమునిగితే రూ.25వేల చొప్పున, మొదటి అంతస్తు, ఆపై వారికి రూ.10వేలు పరిహారంగా ఇచ్చామని వివరించారు. చేతివృత్తిదారులకు రూ.25వేలు, స్వీట్ షాపులు, కిరాణా దుకాణాలు, హోటళ్లు నీట మునిగితే రూ.25వేలు, చిన్న పరిశ్రమలకు రూ.50వేలు, రూ.40లక్షల నుంచి రూ.1.50 కోట్ల వ్యాపారం చేసే పరిశ్రమలకు రూ.లక్ష, ఆపై వ్యాపారం చేసే వారికి రూ.1.50 లక్షల చొప్పున పరిహారం అందించామని తెలిపారు. తోపుడు బండ్లు దెబ్బతింటే కొత్తవాటికి రూ.20 వేలు, నీటమునిగిన ఆటోలకు రూ.10వేలు, ద్విచక్రవాహనాలకు రూ.3వేల చొప్పున సాయం అందించామని చెప్పారు. బాధితుల ఖాతాల వివరాల్లో తప్పులు, ఇతర సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని, లబ్ధిదారుల వివరాలను సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. పరిహారం పొందేందుకు అనర్హులైతే ఆ విషయాన్ని వారికి స్పష్టంగా చెప్పాలన్నారు.

తొలుత 4.19 లక్షల మందికి.. తర్వాత 9వేల దరఖాస్తుదారులకు

'విజయవాడలో వరదలు తగ్గాక 15 రోజుల్లోపే 4,19,528 మందికి రూ.602 కోట్లు జమ చేశాం. తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 9 వేల మందికి రూ.16 కోట్లు చెల్లించాం. మళ్లీ కొత్తగా 2,954 దరఖాస్తులు అందగా.. 1,646 అర్హత కలిగినవిగా గుర్తించాం. వీరిలో 850 మందికి గురువారం ఖాతాల్లో నగదు జమ చేశాం. 796 మందికి శుక్రవారం చెల్లిస్తాం' అని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. 256 మంది పరిహారానికి అర్హులైనా బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేక డబ్బు జమ చేయలేకపోయామని... రెండు రోజుల్లో డబ్బు వేస్తామని తెలిపారు.

బీమా కంపెనీలను పిలిపించండి

2,954 మంది దరఖాస్తుదారులతోపాటు మొదటి విడతలో పరిహారం పొందిన 4,19,528 మంది వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం ఈ సందర్భంగా ఆదేశించారు. ఇప్పటి వరకు 85% దరఖాస్తులకు బీమా చెల్లింపుల ప్రక్రియ పూర్తయిందని అధికారులు వివరించారు. సంబంధిత బీమా కంపెనీలతో తాను శుక్రవారం చర్చిస్తానని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం సాయం చేసిందనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అర్హులకు సాయం అందకుండా ఉండకూడదని.. అందుకే తాను ఇప్పటికీ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అసలైన ఐటీ మ్యాన్.. చంద్రబాబే

కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్

ఈనాడు, దిల్లీ: అసలైన ఐటీ మ్యాన్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబేనని రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ వ్యవహారాల శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ అన్నారు. అమరావతి రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో ఆయన గురువారం దిల్లీలోని రైల్‌భవన్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఇంతమందిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలిపి ఐటీశాఖ మంత్రి అనిపించుకున్నారని అశ్వినీవైష్ణవ్‌ను ప్రశంసించారు. అందుకు ఆయన బదులిస్తూ 'నేను కాదు... నిజమైన ఐటీమ్యాన్ మన ముందున్న సీఎం చంద్రబాబే' అని వ్యాఖ్యానించారు.

మాజీ మంత్రి కాకాణిపై కేసు నమోదు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కాకాణి అసత్య ప్రచారాలు చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున్‌రావు ముత్తుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురువారం తెలిపారు.

తల్లి, చెల్లిని రోడ్డుపైకి లాగి మమ్మల్ని నిందిస్తారా?

- నన్ను తిరగకుండా అడ్డుకున్నా జగన్‌ను స్వేచ్ఛగా తిరగనిస్తున్నాం
- చెత్త రాజకీయాలు ప్రజలను కాపాడవు
- చీకటి జీఓలపై విచారణ చేయిస్తాం
- విలేకర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: "తల్లి, చెల్లితో ఇంట్లో గొడవైనా వైకాపా అధినేత జగన్ మమ్మల్ని నిందిస్తున్నారు. ఆస్తిలో వాటా ఇవ్వకుండా తల్లి, చెల్లిని రోడ్డుపైకి లాగి మా గురించి మాట్లాడుతున్నారు. దీంతో మాకేం సంబంధం?" అని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. "ఆస్తి ఇవ్వడానికి తల్లి, చెల్లికి కండిషన్లు పెట్టే జగన్.. ప్రజలకు సేవ చేయడానికి ఎలాంటి షరతులు పెడతారో.. ఇలాంటి వ్యక్తులతో రాజకీయం చేస్తానని ఊహించలేదు. ఇవేం చిల్లర రాజకీయాలు? అలాంటివారికి సమాధానం చెప్పడానికి సిగ్గు అనిపిస్తుంది" అని విమర్శించారు.

చేతగాక వదిలేస్తున్నామా?

"ప్రజావేదిక కూల్చారు. అలాంటి పనులు ఇప్పుడు నేను చేయలేనా? అలాంటివి చేయకపోవడమే బాధ్యత. రాజకీయాల్లో ఉండడానికి వారికి అర్హత ఉందా? అమరావతిని శ్మశానంగా చేశారు. 33వేల ఎకరాల భూమిని పైసా తీసుకోకుండా రైతులు రాజధాని కోసం ఇస్తే వాళ్ల బాత్రూంలపై డ్రోన్లు ఎగరేశారు. అబద్ధాలు ప్రచారం చేస్తూ జగన్ పరదాలు కట్టుకుని తిరిగారు. గత ఐదేళ్లలో నేను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు జగన్‌ను మేము అడ్డుకుంటున్నామా? ఆయన స్వేచ్ఛగా తిరగగలుగుతున్నారు కదా? అడ్డుకోవడం మాకు చేతకాదా? ఆ పని చేయడం ఒక్క నిమిషమే కదా? చిత్తూరు జిల్లాలో ఓట్లలో తప్పులు జరుగుతున్నాయని వెళ్తే తిరుపతి నుంచి నన్ను వెనక్కి పంపించారు. మాచర్లలో తెదేపా వారు చాలా మంది గ్రామాలు వదిలి వెళ్లిపోయే పరిస్థితి తీసుకొచ్చారు. మాచర్లకు వెళ్లాలంటే ఇంటి గేట్లకు తాళ్లు కట్టారు. అమరావతిని చూడడానికి వస్తే నాపై రాళ్లు, చెప్పులు, కర్రలు వేశారు. ఈ పరిస్థితిపై డీజీపీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసనలు చెప్పొచ్చని సూత్రీకరించారు. అవన్నీ మేము మర్చిపోయామా? దీనిపై మేము ఏమీ ప్రతీకారం తీర్చుకోవడం లేదే? చిల్లర రాజకీయాలు తిండి పెట్టవు. చెత్త రాజకీయాలు ప్రజలను కాపాడవు. విలువలు లేని మనుషులు సమాజానికి చేటు. కనీస విలువలు ఉండాలి. బురద వేస్తాను మీరు తుడుచుకోండి అన్నట్లు జగన్ వ్యవహరిస్తున్నారు" అని చంద్రబాబు దుయ్యబట్టారు.

సచివాలయంలో జగన్ ఎప్పుడైనా కూర్చున్నారా?

"గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పనీ చేయలేదు. సచివాలయంలో ఎప్పుడైనా జగన్ కూర్చున్నారా? రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త పోగుపెట్టారు. చెత్తపై పన్ను వేసి, పన్ను కట్టలేదని కార్యాలయాల ముందు చెత్త వేశారు. ఇలాంటి వారికి సమాధానం చెప్పాలా? తాను ఏం చెప్పినా జనం నమ్ముతారని జగన్ అనుకుంటున్నారు. ప్రజలు ఆలోచించాలి. బాధితులకు ఆయన డబ్బులు పంచుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా డబ్బులిచ్చారా? ఎక్కడి నుంచి వస్తున్నాయి అన్ని లక్షల రూపాయలు? వ్యవసాయం చేసి సంపాదించారా? 2004లో ఆయన ఆదాయం ఎంత? ఎన్నికల ముందు మేము ఏం చెప్పామో అవన్నీ చేస్తున్నాం. ఈ నెల 31న ఉచిత సిలిండర్లు ఇస్తున్నాం. అమరావతికి డబ్బులు ఇస్తామంటే జగన్ వద్దన్నారు. పోలవరం పూర్తిచేయలేదు. డయాఫ్రం వాల్ మళ్లీ నిర్మిస్తున్నాం. రూ.460 కోట్లతో పూర్తిచేసిన డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేస్తే రూ.990 కోట్లతో ఆ పనులు ప్రారంభించాం. దీనికి ఎవరు కారణం? జగన్‌లాంటి వ్యక్తులకు ఓట్లు వేస్తే బాధ్యత లేకుండా వ్యవహరిస్తారు" అని విమర్శించారు.

చీకటి జీఓలపై విచారణ

"ఐదేళ్లు జీఓలు దాచిపెట్టారు. అలాంటి చీకటి పాలన గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారు. పాలనలో పారదర్శకత ఉండాలి. జీఓలను అందుబాటులో ఉంచాలని కోర్టులు చెప్పాయి. గత ఐదేళ్లలో వారి ఇష్టం వచ్చినట్లు చేశారు. ఐదేళ్ల జీఓలను ఇప్పుడు ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. ఐదేళ్లలో చీకటి జీఓలు ఏమైనా ఉంటే వాటిపై విచారణ చేయాలని ఆదేశించాం. ఎన్నో అరాచకాలు చేశారు. వాటిన్నింటినీ వెలుగులోకి తీసుకొస్తున్నాం. ఒక్కోదాన్నీ సరిదిద్దుతున్నాం" అని వెల్లడించారు.

కన్నతండ్రినే కేసుల్లో ఇరికించిన ఘనుడు జగన్

- అలాంటి వ్యక్తికి తల్లిని, చెల్లినీ మోసం చేయడమో లెక్కా?
- తెదేపా సీనియర్‌నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజం



ఈనాడు, అమరావతి: తన అక్రమార్జనకు కన్న తండ్రి రాజశేఖరరెడ్డినే ఈడీ, సీబీఐ కేసుల్లో ఇరికించిన జగన్‌కు సొంత తల్లిని, చెల్లిని మోసం చేయడమో లెక్కా.. అని తెదేపా సీనియర్ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చనిపోయిన రాజశేఖరరెడ్డి పేరును జగన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాకే నిందితుడిగా చేర్చారని గుర్తుచేశారు. అసలు కుటుంబ ఆస్తుల పంపకాలకు, రాజకీయాలకు సంబంధం ఏమిటని నిలదీశారు. విజయమ్మ, షర్మిలను రాజకీయంగా దారికి తెచ్చుకోవడానికే గతంలో వారికిచ్చిన ఆస్తికి సంబంధించిన గిఫ్ట్ డీడ్స్ రద్దు చేయాలని జగన్ చూస్తున్నారన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సాధారణంగా ఏ తల్లి అయినా తన బిడ్డలందరినీ సమానంగా చూసుకుంటుంది. కానీ జగన్ క్రూర చేష్టలు, మోసాల్ని భరించలేక ఆయన తల్లి విజయమ్మ.. కుమార్తె వైపు మొగ్గారు' అని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

భూ కేటాయింపుల్ని రద్దు చేయాలి

'సరస్వతి పవర్ కంపెనీ ఆస్తుల్ని మూడు భాగాలు చేసి ఒక భాగం జగన్‌కు, రెండో భాగం షర్మిలకు మిగిలిన భాగం పేదలకు ఇవ్వాలి. దానికి కేటాయించిన భూమి పేదలది. అలాంటప్పుడు పేదలకు ఎందుకు వాటా ఇవ్వరు? అసలు చట్టప్రకారం ఆ భూ కేటాయింపుల్ని రద్దు చేయాలి' అని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. 'జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని కాంగ్రెస్‌తో మంతనాలు జరుపుతున్నారు. మరోవైపు కేంద్రం కన్నెర్ర చేయకుండా.. ఈడీ, సీబీఐ కేసుల నుంచి రక్షణ కోసం కాంగ్రెస్‌తో విబేధాలు ఉన్నట్లు ఇలా నాటకం ఆడుతున్నారేమో అనే అనుమానాలు ఉన్నాయి' అని సోమిరెడ్డి పేర్కొన్నారు.

ఏదీ వైకాపా కాలం నాటి గ్రామస్వరాజ్యం?

- గుర్లలో పరిస్థితులు దారుణం
- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి





గుర్ల-గరికివలస ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన టెంటు ★ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్

ఈనాడు, విజయనగరం: 'వైకాపా పాలనాకాలంలో గ్రామస్వరాజ్యం కనిపించింది. కూటమి ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితి లేదు. గుర్లలో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి' అని మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించాక ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చాం.. అందులోనే మన పిల్లలు ఉద్యోగాలు చేస్తున్నారు. పంచాయతీరాజ్ సహా పలు శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండేవారు. ప్రజలకు సేవలు అందేవి. పీహెచ్‌సీలు, సచివాలయాలు అనుసంధానంగా ఉండేవి. నేడు ఆ వ్యవస్థ అంతా మారిపోయింది. గుర్ల మండలంలో ఇప్పటివరకు డయేరియాతో 14మంది మృతిచెందారు. ఈ నెల 19న నేను ఫోన్‌చేస్తే ఎంతమంది చనిపోయారో ఇక్కడి యంత్రాంగం చెప్పలేకపోయింది. గుర్ల, కోటగండ్రేడు సమీప ప్రాంతాల్లో డయేరియా విస్తరిస్తోంది. ఇక్కడి పరిస్థితులపై నేను ఎక్స్‌లో పోస్ట్ చేశాకే తీవ్రత బయటపడింది. పరిస్థితి ఇంత ఆందోళనకరంగా ఉన్నా ప్రభుత్వం స్పందించలేదు. జిల్లా కలెక్టర్.. ఒకరే చనిపోయారంటారు. ముఖ్యమంత్రి ఐదుగురంటారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పదిమందన్నారు. నీటి పథకాల నిర్వహణ, ట్యాంకుల శుభ్రతను పూర్తిగా మరచిపోయారు. ఐదు నెలలుగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టలేదు. గుర్ల మండలం నుంచి డయేరియాతో 345 మంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరారు. గజపతినగరం, దత్తిరాజేరు మండలాల్లోనూ ఈ వ్యాధి వ్యాపించింది. ఏదైనా ఘటన జరిగితే దానికి మసిపూసే ప్రయత్నం చేస్తున్నారు' అని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఇప్పటివరకు ఎలాంటి సాయం అందలేదని, తీరా.. ఇప్పుడు డయేరియాతో మృతి చెందారని చెప్పొద్దని.. గుండెపోటుతో మరణించారని చెప్పాలనడం సిగ్గుచేటని విమర్శించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు మార్చి నుంచి ఇప్పటివరకు రూ.1800 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేదన్నారు.

రూ.2 లక్షల చొప్పున సాయం

గుర్లలో డయేరియాతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను జగన్ సామూహికంగా పరామర్శించి ఓదార్చారు. మృతిచెందిన ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించినా, వారి పేర్లు వెల్లడించలేదు. పరామర్శ శిబిరానికి జగన్ చేరుకునే సమయంలో తోపులాట జరిగింది. పలువురు పార్టీ కార్యకర్తలు కింద పడిపోయారు. ఈ దశలో ఎలక్ట్రానిక్ మీడియా కెమెరా స్టాండ్లు విరిగిపోయాయి.

మీ కుటుంబాల్లో గొడవలు లేవా?

తాను గుర్లకు వస్తున్నట్లు తెలిసి తన తల్లి, చెల్లి పేర్లను బయటకు తీస్తూ కొందరు రాజకీయాలు చేస్తున్నారని జగన్ తీవ్రంగా విమర్శించారు. తమ ఇంటి సమస్యను పెద్దదిగా చేసి చూపించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తన కుటుంబంపై వ్యాఖ్యలు చేస్తున్న వారి కుటుంబాల్లో ఇలాంటి గొడవలు లేవా అన్నారు.

కనిపించని బొత్స

సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన జగన్ పర్యటనలో మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ కనిపించలేదు. బొత్స సొంత నియోజకవర్గం చీపురుపల్లికి జగన్ వస్తున్నా సత్తిబాబు హాజరు కాకపోవడంపై ఆ పార్టీవర్గాలు చర్చించుకున్నాయి. ఆయన విదేశీ పర్యటనలో ఉన్నందున రాలేదని ఒకరిద్దరు నాయకులు అన్నారు.

రహదారికి అడ్డంగా టెంటు

అతిసార బాధిత కుటుంబాలను జగన్ ఓదార్చడానికి గుర్ల-గరికివలస రహదారిపై టెంటు వేశారు. బస్సులు వెళ్లే దారి లేక.. గుర్ల నుంచి వెనుదిరిగాయి. దీంతో గరికివలస, ఆనందపురం, కోటగండ్రేడు, కలవచర్ల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

తల్లి, చెల్లిని కోర్టుకి ఈడ్చడం సామాన్య విషయమా?

జగన్‌ని ప్రశ్నించిన షర్మిల



ఈనాడు, అమరావతి: ఆస్తుల గొడవలు అన్ని కుటుంబాల్లో సామాన్యమేనంటున్న జగన్... తల్లిని ఎందుకు కోర్టుకు ఈడ్చారని ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రశ్నించారు. 'ఇది సామాన్య విషయం కాదు జగన్ సార్' అని ఆమె వ్యాఖ్యానించారు. వివిధ జిల్లాల కాంగ్రెస్ నేతల సమావేశంలో పాల్గొనేందుకు షర్మిల గురువారం విజయవాడ వచ్చారు. విజయనగరం జిల్లా పర్యటనలో జగన్ వ్యాఖ్యలపై స్పందించారు. 'ఆస్తుల పంపకాల్లో గొడవలు పెట్టుకోవాలన్నది మా ఉద్దేశం కాదు. నాలుగు గోడల మధ్య సామరస్యంగా పరిష్కరించుకోవాలని మాకూ తెలుసు. ఇది అన్ని కుటుంబాల్లో జరిగే సామాన్య విషయమేనని జగన్ అంటూనే... తల్లిని, చెల్లిని కోర్టుకి ఈడ్చారు. ఇది సామాన్య విషయం కాదు' అన్నారు.

యువతను డ్రగ్స్‌కు బానిసగా మార్చిన జగన్

తెదేపా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ధ్వజం



ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో సుమారు 2 లక్షల మంది మహిళలు, చిన్నారులపై దాడులు జరిగినా అప్పటి సీఎం జగన్ మిన్నకుండిపోయారని తెదేపా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. జగన్ యువతను గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల్ని అసభ్య పదజాలంతో తిట్టించి ఆనందపడే మనస్తత్వం జగన్‌దని ఆ పార్టీ కోసం పనిచేసిన వాసిరెడ్డి పద్మ చెప్పారని గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం అనురాధ మాట్లాడుతూ.. నేరాలు, ఘోరాలు, మనీ ల్యాండరింగ్‌కు సంబంధించిన 31 కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న జగన్.. మంత్రి నారా లోకేశ్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.

రాజకీయాలకు పనికిరాని జగన్

హోం మంత్రి వంగలపూడి అనిత



గుర్లలో అతిసార బాధితులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ఈనాడు, విజయనగరం: రాజకీయాలకు పనికిరాని ఏకైక వ్యక్తి మాజీ సీఎం జగన్ అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. విజయనగరం జిల్లా గుర్లలో గురువారం డయేరియా బాధితులను పరామర్శించిన అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'అతిసారం ప్రబలిన మరుక్షణం నుంచే యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామంలో ఎవరు ఏ కారణంతో మరణించారన్నదానిపై విచారిస్తున్నాం. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గుర్లలో పర్యటించి క్షేత్రస్థాయిలో అన్ని అంశాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలిచ్చారు. గ్రామంలోని గొట్టపు బావుల నీరు వాడకుండా చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులో ఉంది. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు ఈ దుస్థితి నెలకొంది' అని మండిపడ్డారు. 'జగన్ హయాంలో ఆళ్లగడ్డ, కృష్ణా, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో చాలా మంది డయేరియాతో మృత్యువాత పడ్డారు. ఏ రోజూ వారిని ఆయన పరామర్శించలేదు' అని అనిత అన్నారు.

అమ్మ వద్దు.. ఆస్తి ముద్దు: ప్రస్తుతం రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ 'అమ్మ వద్దు.. ఆస్తి ముద్దు' పేరిట పెద్ద సీరియల్ నడుపుతున్నారు. తల్లికి, చెల్లికి విలువ ఇవ్వని వ్యక్తి.. రాష్ట్ర ప్రజలకు ఏమిస్తారు?' అని అనిత మండిపడ్డారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, కోళ్ల లలితకుమారి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

'దానా' తుపానుతో మూడు రాష్ట్రాల్లో భారీవర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో 'దానా' తీవ్ర తుపానుగా బలపడింది. గురువారం సాయంత్రం 5.30 సమయంలో పరదీప్ (ఒడిశా) నుంచి 100 కి.మీ., ధమ్రా (ఒడిశా) నుంచి 130 కి.మీ., సాగర్ ద్వీపం (పశ్చిమబెంగాల్) నుంచి 210 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఒడిశాలోని బిత్తర్‌కనిక, ధమ్రా మధ్యలో పరదీప్ వద్ద తీరం దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ సమయంలో గంటకు గరిష్ఠంగా 120 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేస్తోంది. **తీరం దాటే ప్రక్రియ గురువారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభమై, శుక్రవారం ఉదయానికి పూర్తవుతుందని తెలిపింది.** తర్వాత తుపానుగా బలహీనపడుతుందని వెల్లడించింది. ఉత్తరాంధ్ర జిల్లాలపై తుపాను ప్రభావం లేకపోవడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం రాత్రి 9 గంటల వరకు శ్రీకాకుళం జిల్లాలో తేలికపాటి జల్లులు మినహా ఎక్కడా వర్షాలు కురవలేదు.

★ రాబోయే మూడురోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం ముఖ్య అధికారి స్టెల్లా తెలిపారు. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు శనివారం వరకు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ హెచ్చరించారు.

ఒడిశాలో నాలుగు జిల్లాలకు రెడ్ ఎలర్ట్

భువనేశ్వర్/కోల్‌కతా/రాంచీ: 'దానా' తుపాను ధాటికి ఒడిశా, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. బాలేశ్వర్, భద్రక్, కేంద్రపడ, జగత్‌సింగ్‌పుర్ జిల్లాలకు రెడ్ ఎలర్ట్ జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని 10 లక్షలమందిని తరలించే ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం ఒడిశా సీఎంకు ఫోను చేసి రాష్ట్రంలో తుపాను సన్నద్ధతపై ఆరాతీశారు. భువనేశ్వర్, కోల్‌కతా విమానాశ్రయాలను శుక్రవారం ఉదయం వరకు మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో వందల సంఖ్యలో విమాన సర్వీసులపై ప్రభావం పడింది.

★ దక్షిణ పశ్చిమబెంగాల్‌లో గురువారం భారీవర్షాలతో ఈదురుగాలులు వీచాయి. రాష్ట్రప్రభుత్వం తీరప్రాంతాల్లోని 3.5 లక్షలమందిని సహాయక శిబిరాలకు తరలిస్తున్నట్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మీడియాకు తెలిపారు. తాను రాత్రంతా రాష్ట్ర సచివాలయంలోనే ఉండి పరిస్థితులను సమీక్షించనున్నట్లు మమత చెప్పారు. తుపాను దృష్ట్యా తూర్పు, ఆగ్నేయ రైల్వేవిభాగాలు 27వ తేదీ వరకు దాదాపు 400 రైలు సర్వీసులను రద్దు చేశాయి. ఝార్ఖండ్‌లోనూ భారీవర్షాలు పడుతున్నాయి. కొల్హాన్ ప్రాంతానికి శుక్రవారం ఆరెంజ్ ఎలర్ట్ జారీచేశారు. వర్షాలతోపాటు పిడుగుపాట్లు, గంటకు 60 కి.మీ. వేగంతో తీవ్రగాలులు ఉంటాయని అధికారులు తెలిపారు.



కుటుంబ సమయాన్ని అలా గడపండి

కుంగుబాటు, తరచుగా మానసిక ఉద్వేగాలు మారిపోయే స్థితిని నియంత్రించడానికి శారీరకంగా చురుగ్గా ఉండటం అవసరం. వాటితో బాధపడే వ్యక్తులు నడక, వ్యాయామం లాంటివి ఒంటరిగా చేయకుండా కుటుంబ సభ్యులతో కలసి చేస్తే మరింత ప్రయోజనం కలుగుతుంది. కుటుంబమంతా కలసి సరదాగా గడిపే సమయాన్ని క్రీడల కోసమో లేదా తోట పని కోసమో కేటాయించుకోవడం ఉత్తమం.

– గేబ్ ఫ్లగ్వేజ్, ఫిట్‌నెస్ కోచ్



అరకు సిగలో మరో అద్భుతం

ఆంధ్రా ఊటీ అరకులోయలో మరో మేఘాల కొండ కనువిందు చేస్తోంది. అరకులోయ మండలం లంతంపాడు సమీపంలోని ఎత్తయిన కొండపై నుంచి చూస్తే. . పొగమంచు సోయగాలు ఆకట్టుకుంటున్నాయి. పాల సంద్రం వంటి ఆ మేఘాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. పర్యాటక శాఖ, ఐటీడీఏ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందివ్వచ్చు. స్థానికులకు ఉపాధి దొరుకుతుంది.

– అరకులోయ, న్యూస్‌టుడే

ఉపాధి పనులకు మార్కెట్లో సిమెంట్ కొనొచ్చు

పంచాయతీలకు ప్రభుత్వం ఆదేశాలు

ఈనాడు, అమరావతి: గ్రామాల్లో రహదారులు, కాలువల నిర్మాణం కోసం అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వం నిర్దేశించిన ధరకు లోబడి మార్కెట్లో కొనుగోలు చేయొచ్చని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ పనులకు సిమెంట్‌ను వైఎస్ఆర్ నిర్మాణ్ ఆన్‌లైన్ పోర్టల్ నుంచే విధిగా కొనుగోలు చేయాలని గత ప్రభుత్వంలో జారీ చేసిన ఉత్తర్వుల నుంచి పంచాయతీలకు మినహాయింపు ఇచ్చింది. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా 13,326 పంచాయతీల్లో 30 వేల పనులు ఇటీవల ప్రారంభించిన విషయం తెలిసిందే. పాత విధానం పక్కన పెట్టి మార్కెట్లో సిమెంట్ కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులిచ్చింది.



మరోవైపు వెలగని దీపాలిలా..

"చూడు ఒకవైపే చూడు.. రెండోవైపు చూడాలనుకోకు.. అనే సినిమా డైలాగులా ఉంది బెంజి సర్కిల్ ఫైవంతెనపై వీధిదీపాల తీరు. రామవరప్పాడు వైపు నుంచి స్క్రూబ్రిడ్జి వైపు వీధిదీపాలు వెలుగుతుండగా... స్క్రూబ్రిడ్జి నుంచి రామవరప్పాడు వైపు వెలగకుండా చీకటిగా మారాయి. వాహనాల వెలుతురు తప్ప ఒక్క బల్బు కూడా వెలగడం లేదు.

- ఈనాడు, అమరావతి

వెలితిక్కడ.. వెలుగక్కడ..!



ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక కేంద్రాలు


తుళ్లూరు: రాజధాని అమరావతి కోసం సీఆర్డీఏకు భూసమీకరణ పథకంలో భూములు ఇచ్చిన రైతులకు (గతంలో కేటాయించని వారికి) రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపునకు రెండో రోజు గురువారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో లాటరీ నిర్వహించారు. 9 గ్రామాలకు చెందిన 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లు అందజేశారు. రైతులకు త్వరితగతిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుగా ప్రభుత్వం 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్ల ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందిన రైతులు సంబంధిత కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు.

మహానగరికి.. మరో మణిహారం

"అమరావతి రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇది రాజధానికి మరో మణిహారంగా మారబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ప్రధానంగా విజయవాడ, గుంటూరు నగరాలకు వరంగా మారబోతోంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ భారీగా తగ్గించబోతోంది. విజయవాడతో సంబంధం లేకుండా 39 కిలోమీటర్ల దూరంలో మలుపు తిరిగి.. అమరావతి మీదుగా గుంటూరు, అక్కడి నుంచి ఇతర నగరాలకు తేలికగా చేరుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ లైన్‌ను ఐకానిక్‌గా మార్చి పర్యాటకులను సైతం ఆకర్షించడంపైనా.. ప్రభుత్వం దృష్టి సారించింది. 57 కిలోమీటర్ల అమరావతి రైల్వే లైన్‌లో.. కృష్ణా నదిపై నిర్మించబోయే 3.2 కి.మీ. ఐకానిక్ వంతెన పర్యాటకులను ఆకర్షించబోతోంది. ఈ రైల్వేలైన్ పర్యావరణహితంగానూ ఉండబోతోంది. ఈ నూతన లైన్‌తో వాహన కాలుష్యాన్ని సైతం పెద్దఎత్తున తగ్గించబోతున్నారు."

దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత రద్దీ స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రైల్వేస్టేషన్ మీదుగా 250 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ రోజుల్లోనే లక్ష మందికి పైగా ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారు. సెలవులు, పండగ రోజుల్లో రెండు లక్షల మంది దాటుతుంటారు.





- అమరావతి రైల్వేలైన్‌తో ఈ ప్రాంతానికి మహర్దశ
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లావాసులకు వరం
- విజయవాడకు వెలుపల ఎర్రుపాలెం నుంచి ఆరంభం
- గుంటూరుకు ముందు నంబూరు స్టేషన్ వరకు నిర్మాణం

పర్యావరణ హితపథం

ఎర్రుపాలెం-నంబూరు మధ్యలో తొమ్మిది కొత్త స్టేషన్లు రానుండడంతో ఈ ప్రాంతాలన్నింటికీ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. తద్వారా వాహన కాలుష్యం విపరీతంగా తగ్గుతుంది. పరిటాల రైల్వేస్టేషన్ వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను నిర్మించనున్నారు. వీటన్నింటికి తోడు కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అసలు సంబంధమే లేకుండా ఉండేలా ఈ నూతన లైన్‌ను పర్యావరణహితంగా నిర్మించనున్నారు.

– ఈనాడు, అమరావతి

విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకల్లో జాప్యం, ప్లాట్‌ఫాంల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయంగా విజయవాడకు చుట్టుపక్కల ఉన్న



కృష్ణాకెనాల్(తాడేపల్లి), గుణదల, రాయనపాడు స్టేషన్లను శాటిలైట్‌గా మార్చాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. తాజాగా అమరావతి లైన్‌కు కూడా ఆమోదముద్ర పడడంతో.. గుంటూరు వైపు వెళ్లే రైళ్లు.. విజయవాడకు రావాల్సిన అవసరం ఉండదు.

రాజధాని అమరావతిలో కీలకం..

– కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ ఎంపీ



విజయవాడ రైల్వే జంక్షన్‌కు రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. అమరావతి నూతన మార్గంతో విజయవాడ మీద కూడా ఒత్తిడి తగ్గబోతోంది. ఈ కొత్త మార్గంతో మన రాజధాని అమరావతికి.. దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానం ఏర్పడనుండడం శుభపరిణామం. భవిష్యత్తులో ఈ రైల్వే లైన్ కీలకంగా మారబోతోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాలను కలిపేలా.. బుల్లెట్ రైళ్లను సైతం ఏర్పాటు చేస్తామని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఈ నూతన రైల్వేలైను వాటన్నింటికీ ఆరంభంగా భావిస్తున్నాం.

విజయవాడ బయట నుంచే వెళ్లేలా...

దిల్లీ ప్రధాన లైన్‌లో వచ్చే రైళ్లు విజయవాడతో సంబంధం లేకుండా నేరుగా అమరావతి మీదుగా గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడకు 39 కిలోమీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌కు వెలుపలి నుంచి సరిగ్గా ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఈ లైన్‌ను అమరావతికి అనుసంధానం చేస్తారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు స్టేషన్‌కు కలుపుతారు. నంబూరు నుంచి గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడ, గుంటూరు మధ్యలో నంబూరు ఉంటుంది. ఈ నూతన లైన్ విజయవాడకు బైపాస్ లాంటిదే. భవిష్యత్తులో ఈ లైన్ అత్యంత ప్రధానమైన మార్గంగా మారబోతోంది. అమరావతి నుంచి ఎర్రుపాలెం వైపు వస్తే దిల్లీ, హైదరాబాద్, అహ్మదాబాద్, ముంబయి వెళ్లిపోవచ్చు. నంబూరు నుంచి గుంటూరు స్టేషన్, అక్కడి నుంచి తెనాలి వస్తే ప్రధాన రైల్వే లైన్‌లో కలిసిపోతుంది. అక్కడినుంచి విశాఖ, చెన్నై, బెంగళూరు, కేరళ వరకూ వెళ్లిపోవచ్చు.

శుభపరిణామం.. ప్రగతికి మార్గం



అమరావతి రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడం శుభపరిణామం. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మన రాజధానిలో నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాని మోదీని సైతం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా కలిసినప్పుడు విజ్ఞప్తి చేశారు. రాజధాని అభివృద్ధిలో ఈ రైలు మార్గం కూడా భాగం కాబోతోంది. విజయవాడ, గుంటూరు మధ్యలో మరో కీలకమైన రైల్వే మార్గంగా ఇది మారుతుంది. బందరు పోర్టుకు కూడా ఈ మార్గం అనుసంధానం అవుతుంది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలే కొలువు దీరడంతో మనకు ఇలాంటి గొప్ప ప్రాజెక్టులు వస్తున్నాయి. త్వరలో మచిలీపట్నం-రేపల్లె రైల్వే ప్రాజెక్టు కూడా పట్టాలెక్కబోతోంది. ఈ నూతన రైలు మార్గాల రాకతో.. రాష్ట్రంలో ప్రయాణికుల రాకపోకలతోపాటు, సరకు రవాణాకు మార్గం సుగమం అవుతుంది.

– వల్లభనేని బాలశౌరి, బందరు ఎంపీ

పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా నిర్మాణం

అమరావతిని దేశంలో ప్రధాన నగరాలు అన్నింటితో కలిపేందుకు ఈ నూతన లైన్ దోహదపడుతుంది. ఈ నూతన లైన్‌ను అనుకున్న లక్ష్యంలోగా పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించబోయే ఈ లైన్‌లో అనేక విశేషాలుంటాయి. ఐకానిక్ వంతెన కూడా కృష్ణా నదిపై వస్తుండడంతో పర్యాటకాభివృద్ధికి సైతం దోహదపడుతుంది.

– పి.ఈ.ఎడ్విన్, ఏడీఆర్ఎం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విజయవాడ రైల్వేడివిజన్

అమ్మ తోడు.. అక్రమం చూడు!

- రూ.కోట్ల విలువైన మాన్యంపై కన్ను..
- బుడమేరు విస్తరణలో దక్కని పరిహారం
- 3.60 ఎకరాలు సేకరించినట్లు నిర్ధారణ
- అయినా పట్టించుకోని దుర్గగుడి అధికారులు

"అక్కడ ఎకరం మార్కెట్ విలువ.. రూ.20 కోట్లు పైమాటే. రిజిస్ట్రేషన్ విలువ రూ.5 కోట్ల వరకు ఉంది. జాతీయ రహదారి పక్కన భూమి. విలువ బాగా పెంచారు. అలాంటివి 3.60 ఎకరాలు ప్రభుత్వ అవసరాలకు సేకరించారు. భూసేకరణ చట్టం మేరకు రెండున్నర రెట్లు పరిహారం ఇస్తారు. అంటే ఎకరానికి రూ.12.50 కోట్లు. 3.60 ఎకరాలకు రూ.55.80 కోట్లు రావాలి. ఈ సొమ్ము దుర్గగుడి అధికారులకు చేదుగా మారింది. పరిహారాన్నీ మరిచి.. భూముల రక్షణనూ విస్మరించిన ఫలితంగా ఇది వివాదంలో పడింది. దాదాపు రూ.55 కోట్ల పరిహారం గద్దలు తన్నుకెళ్లేలా రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ పరిహారం చెల్లించి ఉండవచ్చని రెవెన్యూ శాఖ అనుమానిస్తోంది. దేవదాయ శాఖ భూముల రక్షణకు జగన్ ఏలుబడిలో చర్యలు లేని వేళ కబ్జాలు పేట్రేగాయి. ప్రసిద్ధ దుర్గగుడి భూములకూ ఎసరెట్టిన దారుణమిది."

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దేవస్థానానికి రాష్ట్రంలో.. ఇతర రాష్ట్రాల్లోనూ ఆస్తులు ఉన్నాయి. వాటిలో పొలాలే ఎక్కువ. భూములు.. స్థిర, చర ఆస్తుల లెక్కలు నిర్వహించి.. ఏటా ఆదాయం చూపాలి. దీనిపై ఆలయ అధికారులకు పట్టింపు లేకుంది. దుర్గగుడికి సర్వే నెంబరు 202/1లో 6.25 ఎకరాలు ఉంది. ఇది ఒక రికార్డులో 9 ఎకరాలుగా.. రెవెన్యూ రికార్డుల్లో 8.66 ఎకరాలుగా ఉంది. జలవనరుల శాఖ లెక్కల్లో 6.25 ఎకరాలుగా ఉంది. దాదాపు 9 ఎకరాలను గూడవల్లి గ్రామ రైతు కౌలుకు చేస్తున్నారు. ఏటా ఈయనకు కౌలు తిరిగి పునరుద్ధరించాలి. ఈ భూమి గూడవల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉంది. అయితే ఈ పొలాన్ని దుర్గగుడి అధికారులు సేద్యం చేయనీయకుండా కొంత ప్రాంతాన్ని మాత్రమే ఇచ్చారు.



పరిహారం ఏమాయె...?

2012లో బుడమేరు విస్తరణకు ప్రతిపాదించి.. సర్వే నెంబరు 2002/1లో 3.60 ఎకరాలు సేకరిస్తున్నట్లు నోటిఫై చేశారు. ఆ మేరకు దుర్గగుడికి ఆదాయం రావాలి. కొత్త చట్టం ప్రకారం దేవదాయ భూములు ప్రజాహితానికి సేకరించినా పరిహారం ఇవ్వాల్సిందే. జాతీయ రహదారుల సంస్థ కూడా అలాగే చెల్లిస్తోంది. బుడమేరు విస్తరణలోనూ దీనికి పరిహారం అర్హత ఉంది. 2019లో అందరికీ పరిహారం ఇచ్చినా.. వీటికి ఇవ్వలేదు. దుర్గగుడి యాజమాన్య పర్యవేక్షణలో ఉన్నందున పరిహారం గుడికే రావాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ పరిహారం ఎవరు తీసుకున్నారు? ఇచ్చారా లేదా అనేది తేలనేలేదు.

ఇదండీ వీరి చిత్తశుద్ధి...

బుడమేరుకు భూసేకరణ జలవనరుల శాఖ గుడివాడ డ్రెయినేజీ విభాగం ఆధ్వర్యంలో సేకరించారు. 2019లో విజయవాడ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో 2002/1 సర్వే నెంబరులో 3.60 ఎకరాలు సేకరించినట్లు నమోదు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అనీ. . పరిహారం ఇవ్వక్కర్లేదని తేల్చారు. వాస్తవానికి వర్గీకరణలో, నోటిఫికేషన్‌లో ఆలయ భూములనే గుర్తించారు. దీనిని కొందరు 2020లో నాటి దుర్గగుడి ఈవో, అదనపు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా. . అప్పుడు లేఖ రాశారు. 2020లో రాసిన లేఖ రెవెన్యూ శాఖకు 2022లో పంపారంటే.. ఎంత శ్రద్ధనో అర్థం అవుతుంది. లేఖ సంఖ్య సీ1/702/2020. దాని మీద తేదీ 02.12.2022గా ఉంది. ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం డ్రెయినేజీ డివిజన్ గుడివాడ ఈఈ పరిశీలించి కృష్ణా కలెక్టర్‌కు నివేదించారు. సర్వే నెంబరు 202/1లో 3.60 ఎకరాలు సేకరించి బుడమేరు విస్తరణ చేపట్టినట్లు ధ్రువీకరించారు. దేవస్థానానికి పరిహారం ఇవ్వలేదని 2023 జులైలోనే నివేదించారు.

కళ్లెదుటే.. కొల్లగొట్టే యత్నం

ప్రస్తుతం ఈ భూములు ప్రైవేటు పట్టా భూములనీ.. దుర్గగుడి సర్వే నెంబరులో 6.25 ఎకరాలే ఉన్నాయని మిగిలిన పట్టా భూమి ప్రైవేటు వ్యక్తులదని తెరమీదకు తెస్తున్నారు. రెవెన్యూ దస్త్రాల మేరకు 8.66 ఎకరాలనీ, వాటిలో 2.41 ఎకరాలు దుర్గగుడివి కాదని అంటున్నారు. రూ.కోట్ల విలువైన భూమి ప్రైవేటు వ్యక్తులకెళ్లే ప్రమాదం ఉన్నా దుర్గగుడి వారి భూమి తమదే అని ధ్రువీకరించే దస్త్రాలు ఇవ్వట్లేదు.

సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో అధికారులుగా నటిస్తూ నకిలీ ఎస్ఎంఎస్‌లు, వీడియో కాల్స్ ద్వారా భయపెడుతున్నారు. ఇలాంటి వాటిపై ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, మనీ లాండరింగ్ కేసుల్లో ప్రమేయం ఉందంటూ నమ్మించి అమాయకులను మోసం చేస్తున్నారని, అపరాధరుసుం చెల్లించమని బెదిరించి డబ్బులు బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి నేరాల కట్టడికి అందరి సహకారం కావాలని కోరారు. గురువారం తన సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సైబర్ కమాండోలు, సైనికుల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. నేరం జరిగినపుడు 1930కి ఎలా ఫోన్ చేయాలి? ఏయే ఆధారాలు పోలీసులకు సమర్పించాలి? తదితర అంశాలపై తెలియజేస్తున్నామని వివరించారు. ఖాతా నుంచి డబ్బులు పోయినప్పుడు.. అవి ఏ ఖాతాకు వెళ్లాయో బాధితులకు తెలియజేయాలని కోరారు. మెయిల్ ద్వారా ఏదైనా ఖాతాను స్తంభింపచేసి, డబ్బులు త్వరితగతిన వెనక్కి వస్తే బాధితులు ఆనందపడతారని, దీనికి బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. అనుమానాస్పద లావాదేవీలు నిలిపివేసి, వెంటనే తమకు సమాచారం అందించాలని, బెదిరింపులకు గురైన ఖాతాదారుడి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయించి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలు వీడియో కాల్స్, మేసేజ్‌ల ద్వారా అరెస్టులు చేయవని.. దీనిపై ప్రజలకు మరింతగా అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైం డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ ఆధిక్యంతో గెలిపించాలి



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, పక్కన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ ఆధిక్యతతో గెలిపించి వైకాపా మూకలకు బుద్ధి చెప్పాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని తిరువూరులో గురువారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాసనమండలిలో తెదేపా సభ్యులు చేసిన పోరాట ఫలితంగానే అప్పటి వైకాపా ప్రభుత్వం పన్నిన మూడు రాజధానుల కుట్ర బిల్లు వీగిపోయిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలోని 25వేల మందికిపైగా పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారని, వారందరితో నూరు శాతం ఓటు నమోదు చేయించే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని తెలిపారు. శాసనమండలి సభ్యుడు పి.అశోక్‌బాబు మాట్లాడుతూ శాసనసభతోపాటు శాసనమండలిలో కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి మెజార్టీ సభ్యులు ఉంటేనే పరిపాలన సజావుగా సాగుతుందని చెప్పారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం మాట్లాడుతూ శాసనసభతోపాటు శాసనమండలిలో కూడా ఎన్డీయే కూటమి అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెదేపా సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో తిరువూరు మేటిగా ఉండేలా కృషి చేస్తానన్నారు. పరిశీలకులు శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఈనాడు – అమరావతి

పవిత్ర కార్తిక మాసం వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోంది. ఇది నవంబరు 30న ముగుస్తుంది. ఈ మాసంలో పరమ శివుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. కార్తిక సోమవారం రోజు శైవక్షేత్రాలను దర్శిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. గత ఏడాది ఎక్కువ మంది భక్తులు పంచారామాలు, త్రిలింగ దర్శిని ప్యాకేజీలను వినియోగించుకున్నారు. ఈ ప్యాకేజీలతోపాటు వనభోజనాలు, ఆలయాల సందర్శన కోసం కూడా చాలా మంది వ్యక్తిగతంగా ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ ఏడాది కూడా గత ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.



వివిధ డిపోల నుంచి తిరగనున్న ప్రత్యేక సర్వీసులు

డిపో	బస్సులు
జగ్గయ్యపేట	34
తిరువూరు	34
విజయవాడ	150
ఇబ్రహీంపట్నం	25
విద్యాధరపురం	15
ఆటోనగర్	30
గవర్నర్‌పేట-1	22
గవర్నర్‌పేట-2	40
మొత్తం	350

ఈసారి 350 సిద్ధం...

ఎన్టీఆర్ జిల్లా నుంచి పంచారామాలు, శైవ క్షేత్రాలకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో 350 ప్రత్యేక బస్సులు వేశారు. ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండొచ్చని గతం కంటే సర్వీసులను పెంచారు. పంచారామాల ప్యాకేజీ కింద ఒకేరోజు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటలో క్షేత్రాలను దర్శించుకునే వీలుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా యాగంటి, మహానంది, శ్రీశైలం ఆలయాలకు ఒకటిన్నర రోజులో వెళ్లి వచ్చేలా త్రిలింగ దర్శిని ప్యాకేజీని సైతం తయారు చేశారు. వీటితోపాటు శ్రీశైలం, కొండవీడు, అన్నవరం, కర్ణాటకలోని దేవనహళ్లి తదితర ఆలయాలకు వేరుగా బస్సులు నడుపుతున్నారు. డిమాండ్‌ను బట్టి అరుణాచలం, సముద్ర స్నానాలకు కూడా తిప్పనున్నారు.

రికార్డు ఆదాయం

గత ఏడాది కార్తిక మాసంలో స్పెషల్ బస్సులు కిటకిటలాడాయి. జిల్లా నుంచి పలు శైవ క్షేత్రాలకు ఆర్టీసీ అధికారులు 301 బస్సులు నడిపారు. ఎన్నడూ లేనివిధంగా రూ.86.44 లక్షల రాబడి ఆర్టీసీకి వచ్చింది. 87 శాతం ఓఆర్ నమోదైంది. కిలోమీటరుకు రూ.58.72 జమ అయింది. కొవిడ్‌కు ముందు 2019లో వచ్చిన ఆదాయం కంటే ఇది ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ రద్దీ ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన కృష్ణా వరద ప్రవాహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద గురువారం వరద ప్రవాహం పెరిగింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 27,685 క్యూసెక్కులు రాగా, సాయంత్రం 6 గంటలకు 35,702 క్యూసెక్కులకు పెరిగింది. 30 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 40 గేట్లు మూసి ఉన్నాయి. సముద్రంలోకి 21,750 క్యూసెక్కులు, పంట కాల్వలకు 13,952 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ నుంచి పులిచింతల (వజినేపల్లి) ద్వారా 31,500, మునేరు (కీసర) నుంచి 5,272, పాలేరు నుంచి 357 క్యూసెక్కుల మేర వస్తోంది.

కాల్వలకు 13,952 క్యూసెక్కులు : ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు మొత్తం 13,952 క్యూసెక్కులు ఇస్తున్నారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 8,425, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,527 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 4,188, ఏలూరు కాల్వకు 1,302, కేఈబీ కాల్వకు 1,300, బందరు కాల్వకు 1,705 క్యూసెక్కులు విడుదల చేశారు.

మర్యాద పూర్వక కలయిక

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన విశ్రాంత ఐపీఎస్ అధికారిణి అనురాధను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మహాత్మా గాంధీ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.


అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

వైద్యఆరోగ్య శాఖ కార్యక్రమాలపై ఆరా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయాన్ని శిక్షణ కలెక్టర్ శుభమ్ నొక్వాల్ గురువారం సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పథకాల అమలు, వివిధ విభాగాలు ఏర్పాటు, పని విధానం, లక్ష్యాలు తదితర అంశాల గురించి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని వివరించారు. డీఎల్‌టీవో డాక్టర్ జె.ఉషారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవీనాయుడు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కలెక్టర్ శుభమ్‌కు వివరిస్తున్న సుహాసిని

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు.. జిల్లాలోని ఆరోగ్య శాఖ పరిధిలోని అధికారులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల వైద్యాధికారులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుహాసిని జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీవీఆర్ ఉన్నత పాఠశాల, పటమట లంక ఉన్నత పాఠశాల, బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలను డీఎంహెచ్‌వో సుహాసిని సందర్శించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కింటికి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 280.


నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

[illegible] ★ నెక్ విజయవాడ [illegible]

చక్రబంధం... ఇదిగో వ్యూహం!

> ప్రతి రోజూ సాయంత్రం వేళ.. బెంజిసర్కిల్ ట్రాఫిక్ పాయింట్లలో వాహనాలు బారులు తీరతాయి. రోడ్డు దాటేందుకు కనీసం రెండు సార్లు ఆగాల్సిందే.

- మహానాడు కూడలిలో పగలు సిగ్నల్ పాయింట్ దాటాలంటే కనీసం 10 నిమిషాలు పడుతుంది. సాయంత్రం నుంచి రద్దీ మరింత పెరుగుతుంది. ఎప్పుడు కదులుతామో చెప్పలేని పరిస్థితి.
- రామవరప్పాడు రింగ్ వద్ద ఇరుకైన రోడ్డులో యూ టర్న్ తీసుకునే వాహనాలు స్తంభించిపోతాయి.
- పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులు.. పక్కనే ఉన్న లోబ్రిడ్జి వైపు వెళ్లడానికి నడక మార్గమే లేదు. రోడ్డుపై నడుస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



ట్రాఫిక్‌పై అధికారుల ప్రత్యక్ష పరిశీలన

సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

నగరంలో ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయో ట్రాఫిక్ పోలీసు అధికారులు గుర్తించారు. పరిష్కారమార్గాలపై నగరపాలక సంస్థ అధికారులు, జాతీయ రహదారుల విభాగం అధికారులతో కలిసి సర్వే ప్రారంభించారు. కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నారు. వీటిని గురువారం ట్రాఫిక్ ఏడీసీపీ ఎ.వి.ఎల్.ప్రసన్న ఇతర అధికారులు కలిసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఎదుట ప్రస్తావించారు. తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

కృష్ణలంకలో జాతీయ రహదారిపై...

కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమవుతున్నాయి. కార్లు.. ఇతర చిన్న వాహనాలు నగరంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి మహాత్మా గాంధీ రోడ్డులోకి వెళ్లాల్సిన వాహన చోదకులకు మార్గం తెలియక బెంజిసర్కిల్ వరకు వచ్చేస్తున్నారు. అక్కడి నుంచి మహాత్మా గాంధీ రోడ్డులోకి వెళుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జాతీయ రహదారులపై విస్తృతంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమెరికన్ ఆసుపత్రి వైపు నుంచి జాతీయ రహదారిలోకి ప్రవేశించే మార్గం ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఏం చర్యలు తీసుకుంటే మంచిదో చర్చించారు. వారధి వద్ద ఏర్పాటు చేసిన ఐలాండ్ల వెడల్పు ఎక్కువగా ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీనికి ప్రత్యామ్నాయంగా ఐలాండ్ల నిడివి తగ్గించి, రోడ్డు వెడల్పు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా స్క్యూబ్రిడ్జి నుంచి బెంజిసర్కిల్ వైపు వచ్చేటపుడు అక్కడ సర్వీసు రోడ్డులోకి కలిసే మార్గం ఇరుకుగా ఉంది. దీన్ని వెడల్పు చేస్తే.. వాహనాలు సర్వీస్‌రోడ్డులోకి వెళ్లి, మహాత్మా గాంధీరోడ్డులోకి ఆగకుండా వెళ్లిపోతాయి. ఫలితంగా బెంజిసర్కిల్‌పై కొంత మేర ట్రాఫిక్ భారం తగ్గుతుంది.

రామవరప్పాడు రింగ్‌లో భయం

రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ట్రాఫిక్ కష్టాలే. ప్రధానంగా ఏలూరు వైపు వెళ్లే కార్లు, ట్రావెల్స్ బస్సులు, ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారిపై అంచుల్లో ఆపుతున్నారు. దీని వెనుక మరికొన్ని వాహనాలు నిలిచిపోతున్నారు. రింగ్‌రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలు ఫైవంతెన మీదకు వెళ్లాలంటే.. ఈ ఆగి ఉన్న వాహనాలను దాటడం కష్టమవుతోంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రి 9 గంటలు దాటితే ఇక గందరగోళమే. విశాఖపట్నం వెళ్లే ట్రావెల్స్ బస్సులన్నీ జాతీయ రహదారి పైనే ఆపుతున్నారు. దీని పక్కనే విశాలమైన సర్వీసురోడ్డు ఉంది. అక్కడ నిలిపితే.. ఎవరికీ ఇబ్బంది ఉండదు.

ప్రతిపాదనలు ఇవీ..

- కృష్ణలంక, గవర్నర్‌పేట, గాంధీనగర్, పటమటలో రహదారులపై ఆక్రమణలు తొలగించడం.
- రామవరప్పాడు రింగ్ వద్ద ఫుట్‌పాత్ వెడల్పు తగ్గించి, రోడ్డు వెడల్పు చేయడం.
- పటమట బస్టాపు ఎదురుగా ఉన్న సెంట్రల్ డివైడర్ కటింగ్‌ను మూసివేసి, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేయడం.
- కనకదుర్గమ్మ వారధి వద్ద ట్రాఫిక్ ఐలాండ్స్ వెడల్పు తగ్గించడం.
- బెంజిసర్కిల్ వద్ద రామవరప్పాడు వైపు వెళ్లే ఫ్రీ లెఫ్ట్‌ను సర్వీస్ రోడ్డులోకి అనుసంధానించడం.

సీపీ పర్యవేక్షణ : కనకదుర్గమ్మ వారధి, రామవరప్పాడు, బెంజిసర్కిల్, మహానాడు కూడలి, ప్రకాశం బ్యారేజీ ప్రాంతాల్లో డ్రోన్స్ ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. డ్రోన్ విజువల్స్‌ను సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. గురువారం కనకదుర్గమ్మ వారిధిపై చిన్నపాటి ప్రమాదంలో వాహనచోదకులు గొడవ పడ్డారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి.. ట్రాఫిక్ క్లియర్ చేశారు. కారకులైన చోదకులకు రూ.2వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు.

అమలు చేస్తే..

ట్రాఫిక్ సమస్యలపై అధికారులు చేసిన ప్రతిపాదనలు సక్రమంగా అమలు చేస్తే.. నగరంలో ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గుతుంది. దీనికి ప్రజలు, వాహన చోదకులు సహకారం అందించాల్సి ఉంది. అందరూ కలిసి ముందుకు వెళితేనే రద్దీ సమయంలో ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ కష్టాలు తీరతాయి. ప్రజలకూ ఇబ్బందులు తీరతాయి.

ఆంధ్రా ఆసుపత్రిలో ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

ఈనాడు, విశాఖపట్నం: యూకేకు చెందిన హీలింగ్ లిటిల్ హార్ట్స్, మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో 32వ ఉచిత పిల్లల గుండె శస్త్రచికిత్సల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు పేర్కొన్నారు. కేజీహెచ్ సమీపంలోని ఆంధ్రా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఈ నెల 21 నుంచి 26 వరకు 15 సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలను ఉచితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 9 మంది చిన్నారులకు శస్త్రచికిత్స పూర్తయింది. విశాఖలో రెండోసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నాం. తొమ్మిదేళ్లలో విజయవాడ, విశాఖలోని ఆంధ్రా హాస్పిటల్స్‌లో 4000 గుండె శస్త్రచికిత్సలు జరిగాయి. వాటిలో అధిక శాతం ఎన్టీఆర్ వైద్యసేవ, మహేష్‌బాబు ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో ఉచితంగా చేసినవే. ఆంధ్రా హాస్పిటల్స్‌లో గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాలజీ, నవజాత శిశువులు, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందాలు కలిసికట్టుగా పనిచేయడంతో ఇది సాధ్యపడింది. రాష్ట్రంలో ప్రతి రెండు లేదా మూడు నెలలకు ఒకసారి ఈ శిబిరం నిర్వహిస్తాం" అని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర హాస్పిటల్స్ వైద్య నిపుణులు రేవంత్, విక్రమ్, రవీంద్ర దేవ్, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, పద్మావతి తదితరులు మాట్లాడారు. యూకేకు చెందిన వైద్య నిపుణులు సిమోన్, స్నిగ్ధ పద్వాల్వార్, శరన్ దురై రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పోస్టులు భర్తీ చేయాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రజారోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. గురువారం హనుమంతరావు గ్రంథాలయంలో నిర్వహించిన విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 12వ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30 ఏళ్లుగా పారిశుద్ధ్య విభాగంలో శాశ్వత ప్రాతిపదికన కార్మికులను తీసుకోలేదని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా బ్యాక్‌లాగ్ పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయడం లేదని విమర్శించారు. మార్చి నుంచి ఆప్కాస్‌లో పేర్ల నమోదు ప్రక్రియ నిలిచిపోవడంతో ఉన్న కార్మికులపై పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. వైకాపా ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థల నుంచి కమీషన్లు వసూలు చేసి, కార్మికుల పొట్టగొట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, హిందూపురంలో 11 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వరద సమయంలో పని చేసిన వారికి నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, యూనియన్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, రాజా, ఆర్.పిచ్చయ్య, ఎస్.కె.నజీర్, టి.తాతయ్య, లంక దుర్గారావు, కె.ఆర్.ఆంజనేయులు, కె.రమణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారాయుడు. వేదికపై కోటేశ్వరరావు, సాంబశివరావు, నాగేశ్వరరావు తదితరులు

స్త్రీ, పురుష సమానత్వానికి జ్యోత్స్న కృషి మరువలేం

కృష్ణలంక, న్యూస్‌టుడే: స్త్రీ, పురుష సమానత్వం కోసం జ్యోత్స్న ఎంతో కృషి చేశారని, మన మధ్య లేకపోయినా ఆమె ఆశయాలను కొనసాగిద్దామని వక్తలు పేర్కొన్నారు. తరుణీతరంగాలు, ఎంబీవీకే, అమరావతి బాలోత్సవం, సేఫ్, ఐద్వా, పీవోడబ్ల్యూ, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన విజ్ఞాన సంస్థ, భారత మహిళా మండలి తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'జ్యోత్స్న జ్ఞాపకాలలో' పేరుతో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ జ్యోత్స్న, తాను చిన్నప్పటి నుంచి స్నేహితులమని, నగరంలోని మాంటిస్సోరి మహిళా కళాశాలలో చదువుకున్నట్లు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి ఆర్.కొండలరావు మాట్లాడుతూ అమరావతి బాలోత్సవం ప్రారంభం నుంచి ఆరు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో ఆమె కృషి ఎనలేనిదన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణానంద్, సిద్ధార్థ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవిలు మాట్లాడుతూ జ్యోత్స్న స్ఫూర్తితో మహిళా చైతన్యంపై నిర్వహించే కార్యక్రమాలతో యువత ముందుకు సాగాలన్నారు. ఆమె చిత్రపటానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.


జ్యోత్స్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుణ్యవతి, రమాదేవి తదితరులు

నేటి నుంచి పశు గణన


గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న నిధి మీనా, హనుమంతరావు తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 25వ తేదీ శుక్రవారం నుంచి పశు గణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా తెలిపారు. నాలుగు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నగరంలోని జేసీ విడిది కార్యాలయంలో పశు గణన గోడ పత్రాలు, నియమావళి పుస్తకాలను గురువారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. 21వ జాతీయ పశు గణన ప్రక్రియ కింద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 20 గ్రామీణ మండలాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లోనూ పశు గణన చేపడతామన్నారు. మొత్తం 7,02,900 కుటుంబాలను సర్వే చేసి, వాళ్ల పరిధిలోని గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు తదితర 16 రకాల పశువులు, జీవాల సంఖ్య లెక్కించి, యాప్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. దీనికోసం 241 మంది పశు గణన కర్తలు, 47 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గణన కర్తను నియమించినట్లు చెప్పారు. గణనకర్తలకు పాడి రైతులు సహకరించి కచ్చితమైన వివరాలను అందించాలని ఆమె సూచించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి క్రీడాజట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపికలు ఈ నెల 27 నుంచి నిర్వహిస్తామని సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అండర్-19 బాలబాలికల స్విమ్మింగ్, వచ్చే నెల ఒకటో తేదీన మారిస్ స్టెల్లా కళాశాలలో బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు, మధ్యాహ్నం మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో ఖోఖో, వాలీబాల్ జట్ల ఎంపికలు, వచ్చే నెల 2న మారిస్ స్టెల్లా కళాశాలలో నెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు సంబంధిత పత్రాలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94401 12455 నంబరుపై సంప్రదించాలన్నారు.

భూసర్వేలో తప్పులు.. రికార్డులు సరిచేస్తాం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో జరిగిన సమగ్ర భూసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా సర్వే అధికారి టి.త్రివిక్రమరావు తెలిపారు. మండలంలోని గుమ్మడిదుర్రులో గురువారం నిర్వహించిన గ్రామసభలో మండల అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, భూయజమానులు రీసర్వేలో వచ్చిన తప్పులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. భూమి సర్వే చేసే సమయంలో రైతులందరినీ పిలవలేదని, ఇష్టానుసారంగా కొలతలు వేశారని, పాత 1బీ అడంగల్‌లో ఉన్న దానికి, కొత్తగా వస్తున్న అడంగల్‌లో భూరికార్డుల్లో వ్యత్యాసం ఉందని రైతులు అధికారులకు వివరించారు. కొత్తగా చేసిన సర్వేను పూర్తిగా రద్దు చేసి పాత రికార్డులనే పునరుద్ధరించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. దీనిపై సర్వే అధికారి త్రివిక్రమరావు స్పందిస్తూ భూసర్వే చేసిన ప్రాంతాల్లో భూమికి, రికార్డులకు సాంకేతికతను జోడిస్తున్నామని, దీనివల్ల భూయజమాని తన భూమిని ఎక్కడి నుంచైనా చూసుకునే అవకాశం ఉందన్నారు. దీనివల్ల దొంగ రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం లేదని తెలిపారు. గట్టు జరిగినా వెంటనే తెలిసిపోయేలా చేశామన్నారు. గతంలో జరిగిన భూసర్వే వేగంగా చేపట్టడం వల్ల కొన్ని తప్పులు దొర్లినమాట వాస్తవమేనని తెలిపారు. వాటిని గ్రామసభ దృష్టికి తీసుకువస్తే ప్రతి ఒక్కరి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తేడాలు వచ్చిన రైతులు అర్జీలు దాఖలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వే అధికారి స్వామి, తహసీల్దారు శాంతిలక్ష్మి, సర్పంచి నక్కా కమలమ్మ, రైతు నాయకులు పొన్నం బాలాజీ, పొందూరి శ్రీనివాసరావు, పోపూరి రామకోటేశ్వరరావు, నక్కా సుధాకర్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారి త్రివిక్రమరావు, పక్కన తహసీల్దారు శాంతిలక్ష్మి, అధికారులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

? జాతీయ రహదారి కొండపల్లి చైతన్యనగర్ వద్ద కాలువలపై వేసే సిమెంటు బిళ్లలు పది రోజుల కిందట రోడ్డుపై పోశారు. రాత్రి వేళ వెలుతురు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు.

✔ఆ ప్రాంతంలో సైడ్ డ్రెయిన్ నిర్మించారు. వాటిపైన వేయవలసిన సిమెంటు అచ్చులు పోశారు. గుత్తేదారు సిబ్బంది వాటిని సోమవారం అక్కడి నుంచి తొలగిస్తామని తెలిపారు. - పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ - న్యూస్‌టుడే, కొండపల్లి

స్పందనకు స్పందన

★ పట్టణంలోని 8వ వార్డు సచివాలయం పరిధిలో 6వ వార్డులో శాంతినగర్ కోతమిల్లు వీధిలో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికుడు ప్రకాష్ మేమున్నాం.. మీకు తోడుగా.. కు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో బాగుచేయించారు.

★ 9వ వార్డు సచివాలయం పరిధిలో 16వ వార్డులో కమ్మరి బజారులో రోడ్డుపై చెత్త ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో ఊడ్పించారు.

★ 1వ వార్డు సచివాలయం పరిధిలో 1వ వార్డులో కాలనీ రోడ్డులో మురుగు నీరు పారుతుందని పూడిక ఉందన్న సమస్యను ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలపగా ఆయన స్పందించి సిబ్బందితో పూడిక తీయించారు.

★ 8వ వార్డు సచివాలయం పరిధిలో 14వ ముస్లిం బజారులో కాల్వల్లో మురుగు ఉందని స్థానికుల ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, తిరువూరు

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనా

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలోని గంపలగూడెం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని ఆదర్శ పాఠశాలలు (మోడల్‌స్కూల్స్), కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగాలకు ఎంపికైన మహిళలకు గురువారం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనా విజయవాడలో నియామక పత్రాలు అందజేశారు. సమగ్ర శిక్ష ఏపీసీ జి.మహేశ్వరరావు, డీఈవో యూవీ.సుబ్బారావు, జీసీడీవో కె.శాంతి పాల్గొన్నారు. నియామకాలు పొందిన ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని ఆయన తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బైపాస్ ఫీడరులో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 25న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేష్‌బాబు తెలిపారు.

గంపలగూడెం: మండలంలోని రాజవరం, పెనుగొలను, జింకలపాలెం, రాజులపాలెం, చల్లగుండ్లవారిపాలెం, సత్యాలపాడు, మేడూరు, ఆర్లపాడు, తునికిపాడు, దుందిరాలపాడు, చెన్నవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు లైన్ల ఏర్పాటు నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జగదీష్ తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం): మూలపాడు గ్రామంలోని బాల త్రిపుర సుందరి దేవి సమేత విరూపాక్షేశ్వర స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అన్నసంతర్పణ నిర్వహించారు.

యూఎన్‌వో దినోత్సవం

విస్సన్నపేట: ఐక్యరాజ్య సమితి (యూఎన్‌వో) దినోత్సవాన్ని గురువారం విస్సన్నపేట శ్రీశ్రీ పాఠశాలలో నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం యూఎన్‌వో ఆవిర్భావం, బాధ్యతలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాల నిర్వాహకులు రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

తిరువూరు, ఎ.కొండూరు: పాడి రైతుల సంక్షేమం కోసం కృష్ణా మిల్క్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్.ఆంజనేయులు తెలిపారు. ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు, తిరువూరు మండలం కకర్లలో గురువారం పాడి రైతులతో ఆయన సమావేశమయ్యారు. పాల ట్రస్ట్ సభ్యులు పల్లాటి సత్యనారాయణ, పాల శీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు వీరగాథల పోటీలు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖ పాఠశాల స్థాయిలో గురువారం నిర్వహించిన వీరగాథల పోటీల్లో భాగంగా కొండపల్లి పాఠశాల విద్యార్థులు వేషధారణలు అలంకరించారు. స్వాతంత్ర్య పోరాటాలు చేసిన మహనీయుల గురించి విద్యార్థులు వివరించారు. విద్యార్థులు వీరగాథ పోటీల్లో ఆన్‌లైన్ చేసి జిల్లా స్థాయి ఎంపిక కమిటీకి పంపించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి అక్కడి నుంచి జాతీయస్థాయికి పంపి విజేతలను నిర్ణయిస్తారని పాఠశాల ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా తెలిపారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం నాగమల్లేశ్వరి ఉపాధ్యాయులు భవానీలు పర్యవేక్షించారు.

లక్ష్యం కోసం శ్రమించాలి

కొండపల్లి: ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించేందుకు శ్రమించాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఏ.కోటిరెడ్డి అన్నారు. కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రేరణ కార్యక్రమాన్ని స్థానిక బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఏ కోర్సుల్లో చేరితే భవిష్యత్తులో పక్కా ఉపాధి ఉంటుందో విద్యార్థులు గ్రహించాలన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ లయన్స్ అధ్యక్షుడు రమణారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడికి రూ.50వేలు వితరణ

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయానికి సభ్యుడైన యంగ్రాతి భాస్కరరావు గురువారం రూ.50వేలు విరాళం అందజేశారని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజారావు, కె.సుబ్బారావు తెలిపారు. గుడిలో జరిగిన అన్నప్రసాదంలో 400 మంది అయ్యప్పస్వామి దీక్షాధారులు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రోత్సాహం.. వెల్లివిరిసె ఆనందం

ఇంటర్ విద్యార్థులకు విద్యా సామగ్రి ఉచితం

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే

రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు అందించే ప్రోత్సాహాన్ని పునఃప్రారంభించింది. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ అభ్యసించే విద్యార్థుకు ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలతో పాటు రాత పుస్తకాలు, సంచులు కూడా అందించింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, వృత్తి విద్యా గ్రూపుల్లో ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహం అందించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు.

నియోజకవర్గంలోని కళాశాలలు

ప్రభుత్వ జూనియర్	: 4
గురుకుల	: 2
హైస్కూల్ ప్లస్	: 2
కేజీబీవీలు	: 2
ఆదర్శ పాఠశాల	: 1
విద్యార్థులు	: 1,500 (సుమారు)

నాటి తెదేపా హయాంలో..

2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించారు. 2018-19లో కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేశారు. 2019లో వైకాపా అధికారంలో వచ్చాక ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రద్దు చేసింది. వారికి అందిస్తోన్న ప్రోత్సాహకాలు ఆపేసింది. దీంతో క్రమేణ విద్యార్థుల సంఖ్య తగ్గింది. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం పాఠ్య, రాత పుస్తకాలు, సంచులు ఉచితంగా అందించి ప్రోత్సహించారు.

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు అందిస్తోన్న ప్రోత్సాహం అభినందనీయం. గ్రామీణ ప్రాంతాల్లో ఖరీదైన పాఠ్య, రాత పుస్తకాలు, బ్యాగులు కొనుగోలుకు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించడం ఎంతైనా అవసరమే. మా కళాశాలలో కూడా ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పుస్తకాలు, బ్యాగులను వారికి అందించాం. – జి.అనూరాధ, పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్

వసతిగృహాలూ ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం ఇంటర్ చదువుతున్న మాకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలు, బ్యాగులు అందించడం సంతోషం. వాస్తవంగా ఖరీదైన అవన్నీ బయట కొనాలంటే మా కుటుంబాలకు ఆర్థికంగా భారమే. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపయుక్తంగా ఉంది. ఇక గ్రామీణ కళాశాలల్లో అభ్యసించే విద్యార్థులకు వసతి గృహాల సౌకర్యంగా ఉండాలి. – అల్లూరి నవీన, దేవర కావేరి, ప్రథమ సీఈసీ

ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందించండి



ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే అభ్యసించే విద్యార్థులకు అందిస్తున్న చేయూతకు కృతజ్ఞతలు. ప్రథమ ఇంటర్‌లో పాఠ్య, రాత పుస్తకాలు, బ్యాగు కొనుగోలుకు మా తల్లిదండ్రులు కష్టపడి డబ్బులు ఇచ్చారు. ద్వితీయ ఇంటర్‌లో ప్రభుత్వమే అవన్నీ ఉచితంగా అందించింది. ఇక ఇంటర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం కూడా అమలు చేయాలని కోరుతున్నాం. – అనంత శ్యామ్, ఇనపనూరి గోపాలకృష్ణ, ద్వితీయ ఎంపీసీ,

తిరువూరులో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ప్రారంభిస్తాం



రిబ్బను కత్తిరిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. తిరువూరులో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టడీ సర్కిల్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎ.రాజేంద్రప్రసాద్, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

నెమలి వేణుగోపాలుని సేవలో ఎంపీ, ఎమ్మెల్యే

దుందిరాలపాడు, నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని దుందిరాలపాడులో తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. తదుపరి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అధికారిణి సంధ్య స్వామివారి చిత్రపటాలు, ప్రసాదం అందజేశారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ నవాబ్‌జానీ, కోసూరి రాజశేఖర్ కోరారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో పర్యటించి, ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై తమ సంఘం నిరంతర పోరాటం చేస్తుందన్నారు. సంఘ నాయకులు సోలా రాఘవరాజు, పుల్లారెడ్డి, యూసుఫ్, వెంకటేష్, శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్, కరస్పాండెంట్

విద్యార్థుల ప్రతిభకు పదును

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక వివేకానంద పాఠశాలలో గురువారం ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీ పరీక్ష నిర్వహించారు. పోటీల్లో శ్యామల వర్షిత, కె.సామ్రాజ్య పాశ్వాన్, ప్రజాపతి ధృవిలు మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు. ప్రిన్సిపల్ ఎం.వి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

జి.కొండూరు, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో మండలంలోని కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి శివనాయక్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. పీయాటీ మార్త విద్యార్థి ప్రధానోపాధ్యాయిని రాజశ్రీ అభినందించారు.

మైలవరం: రాష్ట్రస్థాయి అండర్ 14, 17 కబడ్డీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికైనట్లు మండలంలోని పుల్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు తెలిపారు. అండర్ 17 విభాగంలో కోటిపల్లి స్రవంతి, అండర్ 14 విభాగంలో దుర్గం మధు బుధవారం జగ్గయ్యపేటలో నిర్వహించిన పోటీల్లో ఎంపికయ్యారన్నారు.

కంభంపాడు(ఎ.కొండూరు): మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.ఆదిశేషు, పీడీ బి.గోపి గురువారం తెలిపారు. జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభచూపిన తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఎం.ప్రశాంత్, ఆర్.ద్వారక ఉమశ్రీ అండర్-14 బాలబాలికల విభాగాల్లో ఎంపికైనట్లు తెలిపారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



గొల్లపూడిలో ఓటు దరఖాస్తును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే: పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.



ఓటు నమోదు ఫారాలను అందజేస్తున్న డీపీఆర్‌టీయూ నాయకులు

మైలవరం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఓటేసేందుకు పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని డీపీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు సూచించారు. అందులో భాగంగా గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఓటు నమోదు ఫారాలను అందజేశారు. మస్తాన్‌రావు, శ్రీరామ్, యాకుబ్‌మియా, గోవిందమ్మ, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

తిరువూరు, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా గ్రామాల్లో తాత్కాలికంగా బాణసంచా విక్రయ దుకాణాలు నిర్వహించే ప్రైవేటు వ్యాపారస్తులు అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని ఆర్డీవో కె.మాధురి వెల్లడించారు. తన కార్యాలయంలో గురువారం రెవెన్యూ డివిజన్‌లోని రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్తు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. లైసెన్సులు, ముందుస్తు అనుమతులు లేకుండా ఎక్కడైనా దుకాణాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సదరు అధికారులకు ఆమె సూచించారు.

తప్పులు సరి చేసేందుకే గ్రామసభలు



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మాధురి

గంపలగూడెం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేసేందుకే ప్రస్తుతం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఆర్డీవో కె.మాధురి స్పష్టం చేశారు. గంపలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆమె పాల్గొని భూ సమస్యలపై రైతుల అందించిన సభలో 50 అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు వి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని టి.గన్నవరంలో గ్రామసభలో రైతులు 33 అర్జీలను అందజేసినట్లు తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి వివరించారు.

జి.కొండూరు: భూ రీసర్వేకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ హుమయున్‌బేగ్ అన్నారు. మండలంలోని వెల్లటూరు సచివాలయం-2 లో గురువారం నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై రైతుల నుంచి పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

తూర్పుమాధవరం(ఎ.కొండూరు): తూర్పుమాధవరంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 29 మంది రైతులు అర్జీలు ఇచ్చారని తహసీల్దారు బి.ఆశయ్య తెలిపారు.

ముష్టికుంట్ల(తిరువూరు): ముష్టికుంట్లలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో భూసమస్యలు పరిష్కారం కోరుతూ రైతుల నుంచి 125 అర్జీలు అందాయని తహసీల్దారు కె.లక్ష్మి తెలిపారు. సభలో ఆర్డీవో కె.మాధురి కూడా పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

పోలీసుల విధులపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా విస్సన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్షకభటుల విధులపై అవగాహన కల్పించారు. ఠాణాలో జరిగిన 'ఓపెన్ హౌస్'లో సదరు విద్యార్థులకు అమరవీరులైన పోలీసుల త్యాగాలను వివరించారు. పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్‌కు ప్రదర్శనగా వచ్చిన విద్యార్థులు పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: కనుమూరులో గురువారం విజయవాడ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిర్వహించిన తనిఖీలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న తెలంగాణకు చెందిన 200 మద్యం సీసాలు పట్టుకున్నారని తిరువూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణవర్మ తెలిపారు. నిందితుడు షేక్ బాజీవలిని తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు. ఈఎస్‌టీఎఫ్ ఎస్సై కె.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సారా విక్రేతలు అరెస్టు

మైలవరం : ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట తండాలో భరోత కనక మహిళ వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై 8 లీటర్ల సారా తరలిస్తున్న కూనపరాజపర్వకు చెందిన నాగయ్య, చంద్రుపట్ల తండాకు చెందిన దాసులను అరెస్టు చేసి, గురువారం మైలవరం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండు విధించినట్లు పేర్కొన్నారు.

స్వర్గపురి వాహనం కొనుగోలుకు విరాళం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో స్థానిక పోతుల చెరువు వద్ద నిర్మించిన స్వర్గపురికి భౌతిక కాయం తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలుకు పట్టణానికి చెందిన న్యాయవాది, లయన్స్‌క్లబ్ చార్టర్ అధ్యక్షుడు కంచర్ల ముత్యప్రసాద్ గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. దాత తన తండ్రి రాజారావు జ్ఞాపకార్థం ఇచ్చిన వితరణను తల్లి భారతి చేతుల మీదుగా తోసా సభ్యులకు అందించారు.

కోతకు గురయ్యాయ్.. కరుణించండి



పాతనాగులూరు వద్ద వరదనీటి ప్రవాహానికి కోతకు గురైన ఆర్అండ్‌బీ రహదారి

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు చెరువులకు గండ్లు పండి రోడ్లు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల రోడ్ల మార్జిన్లు సైతం కోతకు గురయ్యాయి. ఇంకా సంబంధిత అధికారులు ఆయా రహదారులను బాగు చేయకపోవడంతో వాహనదారులు భయంభయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. విస్సన్నపేట -విజయవాడ వయా రెడ్డిగూడెం వైపు ఉన్న ఆర్అండ్‌బీ రహదారి, నూజివీడు -గంపలగూడెం మార్గాల్లో పలు చోట్ల కోతకు గురై దారుణంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

గంజాయి తాగినా..అమ్మినా పీడీ కేసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ, ఎస్సై

మైలవరం, న్యూస్‌టుడే: గంజాయి తాగుతూ దొరికినా, అమ్మినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎన్టీఆర్‌జిల్లా మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు హెచ్చరించారు. ఊరి చివరి లేఔట్‌లో గంజాయితో దొరికిన ఏడుగురు నిందితుల వివరాలను గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాకు వివరించారు. విశ్వసనీయ సమాచారంతో గురువారం ఉదయం తిరువూరు రోడ్డులోని ఓ ప్లాట్లలో సీఐ చంద్రశేఖర్, ఎస్సై కె.సుధాకర్‌లు వారి సిబ్బందితో దాడి చేయగా.. అక్కడి షెడ్డులో గంజాయితో ఏడుగురు చిక్కగా.. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు.. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, ఏజెన్సీ ప్రాంతంలోని కిముడు శంకర్ అనే గంజాయి విక్రేతకు అప్పగించి.. అతడి నుంచి గంజాయి తెచ్చి మైలవరం ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు వెల్లడించారన్నారు. దొరికిన వారిలో ఇద్దరు మైనర్లు, స్థానిక పెద హరిజనవాడకు చెందిన వేల్పుల జమలయ్య (జార్జి), అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి క్యాంపు ప్రాంతానికి చెందిన గంజాయి విక్రేత కిముడు శంకర్, ఎ.కొండూరు మండలం గొల్లమందలకు చెందిన వీరమళ్ల ప్రేమ్‌కుమార్, దాసుళ్లపాలేనికి చెందిన వింజమూరి సంపత్, దేవునిచెరువుకు చెందిన కేశి సాగర్‌లపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి 8 ద్విచక్ర వాహనాలతో పాటు 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

NOTICE

IN THE COURT OF THE HONOURABLE I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION): AT: VIJAYAWADA O.S.NO.497 OF 2024

BETWEEN:
Kadiyala Raghava Rao @ Kadiyala Ragarao .. **Plaintiff**
AND
Kadiyala Priyanka & Others .. **Defendants**

1. Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Defendant No.1)**
2. Kadiyala Tharaka Ram, Son of Late Sambasiva Rao, aged about 10 years, being minor, rep.by his mother and natural guardian Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Defendant No.2)**
3. Kadiyala Nandan Ram, Son of Late Sambasiva Rao, aged about 5 years, being minor, rep.by his mother and natural guardian Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Defendant No.3)**

All of you are the Defendant Nos. 1, 2 & 3 in the above suit. The above suit is posted on 19-11-2024 for your appearance. Be present yourself or through your Counsel on 19-11-2024 at 10.30 AM before the Honourable I Additional Civil Judge (Junior Division): At: Vijayawada. If you fail to appear, the petition will be decided in your absence. This notice was issued as per the orders of the Honourable I Additional Civil Judge (Junior Division): At: Vijayawada.

ADJOURNMENT DATE: 19-11-2024
As per the orders of the Honourable Court
Sunkara Rajendra Prasad
Advocate, Vijayawada, Mobile: 98481 27375

NOTICE

IN THE COURT OF THE HONOURABLE I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION): AT: VIJAYAWADA I.A.NO.165 OF 2024 IN O.S.NO.497 OF 2024

BETWEEN
Kadiyala Raghava Rao @ Kadiyala Ragarao **...Petitioner/Plaintiff**
AND
Kadiyala Priyanka & Others **... Respondents/Defendants**

1. Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Respondent No.1)**
2. Kadiyala Tharaka Ram, Son of Late Sambasiva Rao, aged about 10 years, being minor, rep.by his mother and natural guardian Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Respondent No.2)**
3. Kadiyala Nandan Ram, Son of Late Sambasiva Rao, aged about 5 years, being minor, rep.by his mother and natural guardian Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Respondent No.3)**

All of you are the Respondent Nos. 1, 2 & 3 in the above IA. The above IA is posted on 19-11-2024 for your appearance. Be present yourself or through your Counsel on 19-11-2024 at 10.30 AM before the Honourable I Additional Civil Judge (Junior Division): At: Vijayawada. If you fail to appear, the petition will be decided in your absence. This notice was issued as per the orders of the Honourable I Additional Civil Judge (Junior Division): At: Vijayawada.

ADJOURNMENT DATE:19-11-2024
As per the orders of the Honourable Court
Sunkara Rajendra Prasad,
Advocate, Vijayawada Mobile: 98481 27375

NOTICE

IN THE COURT OF THE HONOURABLE I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION): AT: VIJAYAWADA I.A.NO.166 OF 2024 IN O.S.NO.497 OF 2024

BETWEEN:
Kadiyala Raghava Rao @ Kadiyala Ragarao **...Petitioner/Plaintiff**
AND
Kadiyala Priyanka & Others **...Respondents/Defendants**

1. Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Respondent No.1)**
2. Kadiyala Tharaka Ram, Son of Late Sambasiva Rao, aged about 10 years, being minor, rep.by his mother and natural guardian Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Respondent No.2)**
3. Kadiyala Nandan Ram, Son of Late Sambasiva Rao, aged about 5 years, being minor, rep.by his mother and natural guardian Kadiyala Priyanka, Wife of Late Sambasiva Rao, aged about 29 years, Resident of Cheruvukatta Bazaar, Elaprolu Village, Ibrahimpatnam Mandal, NTR District. **(Respondent No.3)**

All of you are the Respondent Nos. 1, 2 & 3 in the above IA. The above IA is posted on 19-11-2024 for your appearance. Be present yourself or through your Counsel on 19-11-2024 at 10.30 AM before the Honourable I Additional Civil Judge (Junior Division): At: Vijayawada. If you fail to appear, the petition will be decided in your absence. This notice was issued as per the orders of the Honourable I Additional Civil Judge (Junior Division): At: Vijayawada.

ADJOURNMENT DATE:19-11-2024
As per the orders of the Honourable Court
Sunkara Rajendra Prasad
Advocate,Vijayawada, Mobile: 98481 27375

రేస్ గుర్రాలు ఎటువైపు?

- అమెరికా ఎన్నికల్లో జాతుల ప్రభావం
- 4 వర్గాల ఓట్లే కీలకం




వలస రాజ్యంగా పేరొందిన అమెరికా.. శ్వేత జాతీయులతోపాటు, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చి స్థిరపడ్డ అనేక జాతుల సమ్మేళనం. అందుకే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జాతుల జాతర మామూలుగా ఉండదు. వివిధ జాతుల వారిని ఆకట్టుకోవడానికి డెమోక్రాట్లు, రిపబ్లికన్లు పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. ప్రధానంగా నాలుగు జాతులు ఎన్నికలను ప్రభావితం చేస్తుంటాయి. శ్వేత జాతీయులు అధిక సంఖ్యలో ఉన్నా.. ఆఫ్రో అమెరికన్లు, లాటిన్ అమెరికా దేశాల నుంచి వచ్చి స్థిరపడ్డ (స్పానిష్ మాట్లాడే) హిస్పానియన్లు, ఆసియా దేశాల నుంచి వచ్చిన ఆసియన్ల ఓట్లు ఫలితాన్ని తారుమారు చేసే అవకాశముంది. ఏ రేసు (జాతి) ఎవరివైపు మొగ్గుతుందో చూస్తే...

2022 జనాభా లెక్కల ప్రకారం అమెరికా జనాభా 33.3 కోట్లు. వారిలో..

శ్వేత జాతీయులు	58.9%
హిస్పానియన్లు	19.1%
ఆఫ్రో అమెరికన్లు	12.6%
ఆసియన్లు	6.1%
మిగిలినవారు	2.4%
స్థానిక అమెరికన్లు	0.7%
స్థానిక హవాయియన్లు, పసిఫిక్ ద్వీపవాసులు	0.2%

ఓటు వేసేవారిలో..

74% శ్వేత జాతీయులు
10% ఆఫ్రో అమెరికన్లు
9% హిస్పానియన్లు
2% ఆసియన్లు



1. శ్వేత జాతీయులు

జనాభాలో ఎంత: 59%
మొగ్గు ఎటు: రిపబ్లికన్లవైపు

దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న తెల్లవారిలో.. అత్యధికులు రిపబ్లికన్ పార్టీవైపు మొగ్గు చూపుతుంటారు. సంప్రదాయ అమెరికన్లుగా పేరొందిన వీరు.. మొదటి నుంచీ రిపబ్లికన్ అభ్యర్థికి ఓటు వేస్తుంటారు. అమెరికా గ్రామీణ ప్రాంతాల్లోనైతే ఈ సంఖ్య ఇంకా అధికంగా ఉంటుంది. అమెరికా తెల్ల జాతీయులదనే భావన కనిపిస్తుంటుంది. 2016 నుంచి 2022 మధ్యంతర ఎన్నికల దాకా ఓట్లను పరిశీలిస్తే.. రిపబ్లికన్ ఓటర్లలో ప్రతి 10 మందిలో 7-8 మంది శ్వేతజాతీయులే అనేది స్పష్టమవుతుంది. అమెరికాను మళ్లీ గ్రేట్‌గా మారుద్దామంటూ ట్రంప్ రంగంలోకి దిగిన నేపథ్యంలో ఈసారీ తెల్లవారి ఓట్లు అత్యధికంగా రిపబ్లికన్లకే పడతాయని అనుకుంటున్నారు.

2. హిస్పానియన్లు

జనాభాలో ఎంత: 19.1%
మొగ్గు ఎటు: మామూలుగానైతే డెమోక్రాట్లకు. ఈ మధ్య రిపబ్లికన్లవైపు మళ్లుతున్నారు.

మెక్సికో, క్యూబా తదితర లాటిన్ అమెరికా దేశాల నుంచి తాతముత్తాతల కాలంలోనే వలస వచ్చి అమెరికాలో స్థిరపడ్డ స్పెయిన్ మాట్లాడే వారిని హిస్పానియన్లుగా పిలుస్తారు. అమెరికా జనాభాలో శ్వేత జాతీయుల తర్వాత అధిక సంఖ్యాకులు వీరే. ఫలితాన్ని నిర్ణయించడంలో వీరి ఓట్లు కీలకం అవుతాయి. సాధారణంగా వలసలకు మద్దతిచ్చే డెమోక్రాట్లకు వీరు అండగా నిలుస్తుంటారు. డెమోక్రాట్ పార్టీ ఓట్లలో దాదాపు 12 శాతం హిస్పానియన్లవి ఉంటాయి. అయితే... కొద్దికాలంగా రిపబ్లికన్ పార్టీవైపు హిస్పానియన్ల మొగ్గు పెరుగుతుండటం గమనార్హం. ఈసారి ఎన్నికల్లోనూ ఆ ట్రెండ్ కొనసాగుతుందన్నది రిపబ్లికన్ల అంచనా.

3. ఆఫ్రో అమెరికన్లు

జనాభాలో ఎంత: 12.6%
ఎటువైపు: డెమోక్రాట్ల వైపు

జాతి వివక్షపై ప్రపంచానికి పాఠాలు చెప్పే అమెరికా.. మాటల్లోని డొల్లతనానికి ప్రత్యక్ష ఉదాహరణ అక్కడి ఆఫ్రో అమెరికన్లు. శతాబ్దాల కిందట ఆఫ్రికా నుంచి బానిసలుగా వచ్చినవారి వారసులుగా ఇక్కడే స్థిరపడ్డ ఆ ఆఫ్రో అమెరికన్లు ఇప్పటికీ జాతి వివక్షపై ఆందోళన బాట పడుతుంటారు. దేశ జనాభాలో 12.6 శాతం ఉండే వీరు డెమోక్రాట్లకు భారీగా మద్దతిస్తారు. 2016 నుంచి జరిగిన అధ్యక్ష, మధ్యంతర (సెనెట్) ఎన్నికల్లో డెమోక్రాట్ ఓటర్లలో 17% శాతం ఆఫ్రో అమెరికన్లుంటున్నారు. కమలా హారిస్ వీరి ఓట్లపై నమ్మకంతో ఉన్నారు. అయితే ద్రవ్యోల్బణం పెరగడం, ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకుల కారణంగా ఇబ్బందులు పడుతున్న ఈ వర్గం ఈసారి డెమోక్రాట్లను ఎంత మేరకు ఆదరిస్తుందనేది ఆసక్తికరం.

4. ఆసియన్లు

జనాభాలో ఎంత: 6.1%
ఎటువైపు: డెమోక్రాట్ల వైపు

గత 15 సంవత్సరాల్లో అమెరికాలో వేగంగా విస్తరిస్తున్న వర్గం ఆసియా దేశాలవారు. 2010లో నుంచి 2022 నాటికి వీరి జనాభా అమెరికాలో 27% పెరిగింది. సాధారణంగా వలస వచ్చి స్థిరపడ్డ వీరు వలసవాదుల పట్ల ఉదారంగా ఉన్నట్లనిపించే డెమోక్రాట్లకే ఎక్కువ మొగ్గు చూపుతూ వస్తున్నారు. 2022 మధ్యంతర ఎన్నికల్లో 68% ఏషియన్లు డెమోక్రాట్లకు ఓటు వేశారు. 2016 నుంచి 2022 వరకూ జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ ఓటర్లలో ఆసియన్ల వాటా 4% కాగా.. రిపబ్లికన్లలో ఇది 2% మాత్రమే. కానీ 2020 అధ్యక్ష ఎన్నికల్లో చాలామంది ఆసియన్లు రిపబ్లికన్ అభ్యర్థికి ఓటు వేశారు. ఈసారీ ట్రంప్ రంగంలో ఉన్న నేపథ్యంలో మళ్లీ చాలామంది ఆయనకే మొగ్గు చూపుతారా అనేది ఆసక్తికరం.

– ఈనాడు ప్రత్యేక విభాగం

మేమున్నామని.. మీకేం కాదని..!



ఈనాడు ఎండీ కిరణ్‌కు రూ.4,01,000 విరాళం అందజేస్తున్న కోనేరు విద్యాసంస్థల (హైదరాబాద్) ప్రతినిధులు కోనేరు లీలాకుమారి, కోనేరు రమేష్‌బాబు, మణితేజ చౌదరి

రెక్కలు ముక్కలు చేసుకొని నిలదొక్కుకుంటున్న బడుగు జీవులను వరద కోలుకోలేని దెబ్బతీసింది. బుడమేరు, మున్నేరు పోటెత్తి ఒక్క రోజులోనే జీవితాలను తలకిందులు చేశాయి. ఆశపడి కొన్న వస్తువులు, ఆసరాగా ఉన్న జీవాలు, ఆధారమైన వ్యాపారాలు అన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఆ చేదు జ్ఞాపకాల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న అభాగ్యులకు ఎంతో మంది దాతలు ఆసరాగా నిలుస్తున్నారు. చేతనైన సాయం చేసి భరోసా ఇస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరపున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
ఫాక్స్‌ఫైర్ టెక్నాలజీస్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్	50,000
ఫాక్స్‌ఫైర్ టెక్నాలజీస్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులు, హైదరాబాద్	50,000
అనంతభొట్ల వెంకట చలపతి, నెల్లూరు	25,000
ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఓల్డ్ గాజువాక, విశాఖపట్నం	11,000
యెర్నేని సురేంద్రబాబు, విజయవాడ	10,116
సి.మోహనరావు, విశాఖపట్నం	10,000
సి.కేశవులు, నెల్లూరు	10,000
నంబూరి సీతారామాంజనేయులు, హైదరాబాద్	10,116
జొన్నల సీతావరలక్ష్మి, హైదరాబాద్	5,116
సిగరంభొట్ల గోపాల్, నూనెపల్లి, నంద్యాల జిల్లా	5,116
కానూరి బాలగంగాధర తిలక్ (ప్రభుత్వ ఉపాధ్యాయుడు), భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా	5,116
ఆలూరి రెడ్డప్పశాస్త్రి లక్ష్మీనారాయణ (న్యాయవాది), బెంగళూరు	5,001
పూళ్ళ సత్యనారాయణమూర్తి (కీ.శే. పూళ్ళ జానకీశర్మ గారి జ్ఞాపకార్థం), ఏలూరు	5,001
పెండ్యాల శివరామయ్య, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా	5,000
కొసరాజు చంద్రశేఖరరావు, హైదరాబాద్	5,000
అనంతోజు స్వరూపారాణి, హైదరాబాద్	5,000
ఆర్వీఆర్ మోహన్‌రాజు, ఎ.కె.నగర్, నెల్లూరు	5,000
డా.వందనపు అచ్యుతం, పిట్లం, కామారెడ్డి జిల్లా	5,000
మొహమ్మద్ ముబీన్ మొహియుద్దీన్, హనుమకొండ	5,000

మన సాయం వారికి అభయం

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

దాతలకు ముఖ్య సూచన: విరాళం సొమ్మును బ్యాంకు ఖాతాకు బదిలీ చేయగానే.. 1. దాత పేరు, 2. పూర్తి చిరునామా, 3. పాన్‌కార్డు నంబరు వివరాలను 9154990933 వాట్సప్ నంబరుకు లేదా elieffund@eenadu.in ఈ-మెయిల్ ఐడీకి పంపగలరు.

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కొరియా సహకారం

అధికారులతో సమావేశమైన ప్రతినిధి బృందం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అమలులో ఉన్న వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు కొరియాకు చెందిన 'ది ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంకు ఆఫ్ కొరియా(కెక్సిమ్)' ఆసక్తి చూపింది. నౌకా నిర్మాణం, మరమ్మతులు, పోర్టుల అభివృద్ధి, గ్రీన్ పోర్టులు, లాజిస్టిక్స్, స్మార్ట్ పోర్టులు, క్లస్టర్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాల్లో కెక్సిమ్ ఆసక్తిని వ్యక్తంచేసింది. రాష్ట్రంలో ఎకనమిక్ డెవలప్‌మెంట్ కో-ఆపరేషన్ ఫండ్ కార్యకలాపాలను సమీక్షించడం, మెరైన్ రంగంలో భవిష్యత్ సహకారంపై ఉన్న అవకాశాలపై బృందం చర్చించింది. రాష్ట్రంలో మెరైన్ రంగంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, భవిష్యత్తు అవకాశాలను పరిశీలించి సహకరించేందుకు వీలుగా మరింత అధ్యయనం చేసేందుకు అంగీకరించింది. సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్.. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టుల గురించి కొరియా ప్రతినిధి బృందానికి వివరించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉన్న వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. కొరియాలో నిర్వహించే ఎకనమిక్ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫండ్ (ఈడీసీఎఫ్) 29వ వర్క్‌షాప్‌లో పాల్గొనాలని కెక్సిమ్ ఆహ్వానించింది.

ఏనుగుల దాడిలో వృద్ధుడి మృతి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల దాడిలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. కొన్ని రోజుల క్రితం పార్వతీపురం మండలంలోకి ప్రవేశించిన ఏనుగులు సమీప తోటల్లో తిష్ట వేశాయి. వాటిని చూసేందుకు పెదబొండపల్లికి చెందిన హరితరాయబారి దేవాబత్తుల యాకోబ్ (74) స్థానికులతో కలిసి గురువారం గదబవలస సమీపంలోని తోటకు వెళ్లారు. ఆయనపై ఏనుగులు దాడి చేసి, తొక్కేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. నగదు చెక్కును శుక్రవారం అందజేస్తామని పేర్కొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో 53 మందికి గాయాలు



వృద్ధురాలికి చికిత్స చేస్తున్న సిబ్బంది

చీపురుపల్లి, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణంలో రెండు పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. గురువారం ఏకంగా 53 మందిని కరిచి, గాయపరిచాయి. బాధితులతో చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రి కిటకిటలాడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు ప్రధాన రహదారి నుంచి లావేరు రోడ్డు, పిల్లపేట, డైలీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో స్థానికులపై దాడి చేశాయి. తప్పించుకోలేకపోయిన వృద్ధులను తీవ్రంగా గాయపరిచాయి. బాధితులకు వ్యాక్సిన్లు వేశారు.

గిరిజన రైతులకు ప్రభుత్వం అండ

- 90% రాయితీతో వ్యవసాయ పరికరాలు
- గతంలో ప్రత్యేక పథకం కింద కేంద్రం రూ.20 కోట్ల విడుదల
- వాటిని దారి మళ్లించిన వైకాపా ప్రభుత్వం
- తాజాగా వినియోగానికి కూటమి సర్కారు నిర్ణయం

ఈనాడు, అమరావతి: గిరిజన రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం మరో నిర్ణయాన్ని తీసుకుంది. గతంలో తెదేపా సర్కారు అమలు చేసిందనే కారణంతో జగన్ పక్కన పెట్టిన పథకాన్ని తిరిగి పట్టాలెక్కించనుంది. అప్పట్లో ప్రత్యేక సాయం కింద గిరిజన రైతులకు వ్యవసాయ, మత్స్య, ఉద్యాన పరికరాలు అందించేందుకు కేంద్రం విడుదల చేసిన రూ.20 కోట్ల నిధుల్ని వారికి చేరువ చేయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆ మేరకు ఆర్థికశాఖ ఆ నిధుల్ని తాజాగా గిరిజన సంక్షేమ శాఖకు విడుదల చేసింది. దీని ద్వారా దాదాపు 17,206 మంది గిరిజన కర్షకులకు లబ్ధి చేకూరనుంది. త్వరలో ట్రైకార్ ద్వారా టెండర్లు పిలిచి పరికరాలు కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించనున్నారు.

వ్యక్తిగతంగానూ అందజేత..

అప్పట్లో రూ.20 కోట్ల నిధుల్ని కేంద్రం పూర్తి గ్రాంటుగానే మంజూరు చేసింది. ఈ మొత్తంతో రైతులు కోరుకున్న పరికరాలను అందిస్తారు. చిన్న మొత్తం విలువ కలిగినవి వ్యక్తిగతంగా, భారీ వ్యయం అయ్యేవి సంఘాలుగా ఏర్పడిన రైతులకు మంజూరు చేస్తారు. 90 శాతం రాయితీతో వీటిని ఇస్తారు. 10 శాతం లబ్ధిదారులు భరించాలి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 6,545 మందికి, పార్వతీపురంలో 6,087, పాడేరులో 1,632, రంపచోడవరంలో 638, చింతూరులో 53, కేఆర్‌పురంలో 710, శ్రీశైలం పరిధిలో 1515, కర్నూలు పరిధిలో 26 మందికి పరికరాలు అందించనున్నారు. మొత్తంగా 17,206 మందికి ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్యకార రైతులు వారి అవసరాలకు వినియోగించుకునేందుకు వీలుగా 30 రకాల పరికరాలను అధికారులు గుర్తించారు. ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, ట్రాలీలు, రోటవేటర్లు, ఆయిల్ ఇంజిన్లు, పవర్ టిల్లర్, పవర్ వీడర్, స్ప్రేయర్లు, ఫిషింగ్ బోట్లు తదితర వాటిని అందిస్తారు.

వైకాపా పాలనలో ఇతర వాటికి మళ్లింపు..

స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ టు ట్రైబల్ సబ్ స్కీమ్ కింద నిధులను సమీకరించేందుకు అప్పట్లో తెదేపా ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా రాష్ట్రానికి ప్రాజెక్టు మంజూరైంది. 2020-21లో రూ.20 కోట్లు విడుదల అయ్యాయి. కానీ వైకాపా ప్రభుత్వం ఈ నిధుల్ని గిరిజన రైతులకు వినియోగించకుండా ఇతర వాటికి మళ్లించింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించి యూసీలు సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం రూ.20 కోట్లు గిరిజన సంక్షేమానికి విడుదల చేసి వెంటనే ఉపయోగించాలని అధికారులను ఆదేశించింది.



మేఘం కాదది... నురుగే!

కర్ణాటకలోని దక్షిణ పినాకిని నదిపై హోసూరు సమీపంలో నిర్మించిన జలాశయం నుంచి పెద్ద ఎత్తున నురుగు వస్తోంది. ఆ నురుగు గురువారం ఏకంగా పరిసర ప్రాంతాలను కమ్మేసింది. చుట్టుపక్కలున్న రోడ్లపైకీ చేరడంతో రాకపోకలకూ అంతరాయం కలిగింది. ఇది చూసి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బెంగళూరు ప్రాంతంలోని పరిశ్రమల వ్యర్థాలు జలాశయంలోకి చేరడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

-న్యూస్‌టుడే, హోసూరు

పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఈనాడు, అమరావతి: రబీ నుంచి 2019 ముందు నాటి పంటల బీమా విధానమే అమలు చేస్తున్నామని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. దీనిలో భాగంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా (పీఎంఎఫ్‌బీవై), సవరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. పంటల వారీ నిర్ణయించిన ప్రీమియాన్ని రైతులే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రబీ పంటల బీమా అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, ప్రణాళిక అధికారులు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, లీడ్‌బ్యాంకు మేనేజర్లు, కామన్ సర్వీస్ కేంద్రాల నిర్వాహకులతో గురువారం ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. రుణాలు తీసుకోని రైతులు గ్రామ సచివాలయాలు, ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని, జాతీయ పంటల బీమా పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. పంట రుణాలు తీసుకునే సమయంలో రైతుల నుంచి బీమా ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులు మినహాయించుకుంటాయని.. అంగీకారం తెలియజేయకుంటే ఆ మొత్తం మళ్లీ వెనక్కు వస్తుందని వివరించారు. జీడిమామిడికి నవంబరు 15వ తేదీలోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా కింద టమాటాకు బీమా అమలు చేస్తున్నట్లు వివరించారు. నంద్యాల జిల్లాలో సెనగను వాతావరణ ఆధారిత బీమాలో అమలు చేయాలని అధికారులు సూచించారు. పంటల బీమా నమోదుకు సమయం పొడిగించాలని కొందరు కోరారు. రబీ బీమాపై జిల్లాస్థాయి పర్యవేక్షణ సమావేశాల్లో తరచూ సమీక్షించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు చెప్పారు. సమావేశంలో బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతిలోని హోటళ్లకు బాంబు బెదిరింపులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతిలోని పలు హోటళ్లకు బాంబు బెదిరింపులు రావడంతో కలకలం రేగింది. లీలామహల్ సమీపంలోని మూడు ప్రైవేటు హోటళ్లు, రామానుజ కూడలిలోని మరో హోటల్‌కు గురువారం మెయిల్‌లో బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. 'తమిళనాడులో ఉగ్రవాది జాఫర్ సాదిక్‌కు జైలుశిక్ష పడింది. ఆ శిక్ష పడేందుకు ప్రభుత్వం తరపున తమిళనాడు సీఎం స్టాలిన్ సహకారం అందించారు. సీఎం కుటుంబంతో పాటు తమిళనాడులోని కొన్ని పాఠశాలల్లో పేలుళ్లకు ఐఎస్ఐ పూనుకొంది' అని మెయిల్‌లో పేర్కొన్నారు. అందులో భాగంగా తిరుపతిలోని నాలుగు ప్రైవేటు హోటళ్లను పేల్చివేస్తామని హెచ్చరించారు. వెంటనే పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




తిరుపతిలోని హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విమానానికి బాంబు బెదిరింపు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి విమానాశ్రయంలో స్టార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎస్5-154 విమానానికి గురువారం బాంబు బెదిరింపు వచ్చింది. ఆదమ్‌లాన్‌జా 333 పేరుతో ఉన్న ఎక్స్ ఖాతా నుంచి బెదిరింపు సందేశాన్ని పంపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పల్నాడు జిల్లాలో అతిసారంతో ఇద్దరి మృతి



చినవీరయ్య



వెంకటేష్

దాచేపల్లి, న్యూస్‌టుడే: అతిసారం బారినపడి పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. దాచేపల్లి పట్టణంలోని అంజనీపురం కాలనీలో కలుషిత తాగునీరు, అపరిశుభ్రతతో అతిసారం ప్రబలింది. నాలుగు రోజులుగా పలువురు కాలనీవాసులు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో పరిస్థితి విషమించి బుధవారం రాత్రి తమ్మిశెట్టి వెంకటేష్ (20), గురువారం తెల్లవారుజామున బండారు చిన వీరయ్య (65) మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టరు అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి రవికుమార్, ఆర్డీవో మురళీకృష్ణ హుటాహుటిన దాచేపల్లి వచ్చారు. బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుపచాలని నగర పంచాయతీ కమిషనర్‌ను ఆదేశించారు. కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.

డోలీ మోత తొలగే 'దారి' చూపండి!



అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన రహదారులు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. కాస్తో కూస్తో ఉన్న రోడ్లు ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయాయి. అత్యవసర వైద్యానికి రోగుల్ని, బాలింతలను తరలించడానికి డోలీలే దిక్కవుతున్నాయి. ఈ పరిస్థితిని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు గురువారం గిరిజనులు డోలీలతో విశాఖపట్నంలో జరిగిన ఉమ్మడి జిల్లా పరిషత్తు సమావేశానికి వచ్చారు. సమావేశ మందిరానికి వెళ్లే మార్గంలో డోలీలు పట్టుకొని నిరసన తెలియజేశారు. అనంతరం హోం మంత్రి అనిత వచ్చి ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

– ఈనాడు, విశాఖపట్నం

మాజీ ఎంపీ నందిగం అనుచరుల అక్రమ కట్టడాల కూల్చివేత



మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటి సమీపంలో అక్రమంగా వేసిన పాకలను కూల్చివేస్తున్న జేసీబీలు



అక్రమంగా నిర్మించిన షెడ్డు

గుంటూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో రాజధానిలోని సీఆర్డీఏ భూముల్లో మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు నిర్మించిన అక్రమ కట్టడాలను గురువారం అధికారులు కూల్చి వేశారు. వైకాపా అండదండలతో సురేష్ ఇంటి సమీపంలో ఆయన అనుచరులు అనధికారికంగా రేకుల షెడ్లు, పాకలు నిర్మించారు. ఉద్దండరాయునిపాలెంలో సీడ్ యాక్సిస్ రహదారికి పక్కనే ఉన్న సీఆర్డీఏ భూముల్లో వీటిని నిర్మించారు. ఆ ప్రాంతంలోకి ఇతరులు రాకుండా ముళ్ల తీగతో ఫెన్సింగ్ వేశారు. మూడు రాజధానుల శిబిరానికి కూడా ఇక్కడి నుంచే అండదండలు అందించారు. మాజీ ఎంపీ అనుచరులు అక్కడ నివాసం ఉంటూ ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారు. విజయవాడ నుంచి గంజాయి తీసుకువచ్చి తాగడం, సెటిల్‌మెంట్లు చేయడం, జూదం వంటివి ఐదేళ్లపాటు కొనసాగాయని.. అప్పట్లో వైకాపా నాయకుల మాట విననివారిని ఇక్కడ చితకబాదారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో లారీలు నిలుపుతూ, పశువులను కట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ వైకాపా నాయకుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. సీఆర్డీఏ భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను గురువారం అధికారులు, సిబ్బంది జేసీబీలతో కూల్చివేశారు. షెడ్లలో కొంత సామగ్రి ఉందని వాటిని తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆక్రమణదారులు కోరగా సీఆర్డీఏ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం వరకు సమయం ఇచ్చారు. అనంతరం గ్రామంలో మరి కొన్ని చోట్ల సీఆర్డీఏ భూములను ఆక్రమించి నిర్మించిన రేకులషెడ్లు, పశువుల పాకలను అధికారులు తొలగించారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరంగా చర్యలు

'ఉద్దండరాయునిపాలెంలో రాజధాని సీడ్ యాక్సిస్ రహదారి పక్కన సీఆర్డీఏ భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగిస్తున్నాం. అనుమతి లేకుండా సీఆర్డీఏ భూములు ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. సీఆర్డీఏ భూముల్లో ఎవరూ పంటలు సాగు చేయవద్దని మైకుల్లో ప్రచారం చేస్తున్నాం. అనధికారికంగా వేసిన పంటలను తొలగిస్తాం'

– విశ్వేశ్వరనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సీఆర్డీఏ, ఉద్దండరాయునిపాలెం యూనిట్

జీవిత భాగస్వామి ఎలా ఉండాలంటే..



జీవిత భాగస్వామిని ఎంచుకొనే విషయంలో యువత గందరగోళానికి గురవుతున్నారు. అందం, సంపాదన లాంటి ఆకర్షణల వలలో పడి తర్వాత పశ్చాత్తాప పడుతున్నారు. జీవితాంతం మీతో కలసి ఉండాల్సిన వ్యక్తి ఎలా ఉండాలంటే.. బాధ్యతల నుంచి పారిపోనివారు, మీరు మీలాగే జీవించే హక్కును గౌరవించేవారు, శాశ్వతమైన బంధాన్ని పరమావధిగా భావించేవారు, పరస్పర గౌరవాన్ని కలిగి ఉండేవారైతే మీ జీవితం బాగుంటుంది.

– నికోల్ లెపెరా, క్లినికల్ సైకాలజిస్ట్

వసుంధర

vasundhara@eenadu.in

ఒకప్పుడు తన ప్రేమంతా నాదే!

నాకు పదిహేడేళ్లు. అన్నయ్య నాకంటే పదేళ్లు పెద్ద. కానీ నాన్నలా చూసుకుంటాడు. నేనంటే చాలా ప్రేమ. కానీ తనకీ మధ్య పెళ్లి కుదిరింది. ఆ అమ్మాయితో మాట్లాడటం, ఏదైనా ఇద్దరికీ కొంటున్నాడు. ఒకప్పుడు తన ప్రేమంతా నామీదే ఉండేది. మరొకరు దాన్ని తీసుకోవడం తట్టుకోలేకపోతున్నా. ఆ అమ్మాయి మీద కోపం పెరుగుతోంది. ఏం చేయను? – ఓ సోదరి

మీ అన్నయ్య నిన్ను తండ్రిలా చూసుకోవడం, నువ్వూ మీ అన్నయ్యపై అంతే ప్రేమ చూపడం చూస్తే చాలా ముచ్చటేస్తోంది. ఈ మధ్యకాలంలో ఇలాంటి ఆప్యాయతలు పిల్లల్లో కనిపించడం అరుదు. అయితే అన్నయ్యపై నీ ప్రేమ, అభిమానం అతని భవిష్యత్తుకు అవరోధం కాకూడదు. తను జీవితంలో ముందుకు సాగుతున్న కొద్దీ ఆయన తన పాత్రను విస్తరించుకోవాల్సి ఉంటుంది. అందులో భాగంగా తను పెళ్లి చేసుకోబోతున్న అమ్మాయి పట్లా ప్రేమ, అనురాగం, బాధ్యత ఉంటాయి కదా? భార్యగా వచ్చే ఆ అమ్మాయీ నీలాగే తనకి ముఖ్యమే. అలాగని నీకు తక్కువ విలువ, ప్రాముఖ్యం ఇస్తాడనీ కాదు. ఈ మార్పుని నువ్వూ అర్థం చేసుకుని కాబోయే వదిన పట్ల కోపం, ద్వేషం, అసూయ ఏర్పరచుకోకుండా ఓ స్నేహితురాలిగా మెలుగు. కొత్త ఇంట్లో అడుగు పెట్టడానికి ఆమెకీ బిడియం, భయం ఉంటాయి. వాటిని పోగొట్టేలా ఓ సోదరిలా మసలుకో. నీకూ ఓ స్నేహితురాలు దొరకొచ్చు. అలాకాకుండా ప్రతికూలంగా ఆలోచిస్తే నువ్వూ ఆనందంగా ఉండలేవు, ఇంట్లోనూ మనశ్శాంతి కరవవుతుంది. నీకూ, మీ అన్నయ్యకీ మధ్యా దూరం పెరగొచ్చు. భవిష్యత్తులో నువ్వూ మరో ఇంటికి పెళ్లి చేసుకుని వెళ్లాల్సిందే! అక్కడా ఓ అమ్మాయి నీలాగే ఆలోచిస్తే ఎంత బాధగా, ఇబ్బందిగా ఉంటుందో చెప్పు? అందుకే అన్నయ్య, వదినలకి కావాల్సిన ప్రైవసీ ఇస్తూనే వాళ్లతో అనుబంధాన్ని పెంచుకో. అనవసర భయాలు పక్కనపెట్టి అన్నయ్య జీవితంలో చోటు చేసుకుంటున్న కొత్త మార్పులను ఆనందంగా స్వాగతించు.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

బంగారం వెండి



24న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం (24క్యా)	80,400	80,340	77,988	78,570
ఆర్నమెంట్	73,650	74,200	72,850	73,400
వెండి (కిలో)	99,020	99,442	100,100	101,800
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం (24క్యా)	81,000	81,200	81,600	81,500
ఆర్నమెంట్	75,010	75,190	75,100	75,000
వెండి (కిలో)	98,500	99,500	99,900	99,900
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం (24క్యా)	79,080	79,780	------	------
ఆర్నమెంట్	72,850	73,400	7,285	7,340
వెండి (కిలో)	109,000	109,000	110.00	112.00

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

అమ్మాయిల్ని మెప్పించి... రూ.70 కోట్ల టర్నోవర్!

మొదటి అడుగు... ఆరంభంలోనే ఆగిపోయింది. రెండోది... ఆలోచన బాగున్నా, ఆచరణలో వైఫల్యం.. ఇలాంటి పరిస్థితుల్లో మూడో అడుగు వేయాలంటే ఎంతో మనోధైర్యం కావాలి. అదే తనను విజయ తీరాల దిశగా నడిపించింది అంటారు బ్లిస్‌క్లబ్ యాక్టివ్ వేర్ ఫౌండర్ **మినూ మార్గరెట్**. ఎందరు సందేహించినా, ఎవరు సహకరించకపోయినా నమ్మినదానికోసం నడిచిన ఆమె కథ మనమూ తెలుసుకుందామా!



మినూ

'విజయం... ఒక్కోసారి మన సామర్థ్యానికే కాదు... సహనానికీ పరీక్ష పెడుతుంది. అప్పుడు వెన్నుచూపకుండా నిలబడితేనే మన లక్ష్యం చేరుకోగలం' అంటారు మినూ. ఆ ఆత్మవిశ్వాసమే... ఆమెను వైఫల్యాలు దాటించి వ్యాపారవేత్తగా నిలబెట్టింది. మినూ స్వస్థలం కేరళ. కానీ, వారి కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. అక్కడి క్రైస్ట్ యూనివర్సిటీలో బి.కామ్ చదివారామె. తరవాత యూకేలో 'ఛార్టెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్' నుంచి ఎమ్మెస్ చేశారు. ఆపై ఐఎస్‌బీ(హైదరాబాద్) నుంచి మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఎంబీఏ చేశారు.

మధ్యలోనే ఆపేసినా...

చదువయ్యాక గోల్డ్‌మన్ శాక్స్, విప్రో, యూనీలీవర్, ఫోన్‌పే వంటి కార్పొరేట్ కంపెనీల్లో కొన్ని సంవత్సరాలు పనిచేశారు. కానీ, మనసేమో వ్యాపారం చేయాలని ఉవ్విళ్లూరేది. అందుకే ఆ దిశగా అడుగులేశారు. అయితే, 'జాబ్ మానేస్తున్నా' అని చెప్పినప్పుడు అంతా... పిల్లల్ని కనడం కోసం బ్రేక్ తీసుకుంటున్నావా' అని అడిగారు. 'కాదు, వ్యాపారం ప్రారంభించాలని అనుకుంటు'న్నా అంటే.. 'ఆడపిల్లవు నీకెందుకివన్నీ? నువ్వు చేయలేవని తేల్చేశారు' ఆడపిల్లలు తలచుకుంటే ఎంతటి కష్టాన్నైనా దాటి అనుకున్నది చేయగలరు' అని చెబుతారామె. అందుకే, దారిలో కొన్ని వైఫల్యాలు పలకరించినా బాధపడలేదు మినూ. మొదట 'రెంట్ యువర్ వార్డ్‌రోబ్' పేరుతో దుస్తులను అద్దెకిచ్చే ఓ సంస్థను ఏర్పాటు చేశారు. అయితే, ఈ వెంచర్ పైలట్ దశలోనే ఆగిపోయింది. ఆ తరవాత కొన్నాళ్లకే 'ఆటోమేటెడ్ లాండ్రోమేట్'అనే బిజినెస్ స్టార్ట్ చేశారు. ఇది కొన్నాళ్లు విజయవంతంగా సాగినా... దాని ప్రయాణాన్నీ పలు కారణాలతో ఎక్కువరోజులు కొనసాగించలేకపోయారు. ఆ పరిస్థితుల్లో మరొకరైతే ఇక, వ్యాపారం తన వల్ల కాదనుకుని వెనుదిరిగేవారేమో కానీ, మినూ మాత్రం అలా కాదు... ఆ వైఫల్యాలనే సోపానాలుగా మలచుకున్నారు. గతంలో చేసిన పొరపాట్లను సమీక్షించుకుని కొత్త వ్యాపారానికి దారులు వేసుకున్నారు. అయితే, ఈ ఆలోచన మాత్రం తనకు ఎదురైన సమస్యకు పరిష్కారమే అని అంటారామె.

ఆన్‌లైన్ వేదికగా...

మినూకి ఫిట్‌నెస్‌పై ఆసక్తి ఎక్కువ. దీనికి తోడు చిన్నప్పటి నుంచీ ఏదో ఒక క్రీడల్లో సాధన చేస్తూ, పోటీల్లో పాల్గొంటూనే ఉన్నారు. అలా ఎంబీఏకి వచ్చేసరికి ఫ్రిస్బీని ఎంచుకున్నారు. ఆడేటప్పుడు దుస్తులు సౌకర్యంగా లేకపోతే ఎంత ఇబ్బందిపడాల్సి వస్తుందో, అది ఆటపై ఎంతగా ప్రభావం చూపుతుందో ఈ సమయంలో ఎదుర్కొన్నారామె. అయితే, ఇది తన ఒక్కదాని ఇబ్బంది మాత్రమే కాదని అర్థం చేసుకున్న మినూ... యాక్టివ్‌వేర్, ఫిట్‌నెస్ వేర్ తయారీదిశగా ఆలోచనలు చేశారు. 'సరైన స్పోర్ట్స్ వేర్ లేక ఇంటి నుంచి గ్రౌండ్‌కి వెళ్లడానికి చాలా ఇబ్బందిపడేదాన్ని. ఇక, ప్లస్ సైజ్ మహిళలకు స్పోర్ట్స్ బ్రా దొరకడమూ కష్టమే. అందుకే, వాటిని విదేశాల నుంచి తెప్పించుకునేదాన్ని. అక్కడ ఎన్నో వెరైటీలు... చౌకగా దొరికేవి. ఆశ్చర్యపరిచే విషయం అంటే... అవన్నీ మనదేశంతో పాటూ శ్రీలంక, బంగ్లాదేశ్, చైనాల్లో తయారవుతాయట. అది తెలిశాక... స్పోర్ట్స్ వేర్, యాక్టివ్‌వేర్‌ని మార్కెట్‌లోకి తేవాలనుకున్నా. అదే బ్లిస్‌క్లబ్ ఏర్పాటుకి దారితీసింది' అని చెబుతారు మినూ.



ఏడాదిలోనే...

అలా 2020లో కమ్యూనిటీ-ఫస్ట్ విమెన్స్ యాక్టివ్‌వేర్ బ్రాండ్ బ్లిస్‌క్లబ్‌ని ఏర్పాటు చేశారామె. ఫేస్‌బుక్ కమ్యూనిటీలు, వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్ పేజీలతో వేలాది మంది మహిళలతో ఇంటరాక్షన్ ప్రారంభించారు మినూ. ఆపై వారికి ఆన్‌లైన్‌లో సరదా ఛాలెంజ్‌లను విసురుతూ, ఫిట్‌నెస్ ఈవెంట్లను నిర్వహిస్తూ యాక్టివ్‌వేర్‌పై అవగాహన తెచ్చారు. వీరి వ్యాపారం లెగ్గింగ్స్‌తో మొదలుపెట్టి... క్రమంగా ఇన్నర్‌వేర్, యాక్టివ్ వేర్‌లను తీసుకొచ్చారు. కస్టమైజ్‌తో పాటు భారతీయ మహిళల శరీర ఆకృతులూ, అవసరాలకు తగ్గట్లుగా వీటిని తీర్చిదిద్దారు. అదే సమయంలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరగడం మినూకి కలిసొచ్చింది. అంతర్జాతీయంగా యోగా వేర్‌కి ఉన్న డిమాండ్‌ని మార్కెట్ చేసుకోగలిగారు మినూ. అమ్మకాలు మొదలుపెట్టిన ఏడాదిన్నరలోనే సంస్థ రూ. 15 కోట్లు ఆదాయం అందుకోగలిగింది. ఆ తరవాత ఏడాది సుమారు రూ. 70 కోట్ల టర్నోవర్ చేసింది. 'ఆడవాళ్లందరికీ చెప్పేది ఒక్కటే... మన మీద ఎవరికి నమ్మకం లేకున్నా ఫరవాలేదు. మనమీద మనకి ఉండాలి. అదే మనల్ని విజేతల్ని చేస్తుంది' అంటారామె. మినూ భర్త విదిత్ ఆత్రే మీషో వ్యవస్థాపకుడు.

ఆనందమానందమాయె!

పుస్తకం... ఆస్వాదిద్దాం!




మనకంటూ ఒకరోజు ఉండాలి కదా. ఆ రోజున మనకు నచ్చిన పని చేస్తే ఎంత బాగుంటుందనీ. అందులోనూ మనకిష్టమైన పుస్తకం చేతుల్లోకి తీసుకుని బెడ్ మీద మనం ఒక్కరమే పడుకుని అందులోని పాత్రలతో లీనమైపోయే అనుభవం మరీ బాగుంటుంది. ఆ సమయంలో మన ప్రశాంతత, ఏకాగ్రతలకి భంగం కలిగించే ఫోన్ పక్కన అసలే ఉండకూడదు మరి. బెడ్ పక్కనే ఉన్న లైటు వెలుగులో పుస్తకంలోని అక్షరాల్నీ అందులోని హాస్యభరిత డైలాగుల్నీ ఆస్వాదిస్తూ చదవండి. అప్పుడు మధ్యమధ్యలో పేజీలు తిప్పుతున్న శబ్దం మాత్రమే వినిపిస్తుంటుంది. ఆ నిశ్శబ్దంలో ఈ శబ్దం... అత్యంత మధురమైన అనుభవం. వీనుల విందుని కలిగిస్తుంది. మనల్ని ప్రశాంత స్థితిలోకి తీసుకెళుతుంది. కొత్త ఆలోచనలకు ప్రేరణనిస్తుంది. అంతేనా... ఈ రకమైన పుస్తక పఠనం... ఒత్తిడి, ఆందోళనల్ని మాయం చేసే మహత్తరమైన సాధనం... ఆనందాన్ని అందించే అమృత భాండం... అని ఇలినాయ్ యూనివర్సిటీ అధ్యయనంలోనూ తేలింది మరి!

ఆ రెస్టరంట్‌లో అల్లు అర్జున్ బొమ్మ వేశా!



శిరీష



'ఆసక్తి, అభిరుచి ఉంటే చాలు.. చేసే పని ఏదైనా అద్భుతాలు సృష్టించొచ్చు' అంటోంది హైదరాబాద్‌కి చెందిన **శిరీష గణప**. ఫ్యాషన్ డిజైనింగ్ చేశారు. చదువయ్యాక సొంతంగా ఓ క్లాత్ స్టూడియో పెట్టాలనుకున్నారు. అయితే, అందరిలా తానూ చేస్తే ప్రయోజనం ఏంటని ఆలోచించి కాస్త వైవిధ్యంగా ఆలోచించారు. మహిళల వస్త్రాలు డిజైన్ చేయడానికి బదులుగా, కస్టమైజ్డ్ మెన్స్‌వేర్‌ని రూపొందించడం మొదలుపెట్టారు. మరో పక్క పెయింటింగ్‌పై ఇష్టంతో ఫ్యాబ్రిక్, కాన్వాస్‌లపై చిత్రాలనూ వేయడం ఆరంభించారు. అయితే, ఆర్ట్‌లో వస్తోన్న ట్రెండ్స్ ఇంటీరియర్, ఫర్నిచర్‌లో భాగమవుతోన్న విధానం తనని ఆకట్టుకోవడంతో దానికి మరింత సాన పెట్టుకోవాలనుకున్నారు. ఆ మెలకువలు తెలుసుకునేందుకే నగరంలోని ఓ యాంటిక్ ఫర్నిచర్ స్టోర్‌లో చేరారు. మెలకువలు తెలుసుకున్నారు. ఆపై తను ఇన్నోవేటివ్ మోడర్న్, ట్రెడిషనల్ వాల్ ఆర్ట్ పెయింటింగ్‌లు చేయడం చూసి... తెలిసివారొకరు... తమ ఇంట్లో ఆ పనిచేయమని అడిగారు. అలా మొదటి ప్రాజెక్ట్ చెన్నైలో పూర్తిచేశారు. దాన్ని వీడియో తీసి 'మిథునం' పేరుగల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు. అది మొదలు ఫాలోవర్లూ పెరిగారు.



అవకాశాలూ వరుస కట్టాయి. సినీ స్టూడియోలు, హోటళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లూ, ఇళ్లూ, కన్వెన్షన్ సెంటర్లూ... ప్రముఖ సంస్థల ప్రాజెక్టులెన్నో అందివచ్చాయి. 'ఓ హోటల్‌లోనైతే గోడపై మాస్‌లుక్‌లో ఉన్న అల్లు అర్జున్ చిత్రం వేశా. దానికి ఎంతో గుర్తింపు వచ్చింది. తరవాత ఓ ప్రముఖ నగల దుకాణం గోడపై వేసిన లిప్పన్ ఆర్ట్ మరెంతో మందిని ఆకట్టుకుంది. ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఇష్టంగా చేసే పనులేవీ కష్టం అనిపించవు అనడానికి నేనే ఓ ఉదాహరణ. ఒక పక్క బొటిక్ నిర్వహణ, మరో పక్క చిత్రకళ...ఇలా రెండు పడవల మీద ప్రయాణిస్తున్నా మానసికంగా ఎంతో సంతృప్తినిస్తాయి' అంటారు శిరీష.

మెట్టుమెట్టుకీ... మేలెంతో!

నిత్యం ఫిట్‌నెస్ కాపాడుకునే అలవాటుంటే, మెనోపాజ్‌కొచ్చేసరికి ఆ దృఢత్వం వెన్నంటే ఉంటుంది. అధికబరువు, థైరాయిడ్, మధుమేహం, కీళ్లనొప్పులు, హృద్రోగంవంటివి దరికిరావు. అలాగని 'జిమ్‌కెళ్లాలా' అని అనుకోవద్దు. వీలైనప్పుడల్లా శరీరకండరాలు కదిలిస్తే చాలు. లిఫ్ట్ వాడకాన్ని వదిలేయండి. ఎందుకంటే, అయిదంతస్తుల వరకు మెట్లు ఎక్కి దిగేవారిలో హృద్రోగాలు తక్కువున్నట్లు అథెరోస్క్లెరోసిస్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనం తేల్చింది. అంతేనా... మెట్లు ఎక్కిదిగే ఆ పావు గంటలో 15 ప్రయోజనాలూ ఉన్నాయట.



1. అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎక్సర్‌సైజ్ అధ్యయనం ప్రకారం మెట్లు ఎక్కడంవల్ల నిమిషానికి 8 నుంచి 11 కేలరీలు ఖర్చవుతాయట. నడకతో పోలిస్తే మెట్లెక్కడం ఎక్కువ వ్యాయామం లాంటిది కావడంతో కేలరీలెక్కువ బర్న్ అవుతాయి.
2. హృదయస్పందన రేటు పెరుగుతుంది. గుండె కండరాలను బలపరుస్తుంది. రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరమంతా మెరుగైన రక్తప్రసరణ ఉండటంతో రక్తం గడ్డకట్టడం, రక్తపోటు ప్రమాదం వంటివి దరికి రావు.
3. శరీరంలో ఎండార్ఫిన్‌లను విడుదల చేయడంలో సహాయపడుతుంది. వీటిని హ్యాపీ హార్మోన్లు అనీ పిలుస్తారు. దీని వల్ల నిరాశ, ఆందోళనలు తగ్గుతాయి.
4. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరిచి, టైప్ 2 మధుమేహ ప్రమాదాన్ని తక్కువ చేస్తుంది.
5. గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. తాజాగా ఈఎస్‌సీ ప్రివెంటివ్ కార్డియాలజీ పరిశోధనల మేరకు మెట్లు ఎక్కని వ్యక్తులతో పోలిస్తే క్రమం తప్పకుండా మెట్లను వినియోగించేవారిలో హృదయసంబంధిత వ్యాధులు తక్కువని తేలింది.
6. ఎముకలు, కండరాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. మెట్లు ఎక్కడమనేది బరువు మోసే వ్యాయామంలాంటిది. దీంతో ఎముకలను బలోపేతం చేసి ఆస్టియో ఆర్థరైటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
7. శరీరం శక్తిమంతమవుతుంది. ఫిట్‌నెస్ స్థాయులూ పెరుగుతాయి.
8. నడుం చుట్టూ, పొత్తికడుపు వద్ద కొవ్వు కరుగుతుంది.
9. మెదడు పనితీరును మెరుగుపరిచి భవిష్యత్తులో అల్జీమర్స్‌కు దూరంగా ఉంచుతుంది.
10. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది.
11. అవయవాల పనితీరు బాగుంటుంది. అకాల అనారోగ్యాలు దరిచేరవు. ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది.
12. ఒత్తిడి దూరమవుతుంది. దీంతో మానసికారోగ్యం, భావోద్వేగ శ్రేయస్సు మెరుగ్గా ఉంటాయి.
13. శారీరకంగా శ్రమపడటంతో నిద్రలేమికి దూరంగా ఉండొచ్చు.
14. దిగువ శరీరభాగాల్లో కండరాలు బలోపేతమవుతాయి. రక్తప్రసరణ బాగా జరుగుతుంది.
15. ఈ శారీరక శ్రమ మానసిక ఆరోగ్యాన్నీ అందిస్తుంది.

కుండీలో కూరగాయలు!

తినే కూరగాయలు, ఆకుకూరల్లో రసాయనాల అవశేషాలు ఎక్కువేనంటున్నాయి పలు అధ్యయనాలు. ఎక్కువ దిగుబడి కోసమో, కాయలూ పండ్లూ ఆకర్షణీయంగా కనిపించేందుకో ఈ తరహా ఎరువుల్నీ, మందుల్నీ ఈ మధ్య కాలంలో విరివిగా వాడేస్తున్నారట. దీంతో అనేక అనారోగ్యాల బారినపడుతున్నాం. అందుకే, వీటికి బదులు సేంద్రియ ఉత్పత్తులను ఎంచుకోమని సూచిస్తున్నారు వైద్యులు. అలాగైతే మనమే ఇంట్లో ఆకుకూరల్నీ, కాయగూరల్నీ పెంచుకోవచ్చు కదా! కానీ, ఇందుకు సరిపడా స్థలమే ఉండదనే బాధ చాలామందిది. ఏం ఫరవాలేదు. వీటిని సాగు చేసేందుకు పెద్ద పెరడే అక్కర్లేదు. వెడల్పు తొట్టెల్లోనే నాటేయొచ్చు. బాల్కనీ గ్రిల్‌కి తీగల్నీ అల్లించేయొచ్చు. మీ బాల్కనీలోకి ఎండ రాకపోయినా ఏ పర్వాలేదు. ఎందుకంటే... అన్ని రకాలకూ నేరుగా తగిలే ఎండే అవసరం లేదు. పాక్షికంగా నీడున్నా సరిపోతుంది. పాలకూర, మెంతికూర, పుదీనా, కొత్తిమీర, గోంగూర, తోట కూర, బచ్చలికూర... తగినంత కాంతి ఉంటే చాలు మొలకెత్తుతాయి. ఇందుకోసం మూడొంతుల ఎర్రమట్టి, ఒకవంతు వర్మీ కంపోస్ట్ కలిపి కుండీల్లో నింపాలి. తరవాత రాత్రంతా నాననిచ్చిన ఈ విత్తనాలను వరుసగా నాటుకుంటే సరి. అయితే, అదనపు నీళ్లు నిలబడితే... ఆకుకూరలు త్వరగా కుళ్లిపోతాయి. అలాకాకుండా బయటకి పోయేందుకు తొట్టెకు చిన్న చిన్న రంధ్రాలు చేయాలి. కూరగాయలకూ మట్టిని ఇదే తరహాలో ఎంచుకోవాలి. అయితే, మొక్క నిలబడేందుకు అందులో మాస్‌స్టిక్ లేదా ఒక కర్రను ఏర్పాటు చేయాలి. టొమాటోలు, పచ్చిమిర్చి, క్యాప్సికం, దోసకాయలు, ముల్లంగి, వంగ, బెండ... వంటివీ కుండీల్లో సులువుగా పెరుగుతాయి. మట్టిలో వేప పిండి కలిపితే శిలీంధ్రాలు, పురుగులు ఆశించవు. 20-25 రోజుల్లో ఆకుకూరలు తెంచుకోవచ్చు. ఆకులను మాత్రమే కత్తిరించి వెంటనే ద్రవరూప ఎరువులను మొక్కకి అందిస్తే మరో వారంలో తెంచుకునేందుకు ఆకులు ఎదుగుతాయి. కుండీల్లోని మట్టి పై పొర పొడిబారితే నీళ్లు పోయాలి. తడి ఎక్కువైతే ఫంగల్ ఇన్ఫెక్షన్లు దాడిచేస్తాయన్న సంగతి మరిచిపోవద్దు. గొంగళిపురుగులు, తెల్లదోమ వంటి చీడపీడలు మొక్కకు సోకుతాయి. ఇలాంటప్పుడు లీటరు నీటిలో రెండు చెంచాల వేపనూనె కలిపి పిచికారీ చేయాలి.



ఫ్యాషన్ ఫ్యాషన్

కోట్... క్రాప్ టాప్!



ఈ తరం అమ్మాయిలు... ఫ్యాషన్‌కి ఐకాన్‌లు. పండగైనా, పెళ్లైనా తమ స్టైల్ స్టేట్‌మెంట్ కనిపించాలని కోరుకుంటున్నారు. వారిని మెప్పించేందుకు డిజైనర్లూ ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. అలా ఈ దీపావళి పండక్కి వారిని మెప్పిస్తోన్న ట్రెండ్ ఏంటో తెలుసా? క్రాప్‌టాప్... దానికి జతగా లాంగ్ కోట్. అవునండీ! లంగాఓణీకి ప్రత్యామ్నాయంగా... ఇటు సంప్రదాయాన్నీ, అటు ఆధునిక శైలినీ కలగలిపిన చేసిన డ్రెస్ ఇది. డైమండ్ సిల్క్, రాసిల్క్, జార్జెట్, టిష్యూ... వంటి జాలువారే వస్త్రాలతో శుభకార్యాల్లో తళుక్కుమనేలా తీర్చిదిద్దిన ఇవి యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. చీర, హాఫ్‌శారీ కట్టుకోవడానికి ఇబ్బంది పడేవారికి ఇవీ మరీ నచ్చేస్తున్నాయి. అందుకే, సందర్భానికో రకం అన్నట్లుగా... కట్‌వర్క్, జర్దోసీ, ప్రింట్లూ, పెయింట్లు... వంటి హంగులెన్నో చేరి అదరహో అనిపిస్తున్నాయి. మన అభిరుచిని బట్టి ప్రత్యేకంగా కుట్టించుకోవచ్చు. లేదంటే రెడీమేడ్‌గానూ కొనుక్కోవచ్చు. కట్టుకుంటే క్లాసీ లుక్‌తో మెరిసిపోవడం ఖాయం.



ఛాంపియన్

బెంగళూరులో అనూహ్య ఓటమితో కంగుతిన్న టీమ్‌ఇండియా.. పుణెలో పుంజుకుంది. అనుకున్నట్లే ఈసారి పిచ్ కథ మలుపు 'తిరిగింది'. అనుకోకుండా జట్టులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ ప్రత్యర్థిని తిప్పేశాడు. రెండో టెస్టును మెరుగ్గానే ఆరంభించిన న్యూజిలాండ్.. సుందర్ దెబ్బకు ఒక్కసారిగా కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో బౌలర్లు తమ పని ముగించారు. తొలి రోజే ప్రత్యర్థిని ఆలౌట్ చేశారు. ఇక సిరీస్ సమం చేసే దిశగా జట్టును ముందంజలో నిలపాల్సిన బాధ్యత బ్యాటర్లదే.

అదిరిందయ్యా సుందర్



- వాషింగ్టన్ మాయాజాలం
- కివీస్ 197/3 నుంచి 259కే ఆలౌట్
- భారత్ 16/1

పుణె

సిరీస్‌లో వెనుకబడ్డ రోహిత్ సేన.. న్యూజిలాండ్‌తో రెండో టెస్టును మెరుగ్గా ఆరంభించింది. స్పిన్‌కు సహకరించిన పుణె పిచ్‌పై వాషింగ్టన్ సుందర్ (7/59) కెరీర్ ఉత్తమ ప్రదర్శన చేయడంతో తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 259 పరుగులకే ఆలౌటైంది. ఓ దశలో 197/3తో పటిష్ట స్థితిలో నిలిచిన కివీస్.. సుందర్ ధాటికి 62 పరుగుల తేడాతో 7 వికెట్లు కోల్పోయింది. మరో స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (3/64) సైతం రాణించాడు. డెవాన్ కాన్వే (76; 141 బంతుల్లో 11×4), రచిన్ రవీంద్ర (65; 105 బంతుల్లో 5×4, 1×6) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన భారత్ కూడా తడబడింది. కెప్టెన్ రోహిత్.. సౌథీ బౌలింగ్‌లో డకౌట య్యాడు. ఆట చివరికి భారత్ 16/1తో నిలిచింది. యశస్వి జైస్వాల్ (6), శుభ్‌మన్ గిల్ (10) క్రీజులో ఉన్నారు.

పటిష్ఠ స్థితి నుంచి..: తొలి టెస్టులో విజయం సాధించిన ఊపులో ఈ మ్యాచ్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించిన కివీస్, ఒక దశలో ఆధిపత్యం సాగించిన తీరు చూస్తే.. తొలి రోజు భారత్ బ్యాటింగ్‌కు దిగుతుందన్న అంచనాలే లేవు. ఆ జట్టు అలవోకగా 400 పైచిలుకు స్కోరు సాధించేలా కనిపించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కివీస్ తొలి రెండు సెషన్లలో పైచేయి సాధించింది. పేసర్లు పెద్దగా ప్రభావం చూపకపోవడం, బ్యాటింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా ఉండడం ఆ జట్టుకు కలిసొచ్చింది. బుమ్రా, ఆకాశ్‌దీప్ కట్టుదిట్టంగానే బంతులేసినా వికెట్లు పడగొట్టలేకపోయారు. దీంతో త్వరగా అశ్విన్‌ను దించాడు కెప్టెన్ రోహిత్. అశ్విన్ తన తొలి ఓవర్లోనే లేథమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. తర్వాత యంగ్ (18)ను కూడా అశ్విన్ ఎక్కువసేపు నిలవనీయలేదు. అయితే ఓ ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న కాన్వేకు తొలి టెస్టు సెంచరీ హీరో రచిన్ రవీంద్ర తోడవడంతో భారత్‌కు ఇబ్బందులు తప్పలేదు. ఈ జోడీ స్పిన్నర్లను కూడా సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. సెంచరీ దిశగా సాగుతున్న కాన్వేను కూడా అశ్వినే ఔట్ చేయడంతో 62 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత రచిన్.. మిచెల్ (18)తో కలిసి మరో అర్ధశతక భాగస్వామ్యం నెలకొల్పడంతో కివీస్ 197/3తో తిరుగులేని స్థితికి చేరుకుంది. కాసేపట్లో రెండో సెషన్ ముగియబోతుండగా 3 వికెట్లే కోల్పోవడంతో ఈ మ్యాచ్‌లోనూ కివీస్ పైచేయి సాధించేలా కనిపించింది. కానీ టీ ముంగిట సుందర్ మాయాజాలం మొదలైంది. మరో పెద్ద ఇన్నింగ్స్ ఆడేలా కనిపిస్తున్న రచిన్‌తో పాటు బ్లండెల్ (3)ను వరుస ఓవర్లలో బౌల్డ్ చేసిన సుందర్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. విరామం తర్వాత అతను మరింతగా విజృంభించాడు. శాంట్నర్ (33) మినహా ఎవ్వరూ అతడి బౌలింగ్‌ను కాచుకోలేకపోయారు. మిచెల్‌ను వికెట్ల ముందు బలిగొన్న సుందర్.. సౌథీ (5), అజాజ్ (4)లను బౌల్డ్ చేశాడు. చివరి వికెట్ రూపంలో ఔటైన శాంట్నర్‌ను సైతం వాషింగ్టనే బౌల్డ్ చేశాడు. 20 ఓవర్ల వ్యవధిలో కివీస్ చివరి 7 వికెట్లు కోల్పోగా.. ఆ ఏడూ సుందర్ ఖాతాలోనే చేరాయి. తొలి మూడు వికెట్లను అశ్విన్ పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన భారత్‌ను కివీస్ బౌలర్లు బాగా ఇబ్బంది పెట్టారు. రోహిత్ 9 బంతులాడి సౌథీ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. తర్వాత యశస్వి, శుభ్‌మన్ ఓపిగ్గా ఆడి మరో వికెట్ పడకుండా చూశారు. భారత్ 11 ఓవర్లాడి 16 పరుగులే చేసింది.

1

కివీస్ ఇన్నింగ్స్‌లో పది వికెట్లను ఆఫ్‌స్పిన్నర్లయిన వాషింగ్టన్ సుందర్ (7), అశ్విన్ (3) పంచుకున్నారు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఓ ఇన్నింగ్స్‌లో పదికి పది వికెట్లూ ఆఫ్ స్పిన్నర్లే పడగొట్టడం ఇదే తొలిసారి. మొత్తం వికెట్లను స్పిన్నర్లే పడగొట్టడం ఇది 25వ సారి. ఈ ఇన్నింగ్స్ ముగిసిన కొన్ని నిమిషాలకే పాకిస్థాన్‌తో మూడో టెస్టులో ఇంగ్లాండ్ ఆలౌటైంది. ఆ మ్యాచ్‌లోనూ మొత్తం వికెట్లు స్పిన్నర్లే పడగొట్టారు.



531

టెస్టుల్లో అశ్విన్ వికెట్లు. టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్లలో నాథన్ లైయన్ (530)ను దాటి ఆరో స్థానానికి చేరుకున్నాడు.

7/59

సుందర్ గణాంకాలు. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో అతను 5 అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టడమిదే తొలిసారి. మొత్తంగా ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో సుందర్‌కిదే ఉత్తమ ప్రదర్శన.

అనుకోకుండా అతడు

ఎప్పుడో 2021లో తన చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు వాషింగ్టన్ సుందర్. ఆడిన నాలుగు టెస్టుల్లో 6 వికెట్లే పడగొట్టడంతో అతడిపై వేటు పడింది. మళ్లీ టెస్టు జట్టులోకి రాలేకపోయాడు. ప్రస్తుత న్యూజిలాండ్ సిరీస్‌లో సుందర్ ఆడతాడన్న అంచనా ఎవ్వరికీ లేదు. మూడు రోజుల ముందు వరకు భారత జట్టులో సభ్యుడే కాదు వాషింగ్టన్ సుందర్. మొదట కివీస్‌తో టెస్టు సిరీస్‌కు అతణ్ని ఎంపిక చేయలేదు. అశ్విన్‌తో పాటు జడేజా, కుల్‌దీప్, అక్షర్ పటేల్.. ఇలా నలుగురు స్పిన్నర్లు జట్టులో ఉండగా సుందర్ గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదు. కానీ రెండో టెస్టు ముంగిట ఆశ్చర్యకరంగా అతడిని జట్టులోకి తీసుకున్నారు. రంజీ ట్రోఫీలో సుందర్ నిలకడగా రాణిస్తుండడంతో అతడికి అవకాశమిచ్చారు. అంతే కాక కుల్‌దీప్‌ను తప్పించి మరీ తుది జట్టులో చోటివ్వడం ఆశ్చర్యం కలిగించింది. ఈ నిర్ణయాన్ని ముందు దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ కూడా తప్పుబట్టాడు. కానీ తొలి రోజు ఆటలో సుందర్ ప్రదర్శన చూశాక ఆయన అబ్బురపడ్డాడు. సుందర్ ఎంపికలో కోచ్ గంభీర్ పాత్ర కీలకమని సమాచారం. తన నమ్మకాన్ని నిలబెడుతూ ఈ చెన్నై స్పిన్నర్ కివీస్ బ్యాటింగ్ లైనప్‌ను కూల్చేశాడు. చివరి 7 వికెట్లూ అతడి ఖాతాలోనే చేరాయి. అతను పడగొట్టిన ఏడు వికెట్లలో అయిదు బౌల్డ్‌లే కావడం విశేషం.

అనుకున్నట్లే రాహుల్..

తొలి టెస్టులో షాక్ తిన్న భారత్.. రెండో టెస్టుకు తుది జట్టులో ఏకంగా మూడు మార్పులతో బరిలోకి దిగింది. బెంగళూరులో పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌పై వేటు పడింది. మెడ నొప్పి కారణంగా తొలి టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌కు అందుబాటులోకి రావడంతో రాహుల్ తప్పుకోక తప్పలేదు. బెంగళూరు టెస్టులో ఆడి రెండో ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీ సాధించిన సర్ఫరాజ్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. మరోవైపు కుల్‌దీప్ యాదవ్‌ను తప్పించి స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఎంచుకోగా.. అతను తొలి రోజే అదరగొట్టి తన ఎంపిక సరైందేనని రుజువు చేశాడు. మరోవైపు స్వదేశంలో సాధారణ ప్రదర్శన చేస్తున్న హైదరాబాదీ పేసర్ సిరాజ్‌పైనా వేటు వేసిన జట్టు యాజమాన్యం... ఆకాశ్‌దీప్‌ను తుది జట్టులోకి తీసుకుంది.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లేథమ్ ఎల్బీ (బి) అశ్విన్ 15; కాన్వే (సి) పంత్ (బి) అశ్విన్ 76; యంగ్ (సి) పంత్ (బి) అశ్విన్ 18; రచిన్ (బి) సుందర్ 65; మిచెల్ ఎల్బీ (బి) సుందర్ 18; బ్లండెల్ (బి) సుందర్ 3; ఫిలిప్స్ (సి) అశ్విన్ (బి) సుందర్ 9; శాంట్నర్ (బి) సుందర్ 33; సౌథీ (బి) సుందర్ 5; అజాజ్ (బి) సుందర్ 4; ఒరోర్కీ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం:** (79.1 ఓవర్లలో ఆలౌట్) **259; వికెట్ల పతనం:** 1-32, 2-76, 3-138, 4-197, 5-201, 6-204, 7-236, 8-242, 9-252; **బౌలింగ్:** బుమ్రా 8-2-32-0; ఆకాశ్‌దీప్ 6-0-41-0; అశ్విన్ 24-2-64-3; సుందర్ 23.1-4-59-7; జడేజా 18-0-53-0

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి బ్యాటింగ్ 6; రోహిత్ (బి) సౌథీ 0; శుభ్‌మన్ బ్యాటింగ్ 10; ఎక్స్‌ట్రాలు 0 మొత్తం: (11 ఓవర్లలో వికెట్ నష్టానికి) **16; వికెట్ల పతనం:** 1-1; **బౌలింగ్:** సౌథీ 3-1-4-1; ఒరోర్కీ 3-2-5-0; అజాజ్ పటేల్ 3-1-5-0; శాంట్నర్ 2-0-2-0

అర్జున్ @2800



- చరిత్ర సృష్టించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్
- రేటింగ్ పాయింట్లలో అరుదైన ఘనత

దిల్లీ

తెలుగుతేజం గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి చరిత్ర సృష్టించాడు. చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత 2800 లైవ్ రేటింగ్ పాయింట్లకు చేరుకున్న రెండో భారతీయుడిగా అతడు నిలిచాడు. యూరోపియన్ క్లబ్ చెస్ టోర్నీలో గురువారం అయిదో రౌండ్లో ఆంద్రీకిన్ ద్మిత్రిపై గెలుపుతో అర్జున్ ఈ మైలురాయిని అందుకున్నాడు. లైవ్ రేటింగ్స్‌లో అతడు ప్రస్తుతం 2802.1 పాయింట్లతో ఉన్నాడు. చెస్ చరిత్రలో అర్జున్ కన్నా ముందు 15 మంది మాత్రమే 2800 రేటింగ్ పాయింట్లు సాధించారు. 21 ఏళ్ల అర్జున్ ఈ టోర్నీలో అల్కలాయిడ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న అర్జున్.. భారత్ ఇటీవల చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

అందనంత 'ఎత్తుల్లో'

భారత్‌లో చెస్ అనగానే ముందుగా విశ్వనాథన్ ఆనంద్ పేరే వినిపిస్తుంది. కానీ ఇప్పుడు అద్భుత ప్రదర్శనతో అంతర్జాతీయ వేదికపై సంచలన విజయాలు సాధిస్తున్న యువ ఆటగాళ్లు దేశ చదరంగానికి చిరునామాగా మారుతున్నారు. విషీ రికార్డులను బద్దలుకొడుతూ సాగుతున్నారు. ఇందులో వరంగల్ కుర్రాడు అర్జున్ ఇరిగేశి గురించి ప్రత్యేకంగా చెప్పాలి. దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర ఉన్న భారత చెస్‌లో ఇన్నేళ్ల పాటు కేవలం ఆనంద్‌కే సాధ్యమైన ఘనతను ఇప్పుడు అర్జున్ సాధించాడు. 2011 మార్చిలో విషీ అత్యధికంగా 2817 రేటింగ్‌ను అందుకున్నాడు.

దిగ్గజాల సరసన: ప్రపంచ చెస్‌లో చాలా తక్కువమందికి మాత్రమే ఈ ఘనత సాధ్యమైంది. 2800 ఎలో రేటింగ్‌తో అరుదైన జాబితాలో చేరిన అర్జున్ దిగ్గజాల సరసన చోటు సంపాదించాడు. గ్యారీ కాస్పరోవ్, వ్లాదిమిర్ క్రామ్నిక్, అలెగ్జాండర్ గ్రిషుక్ (రష్యా),కార్ల్‌సన్ (నార్వే), కరువానా, అరోనియన్, వెస్లీ సో, హికారు నకమురా (అమెరికా) తదితర ఆటగాళ్లు ఈ ఎలో రేటింగ్ సాధించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ మైలురాయి చేరుకున్న 16వ ఆటగాడిగా అర్జున్ నిలిచాడు. 2882 (2014లో) పాయింట్లతో కార్ల్‌సన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

మిగిలింది అదొక్కటే: చిన్నతనంలో 64 గళ్లపై ఇష్టం పెంచుకుని, ఎత్తులు వేయడంలో ఎత్తుకు ఎదుగుతున్న 21 ఏళ్ల అర్జున్ ఈ స్వల్ప కెరీర్‌లోనే ఎన్నో ప్రతిష్ఠాత్మక విజయాలు సాధించాడు. ఎన్నో గొప్ప మైలురాళ్లు దాటాడు. 2018 (14 ఏళ్లలో)లో గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన అతను.. తెలంగాణ ఏర్పడ్డాక ఆ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జూనియర్, యూత్ స్థాయిలో ప్రపంచ వేదికలపై సత్తాచాటాడు. సీనియర్ స్థాయిలోనూ సంచలన ప్రదర్శనతో సాగుతున్నాడు. ప్రపంచ మేటి చెస్ ఆటగాడు కార్ల్‌సన్‌పై కూడా విజయాలు సాధించాడు. నిరుడు ఆసియా క్రీడల్లో పురుషుల జట్టు తరపున రజతం నెగ్గాడు. 2022 చెస్ ఒలింపియాడ్‌లో అతను సభ్యుడిగా ఉన్న భారత జట్టు త్రుటిలో పతకం కోల్పోయింది. అయినా వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనకు అతను రజతం దక్కించుకున్నాడు. ఇక ఈ ఏడాది చెస్ ఒలింపియాడ్‌లో అర్జున్‌కు తిరుగులేకుండా పోయింది. 11 గేమ్‌లాడిన అతను ఏకంగా 9 విజయాలు సాధించాడు. రెండు గేమ్‌లను డ్రాగా ముగించాడు. భారత పురుషుల జట్టు ఒలింపియాడ్‌లో తొలి స్వర్ణాన్ని గెలవడంలో అర్జున్‌ది ప్రధాన పాత్ర. అతను వ్యక్తిగత స్వర్ణాన్ని కూడా ముద్దాడాడు. ఈ ఎలో రేటింగ్‌లు, విజయాల గురించి పెద్దగా ఆలోచించను అని చెప్పే అర్జున్ కెరీర్‌లో సాధించాల్సిన ప్రతిష్ఠాత్మక టైటిల్ ఒకటుంది. అదే.. ప్రపంచ ఛాంపియన్ కావడం. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న అతను.. ఇదే నిలకడ కొనసాగిస్తే ఆ కల నెరవేరడం అసాధ్యం కాదు.

– ఈనాడు క్రీడా విభాగం

లైవ్ రేటింగ్‌లో టాప్-4

మాగ్నస్ కార్ల్‌సన్	నార్వే	2831.0
కరువానా	అమెరికా	2805.0
అర్జున్ ఇరిగేశి	భారత్	2802.1
హికరు నకముర	అమెరికా	2802.0

మెరిసిన దీప్తి

- భారత మహిళల ఘనవిజయం
- న్యూజిలాండ్‌తో తొలి వన్డే



అహ్మదాబాద్: న్యూజిలాండ్ మహిళలతో వన్డే సిరీస్‌లో భారత్ ఘనంగా బోణీ కొట్టింది. దీప్తి శర్మ ఆల్‌రౌండ్ జోరు.. స్పిన్నర్ రాధ యాదవ్ మాయాజాలంతో గురువారం తొలి మ్యాచ్‌లో భారత్ 59 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట భారత్ 44.3 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. అరంగేట్ర బ్యాటర్ తేజల్ హసబ్నిస్ (42; 64 బంతుల్లో 3×4), దీప్తి శర్మ (41; 51 బంతుల్లో 2×4, 1×6), యాస్తిక భాటియా (37; 43 బంతుల్లో 5×4), జెమీమా (35; 36 బంతుల్లో 1×4), షెఫాలి వర్మ (33; 22 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. కెప్టెన్ స్మృతి మంధాన (5) విఫలమైంది. అమేలియా కెర్ (4/42), జెస్ కెర్ (3/49) భారత్‌ను కట్టడి చేశారు. ఛేదనలో న్యూజిలాండ్ తడబడింది. ఎడమచేతి వాటం స్పిన్నర్ రాధ యాదవ్ (3/35), అరంగేట్ర పేసర్ సైమా ఠాకోర్ (2/26) ధాటికి 40.4 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌటైంది. దీప్తి శర్మ (1/35) బంతితోనూ రాణించింది. కివీస్ ఇన్నింగ్స్‌లో బ్రూక్ హాలిడే (39; 54 బంతుల్లో 4×4) టాప్ స్కోరర్. మ్యాడీ గ్రీన్ (31), అమేలియా కెర్ (25 నాటౌట్) రాణించారు. దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో వన్డే ఆదివారం జరుగుతుంది.

భారత్: 227 (తేజల్ 42, దీప్తి శర్మ 41, యాస్తిక భాటియా 37, జెమీమా 35, షెఫాలి 33; అమేలియా కెర్ 4/42, జెస్ కెర్ 3/49, ఎడెన్ కార్సన్ 2/42); **న్యూజిలాండ్: 168** (బ్రూక్ హాలిడే 39, మ్యాడీ 31, లారెన్ డౌన్ 26, ప్లిమ్మర్ 25, అమేలియా కెర్ నాటౌట్ 25; రాధ యాదవ్ 3/35, సైమా ఠాకోర్ 26)

హాకీలో గెలిచి ఓడిన భారత్

దిల్లీ: ప్రపంచ ఛాంపియన్ జర్మనీతో రెండో హాకీ టెస్టులో భారత్ 5-3తో విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్‌లు చెరో రెండు గోల్స్‌తో జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. అయితే షూటౌట్లో ఓడిన భారత్ ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను కోల్పోయింది. గురువారం మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో భారత్ తరపున సుఖ్‌జీత్ (34వ, 48వ), హర్మన్‌ప్రీత్ (42వ, 43వ) రెండేసి గోల్స్ కొట్టగా.. అభిషేక్ (45వ) ఓ గోల్ సాధించాడు. జర్మనీ జట్టులో ఎలియన్ మజ్కౌర్ (7వ, 57వ) రెండు గోల్స్ చేశాడు. హెన్రిక్ మెర్టెన్స్ (60వ) ఓ గోల్ సాధించాడు. రెండు జట్లు చెరో మ్యాచ్ నెగ్గడంతో సిరీస్ విజేతను షూటౌట్లో నిర్ణయించారు. షూటౌట్లో భారత్ 1-3తో పరాజయంపాలైంది. భారత జట్టులో ఆదిత్య మాత్రమే స్కోర్ చేయగలిగాడు. హర్మన్‌ప్రీత్, అభిషేక్, మహ్మద్ రహీల్ విఫలమయ్యారు. భారత గోల్‌కీపర్ కృషన్ బహదూర్ రెండు చక్కని సేవ్‌లు చేశాడు. కానీ తన జట్టుకు పరాజయాన్ని తప్పించలేకపోయాడు. తొలి టెస్టులో జర్మనీ 2-0తో గెలిచింది.

దక్షిణాఫ్రికా విజయం



మీర్పూర్: పేసర్ కాగిసో రబాడ (6/46) నిప్పులు చెరగడంతో తొలి టెస్టులో బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. నాలుగు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఏడు వికెట్ల తేడాతో బంగ్లాను చిత్తుచేసింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గత పదేళ్లలో ఆసియా గడ్డపై దక్షిణాఫ్రికాకు ఇదే తొలి విజయం. ఓవర్‌నైట్ స్కోరు 283/7తో గురువారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 89.5 ఓవర్లలో 307 పరుగులకు ఆలౌటైంది. మెహదీ హసన్ మిరాజ్ (97; 191 బంతుల్లో 10×4, 1×6) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అనంతరం 106 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన దక్షిణాఫ్రికా లంచ్ విరామంలోపే పని పూర్తిచేసింది. 22 ఓవర్లలో 3 వికెట్లకు 106 పరుగులు రాబట్టి విజయాన్ని అందుకుంది. టోనీ జోర్జి (41; 52 బంతుల్లో 7×4), ట్రిస్టన్ స్టబ్స్ (30 నాటౌట్; 37 బంతుల్లో 4×4, 1×6) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 106కే ఆలౌట్ కాగా.. దక్షిణాఫ్రికా 308 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన వెరీన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఇంగ్లాండ్ 267.. పాక్ 73/3

రావల్పిండి: పాకిస్థాన్, ఇంగ్లాండ్ మధ్య నిర్ణాయక మూడో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 68.2 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. పాక్ స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (6/128), నొమన్ అలీ (3/88) విజృంభించి ఇంగ్లాండ్‌ను కట్టడి చేశారు. స్పిన్ వికెట్‌పై బెన్ డకెట్ (52; 84 బంతుల్లో 4×4, 1×6), జేమీ స్మిత్ (89; 119 బంతుల్లో 5×4, 6×6), గస్ అట్కిన్సన్ (39; 71 బంతుల్లో 5×4) మాత్రమే పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. పాక్ స్పిన్నర్ల దెబ్బకు ఒకదశలో ఇంగ్లాండ్ 118 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. అయితే స్మిత్, అట్కిన్సన్ ఏడో వికెట్‌కు 105 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అనంతరం తొలి రోజు ఆట ముగిసే సమయానికి పాక్ 23 ఓవర్లలో 3 వికెట్లకు 73 పరుగులు సాధించింది. ఇంగ్లాండ్ బౌలర్లలో జాక్ లీచ్ (1/33), అట్కిన్సన్ (1/2), షోయబ్ బషీర్ (1/29) ఒక్కో వికెట్ తీశారు. ఇంగ్లాండ్ స్కోరును అందుకోవాలంటే పాక్ మరో 194 పరుగులు చేయాల్సి ఉండగా.. కెప్టెన్ షాన్ మసూద్ (16 బ్యాటింగ్), సాద్ షకీల్ (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

హాకీ రాజ్యాన్ని వీడిన రాణి


రాణి రాంపాల్

దిల్లీ: మూడు పూటలు కడుపు నిండా తినే స్తోమత లేని పేదరికం.. కానీ ఆమె ఆగిపోలేదు. ఆర్థికంగా ఆసరా లేకపోయినా కలలు కనడం మానలేదు. విరిగిన కర్రతోనే ఆట మొదలెట్టింది. అంచెలంచెలుగా ఎదిగింది. దేశానికి ప్రాతినిధ్యం వహించింది. జాతీయ జట్టును నడిపించింది. భారత మహిళల హాకీకి మకుటం లేని మహారాణిగా మారింది. ఘన కీర్తిని సొంతం చేసుకుని ఇప్పుడు ఆటను వదిలేసింది. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన రాణి రాంపాల్ గురువారం రిటైర్మెంట్ ప్రకటించింది. 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ఈ 29 ఏళ్ల హరియాణా అమ్మాయి వీడ్కోలు పలికింది. "ఇదో అద్భుతమైన ప్రయాణం. భారత్‌కు సుదీర్ఘ కాలం పాటు ఆడతానని అనుకోలేదు. చిన్నప్పటి నుంచి పేదరికాన్ని అనుభవించా. కానీ ఏదైనా ప్రత్యేకంగా చేయాలని, భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనే లక్ష్యం దిశగా సాగా. దేశానికి 16 ఏళ్ల పాటు ఆడిన తర్వాత రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడం కష్టమే. కానీ ఎంతో ఆలోచించిన తర్వాత ఇదే సరైన సమయమనిపించింది. ఇన్ని సంవత్సరాల పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించినందుకు గర్వపడుతున్నా. 254 మ్యాచ్‌లాడతానని, దాదాపు 200 గోల్స్ చేస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ఒలింపిక్ పోడియంపై మహిళల జట్టును చూడాలనుకున్నా. ఎంతో ప్రయత్నించా కానీ దగ్గరగా వచ్చి ఆగిపోయాం" అని రాణి తెలిపింది. రాణి గౌరవార్థం ఆమె జెర్సీ నంబర్ 28కు రిటైర్మెంట్ ప్రకటించిన హాకీ ఇండియా.. తనకు రూ.10 లక్షల నగదు బహుమతి కూడా అందజేసింది.

బెంగాల్ బోణీ

ఈనాడు, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్లో బెంగాల్ వారియర్స్ బోణీ కొట్టింది. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 32-29 తేడాతో యూపీ యోధాస్‌పై గెలిచింది. తన తొలి మ్యాచ్‌లో జైపుర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడిన బెంగాల్.. వరుసగా రెండు విజయాలు నమోదు చేసిన యోధాస్‌పై ఈ పోరులో పైచేయి సాధించింది. మణిందర్ సింగ్ (8), సుశీల్ (7), నితిన్ (7) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 37-25తో జైపుర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది.

ప్రొ కబడ్డీలో ఈనాడు: పట్నా పైరేట్స్ × తమిళ్ తలైవాస్ (రాత్రి 8 నుంచి)
బెంగళూరు బుల్స్ × పుణెరి పల్టాన్ (రాత్రి 9 నుంచి)


బెంగాల్-యూపీ మ్యాచ్‌లో...

ప్రపంచ రెజ్లింగ్‌కు భారత జట్టు దూరం

దిల్లీ: ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ నుంచి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) భారత జట్టును ఉపసంహరించింది. క్రీడామంత్రిత్వ శాఖ తమ సమాఖ్య వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ)కు తెలిపింది. అండర్-23 ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ కోసం సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు డబ్ల్యూఎఫ్ఐ ఇటీవల ప్రకటించింది. అయితే నిరసన తెలుపుతున్న రెజ్లర్లు ఈ సెలక్షన్స్‌ను వ్యతిరేకించారు. ఇది కోర్టు ధిక్కారం అవుతుందని అన్నారు. సస్పెండైన సమాఖ్య ఎలా సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తుందని ప్రశ్నించారు. ఆ తర్వాత డబ్ల్యూఎఫ్ఐ సెలక్షన్ నోటీసును ఉపసంహరించుకుంది. క్రీడా మంత్రిత్వ శాఖ.. డబ్ల్యూఎఫ్ఐను సస్పెండ్ చేయడం వల్లే ఇదంతా జరుగుతోందని ఓ అధికారి అన్నాడు.

ధ్యాన్‌చంద్ స్థానంలో అర్జున

దిల్లీ: ధ్యాన్‌చంద్ జీవిత కాల పురస్కారం ఇక కనుమరుగవనుంది. క్రీడల్లో సేవలకు గాను అందించే ఈ అవార్డు స్థానంలో ఈ ఏడాది నుంచి కొత్తగా అర్జున జీవిత కాల పురస్కారాన్ని అందచేయనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. దేశంలో క్రీడా పురస్కారాలను హేతుబద్ధం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. హాకీ మాంత్రికుడు, దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ పేరు మీద 2002లో ధ్యాన్‌చంద్ జీవిత కాల పురస్కారాన్ని ప్రవేశపెట్టారు. గతేడాది మాజీ ప్లేయర్లు మంజూష కన్వార్ (బ్యాడ్మింటన్), వినీత్ (హాకీ)తో పాటు కబడ్డీ క్రీడాకారిణి కవితకు ఈ పురస్కారాన్ని అందజేశారు. "ధ్యాన్‌చంద్ అవార్డు స్థానంలో అర్జున జీవితకాల పురస్కారాన్ని ప్రవేశపెడుతున్నాం. కిందిస్థాయిలో కష్టపడే కోచ్‌లు కూడా ద్రోణాచార్య అవార్డుకు ఇకపై అర్హులే. ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడల్లో ఓవరాల్ అత్యుత్తమ ప్రదర్శన చేసిన విశ్వవిద్యాలయానికి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ట్రోఫీ అందజేస్తాం" అని క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది.

న్యాయదేవత విగ్రహంలో మార్పులు ఏకపక్షం

అభ్యంతరం తెలుపుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానం

ఈనాడు, దిల్లీ: న్యాయ దేవత విగ్రహం, సర్వోన్నత న్యాయస్థానం చిహ్నంలో మార్పులపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. బార్‌ను సంప్రదించకుండానే ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించింది. ఈమేరకు బార్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ''న్యాయ పరిపాలనలో మాకూ సమాన భాగస్వామ్యం ఉంది. కానీ ఈ మార్పుల ప్రతిపాదనను మా దృష్టికి తీసుకురాలేదు. ఈ మార్పుల వెనుకున్న హేతుబద్ధత ఏమిటో తెలియడంలేదు'' అని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ తీర్మానంలో పేర్కొంది. దానిపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్‌సిబల్ తదితరులు సంతకాలు చేశారు.

గుల్‌మార్గ్ సమీపంలో ఆర్మీ వాహనంపై ఉగ్రదాడి

ఇద్దరు కూలీలు, ఇద్దరు సైనికుల మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుల్‌మార్గ్ సమీపంలో గురువారం సాయంత్రం నాగిన్ పోస్టు వైపు వెళ్తున్న ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఆర్మీలో పనిచేస్తున్న ఇద్దరు కూలీలతోపాటు ఇద్దరు సైనికులు కూడా ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. రెండు వర్గాల మధ్య కొద్దిసేపు కాల్పులు కొనసాగినట్లు శ్రీనగర్‌కు చెందిన చినార్ దళం 'ఎక్స్'లో పేర్కొంది. గురువారం ఈ దాడి ఘటనకు ముందు.. పుల్వామా జిల్లాలోని త్రాల్ ప్రాంతంలోనూ ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శుభంకుమార్ అనే కార్మికుడు గాయపడ్డాడు.




ప్రతిరోజులోనూ మంచి ఉంటుంది

ప్రతిరోజూ మనకు మంచి రోజు కాకపోవచ్చు. కానీ ప్రతిరోజులోనూ ఏదో ఒక మంచి ఉంటుంది. దాన్ని చిరునవ్వుతో స్వీకరించండి. ప్రతి రోజునూ మీకు దొరికిన మరో గొప్ప అవకాశంగా భావించండి. నిన్న చేయలేకపోయిన పనిని ఈరోజు పూర్తిచేయడానికి ప్రయత్నించి దాన్ని సద్వినియోగం చేసుకోండి.

– ఎరిక్ పార్టకర్, రచయిత

ఉత్తరాన భాజపాకు ఉక్కపోత!



- మహారాష్ట్రలోని 5 జిల్లాల్లో మరాఠా కోటా, ఉల్లి రైతుల సమస్యలే ఎజెండా
- లోక్‌సభ ఎన్నికల్లో ఎంవీఏ ప్రభావం

వ్యవసాయ ప్రధానమైన ఉత్తర మహారాష్ట్ర భాజపాకు కంచుకోట. ఇక్కడ 47 సీట్లున్నాయి. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ కఠిన పరీక్షను ఎదుర్కొంటోంది. మారిన రాజకీయ పరిస్థితుల్లో ఈ ప్రాంతంలో భాజపా ఎంతమేర సీట్లు సాధిస్తుందనేది ఆసక్తికరం. ఉత్తర మహారాష్ట్రలో 5 జిల్లాలున్నాయి. అవి.. ధులే, నందుర్బర్, జల్‌గావ్, నాసిక్, అహిల్యానగర్. ఇందులో కొన్ని మధ్యప్రదేశ్, గుజరాత్ సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ ప్రాంతంలో నవంబరు 20వ తేదీన పోలింగ్ జరగనుంది. మొత్తం 47 సీట్లలో 11 ఎస్టీలకు, 4 ఎస్సీలకు రిజర్వు అయ్యాయి.

2019లో..

2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ భాజపా 16, అవిభాజ్య శివసేన 6, ఉమ్మడి ఎన్సీపీ 13, కాంగ్రెస్ 7, ఎంఐఎం 2, క్రాంతికారీ షెట్కారీ పక్ష్ ఒక సీటు గెలుచుకున్నాయి. ఇద్దరు స్వతంత్రులు నెగ్గారు.

- ప్రస్తుత ఎన్నికలకు వచ్చే సరికి శివసేన, ఎన్సీపీ చీలిపోయాయి.
- లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లలోని 4 సీట్లను మహా వికాస్ అఘాడీకి భాజపా కోల్పోయింది.

ప్రభావం చూపేవి..

ఉత్తర మహారాష్ట్రలో రైతుల సమస్యలు, రిజర్వేషన్లపై మరాఠా-ఓబీసీల్లో వచ్చిన విభజన ప్రభావం చూపే అవకాశముంది.

- ధరల పెరుగుదల, అవినీతి, మరాఠా-ఓబీసీల వివాదం ప్రధానాంశాలుగా నిలవనున్నాయి.
- ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేసినా ధరలు పెరగకపోవడంతో రైతులు అసంతృప్తిగా ఉన్నారు. దీంతోపాటు వర్షాల వల్ల పంట దెబ్బతినడం వారిని మరింత కష్టాల పాల్జేసింది. తక్కువ ధరలకు అమ్ముకున్న ఉల్లి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందించినా వారు అంత సంతోషంగా లేరు.
- ఉల్లిపై 40శాతంగా ఉన్న ఎగుమతి సుంకాన్ని ప్రభుత్వం 20శాతానికి తగ్గించింది. అయితే మొత్తం ఎత్తివేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు.
- పత్తి, సోయాబీన్‌కూ సరైన ధరలు లేవు. కనీస మద్దతు ధర కంటే సోయాబీన్ ధర తక్కువగా ఉండటం రైతుల్లో ఆగ్రహానికి కారణమవుతోంది.
- శాంతి భద్రతల సమస్యలూ ఇక్కడ అధికమే.

కాంగ్రెస్ ప్రభావం తక్కువే

1999లో కాంగ్రెస్ నుంచి శరద్ పవార్ విడిపోవడంతో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ బలహీనపడింది. ఈసారీ ఇక్కడ కాంగ్రెస్ పెద్దగా పోటీ చేసే అవకాశం లేదు. ఉద్ధవ్, శరద్ పవార్ పార్టీలే అధిక స్థానాల్లో పోటీ చేయనున్నాయి.

- జల్‌గావ్ మినహా ఇప్పటికీ భాజపా ఈ ప్రాంతంలో బలంగానే ఉందని రాజకీయ నాయకులు చెబుతున్నారు. ప్రత్యర్థి పార్టీలూ దీనిని అంగీకరిస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో దెబ్బతిన్నా ఆ పార్టీని తక్కువ అంచనా వేయలేమని అంటున్నాయి.
- ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నా తనకున్న సంస్థాగత బలంతో భాజపా నెట్టుకురాగలదని భావిస్తున్నారు. అయితే ఉద్ధవ్, శరద్ పవార్ వర్గాలు గట్టి పోటీ ఇచ్చే అవకాశముంది.
- ధులే, నందూర్బర్, అహిల్యానగర్‌లలో కాంగ్రెస్ కొంత ప్రభావం చూపనుంది.
- పార్టీలు చీలడాన్ని ఈ ప్రాంత ప్రజలు హర్షించడం లేదు.
- రిజర్వుడు నియోజకవర్గాల్లో గతంలో కాంగ్రెస్‌కు బలముండేది. క్రమంగా భాజపా పట్టు సాధించింది.
- కాంగ్రెస్ సీనియర్ నేతలు భాజపాలో చేరారు.
- హిందుత్వ ఎజెండా కూడా ఇక్కడ బాగానే పనిచేస్తుంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

కెనడాది

వెన్నుపోటు



- భారత్ విషయంలో వ్యవహరించిన తీరు తగదు
- కొద్దిమంది ఖలిస్థానీలు హడావుడి చేస్తున్నారు
- పీటీఐ ముఖాముఖిలో హైకమిషనర్ సంజయ్ వర్మ

దిల్లీ: భారత్ పట్ల కెనడా వ్యవహరించిన తీరు ఏమాత్రం సబబుగా లేదని, భారత్‌కు అది వెన్నుపోటు పొడిచిందని అక్కడ హైకమిషనర్‌గా వ్యవహరించిన సీనియర్ దౌత్యాధికారి సంజయ్ వర్మ ఆరోపించారు. కెనడా పౌరుడైన హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసుతో వర్మను ముడిపెట్టాలని అక్కడి ప్రభుత్వం చూడడం, దానిపై ఆగ్రహించిన విదేశీ వ్యవహారాల శాఖ ఆయన్ని వెనక్కి రప్పించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీటీఐ వార్తా సంస్థతో వర్మ మాట్లాడారు. ఎంతో స్నేహపూరిత ప్రజాస్వామ్య దేశంగా ఉండాల్సిన కెనడా.. దానికి తగ్గస్థాయిలో వ్యవహరించలేదని విమర్శించారు.

ఎలాంటి రహస్య ఆపరేషన్లు చేయలేదు

''భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతినేలా కెనడా ప్రవర్తించింది. అక్కడ మేం ఎలాంటి రహస్య ఆపరేషన్లు చేయలేదు. కానీ, భారత్‌పై కెనడా తీవ్ర ఆరోపణలు చేసింది. ఇప్పటివరకు వాటికెలాంటి ఆధారాలు చూపించలేకపోయింది. ఆ దేశంలో న్యాయవ్యవస్థ సున్నితంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. అందుకే అక్కడ ఖలిస్థానీలు ఆశ్రయం పొందుతున్నారు. అక్కడ అతి తక్కువ సంఖ్యలో ఖలిస్థానీ మద్దతుదారులు ఉన్నారు. మిగిలిన సిక్కు కుటుంబాలను వారు భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు అనేక అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు. ఖలిస్థాన్ ఒక నేర సంస్థ. సాధారణ సిక్కులను వారు బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోకపోవడమంటే వారిని ప్రోత్సహించడంతో సమానం. ఖలిస్థాన్ అనేది ఒక వ్యాపారంగా మారింది. దాని పేరుతో మనుషుల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల చేరవేత, వ్యభిచారం వంటివన్నీ జరుగుతున్నాయి. వీటి ద్వారా వారు చాలా డబ్బు సంపాదిస్తున్నారు. ఎన్నికల్లో ప్రయోజనాల కోసం కెనడాలో నేతలు ఈ ఉద్యమకారులకు మద్దతు ఇస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ గోల్డీబార్ పేరును నేరగాళ్ల జాబితా నుంచి ఆకస్మికంగా కెనడా తొలగించింది. కెనడాలో జస్టిన్ ట్రూడో ప్రజాదరణ కోల్పోతున్నారని సర్వేలు చెబుతున్నాయి. వీటి ప్రకారం.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఆయన గెలవడం చాలా కష్టం'' అని వర్మ పేర్కొన్నారు. తమకు దౌత్యపరంగా ఉన్న రక్షణను తొలగించడానికి కెనడాలో ప్రయత్నించారని, అమర్యాదకరంగా వ్యవహరించారని, ఇది తనకు దిగ్భ్రాంతి కలిగించిందని చెప్పారు.

పారిస్ ఒప్పంద లక్ష్యం అందని ద్రాక్షే!

- ఐరాస నివేదిక స్పష్టీకరణ

వాషింగ్టన్: కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలకు ప్రపంచ దేశాలన్నీ కట్టుబడి ఉండాల్సిన ఆవశ్యకతను ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక ఒకటి నొక్కిచెప్పింది. పారిశ్రామిక విప్లవం ముందునాటితో పోలిస్తే.. ఇప్పటికే భూతాపం 1.3 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగినట్లు తెలిపింది. ఉద్గారాలు ప్రస్తుత స్థాయిలో కొనసాగితే.. ఈ శతాబ్దాంతానికి భూతాపం మరో 1.8 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే ముప్పుందని హెచ్చరించింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఇస్తున్న హామీలను అన్ని దేశాలూ పక్కాగా నెరవేరిస్తే ఈ పెరుగుదలలో 0.5 డిగ్రీల మేర కోత పెట్టొచ్చని పేర్కొంది. అయినప్పటికీ వడగాలులు, కార్చిచ్చులు, తుపానులు, కరవుల వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులను తగ్గించడం కష్టమేనని అభిప్రాయపడింది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్‌ఈపీ) ఉద్గారాల వ్యత్యాస వార్షిక నివేదికను గురువారం విడుదల చేసింది. అందులోని ముఖ్యాంశాలివీ..

- పారిశ్రామిక విప్లవం ముందునాటితో పోలిస్తే ఈ శతాబ్దాంతానికి భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కే పరిమితం చేయాలని ప్రపంచ దేశాలు 2015 నాటి పారిస్ ఒప్పందంలో లక్ష్యంగా విధించుకున్నాయి. దాన్ని అందుకోవడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది!
- ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే.. పారిశ్రామిక విప్లవం ముందునాటి కంటే ఈ శతాబ్దాంతానికి భూతాపం 3.1 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఉద్గారాల తగ్గింపు విషయంలో ప్రపంచ దేశాలన్నీ ఇకనైనా తమ లక్ష్యాలను అందుకుంటే ఆ పెరుగుదలను 2.6 డిగ్రీలకు పరిమితం చేయొచ్చు.
- ప్రపంచవ్యాప్తంగా మొత్తం కర్బన కాలుష్యంలో 77 శాతానికి.. 20 అత్యంత ధనిక దేశాలే కారణం. వాటిలో 11 దేశాలే తమ ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను ప్రస్తుతం అందుకోగలుగుతున్నాయి.

భారత ఉద్గారాల్లో 6.1% పెరుగుదల

భారత్‌లో గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు నిరుడు 6.1% మేర పెరిగినట్లు యూఎన్‌ఈపీ నివేదిక స్పష్టం చేసింది. యావత్ ప్రపంచ ఉద్గారాల్లో దీని వాటా 8%గా నమోదైందని పేర్కొంది. అయితే చారిత్రకంగా చూస్తే మొత్తం ఉద్గారాల్లో భారత్ వాటా 3% మాత్రమేనని తెలిపింది.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకం

- రాష్ట్రపతి ఆమోద ముద్ర
- నవంబరు 11న ప్రమాణం

దిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానం 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ గురువారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. తన పదవీ కాలం నవంబరు 10న ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. నూతన సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నవంబరు 11న ప్రమాణం చేయనున్నట్లు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. 2025 మే 13 వరకు జస్టిస్ ఖన్నా సీజేఐగా కొనసాగుతారు.



చరిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామి

సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ సంజీవ్ ఖన్నా...చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన ధర్మాసనాల్లో కీలక భూమిక వహించారు. ఎన్నికల బాండ్లు, 370వ రాజ్యాంగ అధికరణం రద్దు, ఈవీయంల వినియోగానికి సమర్థన వంటి తీర్పులను ఇచ్చిన ధర్మాసనాల్లో జస్టిస్ ఖన్నా భాగస్వామిగా ఉన్నారు. దిల్లీలోని ప్రముఖ కుటుంబానికి చెందిన జస్టిస్ ఖన్నా...దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా సమీప బంధువు. 1960 మే 14న జన్మించిన సంజీవ్ ఖన్నా దిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను అభ్యసించారు. 2005లో దిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులయ్యారు. ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి సాధించారు. ప్రస్తుతం జాతీయ న్యాయ సేవల సంస్థ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఆ కేసుల్లో జర్నలిస్టుపై నిర్బంధ చర్యలు వద్దు

- ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని పాత్రికేయురాలిపై నమోదైన నాలుగు కేసులకు సంబంధించి ఆమెను నిర్బంధించడం వంటి చర్యలను తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని గురువారం సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ పి.కె.మిశ్ర, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. జర్నలిస్ట్ మమతా త్రిపాఠీ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని సూచించింది.



సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన ట్వీట్లకు గాను తనపై నమోదైన నాలుగు కేసులు రాజకీయ ప్రేరేపితమైనవని, పత్రికా స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని పిటిషన్‌లో మమతా త్రిపాఠీ పేర్కొన్నారు. కేసు విచారణ నాలుగు వారాలకు వాయిదాపడింది.

వృక్షాల కూల్చివేత కేసు...

దిల్లీ ఎల్జీ అఫిడవిట్‌లోని తేదీలపై అభ్యంతరాలు

- ఘటనల క్రమంపై స్పష్టత ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని రిడ్జ్ ప్రాంతంలో వృక్షాల కూల్చివేతకు సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా సమర్పించిన అఫిడవిట్‌లోని తేదీలపై పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎల్జీ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం...వృక్షాల కూల్చివేత సమాచారం సక్సేనాకు జూన్ 10న తెలిసింది. అయితే, రికార్డుల్లో నమోదైన ప్రకారం ఏప్రిల్ నెలలోనే దాని గురించి ఎల్జీకి అధికారులు వివరించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ విషయాన్ని వెల్లడించగా...ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం నోట్ చేసుకుంది. ఘటన క్రమంపై స్పష్టతనివ్వాలని ఆదేశించింది. వృక్షాల కూల్చివేతకు సంబంధించిన ఒరిజినల్ రికార్డులను తీసుకురావాలంటూ వచ్చే వారానికి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. వృక్షాల కూల్చివేతకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్న విషయం తనకు తెలియదని ఇటీవల సమర్పించిన అఫిడవిట్‌లో ఎల్జీ సక్సేనా పేర్కొన్నారు.

పాశ్చాత్య విపరీత ధోరణికి అడ్డుకట్ట

- ఈ విషయంలో బ్రిక్స్ పాత్ర కీలకం
- ముగింపు సదస్సులో పుతిన్

కజన్: పాశ్చాత్య దేశాల విపరీత ధోరణికి అడ్డుకట్ట వేయడంలో బ్రిక్స్ దేశాల కూటమి పాత్ర ప్రశంసనీయమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కొనియాడారు. మూడు రోజులపాటు జరిగిన బ్రిక్స్ సదస్సు గురువారం ముగిసిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. తర్వాత విలేకరులతోనూ మాట్లాడారు. దక్షిణార్ధగోళ దేశాల ఎదుగుదల శక్తిని హరించేందుకు పాశ్చాత్య దేశాలు ప్రయత్నిస్తున్నాయని, అక్రమంగా.. ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తున్నాయని పుతిన్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కుల్ని, వాతావరణ మార్పుల ఎజెండాను ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తూనే కరెన్సీని, స్టాక్‌మార్కెట్లను కూడా ప్రభావితం చేస్తున్నాయని విమర్శించారు. దీనివల్ల కొత్త ఘర్షణలు తలెత్తుతున్నాయన్నారు. ఉక్రెయినే దీనికి ఉదాహరణ అని, తమ భద్రతకు ఉక్రెయిన్ తీవ్ర ముప్పుగా మారిందని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని అంతం చేస్తానని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన హామీపై విలేకరులు ప్రశ్నించగా అలాంటి ప్రకటనలను ఎవరు చేసినా తాము ఆహ్వానిస్తామని చెప్పారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ ఉక్రెయిన్‌లో శాంతి కోసం బ్రెజిల్‌తో కలిసి ఒక ప్రతిపాదన చేశామని చెప్పారు. ఉమ్మడి భద్రతకు బ్రిక్స్ ప్లస్ దేశాలు గట్టి ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. ఆధునికీకరణ దిశగా దక్షిణార్ధ దేశాలు కదం తొక్కడం మానవ నాగరికతలో అనూహ్యమని అన్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ మాట్లాడుతూ- అంతర్జాతీయ చట్టాలు, సర్వప్రతినిధి సభ తీర్మానాల ప్రకారం ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలని చెప్పారు.

సంస్కరణలు అవసరం: జైశంకర్

బ్రిక్స్ సదస్సుకు వచ్చిన పలుదేశాల నేతలతో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ భేటీ అయ్యారు. ఇండోనేసియా, సౌదీ అరేబియా, యూఏఈ, థాయ్‌లాండ్ దేశాల విదేశాంగ మంత్రులతో చర్చలు జరిపారు. వివాదాలు, విభేదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని చెప్పారు.

- మోదీ, జిన్‌పింగ్, పుతిన్ సమావేశం కావడం ఎంతో గొప్ప పరిణామమని చైనా పేర్కొంది.
- బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు వేళ సైబర్ దాడులు జరగడం కలకలం రేపింది. రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌పై సైబర్ దాడులు జరిగినట్లు అధికార ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు.

28లోగా ట్రూడో రాజీనామా చేయాల్సిందే

- 24 మంది సొంతపార్టీ ఎంపీల డిమాండ్
- మరింత పెరిగిన వ్యతిరేకత

ఇంటర్నెట్ డెస్క్: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. ఆయన రాజీనామా చేయాలని లిబరల్ పార్టీ ఎంపీలు డిమాండు చేస్తున్నారు. ఈ నెల 28 వరకు దీనికి గడువు విధించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మైనార్టీలో ఉన్న ప్రభుత్వానికి ఇది మరింత సవాలుగా మారనుంది. ట్రూడో రాజీనామా చేయాలన్న లేఖపై 153 మంది ఎంపీల్లో 24 మంది సంతకాలు చేశారు. బుధవారం లిబరల్ పార్టీ ఓ సమావేశం నిర్వహించింది. ఇటీవలి ఎన్నికల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతినడానికి ట్రూడో వైఖరే కారణమని సభ్యులు దుమ్మెత్తి పోశారు. ఈ సమావేశ సమయంలోనే ట్రూడో విలేకర్లతో మాట్లాడుతూ- తాము బలంగా, సమష్టిగా ఉన్నామని, వచ్చే ఎన్నికలకు తానే నాయకత్వం వహిస్తానని ధీమా వ్యక్తంచేయడం విశేషం.



కెనడా పార్లమెంటులో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత పియర్రె పొయిలీవ్రె

వలసలపై కంపెనీలకు కఠిన నిబంధనలు

మరోవైపు.. వలసల నియంత్రణకు కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్యను భారీగా తగ్గించేందుకు సిద్ధమైంది. మరోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2024లో 4,85,000 మంది వలసదారుల్ని శాశ్వత నివాసితులుగా కెనడా గుర్తించింది. 2025కు ఈ సంఖ్యను 3,80,000కి, 2027 నాటికి 3,65,000 మందికి పరిమితం చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ట్రూడో ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'కెనడాలో తాత్కాలిక విదేశీ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నాం. కంపెనీలకు సంబంధించి కొన్ని కఠిన నిబంధనలు తీసుకురానున్నాం. నియామకాల విషయంలో స్థానికులకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వలేదో కంపెనీలు వెల్లడించాల్సి ఉంటుంది' అని చెప్పారు.

నాశనం చేయడమే తప్ప సరిచేయడం చేతకాదు

దేన్నైనా నాశనం చేయడమే తప్పిస్తే సరిచేయడం ట్రూడోకు రాదని కెనడా ప్రతిపక్ష నేత పియర్రె పొయిలీవ్రె విరుచుకుపడ్డారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలను సమర్థించుకొంటూ ట్రూడో తొలుత పార్లమెంటులో మాట్లాడారు. ''ప్రతిపక్ష నేత కెనడా 'బ్రోకెనిస్ట్' ప్లాన్లను మరోసారి ముందుకు తెస్తున్నారు. వాటికి వాస్తవాలతో ఏమాత్రం పొంతన లేదు'' అని వ్యాఖ్యానించారు. దీనికి పియర్రె స్పందిస్తూ ''బ్రోకెనిస్ట్ అనేది ఆంగ్ల పదం కూడా కాదు. ట్రూడో ఆ భాషనూ ముక్కలు చేస్తున్నారు'' అని వ్యాఖ్యానించారు. దీంతో సభ ఘొల్లున నవ్వింది. ట్రూడోను వెక్కిరిస్తూ సామాజిక మాధ్యమాల్లో మీమ్స్ వెల్లువెత్తాయి. ఖలిస్థాన్ వేర్పాటువాదులు పాల్పడుతున్న హింసాత్మక ఘటనలపై చర్యలు తీసుకోవాలని భారత సంతతి ఎంపీ చంద్ర ఆర్య డిమాండ్ చేశారు. ఉగ్రవాదానికి దేశాల సరిహద్దులతో సంబంధం లేదన్నారు.

ఎల్‌ఏసీ వెంబడి యథాపూర్వ పరిస్థితుల పునరుద్ధరణ

- చైనాతో విస్తృత ఏకాభిప్రాయం కుదిరినట్లే
- చర్చలకు ఉండే శక్తి ఇదే: రాజ్‌నాథ్

దిల్లీ: వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి యథాపూర్వ పరిస్థితుల పునరుద్ధరణకు చైనాతో విస్తృత ఏకాభిప్రాయాన్ని సాధించగలిగామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. నిరంతరం చర్చలు జరపడం ద్వారా ఇది సాధ్యమైందని, చర్చలకు ఉండే శక్తి అలాంటిదని చెప్పారు. బ్రిక్స్ సదస్సుకు హాజరైన ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఎల్‌ఏసీపై ఒక అవగాహనకు రావడం; ఇటీవలే కీలక గస్తీ ఒప్పందం కుదరడంపై గురువారం 'చాణక్య డిఫెన్స్ డైలాగ్ 2024'లో రాజ్‌నాథ్ స్పందించారు. ఈ ఒప్పందం ఎంతో కీలక పరిణామమని అభివర్ణించారు. ''పరస్పర భద్రత సూత్రం ఆధారంగా ఇరుదేశాల మధ్య సరిహద్దు పరిస్థితులను పునరుద్ధరించేందుకు ఒప్పందం కుదిరింది. కీలక ప్రాంతాల్లో గస్తీ, పశువులను మేతకు అనుమతించే విషయాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ భేటీ ద్వారా సమస్య పరిష్కారానికి అవకాశం దొరికింది. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం ద్వారా కాస్త ముందువెనుకగా పరిష్కారం లభిస్తుంది'' అని చెప్పారు. అంతర్గత స్థిరత్వం, ఆర్థిక పురోగతి, కీలక మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించడం వంటివన్నీ ఒక దేశ భద్రతకు అవసరమని, ఇవన్నీ రక్షణతో ముడిపడిన అంశాలని తెలిపారు.

ఆధిపత్యాన్ని కాదు.. ప్రభావాన్ని పెంచుకుంటున్నాం

- భారతదేశ వైఖరిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

వాషింగ్టన్: ఆధిపత్యాన్ని ప్రదర్శించడం భారతదేశ వైఖరి కాదని.. ప్రపంచ యవనికపై తన ప్రభావాన్ని పెంచుకోవడమే ప్రధాన లక్ష్యమని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమెరికా, చైనా సహా ఏ దేశమూ ఇప్పుడు భారత్‌ను నిర్లక్ష్యం చేయలేదని అభిప్రాయపడ్డారు. ప్రపంచ బ్యాంకు, బ్రిటన్ ఉడ్స్, ఐఎంఎఫ్ సంస్థలతో వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు ఆమె మంగళవారం అమెరికా వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం వాషింగ్టన్‌లో జరిగిన ఓ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. 'ప్రపంచంలో ప్రతి ఆరుగురిలో ఒకరు భారతీయులే. మా దేశ ఆర్థిక ప్రగతిని ఎవరూ నిర్లక్ష్యం చేయలేరు' అని ఆమె పేర్కొన్నారు.



దిల్లీలో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జమ్మూ-కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

ప్రధాని మోదీతో సీఎం ఒమర్ భేటీ

దిల్లీ: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి దిల్లీలో పర్యటిస్తోన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గురువారం ప్రధాని మోదీతో 30 నిమిషాల పాటు భేటీ అయ్యారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం చేసిన తీర్మానం ప్రతిని ఆయనకు అందజేశారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు సహా పలు సమస్యలపై మోదీతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రధానికి సంప్రదాయ కశ్మీరీ శాలువాను బహూకరించారు. ఒమర్-మోదీ భేటీకి సంబంధించిన ఫొటోలను ప్రధానమంత్రి కార్యాలయం ట్విటర్‌లో పోస్టు చేసింది. ప్రధానిని కలుసుకోవడానికి ముందు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఒమర్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్‌లో రహదారి అనుసంధాన ప్రాజెక్టుల గురించి సీఎం ఒమర్ గడ్కరీకి వివరించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. బుధవారం ఒమర్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో 30నిమిషాల పాటు సమావేశమయ్యారు.

మూడు 'సేన'ల మాహిమ్ ఎవరిదో?

- బరిలో ఎంఎన్‌ఎస్; ఉద్ధవ్, శిందే వర్గాల అభ్యర్థులు
- తొలిసారి పోటీలో రాజ్‌ఠాక్రే తనయుడు అమిత్

ముంబయి: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల వేళ మాహిమ్ శాసనసభ నియోజకవర్గం ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక్కడ శివసేన(యూబీటీ), శివసేన (శిందే వర్గం), మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్‌ఎస్) పోటీ చేస్తుండటమే దీనికి కారణం. ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు రాజ్‌ఠాక్రే తనయుడు అమిత్ ఠాక్రే తొలిసారి మాహిమ్ బరిలోకి దిగారు. శివసేన నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సదా సర్వాంకర్, ఉద్ధవ్ వర్గం నుంచి మహేశ్ సావంత్ పోటీలో ఉన్నారు. సెంట్రల్ ముంబయిలో ఉన్న ఈ ప్రతిష్ఠాత్మకమైన నియోజకవర్గాన్ని గెలుచుకోవడానికి మూడు పార్టీలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అవిభక్త శివసేన 1966లో ఏర్పడగా, శివసేన నుంచి విడిపోయి రాజ్ ఠాక్రే ఎంఎన్‌ఎస్‌ను 2006లో ఏర్పాటు చేశారు.



ముంబయిలోని శివాజీ పార్కులో బాలాసాహెబ్‌కు నివాళులర్పిస్తున్న మహేశ్ సావంత్

ఆ రెండు పార్టీల ప్రధాన కార్యాలయాలు ఇక్కడే

సెంట్రల్ ముంబయిలో అగ్రవర్ణ ఓటర్లు ఎక్కువ ఉండే నియోజకవర్గం మాహిమ్. మైనారిటీల ఓట్లు స్వల్పంగానే ఉన్నాయి. శివసేన, ఎంఎన్‌ఎస్ ప్రధాన కార్యాలయాలు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఇక్కడే రెండు పార్టీలు దసరా ర్యాలీలు, పార్టీ వార్షికోత్సవాలను జరుపుకొంటాయి. 2022 జూన్‌లో శివసేనలో చీలిక ఏర్పడింది. ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలో ఎమ్మెల్యేలు ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసి పార్టీలో చీలిక తెచ్చారు. ఈ క్రమంలో భాజపాతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అజిత్ పవార్ నేతృత్వంలో ఎన్సీపీ కూడా ప్రభుత్వంలో భాగమైంది.

అనురాధ ముందు సవాళ్లు!

- వైకాపా పాలనలో గాడితప్పిన ఏపీపీఎస్సీ
- చక్కదిద్దడం, నియామకాల్లో వేగం పెంచడం అవసరం



ఏపీపీఎస్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ఛైర్‌పర్సన్ అనురాధ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నూతన ఛైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారి అనురాధ గురువారం విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వైకాపా పాలనలో కమిషన్ కార్యకలాపాలు గాడితప్పాయి. ప్రస్తుత కమిషన్‌లో సభ్యులుగా వైకాపా తరఫున పనిచేసిన వారు, నేతల అనుయాయులు, మాజీ సీఎం జగన్ సమీప బంధువులు ఉన్నారు. దీంతో పారదర్శకత లోపించింది. ఈ సమస్యలను అధిగమించి అభ్యర్థులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత నూతన ఛైర్‌పర్సన్‌పై ఉంది. 'నిర్దిష్ట ప్రణాళికకు అనుగుణంగా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ జరిగేలా చర్యలు తీసుకోవాలి. నోటిఫికేషన్‌ల వారీగా జరిగే రాత, మౌఖిక పరీక్షల మార్కులు తెలియజేయాలి' అని అభ్యర్థులు విజ్ఞప్తిచేస్తున్నారు.

★ వైకాపా పాలనలో 2,210 పోస్టుల భర్తీ కోసం 35 నోటిఫికేషన్‌లు మాత్రమే వెలువడ్డాయి. ఇందులో సగం వరకు అంతకుముందు ఉన్న తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరైన పోస్టులు ఉన్నాయి. తొలుత గ్రూపు-1 నియామకాలకు మౌఖిక పరీక్షలు (ఇంటర్వ్యూలు) ఉండవని ప్రకటించిన వైకాపా ప్రభుత్వం మళ్లీ పాత విధానాన్ని అమలుచేసింది. గ్రూపు-1, గ్రూపు-2, ఇతర పరీక్షల సిలబస్‌లలో మార్పులు, చేర్పులు, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి వంటి కీలక విషయాల్లో కమిషన్ ఏకపక్షంగా వ్యవహరించి, అభ్యర్థులను ముప్పతిప్పలుపెట్టింది.

★ గ్రూపు-1 (2018) నోటిఫికేషన్ వివాదాస్పదమైంది. వైకాపా ప్రభుత్వం ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న దానికి భిన్నంగా డిజిటల్ విధానంలో జవాబుపత్రాలు దిద్దించింది. అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. మంగళగిరిలోని 'హాయ్‌ల్యాండ్'లో జవాబుపత్రాల మూల్యాంకన విషయంకూడా వివాదాస్పదమైంది. ఛైర్మన్‌గా మాజీ డీజీపీ గౌతంసవాంగ్ ఉన్నప్పుడు..ఫలితాలు వెల్లడించారు. మూల్యాంకనం, ఎంపికలపై వైకాపా ప్రభుత్వాన్ని ఒక దశలో హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది.

★ గ్రూపు-1 ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అభ్యర్థులకు ఎన్ని మార్కులు వచ్చాయో ఏపీపీఎస్సీ ప్రకటించడంలేదు. రాత పరీక్షల తేదీల ఖరారులోనూ గత కమిషన్ నిర్ణయాలు గందరగోళాన్ని సృష్టించాయి.

నేటి నుంచి రాష్ట్రంలో పశుగణన

- 1.50 కోట్ల కుటుంబాల నుంచి వివరాల సేకరణ
- ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు



పశుగణనపై టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ దామోదర్ నాయుడు తదితరులు

ఈనాడు, అమరావతి: పశుగణన కార్యక్రమం రాష్ట్రంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా అక్టోబరు 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుంబాలకు చెందిన పశువుల వివరాలను ఇందులో నమోదు చేయనున్నారు. వ్యవసాయ పరికరాల వివరాలనూ సేకరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయవనరుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఇది ఉపయోగపడుతుందని పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ దామోదరనాయుడు పేర్కొన్నారు. జిల్లాల పశుసంవర్ధక అధికారులతో గురువారం వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు భాగస్వామ్యంతో కేంద్రం రూపొందించిన యాప్ ఆధారంగా పశుగణన నిర్వహిస్తారని వివరించారు.

ప్రధానాంశాలు..

- గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్లు, పక్షులు సహా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారం సేకరిస్తారు.
- 17,244 గ్రామాలు, పట్టణాల్లోని 3,929 వార్డుల్లో గృహ, గృహేతర వ్యక్తుల నుంచి వివరాలు తీసుకుంటారు
- 5,390 మంది సిబ్బంది, 1,237 మంది పర్యవేక్షకులు, 45 మంది స్క్రూటినీ అధికారులు, ఇతర సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారు. వీరికి ట్రావెలింగ్ కిట్లు, 60వేల వాల్‌పోస్టర్లు, 1.50కోట్ల గృహస్టిక్కర్లు, 8వేల ఐడీ కార్డులు అందించారు.
- పశుగణన పూర్తయిన ఇంటి తలుపుపై స్టిక్కర్ వేస్తారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్

రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రైవేటు బస్సుల యజమానులు తగిన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఆయన గురువారం విజయవాడలో ఏపీ, తెలంగాణ ప్రైవేటు ట్రావెల్స్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, వైద్య, రవాణా శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పన్నుల తగ్గింపు విషయంపై ప్రస్తుత పరిస్థితిని సీఎంకు వివరిస్తానని చెప్పారు.

అమరావతికి రూ.28 వేల కోట్లు

నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణం, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.28,250 కోట్ల నిధులు సాధించారని తెదేపా అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. జగన్ పాలనలో అమరావతి పూర్తిగా నిర్వీర్యమైందని గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. అమరావతికి కొత్త రైల్వే లైను మంజూరుతో పాటు ప్రతిపాదిత జాతీయ రహదారులతో రాజధాని అభివృద్ధి పథంలో దూసుకుపోనుందని పేర్కొన్నారు.

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బెయిలు మంజూరు

ఈనాడు, హైదరాబాద్: అత్యాచారం కేసులో అరెస్టయిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు గురువారం తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. రూ.20 వేల వ్యక్తిగత బాండ్‌తోపాటు అంతే మొత్తానికి మరో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. జానీ మాస్టర్ గానీ, అతని కుటుంబ సభ్యులు గానీ బాధితురాలి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో జోక్యం చేసుకోరాదని స్పష్టం చేసింది. సాక్షులను ప్రభావితం చేయడం గానీ, సాక్ష్యాలను తారుమారు చేయడం గానీ చేయరాదని, విచారణకు సహకరించాలని ఆదేశించింది. జానీ మాస్టర్‌పై అతని సహాయకురాలి ఫిర్యాదు మేరకు నమోదైన అత్యాచారం కేసులో సెప్టెంబరు 20న నార్సింగ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. కింది కోర్టు బెయిలు నిరాకరించడంతో జానీ మాస్టర్ హైకోర్టులో బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. ఇరు పక్షాల వాదనలు, రికార్డులు పరిశీలించిన అనంతరం నిందితుడికి షరతులతో కూడిన బెయిలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొంటూ పిటిషన్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో.. 125 బహుళ ప్రయోజన కేంద్రాలు

- నిర్మాణానికి రూ.75 కోట్ల విడుదల

ఈనాడు, అమరావతి: అడవుల్లో ఉండే ఆ గ్రామాలు కనీస సౌకర్యాలకు నోచుకోవు. అక్కడి పిల్లలకు పాఠశాల భవనాలు ఉండవు. అంగన్‌వాడీ కేంద్రానికి, వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా గదులుండవు. పూరి పాకల్లోనో.. చెట్ల నీడలోనో ఆయా సేవలు పొందాల్సిన దుస్థితి. దశాబ్దాలుగా ఆదివాసీ (పీవీటీజీ) గిరిజనులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. వారు నివసించే గూడేల్లో ప్రత్యేక భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వైద్య ఉప కేంద్రం ఒకేచోట నిర్వహించేలా మల్టీపర్పస్ సెంటర్ల (బహుళ ప్రయోజన కేంద్రాలు) నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పీఎం జన్‌మన్ పథకం కింద రాష్ట్రంలో ఆదివాసీ గిరిజనులు నివసించే ప్రాంతాలకు 125 కేంద్రాలను మంజూరు చేసింది. దీనికోసం కేంద్రం ఇప్పటికే రాష్ట్రానికి రూ.75 కోట్లు విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని నిర్దేశించింది. వీటిలో రెండు నెలల క్రితం 72 కేంద్రాల నిర్మాణానికి రూ.43.20 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తిచేశారు. త్వరలో పనులు మొదలుపెట్టనున్నారు. తాజాగా గురువారం మిగతా 53 కేంద్రాల నిర్మాణానికి రూ.31.80 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతిలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో ఈ కేంద్రాలు మంజూరయ్యాయి.

కొల్లేరు ఆక్రమణలు తొలగించనందుకు ఏపీ సీఎస్‌కు నోటీసులు

ఈనాడు, దిల్లీ: కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలోని ఆక్రమణల తొలగింపులో విఫలమైనందున ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్ఎన్ఎల్ మాజీ సబ్‌డివిజనల్ ఇంజినీరు కె.మృత్యుంజయరావు దాఖలు చేసిన కేసులో సుప్రీం కోర్టు గురువారం నోటీసులు జారీచేసింది. కొల్లేరులో ఆక్రమణలను అరికట్టడానికి కేంద్ర సాధికార సంస్థ 2006లో ఇచ్చిన నివేదికలోని 54వ పేరాను అమలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ చర్యలు తీసుకోలేదని పిటిషనర్ సుప్రీం కోర్టుకు తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఏపీ సీఎస్‌కు నోటీసులు జారీ చేస్తూ నాలుగు వారాల్లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

EENADU Vol: 51, Iss: 75 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఒకే రోజు 80 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: ఒకవైపు కేంద్రం తీవ్ర హెచ్చరికలు చేస్తున్నప్పటికీ.. పదుల సంఖ్యలో విమానాలకు బాంబు బెదిరింపులు రావడం ఆందోళన రేకెత్తిస్తోంది. గురువారం ఒక్క రోజే 80కిపైగా విమానాలకు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎయిరిండియా, విస్తారా, ఇండిగో సంస్థలకు చెందిన 20 చొప్పున విమానాలు ఈ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. అలయన్స్ ఎయిర్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్‌లకూ ఈ పరిస్థితి ఎదురైందని వివరించారు. ఆకాశ ఎయిర్‌కు చెందిన 13 విమానాలకు బెదిరింపులు వచ్చాయని, అత్యవసర ప్రతిస్పందన బృందాలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయని సంస్థ అధికార ప్రతినిధి వెల్లడించారు. గడిచిన 11 రోజుల్లో దాదాపు 250కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రావడం గమనార్హం.

బెదిరింపులకు పాల్పడేవారి డేటా ఇవ్వండి: కేంద్రం

బాంబు బెదిరింపులకు పాల్పడే వారిని గుర్తించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ మేరకు ఆ సందేశాలకు సంబంధించిన డేటాను ఇవ్వాలని సామాజిక మాధ్యమ వేదికలైన 'మెటా', 'ఎక్స్'లను కోరింది.

ట్రంప్ అసమర్థుడు

- అధ్యక్ష పదవికి తగరు • హారిస్ ఆరోపణ

వాషింగ్టన్: ట్రంప్ అసమర్థుడని, అధ్యక్ష పదవికి తగరని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న భారత సంతతికి చెందిన కమలా హారిస్ స్పష్టం చేశారు. దేశాన్ని నడిపించే సమర్థత ఆయనకు లేదని పేర్కొన్నారు. బుధవారం వాషింగ్టన్‌లోని తన అధికారిక నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆయనో నియంత అంటూ ట్రంప్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'తాను అధికారంలో ఉన్నప్పుడు హిట్లర్ లాంటి సైనిక జనరల్స్ కావాలని ట్రంప్ అన్నారని మాజీ సైన్యాధిపతి జాన్ కెల్లీ చెప్పారు. దీనిని బట్టి మాజీ అధ్యక్షుడు ఎలాంటి నియంతో అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగానికి కట్టుబడి ఉండే సైన్యం ఆయనకు నచ్చదు. అది తనకే విధేయంగా ఉండాలని ఆయన కోరుకుంటారు. అమెరికా రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని ఆయన చేసిన ప్రతిజ్ఞను గతంలో ఉల్లంఘించారు. గత వారమే తన సహచర అమెరికన్లను అంతర్గత శత్రువులుగా పేర్కొన్నారు' అని హారిస్ ధ్వజమెత్తారు.

లాస్ ఏంజెలిస్ టైమ్స్ ఎడిటర్ రాజీనామా

లాస్ ఏంజెలిస్: కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఎడిటోరియల్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని పత్రిక యజమాని నిలిపేసినందుకు నిరసనగా లాస్ ఏంజెలిస్ టైమ్స్ ఎడిటోరియల్స్ ఎడిటర్ మారియల్ గర్జా రాజీనామా చేశారు. దేశం అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు పత్రిక మౌనంగా ఉన్నందుకే రాజీనామా చేశానని ఆమె బుధవారం వెల్లడించారు. తాను మౌనంగా ఉండలేనని తేల్చి చెప్పారు.

ట్రంప్ నన్ను అసభ్యకరంగా తాకారు // • మాజీ మోడల్ ఆరోపణ




వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసులో ఉన్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మాజీ మోడల్ ఒకరు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓ సందర్భంలో ట్రంప్ తనను అసభ్యకరంగా తాకినట్లు ఆమె వెల్లడించారని 'ది గార్డియన్' పత్రిక కథనం పేర్కొంది. స్టాసీ విలియమ్స్ అమెరికా మాజీ మోడల్. 1992లో ట్రంప్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రముఖ ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో డేటింగ్‌లో ఉన్న ఆమెను ఓ పార్టీలో ట్రంప్‌నకు పరిచయం చేశారు. 'కొన్ని రోజుల తర్వాత ఓ రోజు జెఫ్రీ న్యూయార్క్‌లోని ట్రంప్ కార్యాలయానికి నన్ను తీసుకెళ్లారు. నన్ను చూసి జెఫ్రీ, ట్రంప్ నవ్వుకున్నారు. అప్పుడే ట్రంప్ నన్ను తన వైపునకు లాక్కొని అసభ్యంగా తాకారు' అని కమలా హారిస్ ప్రచార బృందానికి మాజీ మోడల్ ఫోన్ ద్వారా తెలియజేసినట్లు కథనం పేర్కొంది. జెఫ్రీ, ట్రంప్ మంచి స్నేహితులని, వారిద్దరూ ఎంతో సమయం గడిపేవారని స్టాసీ విలియమ్స్ తెలిపారు. అతడు 20 మందికి పైగా మహిళలను లైంగికంగా వేధించారని ఆరోపించారు. దీనిపై ట్రంప్ ప్రచార బృందం స్పందిస్తూ.. ఇదంతా కట్టుకథంటూ కొట్టి పారేసింది.

29న హారిస్ ప్రచార ముగింపు సభ..

అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో హారిస్ తన చివరి ఎన్నికల ప్రచార సభను ఈనెల 29న నిర్వహించనున్నట్లు ప్రచార అధికారి పేర్కొన్నారు. 2021 జనవరి 6న జరిగిన అల్లర్లకు ముందు డొనాల్డ్ ట్రంప్ ర్యాలీ జరిపిన చోటే ఆమె ప్రసంగిస్తారని తెలిపారు.

ఆధార్ కార్డు.. వయసును నిర్ధారించే ప్రామాణిక పత్రం కాదు: సుప్రీం



దిల్లీ: ఒక వ్యక్తి వయసు నిర్ధారణకు పాఠశాల ధ్రువీకరణ పత్రాలను ప్రామాణికంగా తీసుకోవాలని, ఆధార్ కార్డు ఆధారంగా నిర్ణయానికి రాకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆధార్ కార్డును ప్రామాణిక పత్రంగా భావిస్తూ పంజాబ్, హరియాణా హైకోర్టు వెలువరించిన తీర్పును గురువారం కొట్టివేస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఈ విషయాన్ని వెల్లడించింది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి తరఫు కుటుంబానికి నష్టపరిహారాన్ని నిర్ణయించే క్రమంలో ఆధార్ కార్డులోని తేదీని హైకోర్టు ప్రామాణికంగా తీసుకుంది. దీనివల్ల నష్టపరిహారం మొత్తం తగ్గిపోవడంతో బాధిత కుటుంబం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐఏఐ) జారీ చేసిన సర్క్యులర్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార శాఖ ఇచ్చిన ఆఫీస్ మెమో కూడా ఆధార్ కార్డును వయసు నిర్ధారణ పత్రంగా భావించరాదని పేర్కొన్న విషయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. మోటారు వాహన చట్టం కూడా పాఠశాల ధ్రువీకరణ పత్రాలనే ఆయా వ్యక్తుల వయసు నిర్ధారణకు సాధికారికంగా గుర్తిస్తోందని పేర్కొంది.

వాయు కాలుష్యం కారణంగానే ఉదయపు నడక విరమించుకున్నా: సీజేఐ

దిల్లీ: 'నేను సాధారణంగా ప్రతి రోజు తెల్లవారుఝామున 4 గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్తుంటా. అయితే, గురువారం (అక్టోబరు 24) నుంచి నడకకు వెళ్లరాదని నిర్ణయించుకున్నా. దిల్లీలో వాయుకాలుష్యం స్థాయి తీవ్రం కావడమే ఇందుకు కారణం. బాహ్యప్రదేశాల్లో వాకింగ్ చేయడం వల్ల కాలుష్య కారణంగా శ్వాససంబంధమైన సమస్యలు వస్తాయని, దీనికంటే ఇంట్లో ఉండటమే మంచిదని వైద్యుడు సూచించారు. అందువల్లే ఉదయపు నడకను విరమించుకుంటున్నా''నని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆవరణలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.







ఝార్ఖండ్‌లోని బర్హేట్, గాండేయ్ నుంచి జేఎంఎం అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆయన సతీమణి కల్పన ✦ మహారాష్ట్రలోని వర్లీ నుంచి పోటీచేసేందుకు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న శివసేన (యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రే. చిత్రంలో ఉద్ధవ్, ఆయన సతీమణి రశ్మీ.

అజిత్ పవార్‌పై తమ్ముడి కుమారుడి పోటీ

- ఎన్సీపీ (ఎస్పీ) తొలి జాబితా విడుదల

పుణె: పవార్‌లకు కంచుకోట అయిన బారామతిలో ఎన్సీపీల మధ్యే ప్రధాన పోటీ జరగనుంది. అందునా మరోసారి కుటుంబ పోరుకు ఈ నియోజకవర్గం వేదికైంది. లోక్‌సభ ఎన్నికల్లో బారామతి నుంచి శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే, ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ తలపడిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో సుప్రియా సూలే విజయం సాధించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ నుంచి అజిత్ పవార్ పోటీ చేస్తున్నారు. ఆయనపై శరద్ పవార్ పార్టీ నుంచి అజిత్ పవార్ సోదరుడి కుమారుడు యుగేంద్ర పవార్ (32) పోటీకి దిగారు. యుగేంద్ర అజిత్ పవార్ తమ్ముడైన శ్రీనివాస్ పవార్ కుమారుడు. యుగేంద్రతోపాటు 45 మందితో తొలి జాబితాను ఎన్సీపీ (ఎస్పీ) గురువారం విడుదల చేసింది.

✦ మహారాష్ట్రలో పోటీ చేసే 48 మంది అభ్యర్థులతో తొలి జాబితాను గురువారం కాంగ్రెస్ విడుదల చేసింది.

వారసత్వ రాజకీయాల ప్రతీక

- వయనాడ్‌లో ప్రియాంక నామినేషన్‌పై భాజపా విమర్శ

దిల్లీ: కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ నామినేషన్ దాఖలు చేయడంపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఇది వారసత్వ రాజకీయాల ప్రతీకగా విమర్శించింది. ప్రియాంక సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో తేడాలున్నాయని గురువారం దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. దళితుడైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను నామినేషన్ దాఖలు చేసే సమయంలో కలెక్టర్ కార్యాలయంలోకి రానివ్వకుండా గాంధీ కుటుంబం అవమానించిందని దుయ్యబట్టారు. మెరిట్‌పై (యోగ్యత) గాంధీ కుటుంబ అవినీతి, వారసత్వ రాజకీయాల గెలుపిదని విమర్శించారు. మరోవైపు భాజపా అభ్యర్థి నవ్య హరిదాస్, ఎల్‌డీఎఫ్ అభ్యర్థి సత్యన్ మొకేరీ గురువారం కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. వచ్చే నెల 13న వయనాడ్‌లో ఎన్నికలు జరగనున్నాయి.

భాజపా క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్

వయనాడ్‌లో ఖర్గేకు అవమానం జరిగిందన్న భాజపా ఆరోపణలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. అబద్ధాలను ప్రచారం చేస్తున్న ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండు చేసింది. రిటర్నింగ్ అధికారి గదిలోకి ఖర్గేను రానివ్వలేదని భాజపా ఆరోపించడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఖండించారు. నామినేషన్ సమయానికి ఖర్గే కార్యాలయానికి చేరుకోలేకపోయారని తెలిపారు. ముందుగా చేరుకున్న ప్రియాంకా గాంధీ రిటర్నింగ్ అధికారి గదిలోకి వెళ్లారని, ఆ తర్వాత చేరుకున్న సోనియా, రాహుల్‌లూ వేచి ఉండాల్సి వచ్చిందని వెల్లడించారు.

యూపీ ఉప ఎన్నికల్లో పోటీ చేయని కాంగ్రెస్

- పంజాబ్‌లో బరిలో నిలవని శిరోమణి

దిల్లీ, చండీగఢ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని 8 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో పోటీ చేయట్లేదని కాంగ్రెస్ ప్రకటించింది. ఇండియా కూటమి అభ్యర్థులకే తమ పూర్తి మద్దతుంటుందని తెలిపింది. యూపీలో రాజకీయ ఉద్రిక్తతల తీరు, ఇండియా కూటమి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతానికి కాకుండా రాజ్యాంగాన్ని రక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మరోవైపు వచ్చే నెల 13న పంజాబ్‌లో జరగనున్న అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేయకూడదని శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) తీర్మానించింది. మతపరమైన దుష్ప్రవర్తనకు పాల్పడ్డారన్న అంశంలో పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు అకాల్‌తఖ్త్ నుంచి ఉపశమనం లభించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఏడీ తెలిపింది.

రాకెట్‌లో అంతరిక్షంలోకి పర్యాటకులు

- టికెట్ ధర రూ.1.77 కోట్లు

ఇంటర్నెట్ డెస్క్: చైనాకు చెందిన డీప్ బ్లూ ఏరోస్పేస్ అనే అంకుర కంపెనీ 2027లో అంతరిక్షంలోకి పర్యాటకులను తీసుకెళ్లనుంది. ఇందుకోసం టికెట్ల విక్రయాన్ని ప్రారంభించింది. ప్రస్తుతానికి రాకెట్‌లో రెండు సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఒక్కో టికెట్ ధరను రూ.1.77 కోట్లుగా నిర్ణయించింది. భూ వాతావరణం ఆవలికి పర్యాటకులను తాము తీసుకెళ్లనున్నట్లు వెల్లడించింది. వచ్చే నెలలో మరిన్ని టికెట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది.

బాధితులు కోరితే పరిశీలిస్తాం

- కూల్చివేతలపై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: తమ అనుమతి లేకుండా దేశవ్యాప్తంగా ఎలాంటి కూల్చివేతలకు రాష్ట్రప్రభుత్వాలు పాల్పడకూడదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఉల్లంఘనకు గురవుతున్నాయంటూ ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. బాధితులు నేరుగా తమను ఆశ్రయిస్తే వారి ఫిర్యాదులను పరిశీలిస్తామని జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం పేర్కొంది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ వుమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) తన పిటిషన్‌లో ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు కోర్టు ఉత్తర్వులను ధిక్కరించాయని, న్యాయస్థానం అనుమతులు తీసుకోకుండా కాన్పుర్, జైపుర్, హరిద్వార్‌లలో కూల్చివేతలకు పాల్పడ్డాయని పేర్కొంది.

గడియారం గుర్తు వాడుకోండి.. కానీ!

- న్యాయపరిధిలో ఉందని చెప్పండి
- ఎన్సీపీ అజిత్ పవార్ వర్గానికి సుప్రీం ఆదేశం

దిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అజిత్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మహారాష్ట్ర ఎన్నికల్లో 'గడియారం' గుర్తును ఎన్సీపీ వినియోగించుకోవచ్చని, అయితే చిహ్నం అంశం న్యాయపరిధిలో ఉందన్న విషయాన్ని గోడపత్రాల్లో, ప్రకటనల్లో స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించింది. గతంలో తాము ఈ విషయంపై ఇచ్చిన కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించబోమన్న హామీ పత్రాన్ని కూడా సమర్పించాలని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి.. చిహ్నం విషయంలో ప్రజల్లో ఎన్సీపీ అయోమయం సృష్టిస్తోందని ఎన్సీపీ (ఎస్పీ) వర్గం అధినేత శరద్ పవార్ వేసిన పిటిషన్‌పై ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ 'గడియారం' గుర్తును వినియోగించకుండా అజిత్ పవార్ వర్గాన్ని నిరోధించాలని శరద్ పవార్ వర్గం వేసిన మరో పిటిషన్‌పైనా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

యూపీ ప్రభుత్వాసుపత్రిలో ఐదేళ్ల బాలిక మృతి

- వైద్యం అందించకుండా వైద్యులు క్రికెట్ ఆడారని ఆరోపణ

బుదౌన్: ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఐదేళ్ల బాలిక మృతి చెందింది. వైద్య సేవలు అందకపోవడంతోనే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తమ ఐదేళ్ల కుమార్తె సోఫియాను తండ్రి నజీమ్ బుధవారం మధ్యాహ్నం ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో చిన్న పిల్లలకు వైద్యం చేసే డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో బయటకు వచ్చేశారు. ఆ సమయంలో వైద్యులు ఆసుపత్రి బయట క్రికెట్ ఆడుతున్నారని నజీమ్ పేర్కొన్నారు. తమ కుమార్తెకు వైద్యం కోసం వేడుకున్నా సహాయం అందించలేదని, కొద్దిసేపటి తర్వాత ఆమె మృతి చెందిందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు ముగ్గురు వైద్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ తెలిపారు.

గాజాపై ఆగని దాడులు

- 17 మంది పాలస్తీనియన్ల మృతి
- 42 మందికి గాయాలు
- త్వరలో కాల్పుల విరమణ చర్చలు: బ్లింకెన్



ఇజ్రాయెల్-హమాస్ పోరు కారణంగా గాజా సిటీలో ధ్వంసమైన భవనాలు, వాటి మధ్యనున్న రహదారిలో గురువారం రాకపోకలు సాగిస్తున్న పౌరులు

దేర్ అల్-బలాహ్: హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ మృతి చెందినా గాజాపై ఇజ్రాయెల్ తన దాడులను ఆపడం లేదు. గురువారం సెంట్రల్ గాజాలోని నుసీరత్ శిబిరంపై ఇజ్రాయెల్ దళాలు (ఐడీఎఫ్) బాంబుల వర్షం కురిపించాయి. ఇందులో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. 42 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో 13 మంది చిన్నారులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. ఐడీఎఫ్ మాత్రం తాము హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా దాడి చేశామని పేర్కొంది. కాల్పుల విరమణ చర్చలు త్వరలో ప్రారంభమవుతాయని పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఖతార్‌లో ఉన్న అమెరికా విదేశాంగమంత్రి బ్లింకెన్ తెలిపారు. ''హమాస్ చర్చలకు సిద్ధంగా ఉందా లేదా అన్న విషయాన్ని మేం ధ్రువీకరించుకోవాల్సి ఉంది'' అని పేర్కొన్నారు. గాజా, వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనియన్లకు 135 మిలియన్ డాలర్ల సాయాన్ని ఆయన ప్రకటించారు.

✦ గాజా యుద్ధ వార్తలందిస్తున్న ఆరుగురు అల్ జజీరా సంస్థ పాత్రికేయులను ఉగ్రవాదులుగా ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ప్రకటించింది. తాము గాజాలో కనుగొన్న పత్రాలు, నిఘావర్గాల సమాచారంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు పేర్కొంది. ఇందులో ఇద్దరికి హమాస్‌తో, నలుగురికి పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్‌తో సంబంధం ఉందని తెలిపింది. ఈ ఆరోపణలపై అల్ జజీరా మండిపడింది. వాస్తవాలను తెలుపుతున్న పాత్రికేయుల నోళ్ల మూయించడానికి ఇజ్రాయెల్ తప్పుడు ఆరోపణలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేసింది.

✦ ఇజ్రాయెలీ పర్యాటకులపై దాడి చేసేందుకు కుట్రపన్నిన ముగ్గురు వ్యక్తులను గురువారం అంపారా జిల్లాలో శ్రీలంక పోలీసులు అరెస్టు చేశారు. భారత నిఘా వర్గాలందించిన సమాచారంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనల తనిఖీకి ఏఐ: గడ్కరీ

దిల్లీ: ట్రాఫిక్ ఉల్లంఘనల తనిఖీకి, జరిమానాలు కచ్చితంగా విధించడానికి కృత్రిమ మేధ(ఏఐ)తో పాటు ఇతర వినూత్న పద్ధతులు అనుసరించాలని ప్రభుత్వం భావిస్తోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, టోల్ వసూళ్ల విధానంలో మరింత పారదర్శకత తెస్తామని చెప్పారు. ఇందుకోసం శాటిలైట్ టోల్ వ్యవస్థల వినియోగాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. దేశ జీడీపీలో 3 శాతం ఆర్థిక నష్టం.. రహదారి ప్రమాదాల కారణంగానే జరుగుతుందని, ఈ భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఎన్ఐవోఎస్ ఛైర్‌పర్సన్ తొలగింపు

దిల్లీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐవోఎస్) ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ సరోజ్‌శర్మను ఆ పదవి నుంచి కేంద్ర విద్యాశాఖ తొలగించింది. ఆమె తన డ్రైవర్ ఆత్మహత్య కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. డ్రైవర్‌ను ఆమె వేధింపులకు గురిచేయడమే కాకుండా, కుల వివక్షను కూడా చూపించారని పోలీసులు లేఖ రాయడంతో విద్యాశాఖ.. ఆమెను తప్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

పాస్‌పోర్ట్ బదులు బయోమెట్రిక్స్

- సింగపూర్ అధికారుల వెల్లడి

సింగపూర్: తమ దేశంలోని చాంగి విమానాశ్రయంలో మొత్తం నాలుగు టెర్మినళ్లలో పాస్‌పోర్ట్ బదులు ముఖ గుర్తింపు, బయోమెట్రిక్ పరిజ్ఞానాలతో వేగంగా రాకపోకలను అనుమతించే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు సింగపూర్ అధికారులు గురువారం తెలిపారు. సింగపూర్ పౌరులు, శాశ్వత నివాస వసతి పొందినవారు, దీర్ఘకాలంగా సింగపూర్ పాస్‌పోర్ట్ ఉన్నవారికి సెప్టెంబరు 30 నుంచి బయోమెట్రిక్ క్లియరెన్స్‌ను అమలు చేస్తున్నామని వివరించారు. గతంలో పాస్‌పోర్ట్‌పై ముద్ర వేయడానికి 25 సెకన్లు పడితే కొత్త పద్ధతిలో 10 సెకన్లలోనే పని అయిపోతోంది.

ఫిలిప్పీన్స్‌లో ట్రామి తుపాను బీభత్సం

- ఇప్పటి వరకూ 23 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్‌పై మంగళవారం విరుచుకుపడిన ట్రామి తుపాను బీభత్సం సృష్టించింది. దీని ప్రభావంతో గురువారంనాటికి 23 మంది మరణించారు. ఆకస్మిక వరదలు, అగ్నిపర్వతం నుంచి వచ్చిపడిన బురద వరద తీవ్ర నష్టం కలిగించాయి. ఫిలిప్పీన్స్‌లో 24 అగ్ని పర్వతాలున్నాయి. రాజధాని మనీలాకు ఆగ్నేయ దిక్కులో ఉన్న బైకోల్ ప్రాంతంలో ట్రామి తుపాను 24 గంటల్లో రెండు నెలల వర్షపాతాన్ని తీసుకొచ్చింది. 20 లక్షలమందికి పైగా ప్రజలపై తీవ్ర ప్రభావం కనబరచింది. వారిలో 75,400 మంది గ్రామీణులు ఇళ్లూ వాకిళ్లు కోల్పోయి సురక్షిత ప్రాంతాలకు తరలారు. పలు ప్రాంతాల్లో మోటారు వాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. సైనికులకు తోడు 1,500 మంది పోలీసు అధికారులు సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

కేరళలో 104 కిలోల బంగారం జప్తు

త్రిస్సూర్: కేరళలో బంగారం వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన త్రిస్సూర్‌లో ఆ రాష్ట్ర జీఎస్టీ అధికారులు 104 కిలోల బంగారం జప్తు చేశారు. దీని విలువ రూ.75 కోట్లు ఉంటుందని వెల్లడించారు. బంగారానికి సంబంధించిన రికార్డులేవీ వ్యాపారుల వద్ద లేవని పేర్కొన్నారు. 'టొర్రే డెల్ ఓరో (టవర్ ఆఫ్ గోల్డ్)' ఆపరేషన్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 78 చోట్ల అధికారులు తనిఖీలు చేపట్టారు. నగల వ్యాపారులు గత ఆరు నెలలుగా జీఎస్టీ మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

కాలుష్య నిరోధక విధుల్లోకి దిల్లీ బస్సు మార్షల్స్

- ఎల్‌జీ వి.కె.సక్సేనా ఆదేశాలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో బస్సు మార్షల్స్ విధుల నుంచి గతేడాది తొలగింపునకు గురైన 10 వేల మంది పౌర భద్రత వాలంటీర్లను కాలుష్య నిరోధక విధుల్లోకి తీసుకోనున్నారు. వారు నాలుగు నెలలపాటు ఈ కొత్త విధుల్లో సేవలందించనున్నారు. దిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ (డీడీఎంఏ) ఛైర్మన్ అయిన దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఆదేశాల మేరకు వారి సేవలను వినియోగించుకోనున్నట్లు గురువారం అధికారులు వెల్లడించారు. నాలుగు నెలల అనంతరం వారిని ఇతర విధుల్లో కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని దిల్లీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఆతిశీని ఎల్‌జీ కోరినట్లు రాజ్ నివాస్ వర్గాలు తెలిపాయి. ఆర్థిక, రెవెన్యూ శాఖల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో వాలంటీర్లను బస్సు మార్షళ్ల విధుల నుంచి తప్పించారు. నవంబరు 1 నుంచి వాలంటీర్లను కాలుష్య నియంత్రణ విధుల్లోకి తీసుకొంటుండటం తమ విజయమేనని అధికార ఆప్, భాజపా ప్రకటించుకున్నాయి.

ఆసుపత్రిలో మరణిస్తే.. తప్పనిసరిగా కార్నియా సేకరణ!

- నొట్టో పరిశీలనలో కీలక సూచన

ఇండౌర్: ఎవరైనా ఆసుపత్రిలో మరణిస్తే.. కార్నియా దానానికి అనుమతి ఇచ్చినట్లే భావించి తప్పనిసరిగా దాన్ని మృతదేహం నుంచి సేకరించే అవకాశాలను తాము పరిశీలిస్తున్నట్లు 'జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (నొట్టో)' సంచాలకుడు డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ఇందుకోసం చట్టపరంగా ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలంటూ తమకు ఓ సూచన అందిందన్నారు. దాన్ని అమలు చేయాలంటే మానవ అవయవ, కణజాల మార్పిడి చట్టాన్ని సవరించాల్సి ఉంటుందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి కార్నియా వంటి కణజాలాలు, ఇతర అవయవాలను సేకరించేందుకు ప్రస్తుతం ఆ వ్యక్తి కుటుంబ సమ్మతి తప్పనిసరి అని గుర్తుచేశారు. మరణానికి ముందే ఎవరైనా.. తమ కార్నియాల దానానికి రాతపూర్వకంగా నిరాకరిస్తే మాత్రం వాటిని సేకరించకూడదన్నది తమకు తాజాగా అందిన సూచనలో భాగంగా ఉందని తెలిపారు. కార్నియా సంబంధిత వ్యాధుల కారణంగా మన దేశంలో అంధుల సంఖ్య పెరుగుతోందని గుర్తుచేశారు. ఏటా దాదాపు లక్ష కార్నియాలు ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అవసరమవుతున్నాయని తెలిపారు.

ప్రపంచ అత్యుత్తమ పాఠశాలల్లో మూడు మనవే

- ప్రకటించిన టీ4 ఎడ్యుకేషన్ సంస్థ

లండన్: మనదేశానికి చెందిన మూడు పాఠశాలలు 2024లో ప్రపంచంలోనే అయిదు అత్యుత్తమ పాఠశాలల జాబితాలోకి చేరాయి. అవి దిల్లీలోని రాయన్ ఇంటర్నేషనల్ స్కూల్, మధ్యప్రదేశ్, రత్లాంలోని సీఎం రైజ్ స్కూల్ వినోబా, తమిళనాడు, మదురైలోని కల్వి ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్. ఏక్సెంచర్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, లేమాన్ భాగస్వామ్యంతో లండన్ చెందిన టీ4 ఎడ్యుకేషన్ సంస్థ ఈ పోటీలను నిర్వహించింది. విజేతగా నిలిచిన, తుది జాబితాలో చేరిన పాఠశాలల యాజమాన్యాలను దుబాయ్‌లో నవంబరు 23-24 తేదీలలో జరిగే ప్రపంచ పాఠశాలల శిఖరాగ్ర సభకు ఆహ్వానించారు.

మీరు రష్యా వెళితే మేం చేతులు ముడుచుకొని కూర్చోం

- ఉ.కొరియాకు ద.కొరియా హెచ్చరిక

మాస్కో: ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు సాయపడేందుకు ఉత్తరకొరియా తన సైన్యాన్ని పంపితే తాము చేతులు ముడుచుకొని కూర్చోమని దక్షిణ కొరియా హెచ్చరించింది. మిత్రులు, ఇతర భాగస్వాములతో కలిసి ఏం చేయాలో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపింది. ఈ ఏడాది చివరిలోపు దాదాపు 10 వేల మంది సైనికులను రష్యాకు ఉత్తరకొరియా పంపే అవకాశాలు ఉన్నాయని దక్షిణ కొరియా గూఢచర్య సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో అమెరికా కూడా ఈ తాజా పరిణామంపై స్పందించింది. రష్యా బలహీనపడిందని, అందుకే ఉత్తరకొరియా సాయం తీసుకుంటోందని పేర్కొంది. ''ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా రోజూ భారీగా నష్టపోతోంది. కానీ ఆ దేశ అధ్యక్షుడు యుద్ధాన్ని కొనసాగించాలనే కోరుకుంటున్నాడు. నిజంగా మానవ వనరుల కోసం ఉత్తరకొరియాపై రష్యా ఆధారపడితే.. అది బలహీనత అవుతుంది. బలం కాదు. ప్రస్తుతానికైతే పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాం. ఈ ఉత్తరకొరియా సైనికులు ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకుంటే.. వారు చట్టబద్ధ సైనిక లక్ష్యాలు అవుతారు. ఉత్తర కొరియా సైనికులు యుద్ధక్షేత్రంలో అడుగుపెట్టారా..లేదా.. మాకు తెలియదు. అయితే ఇది జరిగే అవకాశం ఉంది'' అని వైట్‌హౌస్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి జాన్‌కిర్బీ వెల్లడించారు. మరోవైపు రష్యా పార్లమెంటులోని దిగువ సభ ఉత్తరకొరియాతో పరస్పర సైనిక సహకార ఒప్పందాన్ని ఆమోదించింది. త్వరలో ఎగువ సభ కూడా ఆమోదించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం రెండు దేశాల్లో ఏ ఒక్కదేశంపై సైనిక దాడి జరిగినా.. మరో దేశం వెంటనే సైనిక సాయం అందిస్తుంది.

వ్యర్థాల నుంచి సంపద సృష్టి

- కేంద్రానికి రూ.100 కోట్ల ఆదాయం

దిల్లీ: నెల రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక స్వచ్ఛత ప్రచారం కింద వ్యర్థాలను తొలగించడం ద్వారా కేంద్రానికి రూ.100 కోట్ల ఆదాయం లభించిందని అధికార వర్గాలు తెలిపాయి. దీంతోపాటు వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు 12 లక్షలకు పైగా ఫైళ్లను తొలగించాయని, తద్వారా 97.2 లక్షల చ.అడుగుల స్థలాన్ని ఖాళీ చేశాయని వెల్లడించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు కేంద్రం ఈ ఏడాది అక్టోబరు 2 నుంచి 31వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా 'స్వచ్ఛత' ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రారంభించిన రెండు వారాల తర్వాత ఈ ప్రచారం గణనీయంగా ఊపందుకుందని, కొన్ని సంస్కరణలు పౌరుల జీవన విధానాలను మెరుగుపరచడానికి దోహదపడ్డాయని పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం కార్యదర్శి వి.శ్రీనివాస్ వివరించారు. ఈ నెలలో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమం ఇప్పటివరకు 2.7 లక్షల కార్యాలయాల్లో అమలైందని, వ్యర్థాలను తొలగించడం ద్వారా 101.48 కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు.



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మహారాష్ట్రలోని పుణెలో అమ్మకాల కోసం భారీ ఎత్తున సిద్ధం చేస్తున్న లడ్డూలు

ఈనాడు సినిమా

వేట మొదలు


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు - రాజమౌళి కలయికలో రూపొందనున్న సినిమా పూర్వ నిర్మాణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి కాగా...లొకేషన్ల ఎంపికపై కసరత్తులు మొదలు పెట్టారు దర్శకుడు రాజమౌళి. జనవరిలో చిత్రీకరణని ప్రారంభించడమే లక్ష్యంగా సర్వం సన్నద్ధం చేస్తున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతోంది. ఈ సినిమా కోసం కృత్రిమ మేధ (ఏఐ) పైనా అవగాహన పెంచుకునేందుకు ప్రత్యేక తరగతులకి హాజరయ్యారు రాజమౌళి. విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్ద పీట వేస్తూ ఆయన సినిమాల్ని తెరకెక్కిస్తుంటారు. ఈ కథకి అడవుల నేపథ్యం కూడా ఉండటంతో కొన్ని సహజమైన లొకేషన్లలోనూ చిత్రీకరణ చేయనున్నట్టు తెలుస్తోంది. మహేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న 29వ చిత్రమిది.


కియారా అద్వాణీ

మీనాకుమారిగా కియారా?


అద్భుతమైన నటనతో పరిశ్రమలో మంచి గుర్తింపు, గౌరవాన్ని సొంతం చేసుకున్న దివంగత నటి మీనా కుమారి బయోపిక్‌లో కథానాయిక కియారా అద్వాణీ కనిపించనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. సిద్ధార్థ్ పి.మల్హోత్రా దర్శకత్వంలో మీనా కుమారి జీవితం ఆధారంగా 'కమల్ ఔర్ మీనా' అనే చిత్రం రూపొందుతున్నట్లు ఇటీవలే ప్రకటించింది చిత్రబృందం. ఇందులో కృతి సనన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె స్థానంలో కియారాను ఎంపిక చేసే పనిలో ఉన్నట్లు సమాచారం. మీనా ప్రేమకథలోని కొన్ని సంఘటనల ఆధారంగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో కియారా సైతం నటించడానికి ఉత్సాహంగా ఉన్నట్లు, త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కియారా జాబితాలో 'డాన్ 3', 'వార్ 2' చిత్రాలున్నాయి.

కలబడితే నీదే దునియా..


వరుణ్ తేజ్

"కూర్చుంటే ఏదీ రాదు.. నిలబడి చూస్తుంటే కాదు.. కలబడితే నీదే దునియా అంతా" అంటూ తను నమ్మిన జీవన రాగాన్ని వినిపిస్తున్నారు వరుణ్ తేజ్. ఆయన కథానాయకుడిగా కరుణ కుమార్ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలు. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్రం నుంచి "తస్సాదియ్యా" అనే రెట్రో గీతాన్ని విడుదల చేశారు. "పడిపోతే లేవడమెట్టా.. ఎవ్వడినీ అడగొద్దంటా.. జీవితమే నేర్పిస్తుంది అంతా" అంటూ ఈ పాటతో హీరో పాత్ర వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ పాటకు జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలు సమకూర్చగా.. భాస్కరభట్ల సాహిత్యమందించారు. మనో ఆలపించారు. 1960-80ల మధ్య కాలంలో సాగే కథ ఇది. దేశాన్ని కదిలించిన కొన్ని వాస్తవ సంఘటనల్ని ఆధారం చేసుకుని రూపొందించారు. ఇందులో వరుణ్ నాలుగు భిన్నమైన కోణాల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కూర్పు: కార్తీక శ్రీనివాస్, ఛాయాగ్రహణం: ఎ.కిశోర్ కుమార్.

వైజాగ్‌లో భారీ యాక్షన్


కల్యాణ్ రామ్

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సయీ మంజ్రేకర్ కథానాయిక. విజయశాంతి, సోహైల్ ఖాన్, శ్రీకాంత్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం వైజాగ్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకుంది. దాదాపు 15రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు విజయశాంతి, శ్రీకాంత్, సయీ తదితరులపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో కల్యాణ్‌రామ్ మునుపెన్నడూ చూడనంత శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమాకి సంగీతం: అజనీశ్ లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: రామ్ ప్రసాద్.

ఒక రోజు ముందుగానే 'పుష్ప 2' విడుదల

● యూఎస్‌లో డిసెంబరు 4 నుంచే షోలు


నవీన్ యెర్నేని, వై.రవిశంకర్

పుష్పరాజ్‌గా మరోసారి సినీ ప్రియుల్ని మురిపించేందుకు 'పుష్ప 2: ది రూల్'తో సిద్ధమవుతున్నారు అల్లు అర్జున్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సుకుమార్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఫహాద్ ఫాజిల్, సునీల్, రావు రమేశ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. డిసెంబరు 6న విడుదల కావాల్సిన ఈ సినిమా ఒక రోజు ముందుగానే డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ.. "పుష్ప 2' ఎప్పుడు విడుదలైతే అప్పుడే పండగ. ఈ చిత్రాన్ని మన దగ్గర డిసెంబరు 5న విడుదల చేయనున్నాం. యూఎస్‌లో డిసెంబరు 4నే ప్రీమియర్లు వేయనున్నాం. బుధవారం నుంచి షోలు మొదలైతే లాంగ్ వీకెండ్ కలిసొస్తుందనే ఉద్దేశంతో ముందుగా విడుదల చేస్తున్నాం" అన్నారు. "హీరో యాటిట్యూడ్, డైలాగ్స్ ప్రధానంగా రూపొందుతున్న చిత్రమిది. ఆ క్యారెక్టరైజేషన్‌కు తగ్గట్లుగానే ఆయా సన్నివేశాల్ని గ్రాండ్‌గా చూపించనున్నాం. దీంట్లోని జాతర సీక్వెన్స్ పూనకాలు తెప్పించేలా ఉంటుంది. దాన్ని దాదాపు 35రోజులు షూట్ చేశాం. ఆ ఎపిసోడ్ కోసం బన్నీ చాలా కష్టపడ్డారు. ముఖానికి రంగేసుకుని.. చీరకట్టులోనే రోజంతా సెట్లో అలా కూర్చొనేవారు. ఆయన పడిన కష్టానికైనా ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. నాణ్యతను దృష్టిలో పెట్టుకుని చిత్రీకరణ కాస్త ఆలస్యమైనా అవుట్‌పుట్ ఎంతో సంతృప్తినిస్తోంది. దీంట్లోని ప్రత్యేక గీతం ఎవరు చేస్తారన్నది రెండు రోజుల్లో ప్రకటిస్తాం. ఈ పాట చిత్రీకరణను నవంబరు 4నుంచి ప్రారంభించాలనుకుంటున్నాం. 'పుష్ప 2' ముగింపులో పార్ట్-3కి సంబంధించిన లీడ్ ఉంటుంది. అలాగే ఈ సినిమాని చైనీస్, జపనీస్, రష్యన్ తదితర విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకోసం ఓ ప్రత్యేక వెర్షన్‌ను సిద్ధం చేయాలన్న ఆలోచనలో ఉన్నాం" అన్నారు నిర్మాత వై.రవిశంకర్. ఈ కార్యక్రమంలో మైత్రీ శశి, లక్ష్మీకాంత్ రెడ్డి, ముఖేశ్ మెహతా, అనీల్ తడాని తదితరులు పాల్గొన్నారు.

చిరు ప్రాయం చేసిన దోషమేంటి?


మోహన్ లాల్

వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'డియర్ కృష్ణ'. అక్షయ్ కథానాయకుడు. మమితా బైజు, ఐశ్వర్య కథానాయికలు. దినేశ్‌బాబు దర్శకుడు. పీఎన్ బలరామ్ నిర్మాత. 'చిరు ప్రాయం చేసుకున్న దోషమేంటి దైవమా...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని అగ్ర కథా నాయకుడు మోహన్‌లాల్ విడుదల చేశారు. హరిప్రసాద్ స్వరకల్పనలోని ఈ పాటని, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించగా, గిరిపట్ల రచించారు. "నిజంగా జరిగిన ఓ అద్భుతం చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఆ అద్భుతానికీ, శ్రీకృష్ణుడికీ సంబంధమేమిటన్నది ఆసక్తికరం. 'చిరు ప్రాయం...' పాటకి మంచి స్పందన లభిస్తోంది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చివరిగా పాడిన పాట ఇదే" అని సినీ వర్గాలు తెలిపాయి.

అలాంటి పేర్ల నుంచి బయటపడాలి!

అవకాశాలు వెతుక్కుంటూ రావు. మనమే వాటిని సృష్టించుకోవాలని అంటోంది బాలీవుడ్ నాయిక కృతి సనన్. ఈ ఏడాది 'తేరే బాతోన్ మే ఐసా ఉల్జా జియా', 'క్రూ' లాంటి భిన్నమైన కథలతో తెరపై సందడి చేసిన కథానాయికీమె. ఆమె, కాజోల్ ప్రధాన పాత్రలో శశాంక చతుర్వేది తెరకెక్కించిన చిత్రం 'దో పత్తి'. కృతి తొలిసారి ద్విపాత్రాభినయం, నిర్మాతగా వ్యవహరించడం ఈ సినిమాతోనే కావడం విశేషం. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి.. తన సినీప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.


కృతి సనన్

"ఇటీవలే చిత్రపరిశ్రమకు వచ్చి దశాబ్దం పూర్తి చేసుకున్నాను. ఎప్పుడూ నటిగానే పరిమితం కాకుండా ఏదైనా కొత్తగా చేయాలని మొదటి నుంచే అనుకునేదాన్ని. ఏ పని చేస్తే బాగుంటుంది? ఎలాంటి పాత్ర పోషిస్తే అందరికీ నచ్చుతుంది? అని ఆలోచించేదాన్ని. వచ్చిన ప్రతీ అవకాశాన్ని అందుకుంటూ నెమ్మది నెమ్మదిగా నాలో ఉన్న నైపుణ్యాలని ఎలా మెరుగు పరుచుకోవాలో అర్థం చేసుకున్నాను. చిత్ర పరిశ్రమకు వచ్చిన కొత్తలో ఎవ్వరికీ అంత తొందరగా అవకాశాలు రావు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ సమయం, విజయం, అనుభవంతోనే మీకు అవకాశాలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో అవకాశాల్ని మనమే సృష్టించుకోవాల్సి వస్తుంది. 'దో పత్తి'తో వచ్చిన అవకాశంతో నటిగానే కాకుండా నిర్మాతగా నిరూపించుకోవాలనుకున్నాను".

పదేళ్ల తర్వాత లోతు తెలిసింది

"ఇప్పటి వరకూ ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించాను. అద్భుతమైన నటులతో, అనుభవమున్న దర్శకులతో పనిచేశాను. కానీ.. నేను ఛాలెంజింగ్ పాత్రలో నటిస్తేనే.. సెట్‌లో ఉత్సాహంగా ఉంటాను. ఎప్పుడెప్పుడు వెళ్లి నా పాత్రకు సంబంధించిన సన్నివేశాన్ని పూర్తి చేస్తానా అని ఆత్రుతగా ఎదురుచూస్తుంటాను. కొన్నిసార్లు సవాలు లేని పాత్రలు చేయాల్సి వస్తుంటుంది. అప్పుడు నేను సెట్‌లో ఉత్తేజంగా ఉండలేను. నిద్ర పోవాలనిపిస్తుంది. ఇలాంటి పాత్రలతో నేను సంతృప్తి కూడా చెందలేను. మొదల్లో ఎలాంటి పాత్రల్ని ఎంచుకోవాలో కనీసం అవగాహన లేదు. ఇప్పుడు పదేళ్ల తర్వాత నేను పాత్రల లోతును, కథను అర్థం చేసుకొని ఎంచుకునే స్థాయికి చేరుకున్నాను".

ద్విపాత్రాభినయం ఊహించలేదు..

"నేను నిర్మాతగా మారడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది ఇప్పటి వరకూ నేను పోషించని పాత్రల్ని సినిమాల్లో సృష్టించుకునే స్వేచ్ఛ నాకు ఉంటుంది. రెండోది ప్రస్తుతం చిత్రపరిశ్రమలో మహిళా ప్రాధాన్య కథలపై ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదు దర్శక నిర్మాతలు. ఇలాంటి సమయంలో నేను ఒక నిర్మాతగా ప్రపంచానికి తెలియని కొత్త కొత్త కథలపై దృష్టిపెడుతూ ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకుంటున్నాను. 'మిమీ' తర్వాత నేను లోతైన పాత్రల్లో నటించాలని కోరుకున్నాను. కానీ అస్సలు అలాంటి పాత్రలు మహిళల కోసం రాయట్లేదు. కనికా భిన్నమైన కథలను, పాత్రలను రాస్తుంది కాబట్టి నేను ఆమెతో పనిచేయాలని అనుకుంటున్నానని చెప్పాను. 'దో పత్తి' సినిమాలో నటించడానికి కూడా ఇదే ముఖ్య కారణం. కనికా ఇందులో నన్ను ద్విపాత్రాభినయంలో శక్తిమంతంగా చూపిస్తుందని ఊహించలేదు".

నన్ను నేను నిరూపించుకోవాలని

"టైగర్ ష్రాఫ్‌తో కలిసి నటించిన 'హీరోపంతి'తోనే బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యాను. నేను సినీ కుటుంబానికి చెందిన అమ్మాయిని కాదు. కానీ అప్పటికే టైగర్ అందరికీ సుపరిచితం. ఆ సినిమా విడుదలైన రోజుల్లో అభిమానులు నన్ను గుర్తుపట్టడానికి 'టైగర్ ష్రాఫ్ సినిమాలో కనిపించిన అమ్మాయి' అని పిలిచేవారు. మీరు పరిశ్రమకు చెందిన వ్యక్తి కానప్పుడు మీ పేరు, ముఖాన్ని ప్రజల మనసుల్లో చెక్కడానికి ఎక్కువ సమయం పడుతుంది. దీంతో పాటు మరికొంత మంది నన్ను 'టైగర్ దీదీ' అని పిలిచేవారు. ఇలాంటి పేర్ల నుంచి బయటపడాలని.. నేనెవరో వారు తెలుసుకునేలా చేయడానికి ఎక్కువ కష్టపడి నన్ను నేను నిరూపించుకోవాలని నిర్ణయించుకున్నాను".

ఆ బాధ్యతతో చేసిన చిత్రమే కంగువా


శివ, సూర్య, కె.ఇ.జ్ఞానవేల్ రాజా

"తెలుగు ప్రేక్షకులతో నాకున్న అనుబంధం చాలా ప్రత్యేకమైనది. థియేటర్‌లో నా సినిమా విడుదలై రెండేళ్లపైనే అయ్యింది. ఎంతో ప్రేమని కురిపిస్తున్న ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ అనుభవాన్ని ఇవ్వడం నా బాధ్యత. అందుకే 'కంగువా' చేశా" అన్నారు సూర్య. ఆయన కథానాయకుడిగా... శివ తెరకెక్కించిన చిత్రం 'కంగువా'. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. స్టూడియో గ్రీన్, యు.వి.క్రియేషన్స్ కలిసి రూపొందిస్తున్న ఈ చిత్రానికి కె.ఇ.జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. నవంబరు 14న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్లతో సమావేశమైంది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ "దర్శకుడు శివ ఈ కథ చెప్పినప్పుడు లేచి గట్టిగా హత్తుకున్నా. ఇలాంటి భారీ కథలు చేయాల్సి వచ్చినప్పుడు మొదట భయమేస్తుంది. కానీ 27ఏళ్ల అనుభవం ఉన్న నేను వెనకడుగు వేస్తే అర్థం ఉండదు. ఇలాంటివి డబ్బు కోణంలో ఆలోచించకుండా, తపనతో చేయాల్సిన సినిమాలు. 'బాహుబలి', 'కాంతార', 'ఆర్ఆర్ఆర్' లాంటి సినిమాలు ఇలా ఆలోచించి అడుగు వేసినప్పుడే సాధ్యమవుతాయి. హాలీవుడ్ నుంచి 'బ్రేవ్ హార్ట్', '300' తదితర చిత్రాలు చూసినప్పుడు మనమెప్పుడు చేస్తాం అనుకునేవాళ్లం. అలాంటి సినిమాలకి గేట్లు ఓపెన్ చేసిన దర్శకుడు రాజమౌళికి కృతజ్ఞతలు. ప్రాంతీయ సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లొచ్చని ఆయన దారి చూపించారు. నవంబరు 14న ప్రత్యేకమైన అనుభవాన్ని పంచుతుందీ చిత్రం. ఈ కథ ఫైటర్ గురించి కాదు, వారియర్ గురించి" అన్నారు. దర్శకుడు శివ మాట్లాడుతూ "ఇదివరకు చారిత్రక చిత్రాలు చాలా వచ్చాయి. వాటికి భిన్నంగా 1500 ఏళ్ల కింద అప్పటి ప్రపంచంలో ఉన్న మనుషులు, వాళ్ల భావోద్వేగాలపై సినిమా చేద్దామనుకున్నాం. ఆ ఆలోచనే నాకు కొత్తగా అనిపించింది. ఐదు వంశాల చుట్టూ సాగే చిత్రమిది. పెద్ద కాన్వాస్ చిత్రాలకి, బలమైన మానవీయ భావోద్వేగాలు కూడా తోడైతే చాలా బాగుంటుంది. విజువల్ ఎఫెక్ట్స్, భావోద్వేగాల విషయంలో రాజమౌళిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేశాం" అన్నారు. నిర్మాత కె.ఇ.జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ "కంగువా' అందరికీ వినోదం పంచుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో పంపిణీదారుడు శశి, రచయిత రాకేందుమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ 'గ్యాంగ్‌స్టర్' కథ


కశ్వీ

చంద్రశేఖర్ రాథోడ్ కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కశ్వీ కాంచన్ కథానాయిక. అభినవ్ జనక్, అడ్ల సతీశ్‌కుమార్, సూర్య నారాయణ ఇతర పాత్రల్ని పోషించారు. ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించారు. కథానాయకుడు ఆకాశ్ పూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కథానాయకుడు, దర్శకనిర్మాత చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ "వాణిజ్య హంగులతో రూపొందిన ఓ గ్యాంగ్‌స్టర్ కథ ఇది. అందరినీ అలరించేలా ఉంటుంది. సినిమా తీయడం, హీరోగా నటించడం నా కల. ఈ చిత్రంతో ఆ కల నిజమైనందుకు ఆనందంగా ఉంది" అన్నారు. ఆకాశ్ పూరి మాట్లాడుతూ "చంద్రశేఖర్ రాథోడ్ అన్నీ తానై ఈ సినిమాని తీశారు. ఆయనతో సినిమా చేయడానికి నేను సిద్ధం. ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారన్నారు.



రిలయన్స్‌కు ఎన్‌విడియా ఏఐ చిప్‌లు

- ఇరు కంపెనీల భాగస్వామ్యంలో దేశంలో ఏఐ మౌలిక వసతుల నిర్మాణం
- ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో తోనూ జట్టు


జెన్సెన్


ముకేశ్

ముంబయి: రిలయన్స్ ఇండస్ట్రీస్ గుజరాత్‌లో నిర్మిస్తున్న 1 గిగావాట్ డేటా సెంటర్‌కు కృత్రిమ మేధ (ఏఐ) ఇంటెలిజెన్స్ ప్రాసెసర్లను సరఫరా చేయనున్నట్లు అమెరికా సాంకేతిక దిగ్గజ సంస్థ ఎన్‌విడియా కార్ప్ సీఈఓ జెన్సెన్ హ్యువాంగ్ వెల్లడించారు. దేశీయ టెక్ సంస్థలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, మహీంద్రా, విప్రోలతో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసుకోనున్నట్లు గురువారం ఇక్కడ ప్రకటించారు.

డేటా సెంటర్లకు చిప్‌లు

✦ రిలయన్స్ డేటా సెంటర్‌కు తన బ్లాక్‌వెల్ ఏఐ ప్రాసెసర్‌ను ఎన్‌విడియా సరఫరా చేస్తుంది.

✦ యోట్టా డేటా సర్వీసెస్, టాటా కమ్యూనికేషన్స్ వంటి కంపెనీలకు చెందిన భారీ స్థాయి డేటా సెంటర్లకు తన హాపర్ ఏఐ చిప్‌లను సరఫరా చేయనుంది.

✦ ఎన్‌విడియాకు చెందిన ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారాన్ని వినియోగించి ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రోలు తమ క్లయింట్లకు కస్టమ్-బిల్ట్ సొల్యూషన్లను అందించేందుకు వీలు కల్పిస్తుంది.

భారత్‌లో ఏఐ మౌలిక వసతుల నిర్మాణం

గురువారమిక్కడ జరిగిన ఎన్‌విడియా ఏఐ సమిట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ, హ్యువాంగ్ పాల్గొన్నారు. దేశంలో ఏఐ ఇంటెలిజెన్స్ మౌలిక వసతుల నిర్మాణంలో భాగస్వామ్యాన్ని ఇరు కంపెనీలు ప్రకటించాయి. కంప్యూటింగ్ మౌలిక వసతులతో పాటు ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు, ఇందుకోసం భారీ స్థాయిలో పెట్టుబడులు పెడతామని హ్యువాంగ్ స్పష్టం చేశారు.

ఏం చేస్తారంటే

తమ భాగస్వామ్యంలో భాగంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ పలు అప్లికేషన్లను సృష్టించి, వినియోగదార్లకు విక్రయిస్తుందని హ్యువాంగ్ తెలిపారు. ఎన్‌విడియా ఇప్పటికే భారత్‌లో హైదరాబాద్ సహా 6 ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. కంపెనీలు, క్లౌడ్ ప్రొవైడర్లు, అంకురాలతో కలిసి పనిచేసి ఏఐ మౌలిక వసతులను నిర్మించడంలో ఎన్‌విడియా సహకరిస్తుంది. తనకున్న అత్యంత అధునాతన జీపీయూలు, నెట్‌వర్కింగ్, ఏఐ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్స్, టూల్స్‌ను ఇందుకు ఉపయోగిస్తుంది. 'కంప్యూటింగ్ సామర్థ్యాల్లో 2024లో భారత్ 20 రెట్ల వృద్ధిని నమోదు చేస్తుంది. ఏఐ సొల్యూషన్లను ఎగుమతి చేస్తుంది.' అని హ్యువాంగ్ అన్నారు.

అధునాతన సదుపాయాలు సాధ్యం

ప్రపంచానికి సీఈఓలనే కాదు.. ఏఐ (కృత్రిమమేధ) సర్వీసులనూ భారత్ అందిస్తుందని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద డేటా కంపెనీగా జియోను నిలిపాం. ఒక జీబీ డేటాను 15 సెంట్ల (సుమారు రూ.12.6)కు అందించాం. అమెరికాలో ఒక జీబీ డేటాను 5 డాలర్ల (సుమారు రూ.420)కు విక్రయిస్తున్నారు. రాబోయే కొన్నేళ్లలో ఇంటెలిజెన్స్ సాంకేతికతలో ప్రపంచాన్ని భారత్ ఆశ్చర్యపరుస్తుంద'ని ముకేశ్ అన్నారు. భారత్ తన సొంత మోడల్‌ను అభివృద్ధి చేసుకోవడానికి ముందు, మెటాకు చెందిన ఓపెన్ సోర్స్ లామాను వినియోగించుకోవాలని ముకేశ్ పిలుపునిచ్చారు.

లారస్ ల్యాబ్స్ డివిడెండ్ 20%

ఈనాడు, హైదరాబాద్: లారస్ ల్యాబ్స్ సెప్టెంబరు త్రైమాసికానికి రూ.20 కోట్ల నికరలాభాన్ని, రూ.1,224 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఎబిటా మార్జిన్ 14.9 శాతం కాగా త్రైమాసిక ఈపీఎస్ 40 పైసలు ఉంది. 2023-24 ఇదే కాలంలో ఆదాయం రూ.1,224 కోట్లు, నికరలాభం రూ.37 కోట్లు, ఈపీఎస్ 60 పైసలు ఉన్నాయి. దీంతో పోల్చితే ఈసారి నికరలాభం 46% క్షీణించింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి లారస్ ల్యాబ్స్ ఆదాయం రూ.2,419 కోట్లు కాగా, నికరలాభం రూ.33 కోట్లు, ఈపీఎస్ 60 పైసలు ఉన్నాయి. సీఎంఓ/ సీడీఎంఓ సేవల విభాగంలో డిమాండ్ ఆకర్షణీయంగా ఉన్నట్లు లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావ వివరించారు. కొత్తగా ప్రారంభించిన ఆర్‌అండ్‌డీ కేంద్రం వల్ల ప్రపంచ స్థాయి ఫార్మా కంపెనీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే అవకాశం ఏర్పడిందని అన్నారు. ఏఆర్వీ, ఆంకాలజీ ఏపీఐ వ్యాపార విభాగంలో క్షీణించిన అమ్మకాలను, సీడీఎంఓ సేవలతో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి కాలానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలమనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వాటాదార్లకు 20% చొప్పున (రూ.2 ముఖ విలువ కల ఒక్కో షేరుకు 40 పైసల చొప్పున) మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని లారస్ ల్యాబ్స్ డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది. డివిడెండ్ చెల్లించడానికి నవంబరు 6ను రికార్డు తేదీగా నిర్ణయించారు.

సైయెంట్ ఆదాయం రూ.1450 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: సైయెంట్ లిమిటెడ్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.1450 కోట్ల ఆదాయాన్ని, రూ.177 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదేకాలంతో పోల్చినప్పుడు ఆదాయం 1.8% తగ్గినా, నికరలాభం 2.3% పెరిగింది. సెమీకండక్టర్ల వ్యాపారంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు సైయెంట్ ఎండీ కృష్ణ బొదనపు వివరించారు.

మాస్‌చిప్ టెక్నాలజీస్ ఆకర్షణీయ ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: సెమీకండక్టర్ సేవల సంస్థ మాస్‌చిప్ టెక్నాలజీస్ సెప్టెంబరు త్రైమాసికానికి రూ.125.62 కోట్ల ఆదాయంపై రూ.9.73 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదేకాలంలో ఆదాయం రూ.71.86 కోట్లు, నికరలాభం రూ.3.63 కోట్లే ఉన్నాయి. దీంతో పోల్చితే ఆదాయం 75%, నికరలాభం 168% పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలకు సంస్థ ఆదాయం రూ.205.98 కోట్లు, నికరలాభం రూ.13.71 కోట్లు ఉన్నాయి.

రూ.800 కోట్లతో కోరమాండల్ విస్తరణ

ఈనాడు, హైదరాబాద్: ఎరువులు, సస్యరక్షణ ఉత్పత్తులు అందించే సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.800 కోట్లతో పలు విస్తరణ ప్రాజెక్టులు చేపట్టనుంది. ఈ ప్రతిపాదనలకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. కాకినాడ యూనిట్లో మరో 7.5 లక్షల టన్నుల గ్రాన్యులేషన్ సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం ఇందులో ముఖ్యమైనది. తత్ఫలితంగా కాకినాడ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 30 లక్షల టన్నులకు పెరుగుతుంది. గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లో ఫంగిసైడ్స్ ఉత్పత్తి చేయడం కోసం మల్టీ ప్రోడక్ట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు.

తగ్గిన నికరలాభం: కోరమాండల్ సెప్టెంబరు త్రైమాసికానికి లాభాల్లో క్షీణత నమోదు చేసింది. రూ.7,509 కోట్ల ఆదాయంపై రూ.696 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదేకాలంలో ఆదాయం రూ.7,301 కోట్లు, నికరలాభం రూ.762 కోట్లు ఉన్నాయి.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నష్టం రూ.429 కోట్లు

హైదరాబాద్: సెప్టెంబరు త్రైమాసికంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నష్టం రూ.429 కోట్లకు పెరిగింది. 2023-24 ఇదే త్రైమాసికంలో కంపెనీ నష్టం రూ.190 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.2,162.38 కోట్ల నుంచి రూ.2,598.09 కోట్లకు వృద్ధి చెందింది. కంపెనీ ఆర్థిక వ్యయాలు రూ.673 కోట్ల నుంచి రూ.1,031 కోట్లకు పెరిగాయి. హైదరాబాద్ విమాన ప్రయాణికుల సంఖ్య 60.1 లక్షల నుంచి 14% వృద్ధితో 68.6 లక్షలకు చేరింది.

20 ఏళ్లలో మరో 200 విమానాశ్రయాలు

- 4,000కు పైగా విమానాలు అవసరం
- కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు

దిల్లీ: దేశీయ ప్రయాణికుల కోసం వచ్చే 20 ఏళ్లలో మరో 4,000కు పైగా విమానాలు అవసరమవుతాయని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అప్పటికల్లా ఇంకో 200 విమానాశ్రయాలు అభివృద్ధి చెందుతాయనీ అంచనా వేశారు. ఉద్యోగ సృష్టి, ఆర్థిక కార్యకలాపాలు, వాణిజ్య కేంద్రాలకు విమానాశ్రయాలు కేంద్ర బిందువుగా మారతాయని వివరించారు. గురువారమిక్కడ ఎయిర్‌బస్ ఇండియా, దక్షిణాసియా ప్రధాన కార్యాలయం-శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ 'విమాన ప్రయాణ విస్తరణతో పైలెట్లపై భౌతికంగా, మానసికంగా ఒత్తిడి పడుతోంది. ప్రపంచ స్థాయి శిక్షణనిచ్చే సరికొత్త సిమ్యులేటర్ల వల్ల, వాస్తవ పరిస్థితుల కనుగుణంగా పైలెట్లు శిక్షణ పొందడానికి వీలుంటుంటుంద'ని పేర్కొన్నారు. భారత్‌లో విమానాల డిజైన్, తయారీకి దీర్ఘకాల ప్రణాళికలున్నాయని పునరుద్ఘాటించారు.

✦ ఎయిర్‌బస్ సెంటర్‌లో పైలట్, నిర్వహణ శిక్షణ కేంద్రం ఉంటుంది. నాలుగు ఏ320 నియో ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్లు(ఎఫ్ఎఫ్ఎస్) ఇక్కడ ఉంటాయి.

భారత్‌లో 5,000 మంది ప్రత్యక్ష ఉద్యోగులు ఉండాలి..ఎయిర్‌బస్: మన దేశంలో 5,000 మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగులు తనకు ఉండాలని ఫ్రాన్స్‌కు చెందిన విమానాల తయారీ దిగ్గజ సంస్థ ఎయిర్‌బస్ ఆశిస్తోంది. రెండేళ్లలో మనదేశం నుంచి 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16,800 కోట్ల) విలువైన సేవలు, విడి భాగాలు సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌తో ఎయిర్‌బస్ బంధం కొత్త ఊపు అందుకుంటోందని ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్, దక్షిణాసియా ఎండీ రెమి మెయిలార్డ్ వెల్లడించారు. ప్రస్తుతం ఎయిర్‌బస్‌కు మన దేశంలో 3,500 మంది ఉద్యోగులున్నారు. 1 బిలియన్ యూరోల (సుమారు రూ.9,000 కోట్ల) విలువైన సేవలు, విడి భాగాలను ఇక్కడ నుంచి సమీకరిస్తోంది. దేశ రాజధాని దిల్లీలో ఎయిర్‌బస్ ఇండియా, దక్షిణాసియా ప్రధాన కార్యాలయం-శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో రెమి ఈ వివరాలు వెల్లడించారు.


ఎయిర్‌బస్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఐటీసీ లాభం రూ.5,054 కోట్లు

దిల్లీ: ఐటీసీ, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.5,054.43 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.4,964.52 కోట్లతో పోలిస్తే ఇది 1.8% ఎక్కువ. కార్యకలాపాల ఆదాయాలు రూ.19,270.02 కోట్ల నుంచి 15.62% వృద్ధితో రూ.22,281.89 కోట్లకు చేరాయి. మొత్తం ఆదాయం 14.86% పెరిగి రూ.22,897.85 కోట్లకు; వ్యయాలు 20.92% పెరిగి రూ.16,056.86 కోట్లకు చేరాయి.

ఒబెరాయ్, లీలా హోటళ్లలో వాటా స్థిరీకరణ: హోటళ్ల వ్యాపారాన్ని విభజించే ప్రక్రియలో ఉన్న ఐటీసీ తన పోటీసంస్థలైన ఒబెరాయ్, లీలా హోటళ్లలో మరింత వాటాలను కొనుగోలు చేసింది. ఈఐహెచ్‌కు ఒబెరాయ్, ట్రైడెంట్ బ్రాండ్లున్నాయి. హెచ్ఎల్‌వీ సంస్థ లీలా బ్రాండ్ కింద లగ్జరీ హోటళ్లను నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఐటీసీకి ఈఐహెచ్‌లో 13.69%, హెచ్ఎల్‌వీలో 7.58% వాటా ఉండగా.. తాజా కొనుగోలుతో వాటాలు వరుసగా 16.13%, 8.11 శాతానికి చేరతాయి.

పూర్ ఈవీ మోటార్‌సైకిళ్లపై రూ.20,000 తగ్గింపు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ ద్విచక్ర వాహన సంస్థ ప్యూర్ ఈవీ, తమ మోటార్ సైకిళ్లపై పండగ ఆఫర్‌ను ప్రకటించింది. ఎకోడ్రిఫ్ట్, ఇ ట్రిస్ట్ ఎక్స్‌పై రూ.20,000 వరకు తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. దీంతో ఈ మోటార్ సైకిళ్ల ధర రూ.99,999 నుంచి ప్రారంభం కానుంది. ప్రెడిక్టివ్ ఏఐ ఎక్స్ ప్లాట్‌ఫాంపై రూపొందించిన ఈ మోడళ్లలో క్లౌడ్ అలర్ట్, స్మార్ట్ బ్యాటరీ మేనేజ్‌మెంట్, హిల్-స్టార్ట్ అసిస్టెన్స్, రివర్స్ మోడ్, పార్క్ అసిస్ట్‌వంటి అధునాతన ఫీచర్లు ఉన్నాయని సంస్థ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ నిశాంత్ డొంగరి తెలిపారు. ధరల తగ్గింపు నవంబరు 10 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రతి ఆర్డరుకూ ప్లాట్‌ఫామ్ ఫీజు రూ.10

పెంచిన జొమాటో, స్విగ్గీ

దిల్లీ: జొమాటో, స్విగ్గీ తమ ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచాయి. ఇకపై ప్రతి ఆర్డర్‌పైనా రూ.10 చొప్పున వసూలు చేయనున్నాయి. పండుగ సీజన్‌లో మెరుగైన సేవలు అందించేందుకు ఫీజులు పెంచుతున్నట్లు ప్రకటించాయి. నగరాల వారీగా ఈ పెంపులో వ్యత్యాసం ఉంటుందని జొమాటో తెలిపింది. దిల్లీలో ఒక్కో ఆర్డర్‌పై రూ.10 ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేస్తోంది. హైదరాబాద్‌లో ఇది రూ.8గా ఉంది. స్విగ్గీ యాప్‌లో ఆర్డర్‌పై ప్లాట్‌ఫామ్ ఫీజు హైదరాబాద్‌లో రూ.10గా చూపిస్తోంది. అంటే ఇప్పటికే ఈ ఫీజు అమల్లోకి వచ్చినట్లు స్పష్టమవుతోంది.

కోడి గుడ్లు

25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	540
గోదావరి	535
విశాఖపట్నం	540
చిత్తూరు	578

ఇండస్ఇండ్ బ్యాంక్ లాభంలో 40% క్షీణత



దిల్లీ: ఇండస్ఇండ్ బ్యాంక్ నికర లాభం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1,331 కోట్లుగా నమోదైంది. 2023-24 ఇదే మూడు నెలల లాభం రూ.2,202 కోట్లతో పోలిస్తే ఇది 40% తక్కువ. మొత్తం ఆదాయం మాత్రం రూ.13,530 కోట్ల నుంచి రూ.14,871 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 5% మెరుగై రూ.5347 కోట్లకు చేరుకుంది. స్థూల నిరర్థక ఆస్తులు(జీఎన్‌పీఏలు) 1.93% నుంచి 2.11 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.57% నుంచి 0.64 శాతానికి పెరిగాయి. దీంతో కేటాయింపులు, రూ.974 కోట్ల నుంచి రూ.1820 కోట్లకు చేరాయి. కనీస మూలధన నిష్పత్తి 18.21% నుంచి 16.51 శాతానికి తగ్గింది.

బ్లింకిట్‌లో ఈఎంఐ సదుపాయం

దిల్లీ: జొమాటోకు చెందిన క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్, నిర్దేశిత మొత్తం కొనుగోళ్లను ఈఎంఐగా మార్చుకునే కొత్త సదుపాయాన్ని తీసుకొచ్చింది. రూ.2,999 కంటే ఎక్కువ మొత్తంలో సరకులకు ఆర్డరు పెట్టేవారు, ఆ మొత్తాన్ని నెలవారీ కిస్తీ (ఈఎంఐ)ల్లో చెల్లించొచ్చని సంస్థ సీఈఓ అల్బీందర్ దిండ్సా వెల్లడించారు. బంగారం, వెండి కొనుగోళ్లకు మాత్రం ఇది వర్తించదని తెలిపారు. ఎంపిక చేసిన బ్యాంక్ క్రెడిట్ కార్డులు కలిగిన వారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. తొలుత తమకు కావాల్సిన ఉత్పత్తులను కార్ట్‌లో జత చేసుకున్నాక, చెక్‌ఔట్ సమయంలో ఈఎంఐ సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. చెల్లింపు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని ఈఎంఐగా బ్యాంక్ మారుస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, సిటీ బ్యాంక్ క్రెడిట్ కార్డులు కలిగిన వారు 3, 6, 9 నెలల కాల వ్యవధులను ఎంచుకోవచ్చు. ఆయా బ్యాంకులను బట్టి వడ్డీ రేటు ఉంటుంది.

పతంజలి ఫుడ్స్ లాభం రూ.309 కోట్లు

దిల్లీ: పతంజలి ఫుడ్స్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.308.97 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.254.53 కోట్ల కంటే ఇది 21% అధికం. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.7845.79 కోట్ల నుంచి రూ.8198.52 కోట్లకు పెరిగింది. మార్జిన్ 53 బేసిస్ పాయింట్ల మేర పెరిగినట్లు కంపెనీ వివరించింది. సవాలు భరిత పరిస్థితుల్లోనూ ఆహారం, ఎఫ్ఎంసీజీ, వంట నూనెల విభాగాలు గణనీయంగా రాణించినట్లు పతంజలి ఫుడ్స్ విశ్లేషించింది. పతంజలి, రుచిగోల్డ్, న్యూట్రెల్లా వంటి బ్రాండ్లపై ఉత్పత్తులు విక్రయిస్తోంది.

పీఏసీ సమావేశానికి సెబీ ఛైర్‌పర్సన్ గైర్హాజరు



దిల్లీ: పార్లమెంట్ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) సమావేశానికి సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ గురువారం గైర్హాజరయ్యారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు పీఏసీకి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ పరిణామాలపై ఆగ్రహించిన ఎన్‌డీఏ సభ్యులు, వేణుగోపాల్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, లోక్‌సభ స్పీకర్ వద్ద ఫిర్యాదు చేశారు. సెబీ అధిపతి మాధబి పురి బచ్‌పై అమెరికా సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు ఒక కమిటీని పార్లమెంట్ నియమించింది. సెబీ పనితీరుపై సమీక్షించేందుకు మాధబి పురి బచ్‌ను తమ ఎదుట హాజరు కావాల్సిందిగా పీఏసీ కమిటీ సమన్లు జారీ చేసింది. గురువారం ఆమె కమిటీ ముందు హాజరుకావాల్సి ఉంది. 'కొన్ని ముఖ్యమైన కారణాలరీత్యా తాను హాజరుకాలేనని' ఉదయం 9.30 గంటలకు ఆమె కమిటీకి తెలియజేశారు. దీంతో రివ్యూ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

✦ సెబీ చీఫ్ గైర్హాజరుపై కేసీ వేణుగోపాల్ స్పందించారు. 'కమిటీ మొదటి సమావేశంలో నియంత్రణ సంస్థ పనితీరును సమీక్షించాలని భావించాం. సంబంధితులకు నోటీసులు పంపగా, సమావేశం నుంచి మినహాయింపు కోరారు. కానీ మేం దాన్ని తిరస్కరించడంతో, తన బృందంతో కలిసి మీటింగ్‌కు హాజరవుతామని సెబీ ఛైర్‌పర్సన్ తెలిపారు. అయితే కొన్ని ముఖ్యమైన కారణాల వల్ల ఆమె దిల్లీకి వచ్చే పరిస్థితి లేదని ఉదయం 9:30 గంటలకు మాకు సమాచారం అందింది. ఒక మహిళ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని సమావేశాన్ని వాయిదా వేశామ'ని తెలిపారు. బచ్‌కు పీఏసీ కమిటీ సమన్లు పంపడం ఇది రెండో సారి. సెబీ, ఆర్‌బీఐ సహా పలు సంస్థల పనితీరును పలు స్టాండింగ్ కమిటీలు సమీక్షిస్తున్నాయని, అయితే సెబీపై వేసిన కమిటీ పనితీరు మాత్రం సరిగ్గా లేదని పీఏసీ సభ్యుడు, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు.

ఎన్‌టీపీసీ లాభం రూ.5,380 కోట్లు



దిల్లీ: ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ ఎన్‌టీపీసీ, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.5,380.25 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.4,726.40 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 14% ఎక్కువ. మొత్తం ఆదాయం మాత్రం రూ.45,384.64 కోట్ల నుంచి రూ.45,197.77 కోట్లకు తగ్గింది. ఏప్రిల్- సెప్టెంబరు మధ్య కంపెనీ సగటు టారిఫ్ యూనిట్‌కు రూ.4.67గా ఉంది. ఏడాదిక్రితం ఇదే సమయంలో ఇది రూ.4.61గా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.2.50 మొదటి మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. 2024 నవంబరు 18న చెల్లింపులు చేయనున్నారు. ఎన్‌టీపీసీ స్థూల విద్యుదుత్పత్తి 90.30 బిలియన్ యూనిట్ల నుంచి 88.46 బి.యూనిట్లకు తగ్గింది. క్యాప్టివ్ గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి 5.09 ఎంఎంటీ నుంచి 9.03 ఎంఎంటీకి పెరిగింది.

గోద్రేజ్ కన్జ్యూమర్ డివిడెండ్ 500%

దిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్) సెప్టెంబరు త్రైమాసికంలో రూ.491.31 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే కాల లాభం రూ.432.77 కోట్లతో పోలిస్తే ఇది 13.5% ఎక్కువ. దేశీయ విపణితో పాటు ఇండోనేషియాలో విక్రయాలు అధికమవ్వడం వల్ల, లాభం పెరిగిందని కంపెనీ తెలిపింది. ఉత్పత్తుల విక్రయాల ఆదాయం రూ.3,568.36 కోట్ల నుంచి 2.2% పెరిగి రూ.3,647.11 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 2.3% పెరిగి రూ.3,752.32 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు స్వల్పంగా పెరిగి రూ.3,039.88 కోట్లకు చేరాయి. జీసీపీఎల్ దేశీయ విపణి ఆదాయం రూ.2,168.21 కోట్ల నుంచి 6.1% పెరిగి రూ.2,300.65 కోట్లకు చేరింది. దేశీయంగా వినియోగదారు గిరాకీ తక్కువగా ఉండటం, చమురు ధరల ఒత్తిడి ఉన్నా స్థిరమైన త్రైమాసికాన్ని నమోదు చేశామని ఎండీ, సీఈఓ సుధీర్ సీతాపతి వెల్లడించారు. జీసీపీఎల్‌కు రెండో అతి పెద్ద విపణిగా ఉన్న ఇండోనేషియాలో ఆదాయం రూ.472.96 కోట్ల నుంచి 8.63% పెరిగి రూ.513.81 కోట్లకు చేరింది. ఆఫ్రికా, యూఎస్ఏ, పశ్చిమాసియాల్లో బలహీనతలు కనిపించాయి. పరిమాణం పరంగా 8%, విలువ పరంగా 10% క్షీణత నమోదైంది.

✦ రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు 500% (రూ.5) చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

ఏసీసీ లాభం రూ.200 కోట్లు

దిల్లీ: సిమెంట్ తయారీ సంస్థ ఏసీసీ, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.199.7 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.387.88 కోట్లతో పోలిస్తే తగ్గింది. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.4,434.73 కోట్ల నుంచి రూ.4,613.52 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలూ రూ.4,127.11 కోట్ల నుంచి రూ.4,452.73 కోట్లకు పెరిగాయి. 2024 జనవరి 8న ఏషియన్ కాంక్రీట్స్ అండ్ సిమెంట్స్ ప్రై.లి. (ఏసీసీపీఎల్), ఏసీసీ నియంత్రణలోకి వచ్చిందని, తదుపరి ప్రకటిస్తున్న ప్రస్తుత ఏకీకృత ఫలితాలను గత ఆర్థిక సంవత్సర ఇదే త్రైమాసిక, అర్ధ వార్షిక ఫలితాలతో పోల్చి చూడొద్దని కంపెనీ తెలిపింది. అన్ని విపణుల్లో అధిక నాణ్యత గల సిమెంట్ ఉత్పత్తులకు బలమైన గిరాకీ ఉండటంతో, వృద్ధి కొనసాగిందని ఏసీసీ పూర్తి కాల డైరెక్టర్, సీఈఓ అజయ్ కపూర్ వెల్లడించారు. రహదారులు, జాతీయ రహదారులు, రైల్వేలు, మెట్రోలు తదితర మౌలిక ప్రాజెక్టులపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించడంతో భవిష్యత్తులో సిమెంట్‌కు గిరాకీ బాగుంటుందని కంపెనీ తెలిపింది. 2024-25లో సిమెంట్‌కు గిరాకీ 4-5% వృద్ధి చెందొచ్చని వెల్లడించింది.

జులై- సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2024-25	నికర లాభం/(నష్టం) 2023-24	మొత్తం ఆదాయం 2024-25	మొత్తం ఆదాయం 2023-24
ఐఈఎక్స్	108.32	86.46	167.76	132.97
అదానీ విల్మర్	311.02	(130.73)	14,565.30	12,331.20
బికజీ ఫుడ్స్	68.58	59.78	721.17	608.68
రాడికో ఖైతాన్	80.66	64.83	3,906.58	3,569.06
స్ట్రైడ్స్ ఫార్మా	93.66	(149.45)	1,201.11	999.43
కోల్గేట్ పామోలివ్	395.05	340.05	1,609.21	1,462.38
పిరమాల్ ఫార్మా	23	5	2,242	1,911
ఎల్‌టీ ఫుడ్స్	150.61	157.26	2,134.04	1,991.91
యునైటెడ్ బ్రూవరీస్	132.33	107.17	4,743.56	4,192.86
అదానీ టోటల్ గ్యాస్	178	168	1,315	---
ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్	106	(15)	1,086	929
ఉజ్జీవన్ స్మాల్ బ్యాంక్	233	328	1,820	1,580
సీఎస్‌బీ బ్యాంక్	138	133	1,064	830
రామకృష్ణ ఫోర్జింగ్స్	183	80	952.43	867.97
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ	853	850	3,459	3,387
డిక్సన్ టెక్నాలజీస్	411.7	113.36	11,534.08	4,943.18

నాలుగో రోజూ నీరసమే



ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.5,062 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు: రూ.3,620 కోట్లు

సెన్సెక్స్ ▼ 17 — 80065
నిఫ్టీ ▼ 36 — 24399

సమీక్ష

వరుసగా నాలుగో రోజూ సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలు చవిచూశాయి. దిగ్గజ సంస్థలు నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించడంతో, ఎఫ్ఎంసీజీ, వాహన షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. విదేశీ అమ్మకాలు కొనసాగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 84.07 వద్ద స్తబ్దుగా ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.99% లాభంతో 76.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో టోక్యో లాభపడగా, సియోల్, షాంఘై, సియోల్ నష్టపోయాయి. ఐరోపా సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి.

✦ సెన్సెక్స్ ఉదయం 17 పాయింట్ల (క్రితం ముగింపు 80,081.98) లాభంతో 80,098.30 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 79,813.02 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిన సూచీ, అనంతరం కోలుకుంది. ఒకదశలో 80,259.82 వద్ద గరిష్ఠానికి చేరినా, చివరకు 16.82 పాయింట్ల నష్టంతో 80,065.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 36.10 పాయింట్లు తగ్గి 24,399.40 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,341.20- 24,480.65 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 11 డీలాపడ్డాయి. నెస్లే 2.88%, ఐటీసీ 1.81%, మారుతీ 1.61%, ఏషియన్ పెయింట్స్ 0.65%, టీసీఎస్ 0.46%, ఇన్ఫోసిస్ 0.38% నష్టపోయాయి. అల్ట్రాటెక్ 2.77%, ఎం అండ్ ఎం 1,35%, టైటన్ 1.28%, ఎస్‌బీఐ 1.15%, అదానీ పోర్ట్స్ 1.02%, ఎన్‌టీపీసీ 0.86% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో ఎఫ్ఎంసీజీ 2.66%, స్థిరాస్తి 1.21%, టెలికాం 1.02%, ఐటీ 0.64%, పరిశ్రమలు 0.62% తగ్గాయి. ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్, విద్యుత్, కమొడిటీస్, ఇంధన, యుటిలిటీస్ మెరిశాయి. బీఎస్ఈలో 2349 షేర్లు నష్టాల్లో ముగియగా, 1584 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 100 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

✦ **అశోక్ లేలాండ్‌కు 500 విద్యుత్ బస్సుల ఆర్డరు:** చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నుంచి 500 విద్యుత్ బస్సుల ఆర్డరును తమ అనుబంధ సంస్థ ఓహెచ్ఎం గ్లోబల్ మొబిలిటీ అందుకున్నట్లు అశోక్ లేలాండ్ ప్రకటించింది.

త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో

✦ **హెచ్‌యూఎల్ షేరుకు నష్టాలు:** ఫలితాలు మదుపర్లను మెప్పించకపోవడంతో హెచ్‌యూఎల్ షేర్లు డీలాపడ్డాయి. బీఎస్ఈలో షేరు 5.83% నష్టంతో రూ.2,502.95 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.36,430.41 కోట్లు తగ్గి రూ.5.88 లక్షల కోట్లకు పరిమితమైంది.

✦ **అదానీ విల్మర్ పరుగులు:** సెప్టెంబరు త్రైమాసికంలో రూ.311 కోట్ల లాభం ప్రకటించడంతో అదానీ విల్మర్ షేరు ఇంట్రాడేలో 8% దూసుకెళ్లి రూ.344.60 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 6.71% లాభంతో రూ.340.30 వద్ద ముగిసింది.

✦ అదానీ టోటల్ గ్యాస్ షేరు 7.82% పెరిగి రూ.755.25 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,026.97 కోట్లు పెరిగి రూ.83,063.16 కోట్లుగా నమోదైంది.

✦ **డిస్నీ హాట్‌స్టార్ అధిపతి రాజీనామా:** డిస్నీ హాట్‌స్టార్ యాప్ అధిపతి సజిత్ శివానందన్ రాజీనామా చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ ఇండియా మీడియా ఆస్తులతో డిస్నీ హాట్‌స్టార్ 8.5 బిలియన్ డాలర్ల విలీనం ఊపందుకున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. త్వరలోనే జియో సినిమా- డిస్నీ హాట్‌స్టార్ విలీనమవుతాయన్న వార్తలు వస్తున్నాయి.

నేటి బోర్డు సమావేశాలు: ఇండిగో, కోల్ ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, డీఎల్ఎఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, బీపీసీఎల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, శ్రీరామ్ ఫైనాన్స్, టొరెంట్ ఫార్మా, ఐడీబీఐ బ్యాంక్, హెచ్‌పీసీఎల్, ఎన్ఎల్‌సీ ఇండియా, బంధన్ బ్యాంక్, ఐనాక్స్ విండ్, జుబిలెంట్ ఫార్మోవా, యూటీఐ ఏఎంసీ, ఎంఐఎల్, ఇక్రా, గో ఫ్యాషన్ ఇండియా, ఓరియెంట్ ఎలక్ట్రిక్

బోనస్ ఏం చేస్తున్నారు?

దసరా, దీపావళి పండగల వేళలో యాజమాన్యాలు తమ ఉద్యోగులకు బోనస్ ఇస్తుంటాయి. చాలా సందర్భాల్లో దీన్ని కొనుగోళ్లు, ఇతర విలాసవంతమైన ఖర్చులకే ఉపయోగిస్తుంటాం. దీనికి భిన్నంగా ఏం చేయాలని ఎప్పుడైనా ఆలోచిస్తే.. ఇలా చేసి చూడండి.



అత్యవసర నిధిని..

మీ పండగ బోనస్‌లను ఉపయోగించి, అత్యవసర నిధిని బలోపేతం చేసుకోవచ్చు. అనుకోని ఖర్చులు వచ్చినప్పుడు ఇది ఉపయోగపడుతుంది. కనీసం 6-12 నెలల ఖర్చులకు సరిపోయే విధంగా ఈ నిధి ఉండాలనేది నిపుణుల సూచన. ఇప్పటికైనా ఈ మొత్తాన్ని ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచన వస్తే.. బోనస్‌తోనే దానికి శ్రీకారం చుట్టండి. మీకు అదనంగా అందిన ఈ మొత్తంలో నుంచి కనీసం 60 శాతం నిధిని పక్కన పెట్టండి.

రుణ భారం తగ్గేలా..

వ్యక్తిగత లేదా క్రెడిట్ కార్డు రుణాలను తీసుకున్నప్పుడు దానికి అధిక వడ్డీని చెల్లించాల్సి వస్తుంది. మీ బోనస్‌తో ఏదైనా అప్పు తీరుతుందా చూసుకోండి. అధిక వడ్డీ ఉన్న అప్పుల జాబితా తీయండి. దాన్ని ముందుగా తీర్చేందుకు చూడండి. దీనివల్ల మీకు నెలనెలా వాయిదాలు చెల్లించాల్సిన ఒత్తిడి దూరమవుతుంది. వడ్డీ భారమూ తగ్గుతుంది. ఇలా మిగిలిన మొత్తంతో తర్వాత అవసరమైన కొనుగోళ్లు చేసుకునే వీలూ ఉంటుంది. ఒకసారి ఆలోచించి, నిర్ణయం తీసుకోండి.

బీమాను పెంచుకోండి..

వైద్య ద్రవ్యోల్బణం ఎలా పెరుగుతోందో చూస్తూనే ఉన్నాం. ఎప్పుడో తీసుకున్న రూ.2లక్షల ఆరోగ్య బీమా ఇప్పుడు సరిపోవడం లేదు. కనీసం రూ.5లక్షల నుంచి రూ.10లక్షల ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ ఉండేలా చూసుకోండి. దీని ప్రీమియం చెల్లించేందుకు బోనస్‌లో కొంత మొత్తాన్ని వినియోగించే ప్రయత్నం చేయొచ్చు. సూపర్ టాపప్, తీవ్ర వ్యాధులకు రైడర్లవంటివీ పరిశీలించాలి.

సంపద పెరిగేలా..

మీ తక్షణ అవసరాలకు బోనస్‌తో అంతగా పని లేకపోతే, ఈ మొత్తాన్ని దీర్ఘకాలిక లక్ష్యాల కోసం కేటాయించాలి. ఇందులో పిల్లల చదువు, మీ పదవీ విరమణ ప్రణాళికలాంటివి ఉండొచ్చు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు, ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్), జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లాంటివి పరిశీలించాలి. కొంత మొత్తం పక్కన పెట్టిన తర్వాత సిస్టమేటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) ద్వారా ఫండ్లలోకి మళ్లించవచ్చు. ఇప్పటికే క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) చేస్తుంటే.. దాన్ని పెంచుకునే ప్రయత్నం చేయొచ్చు.

నైపుణ్యాలు పెంచుకోండి..

అన్ని పెట్టుబడులూ ఆర్థిక అవసరాలే కావాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకునేందుకూ మీ మీద మీరే పెట్టుబడి పెట్టుకోండి. దీనివల్ల మీరు చేసే పనిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. కాస్త విరామం తీసుకొని, కొత్త ప్రాంతాలు చూడ్డానికి వెళ్లేందుకూ బోనస్‌లో కొంత మొత్తాన్ని వినియోగించుకోవచ్చు.

పండగ బోనస్ అంటే ఖర్చు చేయడం ఒక్కటే కాదు.. ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసుకునేందుకు ఒక అవకాశంగా భావిస్తే.. దీర్ఘకాలంలో మంచి ఫలితాలను ఆస్వాదించగలరు.



పిల్లల భవితకు బీమా

పిల్లల ఆర్థిక శ్రేయస్సు గురించి అందరూ ఆలోచిస్తుంటారు. చదువు, పెళ్లి, ఇతర అవసరాలకు ఏ ఇబ్బందీ లేకుండా డబ్బును సమకూర్చాలని అనుకుంటారు. తల్లిదండ్రులుగా మీ ఆర్థిక ప్రణాళికలతో వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం బీమా పాలసీలను ఉపయోగించుకోవడం ఎలాగో తెలుసుకుందాం.

జీవిత బీమా సంస్థలు పిల్లలకు తగిన ఆర్థిక భద్రత కల్పించేందుకు వీలుగా కొన్ని పాలసీలను అందిస్తున్నాయి. వారి జీవితంలో ముఖ్యమైన దశల్లో అవసరమైన ఆర్థిక సహాయం అందేలా ఇవి తోడ్పడతాయి. నష్టభయం తక్కువగా ఉండటంతోపాటు, పన్ను ప్రయోజనాలనూ (పాత పన్ను విధానంలో ఉన్న వారికి) అందిస్తుంటాయి. ఇందులో యూనిట్ ఆధారిత బీమా పాలసీలూ, సంప్రదాయ ఎండోమెంట్ పాలసీలూ అందుబాటులో ఉన్నాయి.

యులిప్‌లతో..

పిల్లల కోసం కొన్ని బీమా సంస్థలు ప్రత్యేకంగా యూనిట్ ఆధారిత బీమా పాలసీలు (యులిప్) అందిస్తున్నాయి. బీమా, పెట్టుబడి ఈ రెండు ప్రయోజనాలూ ఇందులో ఉంటాయి. పిల్లల భవిష్యత్ కోసం పెట్టుబడి పెట్టాలి, అదే సమయంలో వారికి ఆర్థిక రక్షణ అందించాలని భావించే వారు ఈ పాలసీలను ఎంచుకోవచ్చు.

యులిప్‌లోనూ ఈక్విటీ, డెట్, బ్యాలెన్స్‌డ్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేందుకు వీలుగా ఫండ్లను ఎంపిక చేసుకోవచ్చు. నష్టభయం భరించే సామర్థ్యం, పెట్టుబడి లక్ష్యం ఆధారంగా ఏ ఫండ్లను ఎంచుకోవాలన్నది నిర్ణయించుకోవాలి.

యులిప్‌లను ఎంచుకున్నప్పుడు చెల్లించిన ప్రీమియంలో అధిక భాగం మార్కెట్‌లో పెట్టుబడిగా వెళ్తుంది. కాబట్టి, సంప్రదాయ పథకాలతో పోలిస్తే ఇందులో కాస్త మంచి రాబడిని ఆశించవచ్చు.

పెట్టుబడికి నష్టభయం ఉన్నందున, పాలసీని ఎంచుకునే ముందు వ్యక్తులు తమ ఆర్థిక పరిస్థితిని విశ్లేషించుకోవాలి. కనీసం 10-15 ఏళ్లపాటు ప్రీమియం చెల్లించగలను అనుకున్నప్పుడే ఈ పాలసీని ఎంచుకోవాలి.

సంప్రదాయ పాలసీలూ..

దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికల కోసం సంప్రదాయ ఎండోమెంట్ పాలసీలనూ పరిశీలించవచ్చు. ఎండోమెంట్‌లు హామీతో కూడిన రాబడిని అందిస్తాయి. పొదుపు, బీమా ప్రయోజనాన్ని ఇవి అందిస్తాయి.

ఇందులో ఒకేసారి ప్రీమియం చెల్లించి, పాలసీని ఎంచుకునే సౌకర్యమూ ఉంది. పిల్లల జీవితంలోని ముఖ్యమైన దశల్లో పాక్షిక ఉపసంహరణకూ వీటిలో అవకాశం ఉంటుంది. ఏటా ప్రీమియం చెల్లించే పాలసీలనూ ఎంచుకోవచ్చు. కొన్ని పాలసీలకు నెల, ఆరునెలలకోసారి ప్రీమియం చెల్లించే వెసులుబాటూ ఉంటుంది.

రైడర్లూ ఉంటాయి...

పిల్లల బీమా పాలసీలను ఎంచుకున్నప్పుడు అదనంగా కొన్ని రైడర్లనూ తీసుకోవచ్చు. ఇందులో ముఖ్యంగా హాస్పిటల్ కేర్ రైడర్, యాక్సిడెంటల్ డెత్, ప్రీమియం మినహాయింపు, క్రిటికల్ ఇల్‌నెస్ బెనిఫిట్ రైడర్లాంటివి ఉంటాయి. ప్రాథమిక పాలసీని తీసుకునేటప్పుడే అవసరమైన మేరకు ఈ రైడర్లను ఎంపిక చేసుకోవడం మర్చిపోవద్దు.

ఇప్పుడే తీసుకోండి..

పిల్లల పాలసీలను ఎప్పుడు తీసుకోవాలనే ఆలోచన చాలా మందిలో ఉంటుంది. ఈ పాలసీలను ఎంత తొందరగా తీసుకుంటే అంత మంచిదన్న సంగతి ఇక్కడ గమనించాలి. బిడ్డ పుట్టిన వెంటనే ఈ పాలసీలను తీసుకోవడం ద్వారా దీర్ఘకాలంలో మంచి నిధిని సమకూర్చుకోవచ్చు. పిల్లలకు 18 ఏళ్లు వచ్చే నాటికి ఉన్నత చదువులకు అవసరమైనంత మేరకు చేతిలో తగినంత మొత్తం ఉండేలా చూసుకోవాలి.


రెండు విధాల రక్షణ..

పిల్లల కోసం ప్రత్యేకంగా ఉన్న కొన్ని పాలసీలు రెండు రకాల రక్షణను కల్పిస్తాయి. పాలసీ తీసుకున్న తల్లిదండ్రులకు ఏదైనా జరిగితే... నామినీగా ఉన్న పిల్లలకు పాలసీ మొత్తం పరిహారంగా అందుతుంది. అక్కడి నుంచి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదు. తిరిగి పాలసీ వ్యవధి ముగిసినప్పుడు మరోసారి పాలసీ మొత్తం అందుతుంది. ఈ విధంగా ఉన్న పాలసీలను ఎంచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో తల్లిదండ్రులూ తమ పేరుమీద తగినంత మొత్తానికి టర్మ్ పాలసీ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

చెల్లింపులు సురక్షితంగా

ఎన్‌పీసీఐ సూచనలివీ

పండగల సందర్భంగా కొనుగోళ్లు చేసే క్రమంలో చాలామంది వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు చేస్తుంటారు. ఈ సమయంలో వారు కీలకమైన సమాచార భద్రతను విస్మరిస్తుంటారు. ఇది ఆర్థిక నష్టాన్ని కలిగించడంతోపాటు, మానసిక వేదనకూ కారణం అవుతుంది. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులు మరింత సురక్షితంగా లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొన్ని సూచనలు ఇస్తోంది.



◆ ఆకర్షణీయమైన రాయితీలు, తక్కువ ధరలు అప్పటికప్పుడు కొనుగోలు చేసేలా ప్రేరేపిస్తాయి. వీటిని దక్కించుకోవాలనే ఆత్రుతలో ఒక్కోసారి ఆయా వెబ్‌సైట్ల వివరాలు, చట్టబద్ధతను సరిగా పట్టించుకోకపోవచ్చు. అవి అధీకృతమైనవేనా అని చూసుకోకుండానే లావాదేవీలు చేసేస్తుంటారు. ఇలాంటప్పుడు కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలి. మీకు పరిచయం లేని విక్రేతలు, విశ్వసనీయత లేని వెబ్‌సైట్ల జోలికి వెళ్లకూడదు. పూర్తిగా అధ్యయనం చేశాకే కొనుగోలు చేయడం మంచిది.

◆ ఆన్‌లైన్ కొనుగోళ్లు, ఇతర లావాదేవీల సందర్భంలో అవసరమైనంత మేరకే వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోండి. అవసరానికి మించిన సమాచారం అడిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటివి మీ సమాచార తస్కరణకు దారి తీయొచ్చు.

◆ షాపింగ్ మాళ్లలో కొనుగోలు చేసేటప్పుడు, ఇతర చోట్ల ఉచిత వై-ఫై సౌకర్యాన్ని వినియోగించుకోవద్దు. వీలైనంత వరకూ మీ మొబైల్ డేటానే వాడండి. రక్షణ లేని వై-ఫైని వాడి చెల్లింపులు చేసినప్పుడు హ్యాకర్లు మీ ఆర్థిక సమాచారాన్ని తస్కరించే అవకాశం ఉంటుంది.

◆ పండగలప్పుడు ఆన్‌లైన్‌లో అధిక కొనుగోళ్లు చేసినప్పుడు వాటిని ట్రాక్ చేయడం కష్టం అవుతుంది. మోసపూరిత డెలివరీ నోటిఫికేషన్లు రావచ్చు. చెల్లింపు లింకులపై క్లిక్ చేసేముందు ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోండి.

◆ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపు యాప్‌లు, బ్యాంకు ఆన్‌లైన్ ఖాతాలకు సులభమైన పాస్‌వర్డ్‌లను పెట్టుకోవద్దు. ప్రతి ఖాతాకూ ప్రత్యేకంగా పాస్‌వర్డ్ ఉండేలా చూసుకోండి. మీ యూపీఐ పిన్ సులభంగా ఉండకుండా చూసుకోండి. ఈ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు.

మధ్య స్థాయి కంపెనీల్లో..

కొత్త పథకం

బరోడా బీఎన్‌పీ పారిబస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక మిడ్ క్యాప్ ఇండెక్స్ పథకాన్ని తీసుకొచ్చింది. బరోడా బీఎన్‌పీ పారిబస్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 28 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్‌ఎఫ్‌ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 టీఆర్ఐ సూచీ ఈ పథకానికి కొలమానంగా ఉంటుంది. ఇది ప్యాసివ్‌గా నిర్వహించే పథకం కాబట్టి, నిర్వహణ వ్యయాలు కొంత తక్కువగా ఉంటాయి. క్యాపిటల్ గూడ్స్, కెమికల్స్, స్థిరాస్తి, దుస్తులు.. తదితర విభాగాలకు చెందిన కంపెనీలతో ఈ పథకం పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తారు. ఈ పథకానికి నీరజ్ సక్సేనా ఫండ్ మేనేజర్. దీర్ఘకాలిక మదుపరులకు మిడ్‌క్యాప్ పథకాలు అనువుగా ఉంటాయి. కనీసం మూడేళ్ల నుంచి అయిదేళ్ల పాటు పెట్టుబడులను కొనసాగించగలిగే ఆలోచన ఉన్న మదుపరులు ఇలాంటి పథకాలను పరిశీలించవచ్చు.

పసిడిలో పెట్టుబడికి

బంగారంలో మదుపు చేయాలనుకునే వారికోసం గ్రో మ్యూచువల్ ఫండ్ నుంచి గ్రో గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) పథకం అందుబాటులోకి వచ్చింది. ఇది బంగారంపై పెట్టుబడి పెట్టే పథకం. తమ పెట్టుబడి జాబితాలో బంగారమూ ఉండాలని ఆశించే మదుపరులకు అనువుగా ఉంటుంది. పసిడిని ఆభరణాల కోసం కొనుగోలు చేయడం కాకుండా, పెట్టుబడిగా భావించే మదుపరులు ఉంటారు. ఇలాంటి వారికి ఈ తరహా పథకాలు అనువుగా ఉంటాయి. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు తమ పెట్టుబడిని వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది. స్థిరమైన ప్రతిఫలం లభిస్తుంది కూడా. గ్రో గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఎన్ఎఫ్ఓ ఈ నెల 30 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.500. ఈ పథకానికి దేశీయ మార్కెట్లో బంగారం ధరను కొలమానంగా తీసుకుంటారు.

లక్ష్య సాధనకు వ్యూహం ఇలా..



ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు సరైన పెట్టుబడి వ్యూహాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. పదవీ విరమణ ప్రణాళిక, ఇల్లు కొనుగోలు, పిల్లల విద్య, అవసరాలకు అనుగుణంగా తగిన పెట్టుబడి ప్రణాళికలు ఉండాలి. వీటిని ఎలా రచించుకోవాలన్న సంగతి చూద్దాం..

పెట్టుబడులు ప్రారంభించే ముందు మీ లక్ష్యాలేమిటి అనేది స్పష్టంగా నిర్ణయించుకోవడం చాలా అవసరం. పదవీ విరమణ కోసం పొదుపు చేయాలనే సాధారణ ఆలోచనకు బదులు.. మీరు ఎంత ఆదా చేసుకోవాలనుకుంటున్నారన్నది కచ్చితంగా నిర్వచించుకోవాలి. ఉదాహరణకు పదవీ విరమణ నిధి రూ.3 కోట్ల వరకూ ఉండాలి. అనుకున్నారనుకోండి. దాన్ని సాధించేందుకు అవసరమైన పెట్టుబడులు పెట్టేలా ప్రణాళిక వేసుకోవాలి. ఇలాంటి దీర్ఘకాలిక లక్ష్యాల కోసం నష్టభయం ఉన్నప్పటికీ, కాస్త మంచి రాబడిని అందించే పథకాలను ఎంచుకోవాలి. అదే స్వల్పకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు సురక్షిత పథకాల్లో మదుపు చేయడమే మంచిది.

ఎక్కడ మదుపు చేయాలి?

నష్టభయం భరించే సామర్థ్యం, పెట్టుబడి పెట్టేందుకు అనువైన పథకాలను ఎంచుకోవాలి. ఏయే పథకానికి ఎంత కేటాయించాలనేదీ కీలకమే. షేర్లు, బాండ్లు, స్థిరాస్తి, బంగారం ఇలా పథకాలను ఎంచుకోవాలి. నష్టభయం భరించే శక్తి ఎక్కువగా ఉంటే, ఈక్విటీలకు అధికంగా కేటాయించాలి. వీటిలో కాస్త అస్థిరత ఉన్నప్పటికీ అధిక రాబడిని అందిస్తాయి. నష్టభయం తట్టుకోలేం అనుకునే వారు సురక్షితంగా ఉండే బాండ్ల వంటి వాటిని పరిశీలించాలి. ఇవి కాస్త స్థిరంగా ఉంటాయి, అదే సమయంలో తక్కువ రాబడినిస్తాయి.

ఎంపిక వైవిధ్యంగా

పెట్టుబడికి వచ్చే నష్టాన్ని తగ్గించి, రాబడిని పెంచుకోవాలనుకుంటే అనుసరించాల్సిన వ్యూహం పథకాల ఎంపికలో వైవిధ్యం. వివిధ ఆస్తులు, రంగాలు, సంస్థలలో మీ పెట్టుబడులను విస్తరించాలి. ఒకే పథకంలో మొత్తం డబ్బును మదుపు చేస్తే, అది సరిగా పనిచేయకపోతే నష్టాలు వస్తాయి. ఉదాహరణకు మీరు తయారీ రంగంలోని కంపెనీల్లోనే మదుపు చేశారనుకుందాం. సరైన గిరాకీ లేకపోతే ఈ విభాగంలోని కంపెనీల షేర్ల పనితీరు దెబ్బతింటుంది. అందుకే, పెట్టుబడులు వైవిధ్యంగా ఉండాలి. పలు రకాల షేర్లలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించే ఇండెక్స్ ఫండ్లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు, డైవర్సిఫైడ్ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకొని, మదుపు చేయాలి.

సమీక్షించండి...

సమర్థమైన ప్రణాళిక కోసం ఎప్పటికప్పుడు మీ పెట్టుబడులను సమీక్షిస్తూ ఉండాలి. దీనివల్ల మీ లక్ష్య సాధనకు అనువైన మార్గంలో పెట్టుబడులు పనిచేస్తున్నాయా లేదా అనేది తెలుసుకోవడం సులభం అవుతుంది. మీరు మదుపు చేస్తున్న పథకాలు సరైన రాబడిని అందిస్తున్నాయా లేదా తెలుసుకునేందుకు అదే విభాగంలోని ఇతర ఫండ్లతో పోల్చి చూసుకోవాలి. ఏడాదికోసారైనా పెట్టుబడులపై సమీక్ష నిర్వహించండి. మార్కెట్ హెచ్చుతగ్గుల సమయంలోనూ, ఆదాయం పెరిగినప్పుడు, జీవితంలో కీలక సంఘటనల సందర్భంలోనూ పెట్టుబడులను సరిచూసుకోవాలి.

సర్దుబాటు చేసుకోవాలి

పెట్టుబడి వ్యూహం ఎప్పుడూ స్థిరంగా ఉండకూడదు. మారుతున్న లక్ష్యాలకు అనుగుణంగా, మార్కెట్ పరిస్థితులను బట్టి దీన్ని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలి. మీ ఆర్థిక లక్ష్యాలను చేరుకుంటున్న దశలో సురక్షిత పెట్టుబడి పథకాల్లోకి ఆ నిధిని మళ్లించాలి. ఒక పథకంలో ఉండాల్సిన నిష్పత్తికి మించి పెట్టుబడి ఉంటే, దాన్ని ఇతర ఫండ్లలోకి మళ్లించాలి. ఎప్పటికప్పుడు సర్దుబాటు చేస్తూ, సమతౌల్యం చేసినప్పుడే పోర్ట్‌ఫోలియో మంచి లాభాలను ఆర్జిస్తుంది.

క్రెడిట్ కార్డుతో రుణం తీసుకుంటున్నారా?

ఒకసారి క్రెడిట్ కార్డు చేతికి రాగానే.. ఇక ఖర్చు పెట్టుకునేందుకు ఇబ్బందే లేదు అన్నట్లు చాలామంది భావిస్తుంటారు. వాస్తవానికి ఈ కార్డు మీకు తాత్కాలిక రుణంలాంటిదే. దీన్ని వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయం. ముఖ్యంగా కార్డును ఉపయోగించి అప్పు తీసుకునేటప్పుడు కొన్ని విషయాలు గమనించాలి.

క్రెడిట్ కార్డు కొనుగోళ్లు చేయడానికే కాదు.. అత్యవసరాల్లో వెంటనే అప్పు ఇచ్చే సాధనంగానూ ఉపయోగపడుతుంది. పండగల వేళ అవసరానికి డబ్బు కావాలనుకున్నప్పుడు వెంటనే ఈ రుణాన్ని తీసుకునే వీలుంది. వ్యక్తిగత రుణాలతో పోలిస్తే దీనికి నిబంధనలు కొంత సరళంగానే ఉంటాయి. అదనపు పత్రాలు సమర్పించాల్సిన అవసరమూ ఉండదు. బ్యాంకు యాప్, ఆన్‌లైన్ ఖాతా నుంచి ఒక్క క్లిక్‌తో ఈ రుణాన్ని పొందేందుకు అవకాశం ఉంది. క్రెడిట్ కార్డుతో కొంత మేరకు ఏటీఎం నుంచి నగదు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. దీనికి మించి కావాలనుకున్నప్పుడు రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.



- క్రెడిట్ కార్డు ఉన్న వారందరికీ బ్యాంకులు రుణాలను ఇవ్వకపోవచ్చు. బ్యాంకులు, కార్డు సంస్థలు ఆయా కార్డులపై ఎంత మేరకు రుణం ఇస్తామనే సంగతిని ముందుగానే చెబుతాయి. అవసరం ఉన్నప్పుడు ఒక్క క్లిక్ చేస్తే చాలు.. క్షణాల్లో ఖాతాలో డబ్బును జమ చేస్తాయి. ఇది ఎలాంటి హామీ లేని రుణమే. కార్డుతో నగదు తీసుకున్నప్పుడు గడువు లోపు బిల్లుతో కలిపి చెల్లించాలి. నగదు తీసుకున్న రోజు నుంచీ వడ్డీ లెక్క ఉంటుంది. కార్డు రుణం తీసుకున్నప్పుడు గరిష్ఠంగా 36 నెలల పాటు రుణ వ్యవధి ఉంటుంది.
- కార్డును ఉపయోగించి నగదు తీసుకుంటే ఆ మేరకు పరిమితి తగ్గుతుంది. రుణం తీసుకున్నప్పుడు కార్డు పరిమితితో సంబంధం ఉండదు. దీనివల్ల మీ కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకమూ కలగదు.
- క్రెడిట్ కార్డు తీసుకున్నప్పుడు మీరు ఇచ్చిన పత్రాల ఆధారంగానే రుణం వస్తుంది. కాబట్టి, వ్యక్తిగత రుణాలకు ఇచ్చినట్లు ఆదాయ ధ్రువీకరణ, ఇతర పత్రాలను అందించాల్సిన అవసరం లేదు.
- మీ కార్డు వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించినప్పుడు ఎంత రుణం లభిస్తుంది, వడ్డీ ఎంత, వాయిదా ఎంత చెల్లించాలి అనే వివరాలు తెలుస్తాయి. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఈ వెసులుబాటును వినియోగించుకోవాలి.
- వాయిదా నెలనెలా బిల్లుతోపాటే వస్తుంది. కాబట్టి, మీ నెలవారీ బడ్జెట్‌లో ఈ కొత్త ఈఎంఐకి స్థానం ఉందంటేనే కార్డు రుణం తీసుకోండి.
- క్రెడిట్ కార్డు పరిమితిలో ఎప్పుడూ 30 శాతానికి మించి వినియోగించకూడదు. ఇతర రుణాలతో పోలిస్తే కార్డుపై రుణానికి అధిక వడ్డీ ఉంటుంది. మీ మొత్తం ఈఎంఐలు ఆదాయంలో 40 శాతానికి మించకుండా ఉండాలి. ఇవన్నీ చూసుకున్నాకే, అప్పు తీసుకోవాలా, వద్దా? అనే నిర్ణయం తీసుకోండి.
- క్రెడిట్ కార్డుపై రుణం తీసుకున్నప్పుడు అది మీ క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపిస్తుంది. కాబట్టి, తప్పనిసరి పరిస్థితుల్లోనే రుణం కోసం దరఖాస్తు చేయడం మేలు.

ఇవి గుర్తుంచుకోండి...

- క్రెడిట్ కార్డు మీ ఆదాయాన్ని పెంచదు. దీన్ని వాడినప్పుడు, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందే.
- తిరిగి చెల్లించగలను అనే పూర్తి నమ్మకం ఉన్నప్పుడే కార్డుతో ఖర్చు చేయండి.
- ఆలస్యంగా చెల్లించడం అంటే.. రుసుముల భారాన్ని మోయడమే.

ఆరేళ్లలో రూ.50లక్షలు కావాలంటే..

మార్గదర్శి

నెలకు రూ.10 వేల వరకూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్నాను. కొత్తగా మరో రూ.5వేలను పెట్టుబడి పెట్టాలనే ఆలోచన ఉంది. మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవాలా? సురక్షిత పథకాల్లో మదుపు చేయాలా? మరో 10 ఏళ్లపాటు పెట్టుబడిని కొనసాగించగలను. ఎంత మేరకు రావచ్చు? - మోహన్

▲ నాలుగేళ్లుగా స్టాక్ మార్కెట్లు మంచి లాభాలను ఇస్తున్నాయి. కొత్త మదుపరులు చాలామంది ఇందులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం కొంత హెచ్చుతగ్గులు కనిపిస్తున్నా, రానున్న రోజుల్లో మంచి రాబడులను అందించే అవకాశాలే ఉన్నాయి. మీకు 10 ఏళ్ల వ్యవధి ఉంది కాబట్టి, మంచి మొత్తంలో డబ్బు జమయ్యే వీలుంది. మీరు ఇప్పటికే మదుపు చేస్తున్న రూ.10వేలు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో కొనసాగించండి. కొత్తగా మదుపు చేస్తున్న మొత్తాన్ని రూ.3వేలను మిడ్ క్యాప్ ఫండ్లలో, రూ.2వేలను స్మాల్ క్యాప్ ఫండ్లలో మదుపు చేయండి. కాస్త నష్టభయం ఉన్నప్పటికీ, వీటిలో 10 ఏళ్ల కాలంలో మంచి లాభాలు కనిపించే ఆస్కారం ఉంది. ఇప్పటి నుంచీ నెలకు రూ.15వేలను 10 ఏళ్లపాటు క్రమం తప్పకుండా మదుపు చేస్తే 13 శాతం సగటు వార్షిక రాబడి అంచనాతో రూ.37,46,576 అయ్యే వీలుంది.

నా వయసు 24. నెలకు రూ.30వేల వరకూ వేతనం వస్తోంది. ఇందులో నుంచి రూ.15వేల వరకూ పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. దీనికోసం నా ఆర్థిక ప్రణాళిక ఎలా ఉండాలి? - సందీప్

▲ చిన్న వయసులోనే ఆర్థిక ప్రణాళిక వేసుకోవాలనే ఆలోచన అభినందనీయం. పెట్టుబడి వృద్ధి చెందేందుకు చక్రవడ్డీ ప్రయోజనం మీకు ఎంతగానో తోడ్పడుతుంది. మీపై ఆధారపడిన వారు ఉంటే.. కనీసం రూ.40లక్షల వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోండి. ఆరోగ్య బీమా, వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ తీసుకోండి. ఆరు నెలలకు సరిపోయే అత్యవసర నిధిని సిద్ధం చేసుకోండి. మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న రూ.15వేలలో రూ.5వేలను ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)లో జమ చేయండి. మిగతా రూ.10వేలు డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేయండి.

మరో ఆరేళ్లలో పదవీ విరమణ చేస్తాను. ఇప్పటి వరకూ ఎలాంటి పదవీ విరమణ ప్రణాళికలూ వేసుకోలేదు. 2030 నాటికి నా దగ్గర రూ.50లక్షలు ఉండాలంటే ఇప్పటి నుంచి ఎంత పెట్టుబడి పెట్టాలి? ఏ పథకాలను ఎంచుకోవాలి? - కృష్ణ

▲ మీ పదవీ విరమణకు డబ్బు జమ చేసేందుకు సమయం తక్కువగా ఉంది. కాబట్టి, కాస్త అధిక మొత్తంలోనే పెట్టుబడి అవసరం అవుతుంది. మీకు ఆరేళ్లలో రూ.50లక్షలు జమ కావాలంటే.. మీ పెట్టుబడిపై కనీసం 11 శాతం సగటు రాబడి వచ్చేలా చూసుకోవాలి. మీరు దాదాపు నెలకు రూ.47,000-రూ.50,000 మధ్య మదుపు చేస్తే మీరు అనుకున్న మొత్తం వస్తుంది. దీనికి మీరు హైబ్రిడ్ ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లను పరిశీలించవచ్చు. మీకు ఇతర ఆదాయపు మార్గాలు లేకపోతే జమైన రూ.50లక్షలు మీ అవసరాలకు సరిపోకపోవచ్చు. కాబట్టి, ఇంకా అధిక మొత్తం పొదుపు చేసేందుకు ప్రయత్నించండి.

బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో వడ్డీ అధికంగా లభిస్తోంది కదా. వీటిలో డబ్బు జమ చేయొచ్చా? నష్టం వచ్చే అవకాశాలుంటాయా? - సంతోష్



▲ పెట్టుబడి పథకం ఏదైనా సరే బ్యాంకు డిపాజిట్‌కు మించి అధిక వడ్డీ ఇస్తోంది అంటే, అందులో కాస్త నష్టభయం ఉంటుందని గమనించాలి. కార్పొరేట్ డిపాజిట్లు సాధారణంగా బ్యాంకు డిపాజిట్లకంటే అధిక వడ్డీ ఇస్తాయి. వడ్డీ పెరుగుతున్న కొద్దీ, నష్టభయమూ అధికమవుతోంది. మంచి చరిత్ర ఉన్న పెద్ద కార్పొరేట్ డిపాజిట్లనే ఎంచుకోవాలి. ప్రత్యామ్నాయంగా మీరు షార్ట్ టర్మ్ డెట్ మ్యూచువల్ ఫండ్లనూ చూడొచ్చు.

- తుమ్మ బాల్‌రాజ్

ప్రిపరేషన్ టెక్నిక్

ఇప్పుడు దాదాపు అన్ని పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. కాబట్టి ఆన్‌లైన్‌లోనే ప్రాక్టీస్ చేయాలి. ప్రామాణిక వెబ్‌సైట్లు అందిస్తున్న పరీక్షలను ఆన్‌లైన్‌లో రాయడం ద్వారా ఆ వాతావరణానికి అలవాటు పడతారు. రియల్ పరీక్షలో ఇబ్బంది లేకుండా ఉంటుంది.

డీఎస్సీ - 2024
తెలుగు కంటెంట్

కరెంట్ అఫైర్స్



■ కార్వార్ నేవల్ బేస్‌లోని దేశానికి చెందిన అతిపెద్ద రక్షణ మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ అయిన 'సీబర్ ప్రాజెక్ట్' డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల ఎవరు బాధ్యతలు స్వీకరించారు? (వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి నుంచి ఈయన బాధ్యతలు స్వీకరించారు.) జ: వైస్ అడ్మిరల్ రాజేష్ ధన్‌ఖడ్

■ అత్యవసర నిర్వహణ రంగం (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్)లో సహకారం పై ఉమ్మడి రష్యన్ - భారత్ కమిషన్ ఎన్నో సమావేశాన్ని 2024, ఆగస్టు 28న

మాదిరి ప్రశ్నలు

మాస్కోలో నిర్వహించారు? జ: రెండో సమావేశం

■ రైల్వే బోర్డు నూతన ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (రైల్వే బోర్డు మొదటి మహిళా ఛైర్‌పర్సన్‌గా రికార్డు సృష్టించిన జయవర్మ సిన్హా స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు.) జ: సతీష్ కుమార్


■ ఇంటర్నేషనల్ డే ఎగైనెస్ట్ న్యూక్లియర్ టెస్ట్స్ (అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం)ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2009, డిసెంబరు 2న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 64వ సమావేశంలో ఈ తేదీని అణు పరీక్షలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటిస్తూ 64/35 తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.) జ: ఆగస్టు 29

■ ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎమ్‌జేడీవై) పథకం 2024, ఆగస్టు 28 నాటికి ఎన్నేళ్లు పూర్తి చేసుకుంది? జ: 10

మరింత సమాచారం

అన్నింటిలో అదొక్కటే తేడా!

ప్రయాణంలో కారు ఆగిపోయింది. బాగు చేయడానికి రకరకాలుగా ప్రయత్నిస్తారు. ఒక నిర్ణయం తీసుకోవాలి. దానివల్ల కలిగే లాభనష్టాలను పలు కోణాల్లో పరిశీలిస్తారు. అదంతా సమస్యకు వివిధ పరిష్కార మార్గాలను అన్వేషించడమే. ఈ సామర్థ్యాలను అభ్యర్థుల్లో పరీక్షించడానికి 'భిన్న పరీక్ష' అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతారు. వాటి ఆధారంగా త్వరగా నిర్ణయాలు తీసుకునే శక్తిని, కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారగలిగే నేర్పుని అంచనా వేస్తారు. సంబంధిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయడం ద్వారా నిశిత పరిశీలన, విశ్లేషణ, పోలిక, ఊహాశక్తి, తార్కిక ఆలోచన, మూసను గుర్తించే నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు.



భిన్న పరీక్ష

జనరల్ స్టడీస్
రీజనింగ్

ప్రశ్నలో భాగంగా నాలుగు ఐచ్ఛికాలు ఇస్తారు. వీటిలో మూడింటి మధ్య ఒకే రకమైన సంబంధం కనిపిస్తుంది. మరొకటి మాత్రం అందులో ఇమడకుండా ఉంటుంది. అలాంటి ఐచ్ఛికాన్ని అభ్యర్థులు కనుక్కోవాలి. ఈ అధ్యాయంలో భాగంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించడానికి అభ్యర్థికి వర్గాలు, ఘనాలు, సరి సంఖ్యలు, బేసి సంఖ్యలు, ప్రధాన సంఖ్యల్లాంటి వాటిని గుర్తించే సామర్థ్యం ఉండాలి. అంతేకాకుండా ఆంగ్ల అక్షరమాలకు సంబంధించిన అనురూప సంఖ్యలు, వాటి అనువర్తనాలపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.

భిన్న పరీక్ష 3 రకాలుగా ఉంటుంది. అవి..

1) పదాల భిన్న పరీక్ష

ఉదా: కింది పదాల్లో భిన్నమైంది గుర్తించండి.

1) త్రిభుజం 2) చతురస్రం 3) రాంబస్ 4) వృత్తం

మొదటి మూడు జ్యామితీయ పటాలు రేఖలతో ఉంటే వృత్తం మాత్రం వక్రరేఖను కలిగి ఉంది. జ: 4

2) సంఖ్యా భిన్న పరీక్ష

ఉదా: కింది సంఖ్యల్లో భిన్నమైంది గుర్తించండి.

1) 5720 2) 6710 3) 2640 4) 4270

5720 → 5 + 2 + 0 = 7 (కుడివైపు నుంచి రెండో అంకె)

6710 → 6 + 1 + 0 = 7 (కుడివైపు నుంచి రెండో అంకె)

2640 → 2 + 4 + 0 = 6 (కుడివైపు నుంచి రెండో అంకె)

4270 → 4 + 7 + 0 = 11 (కుడివైపు నుంచి రెండో అంకె కాదు) జ: 4

3) అక్షర భిన్న పరీక్ష

ఉదా: కింది అక్షరాల్లో భిన్నమైంది గుర్తించండి.

1) MUP 2) PAG 3) KER 4) AHI

మొదట మూడు ఆప్షన్లలో సరిగ్గా మధ్యలో అక్షరం అచ్చు ఉండి, మొదటి, చివరి అక్షరాలు హల్లులున్నాయి.

కానీ, 4వ ఆప్షన్ మధ్యలో అక్షరం హల్లుగా ఉంది. జ: 4

1. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి.
1) 626 2) 841
3) 962 4) 1090

వివరణ: 626 → 626 − 1 = 625 = 25^2

841 → 841 − 1 = 840 (కచ్చిత వర్గ సంఖ్య కాదు)

962 → 962 − 1 = 961 = 31^2

1090 → 1090 − 1 = 1089 = 33^2

జ: 2

2. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి.
1) 246 2) 356
3) 527 4) 639

వివరణ: 246 → 2 + 4 = 6

356 → 3 + 5 ≠ 6

527 → 5 + 2 = 7

639 → 6 + 3 = 9

సంఖ్యలో మొదటి రెండు అంకెల మొత్తం మూడో అంకెకు సమానంగా ఉంది. జ: 2

3. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి.
1) (18, 45) 2) (23, 14)
3) (29, 82) 4) (36, 27)

వివరణ: (18, 45) → 45 − 18 = 27

(23, 14) → 23 − 14 = 9

మాదిరి ప్రశ్నలు

(82, 29) → 82 − 29 = 53

(36, 27) → 36 − 27 = 9

సంఖ్యల మధ్య భేదం 9 గుణిజంగా ఉంది. జ: 3

4. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి.
1) 4, 16, 24, 12
2) 2, 8, 4, 16
3) 1, 4, 2, 8
4) 3, 12, 6, 24

వివరణ: 4 : 16 : 24 : 12 = 1 : 4 : 6 : 3

2 : 8 : 4 : 16 = 1 : 4 : 2 : 8

1 : 4 : 2 : 8 = 1 : 4 : 2 : 8

3 : 12 : 6 : 24 = 1 : 4 : 2 : 8

ప్రతిదానిలో సంఖ్యల మధ్య నిష్పత్తి 1 : 4 : 2 : 8 గా ఉంది. జ: 1

5. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి.
1) 1975 − 1579
2) 3152 − 5321
3) 4283 − 8432
4) 7319 − 9731

వివరణ: 1975 అనే సంఖ్యలోని అంకెలను అవరోహణ క్రమంలో రాయగా 9751

3152 → 5321; 4283 → 8432

7319 → 9731 జ: 1

6. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి. (TS S.I. Mains - 2018)
1) 1156 2) 1444
3) 1764 4) 2430

వివరణ: 1156 → 34^2

1444 → 38^2; 1764 → 42^2

2430 → కచ్చిత వర్గ సంఖ్య కాదు

జ: 4

7. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి. (TS S.I. Mains - 2018)

ZA, YE, XI, WO, TU

1) ZA 2) XI 3) WO 4) TU

వివరణ: రెండో అక్షరం (A, E, I, O, U) అచ్చుగా ఉంది.

$Z \xrightarrow{-1} Y \xrightarrow{-1} X \xrightarrow{-1} W \xrightarrow{-1} V$

జ: 4

8. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి. (AP SI Mains 2019)

1) B, C 2) K, M 3) Q, S 4) V, W

వివరణ:

B	C	K	M	Q	S	V	W
↓	↓	↓	↓	↓	↓	↓	↓
2	3	11	13	17	19	22	23

V = 22 అనేది మాత్రమే ప్రధాన సంఖ్య కాదు (సంయుక్త సంఖ్య), మిగతావన్నీ ప్రధాన సంఖ్యలు. జ: 4

9. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి.
1) CFILO 2) UXADG
3) OMSVY 4) ORUXA

వివరణ: $C \xrightarrow{+3} F \xrightarrow{+3} I \xrightarrow{+3} L \xrightarrow{+3} O$

$U \xrightarrow{+3} X \xrightarrow{+3} A \xrightarrow{+3} D \xrightarrow{+3} G$

$O \xrightarrow{-2} M \xrightarrow{+6} S \xrightarrow{+3} V \xrightarrow{+3} Y$

$O \xrightarrow{+3} R \xrightarrow{+3} U \xrightarrow{+3} X \xrightarrow{+3} A$

జ: 3

10. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి.
1) PKFB 2) XSNI
3) VQLG 4) TOJE

వివరణ: $P \xrightarrow{-5} K \xrightarrow{-5} F \xrightarrow{-5} A$

$X \xrightarrow{-5} S \xrightarrow{-5} N \xrightarrow{-5} I$

$V \xrightarrow{-5} Q \xrightarrow{-5} L \xrightarrow{-5} G$

$T \xrightarrow{-5} O \xrightarrow{-5} J \xrightarrow{-5} E$ జ: 1

11. కింది వాటిలో భిన్నమైన దాన్ని గుర్తించండి. (TSPSC Prelims 2018)
1) అంకమధ్యమం 2) విస్తృతి
3) బాహుళకం
4) మధ్యగతం

వివరణ: విస్తృతి కాకుండా మిగతావన్నీ కేంద్రీయ స్థానపు కొలతలు. జ: 2



రచయిత: జి. ప్రశాంత్ రెడ్డి

పదోతరగతి

భౌతిక శాస్త్రం

ప్రశ్నలు జవాబులు

అందుకే నక్షత్రాలకు మిణుకు మిణుకు మెరుపు

2 మార్కులు

కాంతి - పరావర్తనం, వక్రీభవనం



1) ఏ సందర్భంలో స్నెల్ నియమం వర్తించదు?

జ: ఒక కాంతి కిరణం రెండు యానకాలను వేరుచేసే ఉపరితల హద్దు లంబం వెంబడి పతనమైనప్పుడు స్నెల్ నియమం వర్తించదు. ఈ సందర్భంలో i = 0, r = 0 అవుతుంది. $\frac{\sin i}{\sin r}$ నిష్పత్తిని నిర్వచించలేం.

2) నీటితో నింపిన గాజు గ్లాసులో పాక్షికంగా ముంచిన పెన్సిల్ వంగినట్లు కనిపిస్తుంది. ఎందుకు?

జ: నీటి ఉపరితలం వద్ద కాంతి వక్రీభవనం చెందడం వల్ల పెన్సిల్ వంగినట్లు కనిపిస్తుంది.

3) నక్షత్రాలు ఎందుకు మిణుకు మిణుకుమంటాయి?

జ: నక్షత్ర కాంతి భూవాతావరణంలో ప్రవేశించినప్పుడు, అది భూమిని చేరే ముందు నిరంతరంగా వక్రీభవనానికి లోనవుతుంది. ఈ వాతావరణ వక్రీభవన కారణంగా నక్షత్రం మిణుకు మిణుకుమని మెరుస్తుంది.

4) ఏ పదార్థాలవక్రీభవన గుణాలు ఎక్కువ, తక్కువగా ఉంటాయి?

జ: ఎ) శూన్యం వక్రీభవన గుణకం తక్కువగా ఉంటుంది (n = 1).
బి) వజ్రం వక్రీభవన గుణకం ఎక్కువగా ఉంటుంది (n = 2.42).

5) పుటాకార దర్పణం వల్ల ఏర్పడే ప్రతిబింబ ఆవర్తనం +2 ఉంది అని రాజు చెప్పాడు. అయితే ఆ ప్రతిబింబం లక్షణాలను ఊహించండి.

జ: పుటాకార దర్పణం వల్ల ఏర్పడే ప్రతిబింబ ఆవర్తనం ధనాత్మకం. కాబట్టి నిలువుగా, పెద్దదిగా, మిథ్యాప్రతిబింబంగా ఉంటుంది. ప్రతిబింబం దర్పణ ధ్రువానికి, ప్రధాన నాభికి మధ్య ఏర్పడుతుంది.

ముఖ్యమైనవి మరికొన్ని.. (2 మార్కులు)

1) నిత్యజీవితంలో వక్రీభవనం రెండు అనువర్తనాలను రాయండి.

2) నక్షత్రాలు కాంతి పరావర్తనం వల్ల మిణుకు మిణుకుమంటాయని తేజ అనే విద్యార్థి చెప్పాడు. అతడిని ఏ ప్రశ్నలు అడిగి ఈ దృగ్విషయంపై అవగాహన కలిగిస్తారు?

3) గోళాకార దర్పణాలైన పుటాకార, కుంభాకార దర్పణాల మధ్య తేడాలను అవగాహన కలిగించడానికి ఏవైనా కొన్ని ప్రశ్నలు తయారు చేయండి.


జవాబుల కోసం

- డి.వి. సుబ్బానాయుడు

SUBSCRIBE CHANNEL

పదాతిదళం పైదల్.. అశ్విక సైన్యం సవార్!

ఆధునిక యుగంలో భారతదేశం బ్రిటిష్ వలస పాలనలోకి వెళ్లడం చరిత్రలో ఒక అతి పెద్ద మలుపు. వ్యాపారం కోసం వచ్చిన ఈస్టిండియా కంపెనీ మొత్తం దేశాన్నే ఆక్రమించి సామ్రాజ్యవాదశక్తిగా అవతరించింది. 1757లో ప్లాసీ యుద్ధంలో నిర్ణయాత్మక విజయంతో మొదలైన కంపెనీ ప్రాబల్యం 1858లో సిపాయిల తిరుగుబాటు వరకు వందేళ్ల పాటు అప్రతిహతంగా సాగింది. బ్రిటిష్ కంపెనీ ఒక్కో ప్రాంతాన్ని, స్వదేశీ పాలకులను జయించిన తీరు, అవలంబించిన వ్యూహాలు, పథకాలతోపాటు వారి పాలనా విధానం గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వివిధ గవర్నర్ జనరల్స్ తెచ్చిన మార్పులు, వారి దూకుడుకు దోహదం చేసిన నాటి స్థానిక, ప్రపంచ రాజకీయ పరిణామాలు, శక్తిమంతులైన మైసూరు, మరాఠా పాలకులతో కంపెనీ చేసిన యుద్ధాలు, వాటి పర్యవసానాలను తెలుసుకోవాలి.



మూడో మరాఠా యుద్ధం వర్ణచిత్రం

డీఎస్సీ - 2024: భారతదేశ చరిత్ర

భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన

1. కిందివాటిలో సైన్య సహకార ఒప్పందంపై సంతకం చేసిన రాజ్యాన్ని గుర్తించండి.
1) హైదరాబాద్ 2) మైసూర్
3) అవధ్ 4) పైవన్నీ

2. హైదర్‌అలీ మైసూర్‌ను ఎవరి నుంచి ఆక్రమించాడు?
1) వడయార్
2) విజయనగర సామ్రాజ్యం
3) అసఫ్ జా 4) ఎవరూకాదు

3. మూడో పానిపట్టు యుద్ధం జరిగిన సంవత్సరం?
1) 1760 2) 1761 3) 1762 4) 1763

4. సింధియా, హోల్కర్, గైక్వాడ్, భోంస్లే రాజవంశాలు ఏ రాజ్యానికి చెందినవి?
1) మైసూర్ 2) బెంగాల్ 3) మరాఠా 4) పంజాబ్

5. పీష్వా ఏ ప్రాంతం కేంద్రంగా మరాఠా సమాఖ్యను నిర్వహించారు?
1) సతారా 2) పుణె 3) బీరార్ 4) బరోడా

6. ఆంగ్లో-మరాఠా యుద్ధాలు ఎన్ని జరిగాయి?
1) 5 2) 4 3) 3 4) 2

7. కింది వారిలో మరాఠా రాజనీతిజ్ఞులను గుర్తించండి.
1) నానా ఫడ్నవీస్ 2) మహదాజీ సింధియా
3) 2వ షాఆలం 4) 1, 2

8. మొదటి ఆంగ్లో-మరాఠా యుద్ధం ఏ సంధితో ముగిసింది?
1) వడగాం 2) సల్బాయ్
3) మద్రాస్ 4) శ్రీరంగపట్నం

9. బ్రిటీషర్లు ఎన్నో మరాఠా యుద్ధంలో భాగంలో ఒడిశా, ఆగ్రా, యమునా నది ఉత్తర భూభాగాలను పొందారు?
1) మొదటి ఆంగ్లో - మరాఠా యుద్ధం
2) రెండో ఆంగ్లో - మరాఠా యుద్ధం
3) మూడో ఆంగ్లో - మరాఠా యుద్ధం
4) ఏదీకాదు

10. మూడో మరాఠా యుద్ధంలో సంపూర్ణ విజయం సాధించిన బ్రిటిష్ కంపెనీ పీష్వాకు భరణం ఇచ్చి ఏ ప్రాంతానికి పంపింది?
1) సతారా 2) బితూర్ 3) పూణె 4) నాగ్‌పుర్

11. చివరి పీష్వా ఎవరు?
1) మొదటి బాజీరావ్ 2) బాలాజీ బాజీరావ్
3) మాధవరావు 4) రెండో బాజీరావ్

12. ఏ ప్రాంత ఆక్రమణతో కంపెనీ వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఉన్న భూభాగాలపై పూర్తిపట్టు సాధించింది?
1) మైసూర్ 2) బెంగాల్ 3) ఒడిశా 4) మరాఠా

13. మరాఠా ప్రాంత ఆక్రమణ అనంతరం 'అత్యున్నత హోదా' అనే విధానాన్ని ప్రకటించిన గవర్నర్ జనరల్?
1) వారన్ హేస్టింగ్ 2) కారన్ వాలీస్
3) లార్డ్ హేస్టింగ్స్ 4) లార్డ్ వెల్లస్లీ

14. ఏ ప్రాంత ఆక్రమణ తర్వాత భారతదేశంలో అతి పెద్ద సామ్రాజ్యంగా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆవిర్భవించింది?
1) అవధ్ 2) మొగల్
3) మరాఠా 4) మైసూర్

15. బ్రిటీషర్లను ప్రతిఘటించిన కిత్తూరు రాణి చెన్నమ్మ ఏ రాష్ట్రానికి చెందిన మహిళ?
1) తమిళనాడు 2) ఆంధ్ర ప్రదేశ్
3) ఒడిశా 4) కర్ణాటక

16. చెన్నమ్మ తర్వాత పోరాటం కొనసాగించిన సంగోలి వీరుడు ఎవరు?
1) కట్టబొమ్మన్ 2) నరసింహారెడ్డి
3) రాయన్న 4) వేలుతంపి

17. 1838−42 మధ్య ఏ ప్రాంతంపై బ్రిటిషర్లు పరోక్ష పాలన ప్రారంభించారు?
1) పాకిస్థాన్ 2) అఫ్గానిస్థాన్
3) సింధ్ 4) మరాఠా

18. బ్రిటిషర్లను ఎదిరించి పోరాడిన సురేంద్రసాయి ఏ ప్రాంతానికి చెందినవారు?
1) సంబల్‌పుర్ 2) కలకత్తా
3) మద్రాస్ 4) మచిలీపట్నం

19. 1843లో సింధ్ ప్రాంతాన్ని ఆంగ్లేయులు ఆక్రమించడానికి ప్రధాన కారణం?
1) సింధ్ ప్రాంత పాలకులు బ్రిటిషర్లను వ్యతిరేకించడం
2) రష్యా భారత్‌ను ఆక్రమిస్తుందేమో అన్న సందేహం
3) బ్రిటిషర్లు సింధ్ ప్రాంతాన్ని క్రైస్తవ సమాజంగా మార్చాలనుకోవడం
4) గిరిజన పాలనను బ్రిటిషర్లు వ్యతిరేకించడం

20. మహారాజా రంజిత్ సింగ్ ఏ ప్రాంతానికి పాలకుడు?
1) పంజాబ్ 2) మైసూర్
3) కర్ణాటక 4) బెంగాల్

21. 1839లో రంజిత్ సింగ్ మరణానంతరం ఏ సంవత్సరంలో అతడి వారసులను ఓడించి ఆంగ్లేయులు పంజాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు?
1) 1845 2) 1843 3) 1848 4) 1849

22. కిందివాటిలో రాజ్య సంక్రమణ సిద్ధాంతానికి సంబంధించి సరైంది?
1) 1848 లో లార్డ్ డల్హౌసి ఈ విధానాన్ని ప్రవేశపెట్టాడు.
2) ఈ సిద్ధాంతం ప్రకారం భారత పాలకుడు వారసుడు లేకుండా మరణిస్తే ఆ భూభాగం కంపెనీ భూభాగంలో కలిసిపోతుంది.
3) ఈ విధానంలో భాగంగా బ్రిటిష్ భూభాగంలో కలిసిన మొదటి ప్రాంతం సతారా.
4) పైవన్నీ

23. కిందివాటిలో 'దుష్పరిపాలన' అనే పేరుతో ఆక్రమించిన ప్రాంతం ఏది?
1) మైసూర్ 2) పంజాబ్
3) అవధ్ 4) ఝాన్సీ

24. 1856లో బ్రిటిషర్లు ఆక్రమించిన చివరి రాజ్యం ఏది?
1) అవధ్ 2) పంజాబ్
3) సింధ్ 4) అఫ్గానిస్థాన్

25. రాజ్యసంక్రమణ సిద్ధాంతం ప్రకారం ఆక్రమించిన ప్రాంతాలను, వాటి సంవత్సరాలతో జతపరచండి.

1) సతారా	ఎ) 1848
2) సంబల్‌పుర్	బి) 1850
3) ఉదయ్‌పుర్	సి) 1852
4) నాగ్‌పుర్	డి) 1853
5) ఝాన్సీ	ఇ) 1854

1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఇ
2) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి, 5-ఇ
3) 1-ఇ, 2-డి, 3-సి, 4-బి, 5-ఎ
4) 1-ఎ, 2-డి, 3-బి, 4-ఇ, 5-సి

26. బ్రిటీషర్లు భారతదేశాన్ని ఎన్ని ప్రెసిడెన్సీలుగా విభజించారు?
1) 1 2) 2 3) 3 4) 4

27. న్యాయ విభాగంలో సంస్కరణలు తీసుకొచ్చిన మొదటి గవర్నర్ జనరల్ ఎవరు?
1) వారన్ హేస్టింగ్స్ 2) కారన్ వాలీస్
3) విలియం బెంటిక్ 4) రాబర్ట్ క్లైవ్

28. బ్రిటిషర్లు భారతదేశంలో రెగ్యులేటింగ్ చట్టాన్ని (మొదటి చట్టం) ఎప్పుడు చేశారు?
1) 1773 2) 1774 3) 1775 4) 1776

29. కింది వాటిలో న్యాయ సంస్కరణలకు సంబంధించి సరైంది?
1) 1772 నుంచి న్యాయవిధానం అమలులోకి వచ్చింది.
2) జిల్లాస్థాయిలో క్రిమినల్ కోర్టును 'ఫౌజ్‌దారి అదాలత్' అంటారు.
3) క్వాజీ, ముఫ్తీ క్రిమినల్ కోర్టులను నిర్వహిస్తారు.
4) పైవన్నీ

30. జిల్లాస్థాయి సివిల్ కోర్టును ఏ పేరుతో పిలుస్తారు?
1) సర్దార్ నిజామత్ అదాలత్
2) ఫౌజ్‌దారీ అదాలత్
3) 1, 2 4) దివానీ అదాలత్

31. 1775లో 11 మంది పండితులతో హిందూ న్యాయస్మృతి తయారైంది. దీన్ని ఎవరు ఆంగ్లంలోకి అనువదించారు?
1) జేమ్స్‌మిల్ 2) జేమ్స్ ప్రిన్సిప్
3) ఎన్.బి.హాల్హెడ్ 4) థామస్ జెఫర్‌సన్

32. ముస్లిం న్యాయస్మృతి ఏ సంవత్సరంలో తయారైంది?
1) 1773 2) 1775 3) 1778 4) 1780

33. రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం కిందిస్థాయి తీర్పులపై అప్పీల్ చేసుకునేందుకు కలకత్తాలో ఏర్పాటు చేసిన ఉన్నత న్యాయస్థానం?
1) సర్దార్ నిజామత్ అదాలత్
2) ఫౌజ్‌దారీ అదాలత్
3) దివానీ అదాలత్ 4) ఏదీకాదు

34. మస్కట్, మ్యాచ్‌లాక్ అనే పదాలు దేన్ని సూచిస్తాయి?
1) తుపాకీ 2) యూనిఫాం
3) బ్రిటిష్ సైన్యం 4) న్యాయస్థానం

35. సవార్స్ అంటే..?
1) కాలినడక సైన్యం
2) గుర్రం మీద యుద్ధం చేసే సైన్యం
3) విలువిద్య సైన్యం 4) సామాన్య రైతాంగం

36. బ్రిటన్ పార్లమెంటులో బెంగాల్‌లో దుష్పరిపాలన కారణంతో అభిశంసన ఎదుర్కొన్న గవర్నర్ జనరల్?
1) రాబర్ట్ క్లైవ్ 2) వారన్ హేస్టింగ్స్
3) కారన్ వాలీస్ 4) వెల్లస్లీ

37. వారన్ హేస్టింగ్స్‌పై ఏడేళ్లు కొనసాగిన అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టింది ఎవరు?
1) విలియం పిట్ 2) జేమ్స్ ప్రిన్సిప్
3) అలెగ్జాండర్ రీడ్ 4) ఎడ్మండ్ బర్క్

38. కింది పదాలకు సంబంధించి సరైన అర్థాన్ని గుర్తించండి.
1) తీర్ - అందాజీ అంటే విలువిద్య
2) పైదల్ అంటే పదాతిదళ సైనికులు
3) సవార్ అంటే అశ్విక దళం
4) పైవన్నీ సరైనవే

39. ఎవరితో యుద్ధాల తర్వాత బ్రిటీష్ కంపెనీ అశ్విక దళాన్ని బలోపేతం చేశారు?
1) మైసూర్ పాలకులు 2) మరాఠాలు
3) 1, 2 4) మొగల్స్

40. 1820 నుంచి బ్రిటిషర్లు పైదల్స్‌కు ప్రాముఖ్యం ఇవ్వడం మొదలుపెట్టారు. దీనికి కారణం?
1) అశ్విక దళం బ్రిటిషర్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు నడపటం.
2) మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికమైన తుపాకులు వాడాల్సి రావడం.
3) ఆంగ్లేయులు గుర్రాలను దిగుమతి చేసుకోలేకపోవడం.
4) పైవన్నీ

41. 1857 నాటికి కంపెనీ భారత దేశంలోని దాదాపు 63% భూభాగాన్ని ఆక్రమించింది. ఈ భూభాగంలోని జనాభా శాతం ఎంత?
1) 78% 2) 80% 3) 90% 4) 85%

42. దక్షిణాఫ్రికాలో బానిసత్వం ఎప్పుడు అంతమైంది?
1) 1832 2) 1834 3) 1824 4) 1828

43. 'ఏ హిస్టరీ ఆఫ్ స్లేవరీ ఎట్ ది కేప్' అనే పుస్తకం రచయిత ఎవరు?
1) ఎరియర్ ఎల్విన్ 2) కార్లే హాస్వెల్
3) నికెల్ వార్డన్
4) రాబర్ట్ స్టీవెన్‌సన్



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు


1-4, 2-1, 3-2, 4-3, 5-2, 6-3, 7-4, 8-2, 9-2, 10-2, 11-4, 12-4, 13-3, 14-3, 15-4, 16-3, 17-2, 18-1, 19-2, 20-1, 21-4, 22-4, 23-3, 24-1, 25-1, 26-3, 27-1, 28-1, 29-4, 30-4, 31-3, 32-3, 33-1, 34-1, 35-2, 36-2, 37-4, 38-4, 39-3, 40-2, 41-1, 42-3, 43-3.

ప్రసరణ వ్యవస్థ

ప్రసరణ వ్యవస్థ అనేది శరీరమంతటికీ పోషకాలు, ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్, హార్మోన్లు, వ్యర్థ ఉత్పత్తుల రవాణాకు తోడ్పడే ముఖ్యమైన వ్యవస్థ. ఇది ముఖ్యంగా మానవుల లాంటి సంక్లిష్ట జీవుల్లో, హోమియోస్టాసిస్‌ను నిర్వహించేందుకు, కణాల పనితీరు, మనుగడలో కీలకపాత్ర వహిస్తుంది.

ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ



అక్కడ కొవ్వు పేరుకుంటే గుండెపోటు పొంచి ఉన్నట్లే..

జంతువుల్లో ప్రసరణ వ్యవస్థ - రకాలు

జంతువులు ప్రధానంగా రెండు ప్రాథమిక రకాల ప్రసరణ వ్యవస్థలను ప్రదర్శిస్తాయి. అవి:

వివృత లేదా ఓపెన్ సర్క్యులేటరీ సిస్టం:

ఆర్థ్రోపోడా జీవులు (కీటకాలు, క్రస్టేషియన్లు), మొలస్కలలో ఈ రకమైన ప్రసరణ వ్యవస్థ కనిపిస్తుంది.

✦ ఈ రకమైన వ్యవస్థలో రక్తం రక్తనాళాలకు మాత్రమే కాకుండా హీమోసీల్ (శరీర కుహరం)లోకి కూడా సరఫరా అవుతుంది. అంటే రక్తం నేరుగా అవయవాలకు పంపిణీ అవుతుంది. హీమోలింఫ్ అని పిలిచే ద్రవం, ఓస్టియా అనే ఓపెనింగ్స్ ద్వారా తిరిగి గుండెకి చేరుతుంది.

✦ రక్తానికి, మధ్యంతర ద్రవానికి మధ్య వ్యత్యాసం లేకపోవడంతో ప్రసరణ నెమ్మదిగా జరుగుతుంది.

సంవృత లేదా క్లోజ్డ్ సర్క్యులేటరీ సిస్టం:

సకశేరుకాలు (మానవులతో సహా), అనెలిడ్‌లు, స్క్విడ్‌లు, ఆక్టోపస్‌లు లాంటి కొన్ని సెఫలోపాడ్‌లలో సంవృత ప్రసరణ వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తుంది.

✦ రక్తనాళాల పటిష్ఠ జాల వ్యవస్థ ద్వారా రక్తం పంపిణీ అయి, శరీర మధ్యంతర ద్రవం నుంచి వేరుగా ఉంటుంది.

✦ పోషకాలు, వాయువుల వేగవంతమైన, కచ్చితమైన రవాణాను ఈ వ్యవస్థ ప్రేరేపిస్తుంది.

ప్రసరణ వ్యవస్థ - మార్గాలు

మానవ ప్రసరణ వ్యవస్థ రెండు ప్రధాన విభాగాలుగా పనిచేస్తుంది.

పుపుస లేదా పల్మనరీ సర్క్యులేషన్: రక్తం కుడి కర్ణికలోకి ప్రవేశించినప్పుడు ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆక్సిజనేషన్ కోసం గుండె కుడి వైపు నుంచి డీఆక్సిజనేటెడ్ రక్తాన్ని ఊపిరితిత్తులకు తీసుకువెళ్తుంది. తర్వాత ఆక్సిజన్ ఉన్న రక్తాన్ని గుండె ఎడమ వైపునకు తిరిగి చేరవేస్తుంది.

దైహిక ప్రసరణ: ఆక్సిజనేటెడ్ రక్తం గుండె ఎడమ వైపునకు చేరుకున్న తర్వాత బృహద్ధమని ద్వారా దైహిక ప్రసరణలోకి పంపిణీ అవుతుంది. ఈ సర్క్యూట్ కార్బన్ డైఆక్సైడ్, వ్యర్థ ఉత్పత్తులను సేకరిస్తూ శరీరానికి ఆక్సిజన్, పోషకాలను అందిస్తుంది. డీఆక్సిజనేటెడ్ రక్తం చివరికి గుండె కుడి వైపునకు తిరిగి వస్తుంది.

మానవుల్లో ప్రసరణ వ్యవస్థ

గుండె, రక్తం, రక్తనాళాలు (ధమనులు, సిరలు, కేశనాళికలు) కలిగి ఉండే సంవృత రక్త ప్రసరణకు మానవ ప్రసరణ వ్యవస్థను ప్రధాన ఉదాహరణగా చెప్పవచ్చు.

☛ కార్బన్ డైఆక్సైడ్, జీవక్రియ వ్యర్థాలను తొలగించేటప్పుడు కణజాలాలకు ఆక్సిజన్, పోషకాలను అందించడంలో ఈ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుంది.

మానవ ప్రసరణ వ్యవస్థ – భాగాలు:

i. గుండె: ఇది కండరాలతో కూడిన నాలుగు గదుల అవయవ నిర్మాణం. మానవ హృదయం శరీరమంతా రక్తాన్ని పంపిణీ చేసే బాధ్యతను వహిస్తుంది.

❖ ఇది రెండు కర్ణికలు (ఎగువ గదులు), రెండు జఠరికలను (దిగువ గదులు) కలిగి ఉంటుంది.

❖ గుండె పనితీరులో కుడి వైపు మలిన రక్తం లేదా ఆమ్లజని రహిత రక్తం, ఎడమ వైపు ఆక్సిజన్ సహిత రక్తం ఉంటాయి.

కుడి కర్ణిక, జఠరిక: శరీరం నుంచి డీఆక్సిజనేటెడ్ రక్తం ఈ గదులకు చేరుతుంది. ఆక్సిజన్ కోసం పుపుస ధమని ద్వారా రక్తాన్ని ఊపిరితిత్తులకు పంపుతాయి.

ఎడమ కర్ణిక, జఠరిక: ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌ను కలిగిన రక్తాన్ని స్వీకరించిన తర్వాత, ఎడమ కర్ణిక దాన్ని ఎడమ జఠరికలోకి పంపుతుంది. ఇది బృహద్ధమని ద్వారా శరీరంలోని మిగిలిన భాగాలకు రక్తాన్ని చేరవేస్తుంది.

ii. రక్తం: రక్తం అనేది ప్లాస్మా (ద్రవ భాగం), ఎర్ర రక్తకణాలు (RBC), తెల్ల రక్తకణాలు (WBC), ప్లేట్‌లెట్లతో కూడిన సంధాయక కణజాలం.

iii. ఎర్ర రక్తకణాలు: ఈ కణాలు ఊపిరితిత్తుల నుంచి శరీరానికి ఆక్సిజన్‌ను, శరీరం నుంచి కార్బన్ డైఆక్సైడ్‌ను తిరిగి ఊపిరితిత్తులకు తీసుకువెళ్తాయి. హిమోగ్లోబిన్, ఎర్రరక్త కణాల్లోని ప్రోటీన్, రవాణా కోసం ఆక్సిజన్‌ను బంధిస్తుంది.

iv. తెల్ల రక్తకణాలు: ఇవి నిరోధక వ్యవస్థలో ఒక భాగం. ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి.

v. ప్లేట్‌లెట్స్: గాయమైనప్పుడు అధిక రక్తస్రావం కాకుండా నిరోధించేందుకు రక్తం గడ్డకట్టడంలో పాల్గొంటాయి.

vi. రక్తనాళాలు: రక్తనాళాలు ఒక నెట్‌వర్క్‌ను ఏర్పరుస్తాయి. దీని ద్వారానే రక్తం ప్రవహిస్తుంది. వీటిలో మూడు రకాలు ఉంటాయి. అవి:

ధమనులు: ఈ నాళాలు ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని గుండె నుంచి శరీర కణజాలాలకు తీసుకువెళ్తాయి. అతిపెద్ద ధమని బృహద్ధమని. ఇది శరీరంలోని అవయవాలకు రక్త ప్రసరణ జరిగేలా సహకరించే చిన్నచిన్న ధమనులుగా విభజితమై ఉంటుంది.

సిరలు: ఇవి డీఆక్సిజనేటెడ్ రక్తాన్ని గుండెకు తిరిగి పంపుతాయి. అతిపెద్ద సిరలు, ఎగువ, దిగువ వీనాకావా, శరీరంలోని ఎగువ, దిగువ భాగాల నుంచి రక్తాన్ని వరుసగా గుండెకు తీసుకువస్తాయి.

కేశనాళికలు: ఇవి రక్తం, కణజాలాల మధ్య వాయువులు, పోషకాలు, వ్యర్థ ఉత్పత్తుల మార్పిడి జరిగేందుకు సహాయపడే చిన్న రక్తనాళాలు.

ప్రసరణ వ్యవస్థ నియంత్రణ

హృదయ స్పందన రేటు: గుండె లయబద్ధ సంకోచాలు సైనోట్రియల్ (SA) నోడ్ ద్వారా నియంత్రితమవుతాయి. దీన్ని సాధారణంగా గుండె పేస్‌మేకర్‌గా చెప్పవచ్చు. స్వయంచోదిత నాడీ వ్యవస్థ (ANS), అడ్రినలిన్ లాంటి హార్మోన్లు శరీర అవసరాల ఆధారంగా హృదయ స్పందన రేటును ప్రభావితం చేస్తాయి.

రక్తపోటు: రక్తనాళాల గోడలపై రక్త ప్రసరణ జరగడం వల్ల కలిగే బలాన్ని రక్తపోటు అంటారు. ఇది మూత్రపిండాలు, రక్త పరిమాణం, రక్తనాళాల సంకోచం లేదా వ్యాకోచం ద్వారా నియంత్రణలో ఉంటుంది.

అసాధారణ రక్తపోటు: రక్తపోటు అధికమైతే అధిక రక్తపోటు లేదా హైపర్ టెన్షన్ అంటారు. తక్కువ రక్తపోటును హైపోటెన్షన్ అంటారు.

హార్మోన్ల నియంత్రణ: శారీరక శ్రమ, ఒత్తిడి, నీటి స్థాయుల ఆధారంగా రక్తప్రసరణ రేటు, పరిమాణాన్ని సర్దుబాటు చేయడంలో కొన్ని హార్మోన్లు ముఖ్యపాత్ర పోషిస్తాయి. అవి.. అడ్రినలిన్ (ఎపినెఫ్రిన్), ఆల్డోస్టిరాన్, యాంటీడియురేటిక్ హార్మోన్ (ADH).

ఇతర జంతువుల్లో ప్రసరణ వ్యవస్థ

చేప: చేపల్లో గుండె రెండు గదులతో ఒకే రక్త ప్రసరణ లూప్ కలిగి ఉంటుంది. రక్తం ఆమ్లజని సహితంగా మారడం కోసం మొప్పల ద్వారా ప్రసరించి గుండెకు తిరిగి వచ్చే ముందు శరీరానికి వెళుతుంది. ఈ జీవుల్లో ప్రసరణ వ్యవస్థ క్షీరదాల్లో కంటే తక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఆక్సిజన్, డీఆక్సిజనేటెడ్ రక్తాన్ని సమర్థవంతంగా వేరు చేయకపోవడమే ఇందుకు కారణం.

ఉభయచరాలు, సరీసృపాలు: ఉభయచరాలు రెండు కర్ణికలు, ఒక జఠరికతో కూడిన మూడు గదుల గుండెను కలిగి ఉంటాయి. ఇలాంటి ప్రసరణ వ్యవస్థలో ఆక్సిజనేటెడ్, డీఆక్సిజనేటెడ్ రక్తాన్ని కలపవచ్చు, తక్కువ సామర్థ్యాన్ని కలిగిస్తుంది. పాములు, బల్లులు లాంటి సరీసృపాలు మూడు గదులను, పాక్షికంగా విభజితమైన జఠరికలను కలిగి ఉంటాయి. ఇది రక్తం కలయికను తగ్గిస్తుంది.

పక్షులు, క్షీరదాలు: మానవుల మాదిరిగా పక్షులు, ఇతర క్షీరదాలు నాలుగు గదుల హృదయాన్ని కలిగి ఉంటాయి. ఇది ఆక్సిజన్, డీఆక్సిజనేటెడ్ రక్తాన్ని పూర్తిగా వేరు చేసేలా నిర్మితమై ఉంటుంది. ఈ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా ఉండటం వల్ల చురుకైన జీవనశైలికి అవసరమైన అధిక జీవక్రియ రేటుకు సహకరిస్తుంది.

మానవ ప్రసరణ వ్యవస్థ - లోపాలు

మానవ ప్రసరణ వ్యవస్థను అనేక సాధారణ పరిస్థితులు ప్రభావితం చేస్తాయి. అవి:

అథెరోస్క్లెరోసిస్: ఈ పరిస్థితి ధమనుల్లో కొవ్వు నిల్వలు (ప్లాక్స్) పేరుకుపోవడం, రక్త ప్రవాహాన్ని తగ్గేలా చేయడం ద్వారా గుండెపోటు లేదా స్ట్రోక్‌ల ప్రమాదాన్ని పెంచుతుంది.

హైపర్‌టెన్షన్: దీర్ఘకాలిక అధిక రక్తపోటు గుండె, రక్తనాళాలపై ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది గుండె జబ్బులు, మూత్రపిండాల వైఫల్యం, స్ట్రోక్ లాంటి సమస్యలకు దారితీస్తుంది.

రక్తహీనత: ఇది రక్తం ఆక్సిజన్‌ను తీసుకెళ్లే సామర్థ్యాన్ని తగ్గించే పరిస్థితి. తరచుగా హిమోగ్లోబిన్ లేదా ఎర్ర రక్తకణాల లోపం కారణంగా సంభవిస్తుంది.

గుండెపోటు: ఈ స్థితిలో గుండెలోని ఒక భాగానికి రక్త ప్రసరణ సరిగ్గా జరగకపోవడం వల్ల కణజాలం దెబ్బతింటుంది.



రచయిత
కొర్లాం సాయివెంకటేష్,
అసిస్టెంట్ ప్రొఫెసర్

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో ఏ జంతువు వివృత ప్రసరణ వ్యవస్థను కలిగి ఉంది?
   1) చేప 2) వానపాము 3) కీటకాలు 4) పక్షులు
2. ఎర్ర రక్తకణాల్లో హిమోగ్లోబిన్ ప్రాథమిక విధి?
   1) కార్బన్ డైఆక్సైడ్‌ను రవాణా చేయడం
   2) ఆక్సిజన్‌ని రవాణా చేయడం
   3) తెల్ల రక్తకణాలను ఉత్పత్తి చేయడం
   4) రక్తం గడ్డకట్టడాన్ని నియంత్రించడం
3. క్షీరదాల్లో శరీరం నుంచి డీఆక్సిజనేటెడ్ రక్తాన్ని పొందే భాగం?
   1) ఎడమ కర్ణిక 2) కుడి కర్ణిక
   3) ఎడమ జఠరిక 4) కుడి జఠరిక
4. మానవ ప్రసరణ వ్యవస్థలో భాగం కానిదేది?
   1) గుండె 2) ధమనులు
   3) నెఫ్రాన్స్ 4) సిరలు
5. వాయు మార్పిడి ప్రాథమికంగా జరిగే రక్తనాళాలు?
   1) ధమనులు 2) సిరలు
   3) కేశనాళికలు 4) శోషరస నాళాలు
6. కింది వాటిలో నాలుగు గదుల గుండెను కలిగి ఉండే జంతువులు?
   1) ఉభయచరాలు 2) సరీసృపాలు
   3) పక్షులు 4) కీటకాలు

సమాధానాలు

1-3, 2-2, 3-2, 4-3, 5-3, 6-3.

450 Word of the Day

Derogatory

Telugu meaning: అమర్యాదకరమైన, అవమానకరమైన

English meaning: The word derogatory is an adjective that describes something that shows a critical or disrespectful attitude.

Synonyms: Insulting, Degrading

Antonyms: Complimentary, Respectful

Usage: **1.** He made several derogatory remarks about his colleague, which damaged their professional relationship.

2. The article was filled with derogatory comments that undermined the achievements of the athletes.

నోటిఫికేషన్స్

సూపర్‌వైజర్ పోస్టులు

గురుగ్రామ్‌లోని మహారత్న కంపెనీ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) ట్రైనీ సూపర్‌వైజర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 70. దరఖాస్తు ఫీజు రూ.300. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 6 నవంబరు 2024.

ట్రైనీ పోస్టులు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ - దేశవ్యాప్తంగా తన రీజియన్/కార్యాలయాల్లో డిప్లొమా ఇంజినీర్, జూనియర్ ఆఫీసర్ ట్రైనీ, అసిస్టెంట్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 802. అర్హులైన అభ్యర్థులు 2024, నవంబరు 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐకార్)కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్ (ఐఐఎంఆర్) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు 2024, నవంబరు 5న ఇంటర్వ్యూకి హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు, అప్రెంటిస్ పోస్టులు, ప్రవేశాలకు నేడే (అక్టోబరు 25) ఆఖరు తేదీ

☛ ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో టీచర్ పోస్టులు. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, పీజీ, డీఈఎల్ఈడీ, బీఈఎల్ఈడీ, బీఈడీ, బీపీఈడీ ఉత్తీర్ణతతో పాటు, సీటెట్, టెట్ అర్హత తప్పనిసరి.

☛ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్), బెంగళూరులో 40 మేనేజీరియల్ పోస్టులు. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, సీఏ/సీఎంఏ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ దేవ్‌ఘర్ ఎయిమ్స్‌లో 101 సీనియర్ రెసిడెంట్ పోస్టులు. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఓఎన్‌జీసీలో 2,236 అప్రెంటిస్ పోస్టులు. సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ తెలంగాణలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్)/ ఏఎన్ఎం ట్రైనింగ్ కోర్సు. ఏదైనా గ్రూప్‌లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు అర్హులు.

☛ ఏపీలో మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్. డిగ్రీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులైనవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

New chairperson of the NCW?

Current Affairs

1. Which of the following persons has been appointed as the new chairperson of the National Commission for Women (NCW)?
   A) Manohar Iyer
   B) Sridhar Singh
   C) Vijaya Kishore Rahatkar
   D) Rajesh Khanna
2. Which of the following states Triumphs at 24th National Para-Swimming Championship?
   A) Assam B) Telangana
   C) Tripura D) Karnataka
3. e-Shram scheme enhances access to which of the following?
   A) Women B) Poor people
   C) Unroganised Workers D) Teachers
4. India's first Biopolymer facility inaugurated in which of the following places?
   A) Pune B) Kerala
   C) Chandigarh D) Agartala
5. What is the full form of the IMF?
   A) International Monetary File
   B) International Monetary Fund
   C) International Monetary Face
   D) International Monetary Food
6. Chiratae Ventures honors Narayana Murthy with which of the following awards?
   A) J. McGovern B) Arjuna
   C) Dronacharya D) Gallantry Medal
7. World Development Information Day is celebrated every year on which of the following days?
   A) October 24 B) October 21
   C) April 24 D) April 21
8. A new book 'War' is written by which of the following persons?
   A) Ravish Kumar B) David Muir
   C) Rajat Sharma D) Bob Woodward

General Knowledge

9. 'Prince of Wales Cup' is related with which of the following sports events?
   A) Badminton B) Cricket
   C) Boxing D) Golf
10. Hima Das is an Indian sprinter from the state of ....
    A) Haryana B) West Bengal
    C) Tripura D) Assam
11. 'The God of Small Things' is written by which of the following authors?
    A) Arundhati Roy B) Ruskin Bond
    C) Daman Singh D) Poonam Surie

SSC Exams Special

General Awareness

12. The union cabinet has approved .... (in 2021) as Janjatiya Gaurav Divas.
    A) 9th November B) 11th November
    C) 15th November D) 18th November

General Science

13. Potassium makes up .... by mass of the Earth crust.
    A) 5% B) 1.5%
    C) 3.6% D) 2.4%
14. Rolled gold is an alloy of ...., used for making cheap ornaments.
    A) Iron, Chromium and Nickel
    B) Copper and Aluminium
    C) Magnesium and Aluminum
    D) Copper and Nickel



Vijaya Kishore Rahatkar

15. Vitamin concept was formulated by which of the following?
    A) Charles Towns B) Dennis Gabor
    C) Casimir Funk D) Michiaki Takahashi
16. An isotope of which of the following metals is used in the treatment of cancer?
    A) Copper B) Cobalt
    C) Nickel D) Tungsten

Geography

17. Nepal does NOT share its boundary with which of the following states in India?
    A) Uttar Pradesh B) Assam
    C) Uttarakhand D) Bihar
18. Which of the following is a line drawn on a map to indicate connecting points of equal salinity in the ocean?
    A) Isotones B) Isonomal
    C) Isochrones D) Isohaline
19. What is the longest canal of Uttar Pradesh?
    A) Lower Ganga Canal B) Agra Canal
    C) Upper Ganga Canal D) Sharda Canal
20. Which of the following is the largest Brackish water lagoon in Asia?
    A) Superior B) Pulicat
    C) Chilika D) Titicaca

Scan the QR code for Key

*These model questions were prepared by subject experts of **QnA Academy**, Hyderabad*

పట్టాదారు పాసు పుస్తకాలకు రైతుల నిరీక్షణ

- 'రీ-సర్వే' భూ హక్కు పత్రాల్లో అనేక తప్పిదాలు
- వాటిని సవరించిన అనంతరమే కొత్తవాటి ముద్రణ
- మిగిలినచోట్ల రైతులకు యథావిధిగా అందేలా చర్యలు

ఈనాడు, అమరావతి

పట్టాదారు పాసు పుస్తకాలు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. పొలం కొనుగోలు, రిజిస్ట్రేషన్ పూర్తయిన పిదప తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తే.. దశలవారీ పరిశీలన తరువాత ఆన్‌లైన్‌లో చెన్నైలోని ముద్రణ సంస్థకు సమాచారం పంపేవారు. అక్కడి నుంచి రైతులు పేర్కొన్న చిరునామాకు నెల రోజుల్లోగా పాసు పుస్తకం అందేది. వారసత్వంగా వచ్చిన ఆస్తిని తమ పేరుపై నమోదు చేయించుకున్న వారికీ ఇదే తరహాలో అందజేసేవారు. కానీ, ప్రస్తుతం దరఖాస్తు చేసి ఏడాది దాటినా అందడం లేదు.

టెండర్ గడువు ముగిసి: రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో.. భూ హక్కు పత్రాల ముద్రణ పనులను వైకాపా ప్రభుత్వం చెన్నైలో కాకుండా రాష్ట్రంలోనే చేపట్టింది. దీంతో పుస్తక నమూనా మారింది. 'జగనన్న భూ హక్కు పత్రం' పేరుతో సుమారు 25 లక్షల పట్టాదారు పాసు పుస్తకాలను ముద్రించారు. వాటిపై జగన్ ఫొటోను పెద్దగా ముద్రించి ప్రచారం చేసుకున్నారు. దీనిపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈలోగా చెన్నై ముద్రణ సంస్థ టెండరు కాల పరిమితి ముగిసింది. గత ప్రభుత్వం టెండరు పిలవగా, సాంకేతిక కారణాలతో ఎన్డీయే ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. ఆ పుస్తకాల పంపిణీని నిలిపివేసింది.

తప్పుల దిద్దుబాటుకు వేల అభ్యర్థనలు: వైకాపా ప్రభుత్వంలో రైతులకు అందజేసిన భూ హక్కు పత్రాల్లో అనేక తప్పులు దొర్లాయి. వాటిని సరిచేయాలని ఈ నెల 15 నుంచి ప్రారంభమైన గ్రామ సభల్లో భారీగా అభ్యర్థనలు వచ్చాయి. ప్రతి వంద అభ్యర్థనల్లో 25% అవే ఉన్నాయి. విస్తీర్ణాలు, పేర్లు మారిపోయాయని.. చనిపోయిన వారి పేర్లూ ముద్రితమయ్యాయని అభ్యంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భూ హక్కు పత్రాల్లో ఉన్న సమాచారాన్ని యథావిధిగా పుస్తకాల్లో ముద్రించి ఇచ్చేందుకు వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ సభల్లో వచ్చిన అభ్యంతరాలను పరిశీలన చేసి, తప్పులను సవరిస్తేనే కొత్త పట్టాదారు పాసు పుస్తకాల ముద్రణ సాధ్యమవుతుంది.

త్వరలో ముద్రణ పునఃప్రారంభం: ఎన్డీయే ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకాల విషయంలో తీసుకురావాల్సిన మార్పులపై అధ్యయనం కోసం శాఖాపరంగా కమిటీ వేసింది. పాత పద్ధతిలోనే రాజముద్రతో.. సెక్యూరిటీ ఫీచర్లతో పుస్తకాలు ముద్రిస్తే సరిపోతుందని ఆ కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. 'రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 వేల మంది కొత్త పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేశారని సమాచారం ఉంది. వీటి వరకు వెంటనే ఇచ్చేందుకు ముద్రణ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నాం. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లోనూ రాజముద్రతో ఉండే పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తాం' అని రెవెన్యూ శాఖ వర్గాలు తెలిపాయి.

పీపీపీ విధానంలో 18 రోడ్ల డీపీఆర్‌కు అనుమతి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో రాష్ట్రంలో 1,307 కి.మీ. మేర 18 రాష్ట్ర రహదారులకు టెక్నో-ఎకనమిక్ ఫీజిబులిటీ స్టడీ, డీపీఆర్ తయారీకి అనుమతిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు టెండర్లు పిలిచి సలహా సంస్థను నియమించుకునేందుకు అనుమతించింది. దీనికి రూ.32.69 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఏడు ప్యాకేజీల కింద 18 రోడ్లకు డీపీఆర్ సిద్ధం చేసేలా ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీచేశారు.

డీపీఆర్ సిద్ధం చేయనున్న రాష్ట్ర రహదారులు ఇవి..

రోడ్లు	కి.మీ.
చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ	130.40
విజయనగరం-పాలకొండ	72.55
కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం	113.40
భీమునిపట్నం-నర్సీపట్నం	78.10
కాకినాడ-జొన్నాడ	48.84
కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్	65.20
ఏలూరు-మేడిశెట్టివారిపాలెం	70.93
నరసాపురం-అశ్వారావుపేట	100.55
ఏలూరు-జంగారెడ్డిగూడెం	51.73
గుంటూరు-పర్చూరు	41.44
గుంటూరు-బాపట్ల	51.24
మంగళగిరి-తెనాలి-నారాకోడూరు	40.05
బెస్తవారిపేట-ఒంగోలు	113.25
రాజంపేట-గూడూరు	95.00
ప్యాపిలి-బనగానపల్లి	54.44
దామాజీపల్లి-నాయినపల్లి క్రాస్-తాడిపత్రి	99.19
జమ్మలమడుగు-కొలిమిగుండ్ల	43.00
సోమందేపల్లి-హిందూపురం-తూముకుంట	35.53
మొత్తం	1,307

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా రాహుల్‌దేవ్ శర్మ

ఈనాడు, అమరావతి: ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి రాహుల్‌దేవ్ శర్మను ప్రభుత్వం నియమించింది. 2010 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన్ను ఆ పోస్టు నుంచి బదిలీ చేస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

దేవాదాయ ట్రైబ్యునల్ ఛైర్మన్ పదవికి హరినాథ్ రాజీనామా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర దేవాదాయ ట్రైబ్యునల్ ఛైర్మన్ కేవీఎల్ హరినాథ్ తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత ఇబ్బందులతో తాను రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ గురువారం ఆయన ఆ పత్రాన్ని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శికి పంపారు.

అమరావతి రైల్వేలైన్ ఆమోదంపై భాజపా నేతల హర్షం

ఈనాడు డిజిటల్, అమరావతి: అమరావతి రైల్వేలైన్, రణస్థలానికి ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ విస్తరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై భాజపా రాష్ట్ర నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. 'శ్రీకాకుళంలోని రణస్థలానికి ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ విస్తరణ కోసం రూ.252.42 కోట్ల బడ్జెట్ విడుదలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనివల్ల అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య తొలగి, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం మెరుగవుతుంది' అని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. 'కేంద్ర మంత్రివర్గం అమరావతి రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం తెలపడం అమరావతి అభివృద్ధిలో కీలక ఘట్టం. దీంతో అమరావతి దేశంలోని ఇతర రాష్ట్ర రాజధానులకు అనుసంధానమవుతుంది' అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కూడా స్వాగతించారు.



కష్టపడకుండా పాఠాలు నేర్వలేం

ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ కష్టపడకుండా, బాధను అనుభవించకుండా, నిరాశానిస్పృహలకు లోనుకాకుండా విలువైన పాఠాలను నేర్చుకోలేదు. క్లిష్ట పరిస్థితులను అధిగమించినప్పుడే పురోగతి సాధ్యమవుతుంది. అందుకే జీవితంలో ఏ దశలోనైనా కష్టంగా అనిపిస్తే దాన్నుంచి నేర్చుకుని ముందుకు సాగండి. అదొక్కటే మీ ముందున్న మార్గం.

– యూనస్, బ్రాండింగ్ మెంటార్

'ఫార్ములా-ఈ'పై బిగుస్తున్న ఉచ్చు!

- అనిశాతో విచారణకు ప్రభుత్వ ఆదేశం
- దర్యాప్తు చేయాలని ఈడీకి సమాచారం?

ఈనాడు, హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ల రేస్ వ్యవహారంలో ఉల్లంఘనలు జరిగాయని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... బాధ్యులపై చర్యలకు ఉపక్రమిస్తోంది. పోటీ నిర్వహణ సంస్థకు ఏకపక్షంగా చెల్లింపులు జరగడం, ఆర్బీఐ అనుమతి తీసుకోకుండా విదేశీసంస్థకు నిధుల బదిలీ జరగడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖ(అనిశా) ద్వారా విచారణ చేయించడంతోపాటు దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను కోరినట్లు సమాచారం. హుస్సేన్‌సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 2.8 కి.మీ. ట్రాక్‌లో 2023 ఫిబ్రవరి 11న నిర్వహించిన మొదటి



ఫార్ములా-ఈ కార్ల పోటీకి దేశవ్యాప్తంగా అభిమానులు హాజరయ్యారు. ఇది విజయవంతం కావడంతో 2024 ఫిబ్రవరి 10న మరోసారి(సెషన్-10) నిర్వహించేందుకు ఫార్ములా-ఈ ఆపరేషన్(ఎఫ్ఈవో)తో పురపాలక పట్టణాభివృద్ధి సంస్థ (ఎంఏయూడీ) 2023 అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు హెచ్ఎండీఏ రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు చెల్లించింది. అనంతరం డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే ఒప్పందంలో పేర్కొన్న అంశాలను పాటించకపోవడంతో తాము హైదరాబాద్ రేస్ నుంచి తప్పుకొంటున్నట్లు అదే నెలలో ఎఫ్ఈవో ప్రకటించింది. అనంతరం 'సెషన్-10' రద్దయింది. ఈ పోటీల నిర్వహణలో ఉల్లంఘనలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. బోర్డు, ఆర్థికశాఖల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండానే రూ.55 కోట్లను విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ చెల్లించిందన్నది ప్రధాన అభియోగం. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఎంఏయూడీ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌కు సీఎస్ శాంతికుమారి మెమో ఇచ్చారు. దీనికి అర్వింద్‌కుమార్ జవాబిస్తూ... మొత్తం ప్రక్రియ త్వరగా జరగాలన్న ఉద్దేశంతోనే చెల్లింపులు జరిపామని, ఇదంతా పురపాలక పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోనే జరిగిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాల్సిందిగా అనిశాను ఇటీవల ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది. దర్యాప్తు చేయాలని ఈడీని సైతం కోరినట్లు సమాచారం. దీంతో కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న ఫార్ములా-ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.

రూ.కోట్ల విలువైన పాఠశాల స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైకాపా నేతలు

- జనసేన జనవాణిలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: 'విజయనగరం జిల్లా బొబ్బిలిలోని చారిత్రాత్మక సీబీఎం ట్రస్టుకు చెందిన బాలికల ఉన్నత పాఠశాల స్థలం 1.20 ఎకరాలను వైకాపా నాయకులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీని మార్కెట్ విలువ రూ.కోట్లలో ఉంటుందని అంచనా. జిల్లా విద్యాశాఖకు, కలెక్టర్‌కు ఎలాంటి సమాచారం లేకుండా రిజిస్ట్రేషన్ జరిగింది. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలి'' అని ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు జనసేన జనవాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ అంశాలపై ఫిర్యాదులు చేశారు. రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్ అర్జీలు స్వీకరించారు.

- 1998 డీఎస్సీలో క్వాలిఫై అయిన అభ్యర్థులు 4,072 మందిని గత ప్రభుత్వం క్యారీ ఫార్వార్డుగా మినిమల్ టైం స్కేలుతో ఉపాధ్యాయులుగా నియమించిందని, ఆ సర్వీసులు క్రమబద్ధీకరించాలని ఆ టీచర్ల అసోసియేషన్ కోరింది.
- కోవూరు షుగర్ ఫ్యాక్టరీ 2013లో మూతపడిందని, తిరిగి దాన్ని తెరిపిస్తామని, ఆ తర్వాత వీఆర్ఎస్ ప్రయోజనాల కింద రూ.10 లక్షలు ఇప్పిస్తామని చెప్పి వైకాపా నాయకులు ఏమీ చేయలేదని ఆ ఉద్యోగులు పేర్కొన్నారు.
- గుంటూరు ఒకటో వార్డులోని గణపతి విజయదుర్గా సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానానికి గత వైకాపా పాలకులు రాజకీయ కక్షలతో విద్యుత్తు కనెక్షన్ తొలగించారని, దానిని పునరుద్ధరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

కాపుల అభ్యున్నతికి ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల వ్యయం

మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: రానున్న ఐదేళ్లలో కాపుల అభ్యున్నతికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారని ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. 2014-19 మధ్య అమలు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరిస్తామని తెలిపారు. కాపు భవనాలతోపాటు యువతకు అన్ని విధాలుగా అండగా నిలిచేలా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం కాపుల కోసం అమలు చేసిన పథకాలను జగన్ ముఖ్యమంత్రి అయ్యాక నిలిపేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కాపులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని పేర్కొన్నారు.

చిత్తూరులో పెద్దిరెడ్డి సోదరుల భూదందా

- అక్రమాలకు సహకరించిన రెవెన్యూ సిబ్బంది
- తెదేపా కార్యకర్త అనే కక్షతో దారి మూసివేత
- ప్రజావేదికకు తరలివచ్చిన గత ప్రభుత్వ బాధితులు
- వినతులు స్వీకరించిన మంత్రి టీజీ భరత్ తదితరులు

ఈనాడు, అమరావతి: 'మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సోదరుడి వరసయ్యే పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి అక్రమంగా మా భూముల్ని ఆక్రమించుకున్నారు. దీనికి స్థానిక తహసీల్దార్, వీఆర్వోలు సహకరించారు' అని చిత్తూరు జిల్లా, సదుం మండలానికి చెందిన కె.చోలేశ్వరరావు వాపోయారు. తనకు న్యాయం చేయాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన 'ప్రజావేదిక'లో ఫిర్యాదు చేశారు. వారి నుంచి మంత్రి టీజీ భరత్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, నేతలు నరసింహప్రసాద్, శ్రీరాంచిన్నబాబు ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలను కబ్జా చేసిన వైకాపా నేతలు అక్కడ వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారని తెదేపా విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. వైకాపాలో చేరలేదనే అక్కసుతో తన ఇంటికి వెళ్లే మార్గాలకు అడ్డుగా వైకాపా వారు గోడలు కట్టారని, అధికారులు కూడా వారికే కొమ్ముకాస్తున్నారని తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలం, ఇందిరానగర్‌కు చెందిన నూతలపాటి జయచంద్రనాయుడు వాపోయారు.

ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని సీఐ, ఎస్సై బెదిరింపులు

తన స్థలాన్ని కబ్జా చేయాలని చూసిన వైకాపా వారిపై ఫిర్యాదు చేయడానికి వెళితే..స్థానిక సీఐ, ఎస్సైలు దాన్ని తీసుకోకపోగా.. కబ్జాదారులకు సహకరించారని, తనను బెదిరించి వారికి అనుకూలంగా ఒప్పందం కూడా చేయించుకున్నారని సత్యసాయి జిల్లా, పెనుగొండ మండలం, చంద్రగిరికి చెందిన జి.మధు విలపిస్తూ చెప్పుకున్నారు. నెల్లూరు జిల్లాలోని కోవూరు షుగర్ కర్మాగారాన్ని మూసివేయడంతో తామంతా రోడ్డున పడ్డామని, తమకు న్యాయం చేయాలని సుమారు 230 మంది కార్మికులు వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో తమ స్థలాన్ని స్థానిక వీఆర్వో వేరొకరి పేరుతో అక్రమంగా మార్చారని ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, తెల్లబాడుకు చెందిన శంకరరావు ఫిర్యాదు చేశారు. పదవీవిరమణ ప్రయోజనాలను ఇప్పించాలని ప్రకాశం జిల్లా మిల్క్ ప్రొడ్యూసింగ్ కంపెనీ విశ్రాంత, వీఆర్ఎస్ ఉద్యోగులు కోరారు.

26 నుంచి సోమశిల-శ్రీశైలం లాంచీ ప్రయాణం

కొల్లాపూర్, న్యూస్‌టుడే: నల్లమల అటవీ ప్రాంతం, కొండకోనల మధ్య కృష్ణా నదిలో విహారానికి రాష్ట్ర పర్యాటకశాఖ సిద్ధమైంది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో ఒకేసారి 120 మంది ప్రయాణించేలా డబుల్ డెక్కర్ తరహాలో ఏసీ లాంచీని ఏర్పాటు చేశారు. కృష్ణా నదిలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు (120 కి.మీ.) 7 గంటలపాటు లాంచీ ప్రయాణం ఉంటుంది. ఈ లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600 టికెట్ ధర నిర్ణయించినట్లు సోమశిల లాంచీ ఇన్‌ఛార్జి శివకృష్ణ తెలిపారు.



దమ్ముంటే ఆ ఆరోపణలను నిరూపించాలి

- జగన్‌కు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సవాలు

ఈనాడు, అమరావతి: వారానికో, పది రోజులకో ఒకసారి బెంగళూరు నుంచి రాష్ట్రానికి వచ్చే మాజీ ముఖ్యమంత్రి జగన్... రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. దమ్ముంటే మీ అసంబద్ధ ఆరోపణల్ని నిరూపించాలంటూ జగన్‌కు సవాలు విసిరారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సుమారు రెండు లక్షల మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగితే కనీసం ఆయన నోరు మెదపలేదని మండిపడ్డారు. మంత్రి లోకేశ్‌ను విమర్శించే అర్హత జగన్‌కు లేదని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "పుంగనూరు, గుంటూరు, బద్వేలు ఘటనలపై సాక్షిలో తప్పుడు రాతలు రాస్తున్నారు. ఈ ఘటనలపై ప్రభుత్వం తక్షణం స్పందించింది. నిందితుల్ని వెంటనే అరెస్టు చేశాం. దోషులు ఎవరైనా ఉపేక్షించేది లేదు" అని రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు.



సుమన్ బోస్ బెయిలు షరతుల సడలింపు

ఈనాడు, అమరావతి: స్కిల్ కేసులో నిందితుడు సౌమ్యాద్రి శేఖర్ బోస్ (సుమన్ బోస్)పై బెయిలు మంజూరు సందర్భంలో విధించిన షరతులను హైకోర్టు సడలించింది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఆయన సరెండర్ చేసిన పాస్‌పోర్టును వెనక్కి ఇవ్వాలని విశాఖ మొదటి అదనపు సెషన్స్ కోర్టును ఆదేశించింది. మరోవైపు ఎప్పుడు కావాలంటే అప్పుడు పాస్‌పోర్టును కోర్టుకు అప్పగిస్తాననే హామీ ఇవ్వాలని బోస్‌కు స్పష్టం చేసింది. ప్రయాణ వివరాలను విశాఖ కోర్టుకు తెలియజేయాలని బోస్‌కు సూచించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈ నెల 22న ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. బెయిలు షరతులను సడలించాలని కోరుతూ సుమన్ బోస్ హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి.. షరతులను సడలించారు.

తిరుపతిలో ప్రింటింగ్ క్లస్టర్ ఏర్పాటుకు రూ.3.77 కోట్ల విడుదల

ఈనాడు, అమరావతి: తిరుపతిలో ప్రింటింగ్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం వాటా కింద రూ.3.77 కోట్లు విడుదల చేసేందుకు పాలనాపరమైన అనుమతులు ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు వినియోగించాలని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ప్రభుత్వాసుపత్రులకు మెరుగ్గా మందుల సరఫరా

మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం సరఫరా చేసే ఔషధాలు, సర్జికల్ సామగ్రికి అదనంగా అవసరమైనప్పుడు.. బోధనాసుపత్రులు, ఇతర వైద్యశాలలకు కేటాయించే బడ్జెట్లో స్థానికంగా కొనుగోలు చేసే విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ల ఆధ్వర్యంలో నిబంధనల ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ పనితీరుపై మంత్రి గురువారం సమీక్షించారు. 'గత వైకాపా ప్రభుత్వం రూ.900 కోట్ల బిల్లుల్ని చెల్లించకపోవడంతో పలుచోట్ల ప్రాణాధార మందుల సరఫరా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఆ బకాయిల్లో సగం సరఫరాదారులకు చెల్లించింది. ఫలితంగా త్వరలోనే అవసరాలకు తగ్గట్లు మందులు సరఫరా కాబోతున్నాయి' అని వివరించారు. గుర్లలో నమోదైన డయేరియా కేసులపై ఆరుగురు వైద్య నిపుణులతో ఏర్పాటు చేసిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం అందజేసిన నివేదికలోని అంశాలపై మంత్రి విడిగా సమీక్షించారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో డయేరియా కేసుల నమోదు నేపథ్యంలో అక్కడ కూడా నివారణ చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

మిగిలిన సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి

హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన విద్యార్థి తల్లి పలగర అనసూర్య హైకోర్టులో గురువారం వ్యాజ్యం వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సుమారు 25 వేల సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రవేశాలకు అర్హులున్నప్పుడు సీట్లను వృథా చేయవద్దని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. కౌన్సెలింగ్ సమయంలో ఏపీలోని వివిధ ప్రాంతాల్లో వరదల కారణంగా తన కుమారుడితోపాటు, పలువురు విద్యార్థులు కళాశాలల్లో చేరలేకపోయారని, నచ్చిన బ్రాంచ్‌ల్లో సీట్లు పొందలేకపోయారని పేర్కొన్నారు. మిగిలిన సీట్లను నాలుగో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేయాలని అధికారులకు వినతులు సమర్పించినా చర్యలు తీసుకోలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. మిగిలిన సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

ప్రైవేటు పారిశ్రామిక పార్కుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ డిమాండ్

ఈనాడు, అమరావతి: ప్రైవేటు పారిశ్రామిక పార్కుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నూతన పారిశ్రామిక విధానంలో నిబంధనలు చేర్చాలని ఓ ప్రకటనలో కోరారు. ''ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు ఏపీఐఐసీ ద్వారా తక్కువ ధరకే భూములు, పన్ను మినహాయింపు, ప్రోత్సాహకాలు ఇస్తోంది. పార్కుల అభివృద్ధికి చేసే ఖర్చులో 80 శాతం ప్రభుత్వమే భరిస్తుంది. వాటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి. పార్కుల కోసం భూములిచ్చిన వారి కుటుంబాల్లో ఒకరికి వెయ్యి చదరపు మీటర్ల ప్లాట్‌ను ఉచితంగా కేటాయించాలి. అందులో పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన రుణాన్ని బ్యాంకు ద్వారా ఇప్పించాలి'' అని పేర్కొన్నారు.

ఆస్తి కోసం తల్లి, చెల్లిపై కేసు వేసిన జగనా మాట్లాడేది?

మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: ఆస్తి కోసం తల్లి, చెల్లిపై కేసులు వేసిన జగన్.. రాష్ట్రంలో మహిళల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మండిపడ్డారు. ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా ఆయనలో మార్పు రాలేదని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లు దిశ చట్టమే అమల్లో ఉంటే 2 లక్షల మందిపై అఘాయిత్యాలు ఎందుకు చోటు చేసుకున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన వీడియో విడుదల చేశారు. వైకాపా హయాంలో రూ.13 వేల కోట్ల పంచాయతీ నిధుల్ని జగన్ దారి మళ్లించారు. జలజీవన్ మిషన్ కింద కేంద్రం నుంచి తీసుకున్న నిధుల్ని తాగునీటికి వినియోగించకుండా ఇతర వాటికి ఉపయోగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజల ఇబ్బందుల్ని తొలగించేందుకు ప్రయత్నిస్తోంది' అని పేర్కొన్నారు.

రొయ్య రైతును దెబ్బతీస్తున్న ఈహెచ్‌పీ

పరిశ్రమకు ఏటా రూ.4 వేల కోట్ల నష్టం

ఈనాడు, అమరావతి: ఎంటెరో సైటోజోన్ హెపటో పినాయి (ఈహెచ్‌పీ) అనే పరాన్నజీవి కారణంగా దేశ రొయ్యల పరిశ్రమకు ఏటా రూ.4 వేల కోట్లకు పైగా నష్టం జరుగుతోందని కెమిన్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. చెరువుల్లోని మట్టి, కాలువ నీటి ద్వారా సంక్రమించే ఈహెచ్‌పీ.. రొయ్యలోకి ప్రవేశించి రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తుందని వివరించారు. విజయవాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ గ్లోబల్ మార్కెటింగ్ డైరెక్టర్ గ్రిన్, గ్లోబల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రాజలక్ష్మి, రీజనల్ డైరెక్టర్ పి.కృష్ణన్, కమర్షియల్ డైరెక్టర్ సి.సుగుమార్ మాట్లాడారు. ప్రతి రెండు రొయ్యల చెరువుల్లో ఒకదానిలో ఈహెచ్‌పీ ఉంటుందని, ఆర్‌టీ పీసీఆర్ టెస్ట్ ద్వారా దీన్ని గుర్తించవచ్చని తెలిపారు. ఈహెచ్‌పీ నివారణకు పాథరోల్ అనే మందును తమ సంస్థ అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. మొక్కల నుంచి సహజసిద్ధ పద్ధతుల్లో దీన్ని తయారు చేసినట్లు తెలిపారు.

'దిశ' లేదు కాబట్టే ఐదేళ్లలో ఒక్కరికీ శిక్ష పడలేదు: మంత్రి నిమ్మల

ఈనాడు, అమరావతి: 'దిశ' చట్టమే ఉంటే గత ఐదేళ్లలో ఒక్క నిందితుడికి కూడా ఎందుకు శిక్ష పడలేదని మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. లేని దిశను ఉన్నట్టు చూపుతూ అసత్యాలు, అబద్ధాలతో జగన్ పాలన సాగించారని మండిపడ్డారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేశ్ నిప్పులాంటి మనిషి కాబట్టే.. నిద్రలో కూడా జగన్ ఆయన పేరునే కలవరిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'దిశ'పై చర్చకు లోకేశ్ ఆహ్వానిస్తే ఎందుకు ముందుకు రాలేదని జగన్‌ను నిలదీశారు. ''తన విద్యార్హతలు కూడా చెప్పలేని వ్యక్తి జగన్. ఆయన పాలన మొత్తం బారికేడ్లు, పరదాలు, 144 సెక్షన్లు, 30 యాక్ట్, ముందస్తు అరెస్టులతో సాగింది. కానీ 2014-19 మధ్య పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా 25 వేల కి.మీ. సీసీ రహదారులు నిర్మించిన ఘనత లోకేశ్‌ది. ఐటీ మంత్రిగా 30 వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. నేడు టీసీఎస్, లులు లాంటి సంస్థల్ని రాష్ట్రానికి తీసుకొస్తున్నారు'' అని నిమ్మల పేర్కొన్నారు.

5జీ సేవల్లో అగ్రగామిగా ఎయిర్‌టెల్

ఈనాడు డిజిటల్, అమరావతి: అక్టోబరులో రాష్ట్రంలో 5జీ సేవలందించడంలో 'భారతి ఎయిర్‌టెల్' అగ్రగామిగా నిలిచిందని గురువారం ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ మేరకు 'ఓపెన్ సిగ్నల్' విశ్లేషణ సంస్థ ఇటీవల ఒక నివేదిక విడుదల చేసినట్లు తెలిపింది. 5జీ సేవల్లో వీడియో అనుభూతి, లైవ్ వీడియో, గేమ్స్ ఎక్స్‌పీరియన్స్, డౌన్‌లోడ్, అప్‌లోడ్ విషయాల్లో నాణ్యమైన సేవలందించి వినియోగదారుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నట్లు చేసుకున్నట్లు పేర్కొంది.

డాక్టర్లు ఉద్యోగులుగా మారిపోయారు..

రోగి, వైద్యుడి మధ్య ఉన్నది వ్యాపార బంధమే ● 'కార్పొరేట్' రాకతో ముదిరిన విపరీత ధోరణి ● ప్రాక్టికల్ శిక్షణ లేకుండానే వైద్యవిద్యార్థులు బయటకు
● గ్రామీణంలో ఎంబీబీఎస్‌లను ప్రోత్సహించాలి ● 'ఈనాడు' ముఖాముఖిలో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్వీ అశోకన్

అయితరాజు రంగారావు
ఈనాడు - హైదరాబాద్

గత రెండు దశాబ్దాల్లో వైద్యులు నాయకత్వాన్ని కోల్పోయారని, డాక్టర్లుగా సేవలందించకుండా.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగులుగా మారిపోయారని 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్వీ అశోకన్ అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల ప్రవేశంతో వైద్యంలో విపరీత వ్యాపార ధోరణి పెరిగిపోయి.. రోగికి, వైద్యుడికి మధ్య కేవలం వ్యాపారబంధమే కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. రోగిని వినియోగదారుల చట్టం పరిధిలోకి తీసుకురావడంతో.. వైద్యులు, ఆసుపత్రులూ కేవలం వినియోగదారుడిగానే చూస్తున్నారని అశోకన్ అన్నారు. కార్పొరేట్ వైద్యంలో ఎలాగూ డాక్టర్ చేతిలో ఏమీ లేదని, కనీసం ప్రాథమిక వైద్యంలోనైనా వైద్యుడు.. రోగి మధ్య మంచి సంబంధాలు కొనసాగించాలని ఆయన సూచించారు.

? వైద్యంలో వ్యాపార ధోరణి పెరిగిపోయిందనే విమర్శలున్నాయి..

దేశంలో గత రెండు దశాబ్దాల్లో చిన్న చిన్న క్లినిక్‌లు తుడిచిపెట్టుకుపోయాయి. మధ్య తరహా ఆసుపత్రులూ క్రమేణా తగ్గిపోతున్నాయి. వీటి స్థానాన్ని కార్పొరేట్ ఆసుపత్రులు ఆక్రమిస్తున్నాయి. వాటిని నడిపించేది వ్యాపార సంస్థలే. లాభనష్టాలపైనే వాటి దృష్టి. ప్రభుత్వాలు వైద్యాన్ని పరిశ్రమగా గుర్తించడం, ఇందులో వ్యాపారవేత్తల ప్రవేశానికి అనుమతించడం, ఆరోగ్య బీమాలు వచ్చి చేరడం.. వీటన్నిటి వల్ల వ్యాపార ధోరణి ప్రబలిపోయింది. వైద్యులు ఉద్యోగులుగా మారిపోయారు. దేశం మొత్తంలో వైద్యానికి చేసే ఖర్చు.. జీడీపీలో 3.9 శాతం. ఇందులో 1.1 శాతం మాత్రమే ప్రభుత్వ వైద్యంలో వెచ్చిస్తుండగా, 2.8 శాతం ప్రైవేటు రంగంలోనే నమోదవుతోంది. ఇలా వైద్యాన్ని ప్రైవేటురంగంమీద వదిలేస్తే.. దాని నుంచి మనం ఏం ఆశించగలం? ఇది రివర్స్ అవ్వాలి. ప్రభుత్వ రంగ వైద్యంపై ఎక్కువ నిధులు ఖర్చుపెట్టాలి.



? వైద్యవిద్యార్థులకు సరైన శిక్షణ లేకుండానే బయటకు వస్తున్నారనే విమర్శలున్నాయి..

రోగిని చేత్తో తాకి, స్టెతస్కోప్‌తో పరీక్షించి, మాట్లాడి.. చికిత్స అందించడం (క్లినికల్ మెడిసిన్) చాలా వరకూ తగ్గిపోయింది. ఇప్పుడంతా నిర్ధారణ పరీక్షల ఆధారంగా చికిత్స చేయడమే (ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్) కొనసాగుతోంది. వైద్యవిద్య దశలోనే విద్యార్థులు రోగులతో మాట్లాడి, జబ్బు గురించి తెలుసుకునే అవకాశాలుండాలి. కానీ చాలా వైద్య కళాశాలల్లో.. ముఖ్యంగా ప్రైవేటు వైద్యవిద్యలో ఈ శిక్షణ కొరవడింది. ప్రాక్టికల్ నాలెడ్జి లేకుండానే డిగ్రీ పూర్తయిపోతోంది. కేవలం పరీక్షలపై ఆధారపడి చికిత్స చేసే పరిస్థితుల్లో మార్పులు రావాలి. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో అవసరాల కంటే తక్కువగా.. మరికొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా మెడికల్ కాలేజీలున్నాయి. ఉదాహరణకు ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త మెడికల్ కాలేజీలు అవసరం. దక్షిణాది రాష్ట్రాల్లో వైద్య కళాశాలలు ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం. . ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక వైద్యుడు ఉండాలి. కానీ దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతి 300-500 జనాభాకు ఒక వైద్యుడున్నారు. అవసరమైన చోట మాత్రమే కొత్త కళాశాలలు ఏర్పాటు చేయాలి.

? జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) ఎంబీబీఎస్ నుంచి పల్మనరీ మెడిసిన్‌ను తొలగించింది. క్షయ నిర్మూలనపై దీని ప్రభావం ఉంటుందా..

కచ్చితంగా దుష్ప్రభావం చూపిస్తుంది. క్షయ నివారణపై వచ్చే డిసెంబరులో కొత్త పాలసీని ప్రభుత్వం ప్రకటించబోతోంది. ప్రైవేటు వైద్య కళాశాలల్లో సరైన బోధన సిబ్బంది లేరన్న సాకుతో అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో పల్మనరీ మెడిసిన్ వంటి కీలకాంశాన్ని ఎలా తొలగిస్తారు? దీనివల్ల ప్రైవేటు మెడికల్ కాలేజీలకు మేలు జరగవచ్చు గానీ.. వైద్యవిద్యార్థులకు నష్టమే. ఎంబీబీఎస్ స్థాయిలోనే పల్మనరీ మెడిసిన్‌పై విద్యార్థులకు బోధించాల్సిన అవసరముంది. దీనిపై ఇప్పటికే ఐఎంఏ తరఫున కేంద్ర ఆరోగ్య మంత్రికి, ఎన్ఎంసీకి లేఖ రాశాం.

? గ్రామీణంలో ఇప్పటికీ అర్హులైన వైద్యులు లేరు. దీంతో అనర్హుల వైద్యంపై ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది..

గ్రామీణంలో అర్హులైన వైద్యులను అందుబాటులోకి తీసుకురావడంలో దశాబ్దాలుగా ప్రభుత్వాలు విఫలమయ్యాయి. 'అనర్హులైతేనేం, కనీసం వారైనా వైద్యం అందిస్తున్నారు కదా' అని ప్రభుత్వ ప్రతినిధులే వ్యాఖ్యానిస్తుండడం.. ఉదాసీనతకు నిదర్శనం. ఏటా 1.10 లక్షల మంది ఎంబీబీఎస్ వైద్యులు బయటికొస్తుంటే.. వీరిలో 65 వేల మంది పీజీ సీట్లు పొందుతుంటారు. మిగిలిన వారు ఎంబీబీఎస్‌తోనే మిగిలిపోతున్న నేపథ్యంలో ప్రాథమిక వైద్యానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. గ్రామీణ వైద్యానికి అధిక నిధులివ్వాలి. అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లోనూ ఎంబీబీఎస్ వైద్యులను నియమించాలి. అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలివ్వలేకపోవచ్చు. అందుకే ఎంబీబీఎస్ వైద్యులు గ్రామీణంలో సొంతంగా క్లినిక్‌ను ప్రారంభించాలనుకుంటే.. ప్రభుత్వం వసతులు కల్పించి ప్రోత్సహించాలి. ఎంబీబీఎస్‌లో 'ఫ్యామిలీ మెడిసిన్' అనేది అతి ముఖ్యమైన సబ్జెక్టుగా అదనపు శిక్షణ ఇవ్వాలి. కుటుంబ వైద్యవ్యవస్థను పునర్నిర్మించడానికి ఇది దోహదపడుతుంది.

? కొవిడ్ తర్వాత శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ బాధితుల సంఖ్య పెరిగిందనే వాదన ఉంది?

అవును. దీర్ఘకాలిక కొవిడ్‌తో బాధపడిన వారిలో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ల తీవ్రత కూడా పెరిగింది. కొవిడ్ సమయంలో యాంటీ బయాటిక్స్‌ను విచ్చలవిడిగా వాడేశారు. దీంతో వాటికి నిరోధకత (రెసిస్టెన్స్) ఏర్పడింది. వీటిని ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించకూడదు. కానీ ప్రతి మెడికల్ షాపులో అది లేకుండానే నేరుగా అమ్ముతున్నారు. దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కోళ్ల పరిశ్రమలోనూ విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వాడుతున్నారు. దీన్ని కూడా అడ్డుకోవాలి. 'రానున్న ఉపద్రవం.. యాంటీ బయాటిక్స్ పనిచేయకపోవడమే'.. అంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక హెచ్చరిక కూడా చేసింది

? ఆయుష్మాన్ భారత్ పథకంలో రోగుల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీనివల్ల రోగుల గోప్యతకు భంగం వాటిల్లుతుందని ఐఎంఏ అంటోంది..

నిజమే. కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ (ఏడీహెచ్ఎం)' విధానాన్ని తీసుకొచ్చింది. దాదాపు అన్ని రాష్ట్రాలూ దీన్ని అమలు చేస్తున్నాయి. రోగుల ఆరోగ్య సమాచారాన్ని డిజిటైజ్ చేయాలనేది గొప్ప ఆలోచనే. రోగి చరిత్రను ఆన్‌లైన్‌లో వైద్యుడు వెంటనే పరిశీలించి, తగిన వైద్యాన్ని సూచించడానికి ఉపయోగపడుతుంది. ఏయే ప్రాంతాల్లో ఏ రకమైన జబ్బులున్నాయనే సమాచారంతో.. ఆరోగ్య ప్రణాళిక రూపొందించుకోవడానికి కూడా ప్రభుత్వానికి ఈ డేటా ఉపయోగపడుతుంది. కానీ ఇందులో భద్రత, గోప్యతపై సందేహాలున్నాయి. దేశంలోని 140 కోట్ల జనాభా ఆరోగ్య సమాచారం కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి చేరుతుంది. ఇందులో రోగి జబ్బులకు సంబంధించిన సమస్త సమాచారమూ ఉంటుంది. ఇది ఒకవేళ ప్రైవేటు బీమా సంస్థలకు, ఫార్మా కంపెనీలకు చేరితే.. ఎనలేని నష్టం జరిగే అవకాశాలున్నాయి. ఫార్మా కంపెనీలు వాటి ఉత్పత్తుల ప్రయోగాలకు ఈ డేటాను వినియోగించే ప్రమాదముంది. పాశ్చాత్య దేశాల్లో ఈ తరహా ఒక రోగి కేస్‌షీట్‌కు 250 డాలర్ల వరకూ చెల్లించి.. ఫార్మా కంపెనీలు ఆ సమాచారాన్ని సేకరిస్తుంటాయి. ఇదొక మాఫియా. కఠిన చట్టాలుండే అమెరికా వంటి దేశంలోనే సుమారు 30 లక్షల రోగుల డేటా చౌర్యానికి గురైంది. మన దేశంలో డేటా భద్రత పరిస్థితి ఏమిటి? 2019 నుంచి దీనిపై ఐఎంఏ అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

కేరళకు చెందిన అశోకన్ సీనియర్ జనరల్ ఫిజీషియన్. కొన్ని దశాబ్దాలుగా క్షయ, మలేరియా నివారణ కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తున్నారు. ఎయిడ్స్, టీబీ, మలేరియాలకు సంబంధించి సమ్మిళిత గ్లోబల్ ఫండ్ ప్రాజెక్టుకు ఐఎంఏ తరఫున ఆరేళ్లపాటు జాతీయ సమన్వయకర్తగా వ్యవహరించారు. టీబీపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు చేసిన వ్యూహ, సాంకేతిక బృందంలోనూ పనిచేశారు. ప్రస్తుతం ఐఎంఏ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు.

ఇంజినీరింగ్ పరిజ్ఞానంతో ప్రాజెక్టుల్లో నష్టాల నివారణ

బ్యారేజీల నిపుణుడు కన్నయ్యనాయుడు

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ పరిజ్ఞానాన్ని ప్రాజెక్టుల్లో సరైన రీతిలో వినియోగించడం ద్వారా నష్టాలను నివారించవచ్చని, దీని ద్వారానే ఇటీవల తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన గేటును ప్రవాహం దిగువకు వెళ్తుండగానే తిరిగి అమర్చగలిగామని నీటిపారుదల రంగం, బ్యారేజీల నిపుణుడు కన్నయ్యనాయుడు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా 'సాగునీటి ప్రాజెక్టుల గేట్ల వైఫల్యాలు. . తీసుకోవాల్సిన తక్షణ చర్యలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 'ప్రాజెక్టుల గేట్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకుంటే వరదలు వచ్చినప్పుడు ఒక్కసారిగా మొరాయిస్తాయి. ఆనకట్ట ఎత్తు కన్నా నీటి ప్రవాహం పెరిగినప్పుడు వరదలు సంభవిస్తాయి. ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రాజెక్టుల స్పిల్‌వేలకు గేట్లు ఏర్పాటు చేస్తారు. వీటి నియంత్రణ సులువుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు. గేట్లు విఫలమైనప్పుడు ప్రాజెక్టులను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైపుణ్యాలను వివరించారు. సమావేశంలో స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ జి.రామేశ్వరరావు, ఇంజినీర్లు ఆదినారాయణ, నరేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సినీ నిర్మాత శివరామకృష్ణ మళ్లీ అరెస్టు

- బెయిలు రద్దు చేసిన న్యాయస్థానం
- రూ.10 వేల కోట్ల భూముల కాజేతకు యత్నం కేసులో రిమాండు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ శివారులో రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి కాజేసేందుకు యత్నించిన కేసులో టాలీవుడ్ నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణను ఓయూ పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఈ కేసులో ఈ నెల 17న శివరామకృష్ణను ఓయూ పోలీసులు అరెస్టు చేయగా.. 18న బెయిలు వచ్చింది. 19న విడుదలయ్యారు. బెయిలు షరతుల ప్రకారం పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలనే నిబంధనను ఆయన ఉల్లంఘించారని, బెయిలు రద్దు చేయాలంటూ ఓయూ పోలీసులు నాంపల్లిలోని నాలుగో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు పిటిషన్ దాఖలు చేశారు. బెయిలు రద్దు చేస్తూ న్యాయమూర్తి బుధవారం ఆదేశాలివ్వగా.. గురువారం శివరామకృష్ణను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

పోలీసులపై తీరుపై విమర్శలు: ఈ కేసులో నిందితుల అరెస్టు, రిమాండు వివరాలు బయటకురాకుండా ఓయూ పోలీసులు గోప్యత పాటించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. రిమాండ్ రిపోర్టు కూడా సరిగా రూపొందించలేదని ప్రచారం జరిగింది. దీంతో నగర పోలీసు ఉన్నతాధికారులు స్పెషల్ బ్రాంచితో విచారణ చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బెయిలు రద్దు కోరుతూ న్యాయస్థానాన్ని ఓయూ పోలీసులు ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విషయంలో కఠిన చర్యలొద్దు

తాడిపత్రి పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయి ప్రతాప్‌రెడ్డి, మరికొందరు పిటిషనర్లపై నమోదు చేసిన కేసులో కఠిన చర్యలు తీసుకోవద్దని తాడిపత్రి పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కేసు దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను నవంబర్ 11కు వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన, ఆయన కుమారులు, పలువురు వైకాపా నేతలు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారంటూ చిన్న సంజన్న, కె.రవీంద్రరెడ్డి, షేక్ సాదక్‌వలీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులలో ముందస్తు బెయిల్ కోసం పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు.



నోముల సృజన్‌గుప్తా, కొండ్ర నవీన్‌కుమార్

నేవీ 'థింక్యూ' క్విజ్ తుది పోటీలకు తేజా, జాన్సన్ పాఠశాలల విద్యార్థులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయిలో భారత నౌకా దళం థింక్యూ-2024 పేరుతో పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహిస్తున్న క్విజ్ పోటీల్లో తెలంగాణ సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని తేజ విద్యాలయ విద్యార్థులు నోముల సృజన్‌గుప్తా (9వ తరగతి), కొండ్ర నవీన్‌కుమార్ (10వ తరగతి)ల జట్టు తుది పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమా, డైరెక్టర్ సోమిరెడ్డి గురువారం తెలిపారు. దేశవ్యాప్తంగా సెప్టెంబరులో నిర్వహించిన ఈ క్విజ్ పోటీల్లో 9 వేల పాఠశాలలు పాల్గొన్నాయన్నారు. మూడు దశల్లో రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ద్వారా ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర విభాగాలుగా నాలుగు ప్రాంతాల నుంచి తుది పోటీలకు 16 పాఠశాలల జట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. తెలంగాణ నుంచి కోదాడలోని తేజ విద్యాలయ, హైదరాబాద్‌లోని జాన్సన్ గ్రామర్ పాఠశాల (మల్లాపూర్) జట్లు ఎంపికయ్యాయని వివరించారు. తుది పోటీలు నవంబరు 7, 8 తేదీల్లో కేరళలోని ఎజిమల నౌకా శిక్షణ కేంద్రంలో జరుగుతాయని నిర్వాహకులు లేఖ రాసినట్లు చెప్పారు. విద్యార్థులతో పాటు పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు, తల్లిదండ్రుల్లో ఒకరిని ఈ క్విజ్ పోటీలకు ఆహ్వానించినట్లు తెలిపారు.

21 మంది డీఈఓల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది జిల్లా విద్యాధికారుల(డీఈఓ)ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో బదిలీలు చేయడం ఇదే మొదటిసారి. ఇందులో ఏడుగురికి ఎలాంటి పోస్టింగ్‌లు ఇవ్వలేదు.



అడగడం నేర్చుకోండి

ఏ రంగంలోనైనా నెగ్గుకురావాలంటే అడగడమెలాగో తెలిసి ఉండటం కీలకం. మొహమాటంతోనో, తమ అజ్ఞానం బయటపడుతుందనో చాలా మంది ఇతరులను ఏదైనా అడగడానికి సందేహిస్తుంటారు. దాని వల్ల నష్టం జరుగుతుంది. జ్ఞానం పెంచుకోవడానికి, ఇతరుల సాయాన్ని, మద్దతును సాధించడానికి, తమ హక్కులను పొందడానికి నోరు తెరిచి అడగడం అత్యవసరం. మూసిన నోరు మీ కడుపు నింపలేదు.
– డేవ్ పకోస్, కంటెంట్ క్రియేటర్

కూల్చివేతలకు ప్రాతిపదిక తేదీ... అక్టోబరు 1

- ఆ రోజు తర్వాత వెలిసిన ప్రతి కట్టడం నేలమట్టమే
- అంతకుముందు నిర్మించినవి ప్రస్తుతానికి సురక్షితమే!
- తెలంగాణ ప్రభుత్వానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మిస్తున్న భవనాలపై కొరడా ఝుళిపించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందుకు ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీని ప్రాతిపదికగా తీసుకొని... ఆ తర్వాత చేపట్టే అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటల విషయంలో ఈ నిబంధన అమలు చేయనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రతిపాదనలను పంపిందని, త్వరలోనే సర్కారు నుంచి ఉత్తర్వులు వస్తాయని భావిస్తున్నారు. ప్రభుత్వ భూములు, స్థలాల్లో ముఖ్యంగా చెరువులు, కుంటలను ఆక్రమించుకొని అడ్డగోలుగా చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు హైడ్రా 310 కట్టడాలను కూల్చి, 114 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడింది. కొన్నేళ్లుగా జరుగుతున్న ఆక్రమణల కారణంగా అనేక ప్రాంతాల్లో నివాసాలు వెలిశాయి. కొందరు అడ్డదారుల్లో అనుమతులు తీసుకొని ఇళ్లు నిర్మించగా, మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే పెద్దపెద్ద భవనాలే కట్టేశారు. ఆ తర్వాత వీటిని అమ్మేశారు. అక్రమంగా నిర్మించారన్న కారణంగా వీటిని కూల్చివేస్తుండటంతో వాటిలో నివాసం ఉంటున్న వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. అందుకే ప్రజలు నివాసముంటున్న ఇళ్లను కూల్చబోమని ప్రభుత్వం సైతం ప్రకటించింది. అయితే, ఇప్పటికే హైదరాబాద్‌లో ఇప్పటికే పెద్దఎత్తున ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా అయ్యాయి. గత పదేళ్ల కాలంలో ఓఆర్ఆర్ లోపల 20 చెరువులు పూర్తిగా, 24 పాక్షికంగా కబ్జా అయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రంలోని మిగతా స్థానిక సంస్థల్లోనూ ఇదే పరిస్థితి. వీటన్నింటినీ తొలగించేపక్షంలో వాటిని కొనుగోలు చేసి, నివాసం ఉంటున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. అందుకే ప్రస్తుతానికి వాటిని పక్కనపెట్టి కొత్తగా ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని అక్రమించినా, అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించినా వెంటనే గుర్తించి కూల్చేయాలని భావిస్తున్నారు. ఇందుకు ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీని ప్రాతిపదికగా తీసుకోవాలనేది అధికారుల ఆలోచన. అంటే ఈ తేదీ తర్వాత అక్రమంగా చేపట్టిన ఎలాంటి నిర్మాణమైనా కూల్చివేస్తారు. ఒకవేళ భవిష్యత్తులో ఎప్పుడైనా ఏదైనా నిర్మాణం 2024 అక్టోబరు 1వతేదీ తర్వాత నిర్మించినట్లు గుర్తించినా అప్పుడు కూడా నేల మట్టం చేస్తారు. అంటే... ఈ తారీఖుకు ముందు నిర్మించిన భవనాలు ప్రస్తుతానికి సురక్షితమేనని తెలుస్తోంది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పంపిన ప్రతిపాదనల మేరకు... అక్టోబరు ఒకటి తర్వాత నిర్మించే అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని స్పష్టం చేస్తూ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడతాయని సమాచారం.



బాధితుడితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు



శస్త్ర చికిత్స చేసి అతికించిన చెయ్యి

రెండు భాగాలైన చేతిని అతికించారు

యశోద ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

మేడ్చల్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మణికట్టు వద్ద తెగి, రెండు భాగాలైన చేతిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సతో అతికించారు. వైద్యులు గురువారం మేడ్చల్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఒడిశాకు చెందిన రామ్‌సేవక్ (21) శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గత నెల 24న పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మణికట్టు వద్ద చేయి తెగి రెండు భాగాలైంది. గంటలోపే ఆస్పత్రిలో చేర్చడంతో ప్లాస్టిక్ అండ్ కాస్మెటిక్ సర్జన్ డాక్టర్ జె.ఎస్.శ్రీనివాస్, ఆర్థోపెడిక్ సర్జన్ బ్రిజేశ్ కిడియూర్ ఆధ్వర్యంలో వైద్య బృందం 12 గంటల పాటు శ్రమించి రెండు భాగాలను అతికించారు. 'శస్త్రచికిత్సలో భాగంగా ప్లేటింగ్‌తో రెండు ధమనులు, రెండు ఉపరితల సిరలు, రెండు అంతర్గత సిరలు, రెండు నరాలు, 24 కండరాలను పునర్నిర్మించాం. ప్రమాదం జరిగిన మూడు గంటల్లోపే శస్త్రచికిత్స ప్రారంభించి, ఎనిమిది గంటల్లో రక్తప్రసరణ పునరుద్ధరించడం వల్లే చికిత్స విజయవంతమైంది' అని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పారామెడికల్ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో సీట్ల భర్తీకి పారామెడికల్ బోర్డు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 30వ తేదీలోపు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును సంబంధిత జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని పేర్కొంది. జిల్లాల వారీగా నవంబరు 13లోపు కౌన్సెలింగ్ పూర్తి చేసి, 20లోగా ఎంపిక జాబితా విడుదల చేస్తామని నోటిఫికేషన్‌లో తెలిపింది. పారామెడికల్ కోర్సులకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని, పూర్తి వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో చూడొచ్చని వివరించింది.

తెలంగాణలో పంటల డిజిటల్ సర్వే ప్రారంభం

- పాల్గొన్న మొత్తం ఏఈవోలు
- 162 మంది సస్పెన్షన్ల రద్దుకు వెలువడని ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పంటల డిజిటల్ సర్వే ఎట్టకేలకు ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 2,600 మంది వ్యవసాయ విస్తరణాధికారు(ఏఈవో)లు గురువారం మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సర్వేలో పాల్గొన్నారు. 162 మంది ఏఈవోల సస్పెన్షన్ ఎత్తివేయకున్నా వారు కూడా సర్వేకు హాజరయ్యారు. పంటల డిజిటల్ సర్వేను వ్యతిరేకిస్తూ ఏఈవోలు ఆందోళనలు చేస్తున్న క్రమంలో.. ప్రభుత్వం 162 మందిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం ఏఈవోల సంఘాల నేతలతో వ్యవసాయ సంచాలకుడు గోపి చర్చలు జరిపారు. వారి సమస్యలు పరిష్కరిస్తామని, విధులకు హాజరైన వారి సస్పెన్షన్లు ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వారంతా ఉదయమే సర్వేకు బయలుదేరారు. పంటల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు.

నవంబరు వేతనాలపై ఉత్కంఠ

సస్పెండైన ఏఈవోలకూ లాగిన్ ఇవ్వడంతో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని విధులకు హాజరయ్యారు. అయితే సాయంత్రం వరకు సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వులు జారీ కాకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమైంది. జిల్లా వ్యవసాయాధికారులను కలిసి సంచాలకుడు హామీ ఇచ్చిన విధంగా సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. మరోవైపు మొత్తం ఏఈవోలకు సంబంధించిన నవంబరు నెల వేతనాల బిల్లులు సమర్పించేందుకు గురువారం చివరి రోజు కాగా వాటిని తయారు చేయకపోవడంతో వారికి ఈ నెల వేతనాలు అందడం అనుమానంగా మారింది. ఉన్నతాధికారులు ఏవోలు, ఇతర సిబ్బంది వేతనాల బిల్లులు మాత్రమే పంపాలని కోరినట్లు తెలుస్తోంది.

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ రూ.358 కోట్లు

- గత ఏడాదికన్నా రూ.50 కోట్లు అధికం... నేడు జమ
- తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: సింగరేణిలో ఉత్పత్తి ఆధారిత పురస్కార పథకం(పీఎల్ఆర్ఎస్) కింద కార్మికులకు అందించే దీపావళి బోనస్‌ను శుక్రవారం వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టివిక్రమార్క ప్రకటించారు. మొత్తం రూ.358 కోట్లు చెల్లిస్తామని, ఇది గత ఏడాది కంటే రూ.50 కోట్లు అధికమని తెలిపారు. ఒక్కో కార్మికునికి సగటున రూ.93,750 అందుతుందన్నారు. గురువారం సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా భట్టి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. 'ఈ ఏడాది కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే బోనస్ చెల్లించాలి. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40 వేల మంది కార్మికులకు ఇది అందుతుంది. బొగ్గు కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా బోనస్ చెల్లించే పద్ధతి కొన్నేళ్లుగా అమల్లో ఉంది. ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లను పంపిణీ చేశాం. ఇందులో ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు అందాయి. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించాం. దసరా పండుగ అడ్వాన్స్ కింద ఒక్కో కార్మికునికి రూ.25 వేల చొప్పున మరో రూ.90 కోట్లను జమ చేశాం. ఇప్పుడు దీపావళి బోనస్ కింద సగటున రూ.93,450 లభిస్తాయి. మొత్తంగా గత నెల రోజుల వ్యవధిలో కంపెనీ రూ.1250 కోట్లను కార్మికులకు చెల్లించింది' అని భట్టి వివరించారు.

చద్దన్నం వద్దన్నందుకు.. కన్నతండ్రిపై కుమారుల దాడి





బాధితుడు కృష్ణయ్య; ఆయన వీపుపై వాతలు

మానవపాడు, న్యూస్‌టుడే: చద్దన్నం తినలేనని, వేడి అన్నం కావాలని అడిగినందుకు కన్నతండ్రిపై ఇద్దరు కుమారులు దాడికి పాల్పడిన ఘటన తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లాలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన నాయక కృష్ణయ్య, మద్దమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. మద్దమ్మ కొన్నేళ్ల క్రితమే చనిపోయింది. వివాహానంతరం కుమారులు ఇంటిని రెండు వాటాలు చేసుకున్నారు. కృష్ణయ్య చిన్న కుమారుడు వద్దే ఉంటున్నాడు. బుధవారం రాత్రి భోజనానికి కూర్చున్న కృష్ణయ్య..కోడలు చద్దన్నం పెడుతుండటాన్ని గుర్తించి వారించాడు. వేడి అన్నం కావాలని అడిగిన నేపథ్యంలో కోడలికి, మామకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 'అక్కడే ఉన్న కుమారుడు సర్దిచెప్పడానికి బదులు.. నాపై కర్రతో దాడిచేశాడు. చిన్న కుమారుడు వీపు భాగం, కాళ్లపై వాతలు తేలేలా కొట్టాడు. అక్కడే ఉన్న పెద్దకుమారుడు కూడా దాడి చేయడంతో కళ్లపైనా గాయాలయ్యాయని' కృష్ణయ్య కన్నీటిపర్యంతమయ్యాడు.

అర్ధరాత్రి ఆరు కిలోమీటర్లు నడిచివచ్చి

కుమారులు కొట్టడంతో ప్రాణభయంతో అర్ధరాత్రి ఇంట్లోంచి వచ్చేసిన కృష్ణయ్య జల్లాపురం నుంచి ఆరు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ మానవపాడు ఠాణాకు చేరుకున్నాడు. రాత్రి అక్కడే పడుకుని గురువారం ఉదయాన్నే ఫిర్యాదు చేశాడు. ఇటీవల తమ పొలం అమ్మగా వచ్చిన డబ్బులో రూ.3 లక్షలు తనకు ఇచ్చేందుకు కుమారులు అంగీకరించారని, ఆ డబ్బు కూడా ఇప్పించాలని ఫిర్యాదులో కోరాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.